శ్రీమతే రామానుజాయ నమః

శ్రీమద్వరవరమునయే నమః



మాధవుని మహిమ



'పండితరత్న' డా|| ఉ.వే. శ్రీమాన్ ఈయుణ్ణి అళగ శింగరాచార్యులు

శ్రీమాన్ కార్పంగాడు వేంకటాచార్య స్వామి వారు



శ్రీమాన్ వేళుక్కుడి వరదాచార్య స్వామి వారు

ఉ.వే. శ్రీమాన్ ఈయుణ్ణి రంగరామానుజాచార్య స్వామివారు

విన్నపం

దత్వా మే దేహమేనం చ సకలవిధ సంరక్షణం.తస్య కృత్వా

చాత్మక్షేమం విధాయానుకలమపి కరాలంబనం దత్తవద్భ్యః,

శ్రీమద్భ్య రంగరామావరజగురువరేభ్యః పితృభ్యో మహద్భ్య

వాక్కైంకర్యస్వరూపాం సుకృతి ముపహరస్ యాం కృతార్థో2హమేనామ్.

దానునకు ఈ శరీరాన్ని ఇచ్చి, అన్ని విధాలుగా దానికి రక్షణను కలిగించి, నా ఆత్మక్షేమాన్ని కలుగజేసి, ప్రతిక్షణం నాకు ప్రోత్సాహాన్ని ఇచ్చిన దానుని పితృపాదులు, మహానుభావులు అయిన ఉ.వే.శ్రీమాస్ రంగరామానుజాచార్య స్వామివారి సన్నిధిలో ఈ గ్రంథాన్ని ఉపహారంగా సమర్పించి కృతార్థుణ్ణి అవుతాను.

శ్రీమద్వేంకటసూరివర్యవరదాచార్యాఖ్యసూరీంద్రసం—

ప్రోక్తద్రావిడవాగ్విశేషతతిభిః క్లుప్తాఽతిభోగ్యా కృతిః

సైషాంఽధ్ర్యాం పరివర్త్య విజ్ఞసవిధే శ్రీశింగరార్యేణ తత్—

ప్రీత్యై మాధవదివ్యవైభవపరా భక్త్యా మయాఽత్రాఽర్ప్యతే.

మహా విద్వాంసులైన శ్రీమాస్ కార్పంగాడు వేంకటాచార్య స్వామి, శ్రీమాస్ వేళుక్కుడి వరదాచార్య స్వామి అనే ఇద్దరు మహనీయులు ద్రావిడ భాషలో అనుగ్రహించిన ఉపన్యాసాల సారమే మాధవుని వైభవాన్ని తెలియజేసే ఈ గ్రంథం. దీనిని ఆంధ్రభాషలో అనువదించి విజ్ఞుల సన్నిధిలో వారి ఆనందంకోసం శింగరాచార్యులు అనే పేరు గల, దాసుడనైన నేను, సమర్పిస్తున్నాను.

తమిళ దేశంలోనే కాక భారతదేశంలో అంతటా గొప్ప ఉపన్యాసకులుగా, ఉభయవేదాంతాలలో సాటిలేని పండితులుగా ప్రసిద్ధి చెందిన మహనీయులు శ్రీమాస్ కార్పంగాడు వేంకటాచార్యస్వామివారు, వారి శిష్యులలో అగ్రగణ్యులైన శ్రీమాస్ వేలుక్కుడి వరదాచార్యస్వామివారు. వీరిద్దరూ తమిళ భాషలో అనుగ్రహించిన విషయాలను ఆధారంగా చేసికొని ఈ గ్రంథం కూర్చబడింది. ఇది గ్రంథ పరిపాలన ట్రస్ట్, (పుత్తూరు అగ్రహారం, తిరుచినాపల్లి) ద్వారా ప్రకాశింప చేయబడింది. వారి సౌజన్యంతో ప్రపన్న లోకానికి ఈ గ్రంథం ఇప్పుడు తెలుగు అనువాద రూపంగా క్రమంగా సమర్పింపబడుతున్నది.

ఈ గ్రంథాన్ని రూపొందించడంలో అన్ని విధాలుగా సహకరించిన మిత్రులు, సహృదయులు, నా విషయంలో ఎంతో అభిమానాన్ని కలవారు అయిన శ్రీమాస్ కేశవ అయ్యంగార్ స్వామివారికి కృతజ్ఞతలను తెలుపుకుంటున్నాను. స్వస్తి.

భవదీయుడు,

ఈ.ఏ.శింగరాచర్యులు

మాధవుని మహిమ

"సర్వేషా మేవ లోకానాం పితా మాతా చ మాధవః, గచ్ఛధ్వమేనం శరణం శరణ్యం పురుషర్షభాః" (అన్ని లోకాలకు తండ్రి తల్లి, మాధవుడే. శరణ్యుడైన– శరణం పొందదగినవాడైన– ఈ స్వామిని పురుషులలో గొప్పవారైన మీరు శరణు పొందండి) అనే ఈ శ్లోకం (మహా భారతం వనపర్వం –189 –57) పంచ పాండవులకు శ్రీ మార్కండేయ మహర్షి చేసిన ఉపదేశంగా కనిపిస్తున్నది. ఈ శ్లోకంలో "పితా మాతా చ మాధవః" అనే పాఠం కనిపిస్తున్నది. ఈ శ్లోకం "మాతా పితా భ్రాతా నివాసః శరణం సుహృద్గతిః నారాయణః" (సుబాలోపనిషత్–6) (నారాయణుడు తల్లి, తండ్రి, తోడబుట్టినవాడు, నివాసం, మోక్షోపాయం, స్నేహితుడు, మోక్షంలో పొందే ఫలంగా ఉన్నాడు) అనే వేద వాక్యానికి ఉపబృంహణం కనుక, అన్వయ క్రమంలో ఈ శ్లోకాన్ని "మాతా పితా చ మాధవః" అనే క్రమంలో గ్రహించాలి. శాస్త్ర సంప్రదాయ సిద్ధమైన వైభవాలు మాధవునకు నిండుగా ఉన్నాయి. వీటిలో కొన్ని, శాస్త్రజ్ఞులు అయిన పెద్దలు మాత్రమే తెలియదగినట్లుగా ఉంటాయి. సాధారణంగా అందరూ తెలుసుకొని ఆనందించేటట్లు వాటిలో కొన్ని విషయాలను విజ్ఞాపనం చేస్తాను.

శ్రీమద్భగవద్గీత, శ్రీ రామాయణం, శ్రీ భాష్యం, భగవద్విషయం, తిరుప్పావై మొదలైన శాస్త్ర సంప్రదాయ గ్రంథాలను కాలక్షేపం అనుగ్రహించే సమయంలో మన ఆచార్యులు, పెద్దలు ఒక క్రమాన్ని అనుసరిస్తారు. అది ఏమంటే, మొదట ఉపోద్ఘాతం, (అంటే, అవతారిక, ప్రవేశం) అని చెప్పబడే విధంగా ముందు మాటలను పలుకుతారు. ఈ అవతారికలో వారు కాలక్షేపం చేసే గ్రంథానికి కల వక్తృ వైలక్షణ్యం, ప్రబంధ వైలక్షణ్యం, ప్రతిపాద్యవైలక్షణ్యం అనే మూడు విధాలైన విషయాలను ఉద్దేశించి పలికి, వినేవారికి కాలక్షేపం చేసే గ్రంథంలో ఆసక్తిని, అపేక్షను కలిగిస్తారు. ఈ విధంగా చేయడానికి మార్గదర్శకులు శ్రీవాల్మీకి భగవానుడే. వారే మొట్టమొదట ఈ క్రమాన్ని శ్రీరామాయణంలో అనుసరించారు. ఆది కావ్యం అయిన శ్రీ రామాయణంలోని మొదట నాలుగు సర్గలు ఈ విధంగానే వక్తృవైలక్షణ్యం, ప్రబంధ వైలక్షణ్యం, ప్రతిపాద్యవైలక్షణ్యం అనే మూడు విధాలైన, శ్రీరామాయణంలో ఉండే గొప్పతనాలను నిరూపిస్తున్నాయి.

కాలక్షేపానికి గ్రహించే అనుగ్రహించే గ్రంథాన్ని రచించినవారు ఎవరు? వారికి ఉండే వైభవం ఎటువంటిది? అనే విషయాన్ని వక్తృ వైలక్షణ్యం తెలియజేస్తుంది. ఈ గ్రంథం ఏవిధంగా ఎందుకోసం అవతరించింది? దీనికి ఉండే గొప్పతనం ఏమి? అనే విషయాన్ని ప్రబంధ వైలక్షణ్యం తెలియజేస్తుంది. ఈ గ్రంథంలో ఉండే విషయంలోని గొప్పతనం ఏమి? ఈ గ్రంథంలో చెప్పబడే విషయం ఎటువంటిది? అనే విషయాన్ని ప్రతిపాద్య వైలక్ష్యణ్యం తెలియజేస్తుంది.

ఈ విధంగా ఒక కాలక్షేప గ్రంథానికి ఉండే మూడు విధాలైన గొప్పతనాలను మనం ఈ శ్లోకానికి గ్రహించేటట్లు ఈ శ్లోకం వెలుగుతున్నది. ఈ శ్లోకాన్ని పలికిన మార్కండేయ మహర్షి మహర్షులు అందరిలో అనితరసాధారణమైన వైభవాన్ని కలవారు. ఒక గొప్ప అధికారిని తనకు వక్తగా కలిగి ఉన్నందున ఈ శ్లోకం చాలా గొప్పతనాన్ని కలిగినదై ప్రకాశిస్తున్నది. ఈ శ్లోకం అవతరించిన క్రమంలో కూడా ఒక గొప్ప తనం ఉన్నది. అది ఏమంటే, ఈ శ్లోకం చాలా అర్థపుష్టిని కలిగి ఉన్నది. ఈ శ్లోకాన్ని ఒక ముఖ్యమైన శాస్త్రవచనంగా మన పూర్వాచార్యులు భావించారు. మన పూర్వాచార్యులు ఈ శ్లోకాన్ని అనేక సందర్భాలలో ఉదాహరించారు. ఈ విధంగా పలు రీతులలో ఈ శ్లోకానికి గొప్పతనాలు ఉన్నాయి అనే విషయాన్ని ముందుగా గమనిద్దాం.

వక్తృవైలక్షణ్యం– శ్రీ మార్కండేయ మహర్షి గొప్పతనం

ఇతిహాస పురాణాలలో –మార్కండేయ మహర్షి గొప్ప తపస్వి, బ్రహ్మర్షి, పరమ భాగవతోత్తముడు, మహాత్ముడు అని పలు విధాలుగా పొగడబడుతున్నాడు. ఈ మహర్షి ముసలితనాన్ని, మరణాన్ని జయించినవాడు. భగవంతుడైన శ్రీమన్నారాయణుని వైభవాన్ని లోకానికి తెలియజేయడంలో సామర్థ్యాన్ని, ఆసక్తిని కలిగినవాడు. కనుక ఉదారుడని కీర్తింపబడుతున్నాడు. మనం మాధవుని గొప్పతనాన్ని తెలిసికొన్నంత మాత్రంలో చాలదు. ఆ స్వామి వైభవాలను మనకు స్పష్టంగా తెలిపిన మార్కండేయుని గొప్పతనాన్ని కూడా తెలుసుకోవాలి కదా. మహాత్ముడైన అతని చరిత్ర మన పాపాలను అన్నిటినీ పోగొట్టి, మనకు మంచి మార్గాన్ని చూపిస్తుంది. మనకు అన్ని మంగళాలను కలిగిస్తుంది.

మహర్షులలో వశిష్ఠుడు, శక్తి, పరాశరుడు, శుకుడు, ఇంకా వీరి ఉపదేశ పరంపరలో వచ్చిన వైశంపాయనుడు, సూతుడు –అని ఈ విధంగా ఉండే పరంపర చాలా విలక్షణమైన శ్రీ వైష్ణవ ఋషి పరంపరగా భాసిస్తున్నది. ఈ మహర్షులకు కల గొప్పతనాలు చాలా ఉన్నాయి. వాటిలో చాలా ముఖ్యమైనది ఏమంటే –భగవంతుని వైభవాలను వీరు లోకానికి చక్కగా తెలియజేయడమే. వీరితో పాటు మనం మార్కండేయ మహర్షిని కూడా కలిపి గ్రహించాలి. వాస్తవానికి మహర్షులలో ఈ మునికి కల గొప్పతనాలు ఇంక ఎవరికీ లేవు అని చెప్పాలి. మహా వైభవశాలి అయిన ఈ మహర్షి గొప్పతనం మహాభారతం, భాగవతం, పద్మ పురాణం మొదలైన శాస్త్ర గ్రంథాలలో విస్తృతంగా కనిపిస్తుంది.

పరమపదంలో ముక్తులకు ఉండే కొన్ని లక్షణాలలో, వారికి కలిగే కొన్ని అనుభవాలలో ఒక భాగం సంసార మండలంలో ఉండే కొందరు విలక్షణ వ్యక్తుల విషయంలో కూడా కేవలం భగవదనుగ్రహం వల్ల కలుగుతాయి. శ్వేత ద్వీప వాసులు ముక్తుల లక్షణాలను, అనుభవాలను అధికంగా కలిగి ఉంటారు. రేపల్లెలోని ఐదు లక్షల గృహాలలో ఉండే గోపికలకు కలిగిన శ్రీకృష్ణ పరమాత్మానుభవం పరమపదంలో మహాలక్ష్మికి కూడా కలుగలేదు అని శ్రీశుకమహర్షి శ్రీ భాగవతంలో అన్నారు. శ్రీ వటపత్రశాయి స్వామి విషయంలో పెరియాళ్వారులకు, వేంకటేశ్వరుని విషయంలో యామునులకు, అనంతార్యులకు లభించిన పుష్ప కైంకర్యం, కంచి వరదరాజ స్వామి విషయంలో కాంచీపూర్ణులకు లభించిన అలవట్ట కైంకర్యం, ఆ వరదరాజ స్వామి విషయంలోనే నడాదూర్ అమ్మాళ్ కు, మేల్ కోట తిరునారాయణస్వామి విషయంలో ఆయ్ జనన్యాచార్యులకు లభించిన క్షీరసమర్పణ కైంకర్యం మొదలైనవి పరమపదంలో నిత్యులకు, ముక్తులకు లభించే అనుభవాలకు సమానమైనవి అని చెప్పాలి. ఇటువంటి విలక్షణ వ్యక్తుల ఒకరుగా మనం మార్కండేయ మహర్షి కూడా గ్రహించాలి. వీరు నిత్యులవలె, ముక్తులు వలె ఎల్లప్పుడు 25 ఏళ్ళ వయస్సులోనే ఉంటారు.

కాలం అనేది ఒక తత్వం. ఇది సంసార మండలంలో ఉండే జీవులను అందరినీ తన వశంలో పెట్టుకుంటుంది. **"సదా పశ్యంతి సూరయః"** – (నిత్య సూరులు ఎల్లప్పుడు పరమాత్మను దర్శిస్తారు) వేదం అన్నందున

పరమపదంలో కూడా కాలం అనేది ఒక తత్వం ఉన్నది అని తెలుస్తున్నది, కానీ, పరమపదంలో కాలం తన అధికారాన్ని చెలాయించ లేదు. అక్కడ కాలానికి అనుగుణమైన మార్పు అనేది ఏది ఉండదు నిత్య విభూతిలో ఉండేవారు కాలానికి వశంలో ఉండరు. అయితే, లీలా విభూతిలో, అంటే, ఈ సంసార మండలంలో ఉండేవారిని అందరిని కాలం అనేది బాధిస్తూనే ఉంటుంది. జన్మ, మరణం, ముసలితనం, బాధ అనేవి కాలాన్ని అనుసరించి కర్మాధీనంగా సంసారులకు కలుగుతూనే ఉంటాయి. సంసారులలో ఎటువంటి వారికి అయినా కాలమనేది కొన్ని సమయాలలో అనుకూలంగా ఉండదు. ఎవరైనా సరే, కాలాన్ని అనుసరించే సంసార మండలంలో జీవించ వలసి ఉంటుంది. కాలానికి ఉండే మహిమను గూర్చి బలి ఇంద్రునకు ఉపదేశించే ఆశ్చర్యకరమైన ప్రకరణం మహాభారతంలో ఉన్నది. దానిని మనం తప్పక తెలియాలి.

దేవతలకు అసురులకు మధ్య ఒకానొక సందర్భంలో జరిగిన యుద్ధంలో దేవతల బలం అధికంగా ఉన్నది. ఇంద్రుడు అందువల్ల అసురులను అందరినీ జయించాడు. అయితే అతనికి విరోచనుని పుత్రుడైన బలి ఉండే చోట తెలియలేదు. బ్రహ్మ దగ్గరకు వెళ్ళిఅతడు బలి ఎక్కడ ఉన్నాడు అనే విషయాన్ని తెలిసికొన్నాడు. అయితే బ్రహ్మ **"బలిని చంపకూడదు"** అని ఇంద్రుని నియమించాడు. బ్రహ్మ చెప్పిన రీతిలో బలి గాడిద రూపంలో ఒక పాడుబడిన ఇంటిలో ఉన్నాడు. అతని దగ్గరకు వెళ్ళిన ఇంద్రుడు అతనిని చాలా విధాలుగా హేళన చేశాడు. ఒకానొక సమయంలో అతనికి కల గొప్పతనం, కీర్తి, ఐశ్వర్యం మొదలైనవానిని ప్రస్తావన చేసి, **"అవి ఇప్పుడు నీకు ఎక్కడకు పోయాయి?"** అని వేళాకోళం చేశాడు.

"ఓ అసురా! నీవు ఇప్పుడు గాడిద రూపాన్ని ధరించి ఊకను తింటూ కాలాన్ని గడుపుతున్నందువల్ల నీకు శోకం కలగడం లేదా? ఒకానొక సమయంలో నీవు ఎటువంటి ఐశ్వర్యాన్ని కలిగి ఉన్నావు అనే విషయం నీ మనసులో ఉన్నదా? అవి అన్ని ఎక్కడికి పోయాయి? శత్రువులకు అధీనంలో ఉండే ఈ నీ స్థితి నీకు ఏవిధంగా వచ్చింది? నీవు అసురులకు రాజుపై ఉండే కాలంలో అసురులు అందరూ నీకు సేవలు చేస్తూ వచ్చారు. వేలాది మంది దేవతా స్త్రీలు నాట్యం చేసి నిన్ను ఆనందింప జేసేవారు. వేలాది మంది

గంధర్వులు గానం చేసి నీకు సంతోషాన్ని కలిగించేవారు. రత్నాలు పొదిగినది, బంగారుతో చేయబడినది అయిన నీ ఛత్రం ఇప్పుడు ఎక్కడ ఉన్నది? ఒకానొక సమయంలో ఎన్నో యాగాలు చేసి, ఈ లోకం అంతటిని యాగభూమిగా కదా నీవు చేశావు. నీవు చేసిన యాగాలకు అంతు లేదు కదా. బ్రహ్మ నీకు ఇచ్చిన మాల కూడా ఇప్పుడు నీ దగ్గర కనబడడం లేదే! నీ ఐశ్వర్యం, కీర్తి, పరాక్రమం అంతా ఎక్కడికి పోయాయి? వీటిని పూర్తిగా కోల్పోయిన నీకు దుఃఖం కలగడం లేదా?"

అని ఈ విధంగా, ఇంకా పలు విధాలుగా పలికి బలిని ఇంద్రుడు వేళాకోళం చేశాడు. ఈ మాటలకు బదులుగా బలి పలికిన వచనాలు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

దేవతలకు ప్రభువువైన మహేంద్రా! వివేకం లేనివాడవై ఇతరులకు దుఃఖాన్ని కలిగించే మాటలను నీవు పలుకుతున్నావే! ఇది నీకు తగినది కాదు. నేను ఇప్పుడు పోయినట్లుగా నీవు పలికే ఐశ్వర్యం మళ్ళీ తిరిగి ఒక కాలంలో నాకు కలగడం నీవు చూడబోతున్నావు సుమా. ఇవి అన్ని ఒక కాలంలో వస్తాయి, ఇంకొక సమయంలో పోతాయి. జ్ఞానాన్ని, సహనాన్ని కలిగిన సాధువులు వీటివల్ల సంతోషపడరు. దుఃఖపడరు. నీవు ఇప్పుడు మతి చెడి నిన్ను నువ్వు చాలా గొప్పగా భావించుకొంటూ ఉన్నావు. ఈనాడు నేను ఉండే స్థితిని నీవు రేపు పొందబోతున్నావు అనే విషయాన్ని తెలిసికో.

కాలం అనే పేరు కలిగిన గొప్ప తత్వం పరమాత్మయొక్క శక్తి విశేషమే. ఈ లోకంలో కాలం మార్పు వల్ల ఐశ్వర్యం, పరాక్రమంవంటివి అన్నీ ఎవరి వద్ద స్థిరంగా ఉండవు. దీనిని చూచి వివేకం కలిగినవాడు మనసులో దుఃఖపడరు. చాలా శక్తి కలిగిన కాలంచేత బాధింపబడనివారు ఈ లోకంలో ఎవరూ లేరు. ఈ లోకంలో ఒకనికి ధనం ఉండవచ్చు ఇంకొకనికి అది లేకుండా పోవచ్చు. ఒకనికి అందం ఉండవచ్చు. ఇంకొకనికి అది లేకుండా పోవచ్చు. ఒకనికి సుఖ సంతోషాలతో కూడిన జీవితం ఏర్పడవచ్చు. ఇంకొకనికి అది లేకుండా పోవచ్చు. అయితే ఎవరికీ ఈ స్థితులు ఎల్లప్పుడూ స్థిరంగా ఉండవు. కాలాన్ని అనుసరించి అవి మారుతూ ఉంటాయి సత్వగుణం అధికంగా ఉండేవారై, చక్కని జ్ఞానాన్ని

కలిగినవారై ఉండేవారు అన్ని విధాలైన పాపకర్మల నుండి నివృత్తిని పొందుతారు. ఎటువంటివారిని అయినా కాలం తన వశంలో పెట్టుకుంటుంది. నీవు భావించినట్లు ప్రభుత్వం, పరాక్రమం ఇప్పుడు నా వశంలో లేవు, నీ వశంలోనూ లేవు. మనమందరం కాలానికి వశమై ఉన్నాము. దీనిని. తెలిసిన నాకు శోకం లేదు. ఇప్పుడు నాకు కాలం అనుకూలంగా లేదు. నా ఈ స్థితి ఎల్లప్పుడూ ఈ విధంగా ఉండదు నీకు కాలం ఇప్పుడు అనుకూలంగా ఉన్నది. అయితే నీ ఈ స్థితి ఎల్లప్పుడూ ఈ విధంగానే ఉండదు. నీవు ఐశ్వర్య గర్వంతో నన్ను హేళన చేస్తున్నావు. ఈ స్థితిలో కూడా నేను నా వజ్రాయుధంతో నిన్ను ఒక దెబ్బను కొట్టగలను. ఆయితే కాలం ఇప్పుడు నాకు అనుకూలంగా లేదు కనుక నా పరాక్రమాన్ని చూపడానికి ఇది సమయం కాదు అని భావించి నేను ఆ పని చేయడం లేదు. నేను ఒక కాలంలో దేవతలకు కూడా వణకు పుట్టించాను. నేను బ్రహ్మాయొక్క లోకాన్ని కూడా జయించాను. అసురులకు ప్రభువును, చాలా బలాన్ని కలిగినవాడను, పరాక్రమశాలి అయిన నన్ను కాలం అణచి వేసింది అంటే, ఇక నీ వెంత?

ఈ విధంగా, ఇంకా ఇటువంటి మాటలను పలికి కాలం యొక్క గొప్పతనాన్ని ఇంద్రునకు బలి తెలియజేశాడు. సంసార మండలంలో కాలాన్ని జయించినవారు ఒకరు ఉన్నారు. అతడే మార్కండేయ మహర్షి. ఈ మహర్షి బ్రహ్మాతో సమానమైన ఆయుస్సును కలవాడు. తాను కోరుకున్నప్పుడు మాత్రమే మరణించ గలిగిన శక్తి కలవాడు. ఆళ్వారులు కూడా మార్కండేయ మహర్షి గొప్పతనాన్ని చాలాసార్లు కీర్తించారు.

"మార్కండస్ కండ వకైయే వరుమ్ కండీర్" (నాస్ ముగస్ తిరు వందాది –15)

"పుక్కడిమైయినాల్ తన్నై క్కండ మార్కండేయనవనై" (తిరువాయ్ మొళి– 4–10–8)

"మార్కండేయనుక్కు వాళు నాళ్" (తిరువాయ్ మొళి –7–5–7)

“మన్ను నాన్మఱై మాముని" (పెరియ తిరుమొళి– 5–8–6) అని మొదలైన ఆళ్వారుల సూక్తులు స్మరించ దగినవి.

"మార్కండేయనుమ్ కరియే" (తిరువాయ్ మొళి– 5–2–9) అని నమ్మాళ్వారులు మార్కండేయ మహర్షిని భగవంతుని పరత్వానికి సాక్షిగా తెలిపారు. శాస్త్ర గ్రంథాలను పరిశీలించి చూచి భగవంతుని పరత్వాన్ని నిర్ణయం చేయవలసిన అవసరం లేదు, శ్రీ మార్కండేయ మహర్షి చరిత్ర, ఉపదేశం– అనే ఇవి చాలు, భగవంతుని పరాక్రమాన్ని తీసుకోవడానికి –అని నమ్మాళ్వారుల అభిప్రాయం.

మార్కండేయుని చరిత్ర ఎటువంటిది? అనే విషయాన్ని చూద్దాం. ఈ మహర్షి మృకండుముని పుత్రుడు. చిన్న వయస్సులో ఉండేటప్పుడు ఆటలాడుతూ ఉండగా ఈయన ఆటలను చూచి తల్లిదండ్రులు ఆనందిస్తున్నారు. అప్పుడు ఒక అశరీరవాణి "ఇతని ఆయుస్సు తీర బోతున్నది" అని చెప్పింది. ఈ మాట విని మార్కండేయుని తల్లిదండ్రులు చాలా బాధ పడి దుఃఖించారు. అప్పుడు తల్లిదండ్రుల దుఃఖాన్ని తీర్చడం కోసం మార్కండేయ మహర్షి శివుని ఉద్దేశించి తపస్సు చేశాడు. శివుడు ప్రత్యక్షం కాగా, తన తల్లిదండ్రుల ఆనందం కోసం తనకు దీర్ఘమైన ఆయుస్సును, తన కోసం మోక్షాన్ని ఇవ్వవలసినదిగా శివుని మార్కండేయ మహర్షి ప్రార్థించాడు. అప్పుడు శివుడు మార్కండేయునకు శ్రీమన్నారాయణుని పరత్వాన్ని విశదీకరించి పలికి, భగవంతుడైన శ్రీమన్నారాయణుడు మాత్రమే మోక్షాన్ని ఇస్తాడు కనుక, ఆ స్వామిని ఆశ్రయించమని మార్కండేయనకు ఉపదేశించాడు. మార్కండేయుడు కూడా ఆ విధంగా నారాయణుని ఆశ్రయించాడు. ఈ విధంగా శివుని మూలంగా భగవంతుని పరత్వాన్ని తెలిసికొని మార్కండేయ మహర్షి శ్రీమన్నారాయణుడే సర్వస్వమని తలచి, ఆ స్వామి అనుగ్రహం వల్ల పరమ భాగవతోత్తముడు అయ్యాడు.

భగవంతుడు మార్కండేయ మహర్షికి తన స్వరూపాన్ని దర్శింప చేసి, అనుగ్రహించిన చరిత్ర చాలా ఆశ్చర్యకరమైనది. బ్రహ్మకు పగలు ఆయుస్సు

ముగిసి, రాత్రి ప్రారంభం అయ్యే సమయంలో నైమిత్తిక ప్రళయం ఏర్పడుతుంది. ప్రయోజనం లో మునిగి ముందే మూడు లోకాలను భగవంతుడు వటపత్ర

శాయి రూపం ధరించి తన కడుపులో పెట్టుకొని రక్షిస్తున్నాడు. అపుడు అతని అనుగ్రహం మూలంగా మార్కండేయ మహర్షి భగవంతుని కడుపులో ప్రవేశించి, అతనిచే రక్షింపబడతున్న మూడు లోకాలను చూసి ఆనందించాడు. తరువాత వటపత్ర శాయి స్వామి ఉదరం నుండి బయటకు వచ్చి, ఆ స్వామి పాదారవిందాల సమీపంలో వాసం చేస్తూ ప్రళయ కాలం గడిపాడు. ఎవరికీ చూడడానికి సాధ్యం కాని తన దివ్యమైన రూపాన్ని ఈ విధంగా భగవంతుడు మార్కండేయ మహర్షికి అనుగ్రహించాడు. తన అవతారాల ప్రయోజనాన్ని గూర్చి భగవానుడు మార్కండేయ మహర్షికి తెలియజేశాడు. ఇది భగవంతుడు మార్కండేయనకు అనుగ్రహించిన గీతోపదేశం వంటిది. సంగ్రహంగా ఇది మార్కండేయ మహర్షి వైభవం.

1) (కర్మ కైంకర్యంలో అంతర్భవిస్తుంది) అని సంప్రదాయంలో ధర్మాచరణం గొప్పగా కీర్తింప బడుతున్నది.

శ్రీకృష్ణుడు, సత్యభామ ద్రౌపదితో పాటు కూడి ఉండే పంచపాండవులతో కలసి ఉండే కాలంలో శ్రీమార్కండేయుడు వీరిని అందరిని చూడడం కోసం అక్కడకు వెళ్లాడు. పాండవులు ఆ మహర్షిని దర్శించి, నమస్కరించి తగిన సత్కారాలను చేశారు. అప్పుడు దేవర్షి నారదుడు అక్కడకు వచ్చాడు. ఆ మహర్షిని కూడా పాండవులు చక్కగా గౌరవించి, తగిన ఉపచారాలు చేశారు. వీరు అందరు కలసి ఉన్న విషయాన్ని మిగిలిన మహర్షులు, అందరూ బ్రాహ్మణోత్తములు, ఇంకా అక్కడ ఉండే పెద్దలు తెలిసికొని అందరూ అక్కడకు వచ్చి చేరారు. ఈ విధంగా అందరూ కలిసి ఉండే సభలో భగవంతుడు మార్కండేయునితో మహనీయ తత్వాలను గూర్చి, ఋషులు, ప్రభువులు, ఉత్తమ స్త్రీలు మొదలైనవారి సనాతనమైన సదాచరణాలను గూర్చి, ఇంకా సదుపదేశపరమైన శ్రుతీతిహాసాదులను గూర్చి పాండవులకు తెలుపవలసినదిగా పలికాడు.

ఈ విధంగా మహాభారతంలోని వనపర్వంలో (మార్కండేయ సమాశ్రయ పర్వంలో) పంచపాండవులకు మార్కండేయుడు ఉపదేశించే ప్రకరణం ఆరంభం అవుతున్నది. మహాభారతంలో ఇది ఒక ముఖ్యమైన ఘట్టం. మనం తప్పక తెలిసికోవలసిన ఎన్నో విషయాలను మార్కండేయుడు పంచ పాండవులకు చాలా ఆశ్చర్యకరంగా ఉపదేశించాడు. ముఖ్యంగా –

1) మానవులు ఈ లోకంలో, పరలోకంలో సుఖదుఃఖాలను, కర్మఫలాలను అనుభవించే క్రమాన్ని తెలియజేశాడు.

2) మరణించినవారిని కూడా బ్రతికించే శక్తి బ్రాహ్మణులకు ఉన్నది అనే విషయాన్ని ఒక ఇతిహాసం ద్వారా వివరించాడు.

3) తార్ క్ష్యునకు, సరస్వతికి మధ్య జరిగిన సంవాదాన్ని తెలియజేసే క్రమంలో అగ్నిహోత్రం, దానం, మోక్షం మొదలైనవానిని గూర్చి తెలియజేశాడు.

4) వైవస్వత మనువు యొక్క చరిత్రను, భగవంతుని మత్స్యావతారాన్ని గూర్చి ఉపదేశించాడు.

5) నాలుగు యుగాల ధర్మాలను వివరించాడు.

6) ప్రళయాన్ని గూర్చి వర్ణించాడు. తాను ప్రళయ సముద్రంలో ఉన్నప్పుడు వటపత్రశాయి రూపంలో ఉండే భగవంతుని కడుపులో ప్రవేశించి, మూడు లోకాలను చూచి, ఆనందించి తిరిగి బయటకు వచ్చి, భగవంతుని పాదాలు సమీపంలో ప్రళయ సమయాన్ని గడిపిన సంగతిని గురించి వివరించాడు.

7) భగవంతుడు తన ప్రభావాలను తనకు తెలియజేసిన తరువాత తాను వానిని మరచిపోయాను –అని, మళ్లీ ఇప్పుడు సత్యభామా సమేతుడైన శ్రీకృష్ణుని సేవించే కాలంలో తిరిగి మళ్ళీ తనకు గుర్తుకు వస్తున్నాయి– అని, ఈ శ్రీకృష్ణుడే పరమాత్మ అయిన

శ్రీమన్నారాయణుడు– అని, ఈ స్వామి శరణు పొందమని పాండవులకు ఉపదేశించాడు.

ఇక్కడే, ఈ సందర్భంలోనే, "సర్వేషామేవ లోకానాం పితా మాతా చ మాధవః, గచ్ఛధ్వ మేనం శరణం శరణ్యం పురుషర్షభాః"

(అన్ని లోకాలకు తల్లి, తండ్రి మాధవుడే. శరణ్యుడైన ఇతనిని పురుషులలో గొప్పవారైన మీరు శరణు పొందండి) అనే శ్లోకాన్ని మార్కండేయ మహర్షి పలికాడు.

భగవంతుడు నోరు తెరిచి పలికే కాలంలో చాలా అందంగా ఉన్నాడు), "నారసింహవపుః శ్రీమాన్" (శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రం) (సౌందర్యం అనే లక్ష్మి కలవాడు), "అళకియాన్ తానే అరియురువన్ తానే" (నాన్మకన్ తిరు వందాది– 22), "శ్రీమాన్ సుఖసుప్తః" (శ్రీ రామాయణం సుందరకాండ– 28 –25) (భగవంతుడు సుఖంగా నిద్రించేటప్పుడు చాలా అందంగా ప్రకాశిస్తున్నాడు) అని మొదలైనచోట్ల ఈ అర్థాన్ని మనం గమనించవచ్చు. మహర్షులు, ఆళ్వారులు, ఆచార్యులు భగవంతుని సౌందర్య పూర్తిని చక్కగా దర్శించి, ఆనందించారు.

భగవానుడు మోహినీ అవతారాన్ని ఎత్తి, దేవతలకు మాత్రం అమృతాన్ని ఇచ్చి, గరుడునిపై ఎక్కి తాను ఉండే చోటుకు వెళ్ళాడు. తరువాత దేవతలకు అసురులకు మధ్య జరిగిన యుద్ధంలో దేవతలు జయించారు. అసురులకు ప్రభువైన మహాబలి ఇంద్రునిచే జయింపబడి, ప్రాణాలు పోగొట్టుకుని సమయంలో అతనిని అసురులు శుక్రాచార్యుని దగ్గరకు తీసుకుని వెళ్లారు. శుక్రుడు సంజీవనీ మూలికతో అతనిని, అతనికి చెందినవారిని బతికించాడు. భృగువంశంలో పుట్టిన బ్రాహ్మణులు మహాబలికోసం నూరు అశ్వమేధ యాగాలను చేశారు. ఈ విధంగా తన ఆచార్యుడైన శుక్రాచార్యుని అనుగ్రహం చేత చాలా బలాన్ని పొందినవాడైన మహాబలి ఇంద్రలోకానికి వెళ్లి, ఇంద్రుని యుద్ధంలో జయించాడు.

మహాబలి తేజస్సును చూచిన ఇంద్రుడు చాలా భయపడినవాడై, తన ఆచార్యుడైన బృహస్పతిని కలిసి, ఆలోచించాడు. మహాబలి గొప్ప తేజస్సును కలవాడై ఉన్నందున అతనిని యుద్ధంలో జయించడం ఇందునకు సాధ్యం కాదు అని, అసురుల బలం తగ్గేవరకు దేవతలు సహించి ఉండాలని, తిరిగి మంచి దశ ఏర్పడడంకోసం వారు శ్రీమహావిష్ణువును ఆశ్రయించాలని బృహస్పతి ఇంద్రునకు హితవు చెప్పాడు. ఇంద్రునితోపాటు దేవతలు అందరూ ఇంద్రలోకాన్ని విడిచిపెట్టి పరుగుతీసి సత్యలోకంలో తలదాచుకున్నాడరు. ఈ విధంగా మహాబలి ఇంద్ర పదవి అయిన త్రైలోక్యరాజ్యాధిపత్యాన్ని పొంది, ఇంద్రునకు కల భోగాలను అన్నిటివి అనుభవిస్తూ ప్రజలను చక్కగా పరిపాలిస్తున్నాడు.

అదితి పుత్రులకు ఆదిత్యులు అని పేరు. తన సంతానమైన దేవతలు అసురులచే బాధింపబడి, ఇంద్రలోక వాసాన్ని కోల్పోయి తపించడం చూచిన అదితి, దేవతల కోరికలు తీరేటట్లుగా తనకు ఒక పుత్రుడు కలగాలని కోరి, అందుకోసం తన భర్త అయిన కశ్యపుని ప్రార్థించింది. అతడు కూడా భగవంతుని, భాగవతుల పూజించే పయోవ్రతం అనే వ్రతాన్ని ఆచరించమని అదితిని నియమించాడు. ఆమె కూడా తగిన నియమాలతో పయోవ్రతాన్ని ఆచరించగా, దాని ఫలంగా ప్రసన్నుడైన భగవంతుడు ఆమె ముందు ప్రత్యక్షమై, తానే ఆమెకు పుత్రుడుగా అవతరిస్తానని తెలిపాడు. ఈ విధంగా 12 మంది ఆదిత్యుల తరువాత శ్రీ వామన మూర్తిగా అదితికి అవతరించాడు. ఇంద్రునకు తమ్ముడైనందున ఉపేంద్రుడు అనే పేరును పొందాడు.

ఆళ్వారులు శ్రీ వామన త్రివిక్రమావతారాన్ని, శ్రీ కృష్ణావతారానికి కలిపి చాలా సందర్భాలలో కీర్తించారు. శ్రీ కృష్ణావతారానికి ఒక ప్రత్యేకంగా అనుభవించడం అనేది ఒక క్రమం. ఈ రెండు అవతారాలను కలిపి కీర్తించడం అనేది ఇంకొక క్రమం. ఈ క్రమంలో ఉండే ఆనందాన్ని చక్కగా అనుభవించి ఆనందించారు, ఆళ్వారులు, వారి మార్గాన్ని అనుసరించినవారు మన

పూర్వాచార్యులు. ఈ రెండు అవతారాలకు మధ్య పోలిక చాలా ఉన్నది. వాటిలో ఒకటి ఏమంటే, ఈ రెండు అవతారాలలో భగవంతుడు అవతరించేటప్పుడు మహావిష్ణు రూపంలోనే ఆవిర్భవించాడు అనేది ఒకటి. తరువాత, తన కన్నవారి ప్రార్థనకు అంగీకరించి, తన నిజరూపాన్ని మరుగు పరచుకొన్నాడు అనేది ఇంకొకటి. భగవంతుడు భాద్రపద మాసంలో, శుక్ర పక్షంలో, ద్వాదశి తిథిలో, శ్రవణా నక్షత్రంలో అదితికి పుత్రుడుగా అవతరించాడు.

ఆ సమయంలో నాలుగు చేతులతో, పీతాంబరాన్ని ధరించినవాడై, తామర పూలవంటి నేత్రాలను కలవాడై, వక్షఃస్థలంలో శ్రీవత్సమనే పుట్టుమచ్చను కలవాడై, వనమాలను ధరించినవాడై, కిరీటం, మకర కుండలాలు మొదలైన ఆభరణాలను ధరించినవాడై, సాక్షాత్తూ నారాయణుడై అవతరించాడు. తరువాత కశ్యపుడు, అదితి ప్రార్థించగా తన రూపాన్ని మార్చుకుని భగవంతుడు వామనమూర్తి అయ్యాడు. ఆనాడే అతనికి జాతకర్మ, బ్రహ్మోపదేశం, సమిధాధానం వంటి వైదిక సంస్కారాలను దేవతలు, మహర్షులు జరిపించారు. సూర్యుడు బ్రహ్మోపదేశం చేశాడు. బృహస్పతి యజ్ఞోపవీతాన్ని అలంకరించాడు. భూదేవి కృష్ణాజినాన్ని, చంద్రుడు దండాన్ని, బ్రహ్మ కమండలును, ద్యులోకం ఛత్రాన్ని. సప్తర్షులు దర్భలను, సరస్వతి జపమాలను, అదితి కౌపీనాన్ని, కుబేరుడు భిక్షను సంపాదించడం కోసం ఒక పాత్రను వామన మూర్తికి సమర్పించారు. ఉమాదేవి భిక్షను పెట్టింది. శ్రీ వామన భగవానుడు తన దేహంలో బ్రహ్మవర్చస్సు అనే తేజస్సు వెలుగుతూ ఉండగా, మహాబలి చేసే అశ్వమేధయాగ శాలకు వెళ్ళాడు.

యాగశాలలోకి భగవంతుడు ప్రవేశించడం చూచిన అక్కడ ఉండే బ్రాహ్మణులు మొదలైనవారు అతని తేజస్సును చూచి ఆశ్చర్య పడ్డారు. మహాబలి కూడా చాలా సంతోషించి, వామనునకు స్వాగతం పలికి, చాలా ప్రీతితో తగిన ఉపచారాలు చేశాడు. మహాబలి వామనునకు తగిన ఆసనాన్ని ఇచ్చి, నమస్కరించాడు. భగవానునకు అర్ఘ్యం మొదలైన ఉపచారాలను చేశాడు. శ్రీ

వామనుని చరణాలను కడిగి ఆ తీర్థాన్ని శిరస్సుపై జల్లుకొన్నాడు. తరువాత వామనునితో ఈ విధంగా అన్నాడు–

"ఓ బ్రాహ్మణోత్తమా! రండి. మీకు దాసుని నమస్కారాలను తెలుపుకుంటున్నాను. బ్రహ్మ తేజస్సు అంతా సమీకృతమై, ఒక రూపాన్ని పొందినట్లుగా మీరు వెలుగుతున్నారు. మీరు ఇక్కడికి వచ్చినందున దాసుని పూర్వులు చాలా సంతోషించారు. మీరు వచ్చినందున దాసుని కుటుంబం వంశం అంతా పవిత్రం అయింది. మీకు ఏమి అపేక్షితం అనే విషయాన్ని తెలుపవలసినదిగా ప్రార్థిస్తున్నాను. పశువులా? బంగారమా? గృహాలా? వివాహం చేసుకోవడం కోసం బ్రాహ్మణ కన్యకలా? అశ్వాలా? ఏనుగులా? లేక, ఏది కావాలో మీరు దాసునకు తెలుపవలసినదిగా కోరుతున్నాను. నేను దేనికైనా సమర్పించడానికి సిద్ధంగా ఉన్నాను"

ఈ విధంగా మహాబలి గౌరవంతో కూడిన ప్రీతితో వామనుని చూచి ప్రశ్నించాడు. దీనికి తరువాత వామనుడు మహాబలిని దగ్గర మూడు అడుగుల నేల యాచించి పొందిన చరిత్ర మనకు తెలిసినదే. అయినప్పటికీ దీనిని గూర్చి కొన్ని విషయాలను తెలుపుతాను.

రెండు పాదాలతో కింద లోకాలను, పై లోకాలను అన్నిటిని భగవంతుడు కొలిచాడు. దీనిని మహాబలి గమనించాడు. మూడవ అడుగును గూర్చి విచారం ఇంకా కలుగలేదు. వెంటనే నీవు "ఉత్తముడవు" అని భగవంతుని మహాబలి పొగిడాడు. ఉత్తముడు– పరమ పురుషుడు– పురుషోత్తముడు– అని అర్థం. గోదాదేవి కూడా దీనిని మనసులో పెట్టుకొని" ఓంగి ఉలగళంద ఉత్తమన్ "అని తిరుప్పావై ప్రబంధంలో అన్నది మహాబలి భగవంతుడు ఉత్తముడు– అని మాత్రమే పొగిడాడు. గోదాదేవి దానికి తగిన కారణాన్ని కూడా చేర్చి "ఓంగి ఉలగళంద ఉత్తమన్" అని అన్నది. లోకాలను కొలిచినవాడు ఉత్తముడు

అయ్యాడు అని దీని భావం. భగవంతుడు సర్వలోక మహేశ్వరుడు. సకల చేతనాచేతనాలకు అధిపతి. అంటే, ఈశ్వరుడు, శేషియైఉండేవాడు అతడు ఒక్కడే. ఇటువంటి తన గొప్ప స్వభావాన్ని విడచి, తనకు దాసుడైనవాని దగ్గరకు వెళ్లి, తన సొత్తును తానే యాచించి పొందడం అనేది ఉన్నదే, అది కూడా ఇంద్రుని కోసం చేయడం అనేది ఉన్నదే, అది పురుషోత్తముడైన అతడు ఒక్కని వల్లనే సాధ్యం అని మన పెద్దలు పొగడుతారు.

భగవంతుని మిగిలిన అవతారాల వంటిది కాదు, త్రివిక్రమావతారం. మనం రామావతార, కృష్ణావతార చరిత్రలను కొన్నిటిని అయినా తెలిసికొంటాము. అయితే, శ్రీ నరసింహావతార, శ్రీ త్రివిక్రమావతార చరిత్రలను గూర్చి మనకు ఏమీ తెలియదు. వీటిని చాలా సాధారణంగా మనం భావిస్తాము. శ్రీనృసింహావతారానికివలె త్రివిక్రమావతారానికి కూడా ఎన్నో విశేషాలు ఉన్నాయి. మిగిలిన అవతారాలలో భగవంతుడు కొందరు అధికారులకు మాత్రమే అనుగ్రహాన్ని ప్రదర్శించాడు. కొందరు దుష్టులను మాత్రమే నిగ్రహించాడు. సాక్షాత్తు ధర్మ స్వరూపుడైన తనను చక్కగా స్థాపించుకున్నాడు. జగత్ సృష్టి, జగద్రక్షణ, జగత్ సంహారం, అనుగ్రహం నిగ్రహం అనే ఐదు కృత్యాలు భగవానునకు ఉన్నాయి అనేది శాస్త్రాలలో చెప్పబడుతున్నది. వీటిలో అనుగ్రహ నిగ్రహాలను రెండిటినీ తన అవతారాలలో తన భక్తుల కోసం విశేషంగా భగవంతుడు నిర్వహిస్తాడు. అయితే, శ్రీ త్రివిక్రమావతారం ఒక్కటిలో మాత్రమే నిగ్రహం అనేది భగవానునకు తెలియదు. నిగ్రహం అనేది కొంచెం కూడా లేకుండా అనుగ్రహం మాత్రమే మూర్తీభవించిన అవతారం త్రివిక్రమావతారం. త్రివిక్రమ భగవానుడు ఎవరిని అయినా నిగ్రహించాడు అనే చరిత్రే లేదు. ఇది ఈ అవతారానికి ఉండే ఒక గొప్ప విశేషం. "ఉవంద ఉళ్ళత్తనాయ్ ఉలకమళందు" (అమలనాదిపిరాన్– 2) అని తిరుప్పాణ్ అళ్వార్ల సూక్తి. అన్ని విధాలుగా అందరికీ అనుగ్రహించడం కోసమే భగవంతుడు ఎత్తిన అవతారం కనుక అతని మనసులో ఏర్పడిన ఆనందాన్ని ఆళ్వార్లు కీర్తించారు అని అంటారు, మన పెద్దలు. భగవంతుని పురుషోత్తమత్వం పరిపూర్ణంగా ప్రకాశించిన అవతారం శ్రీత్రివిక్రమావతారం.

ఇంద్ర పదవి అనేది భగవంతుడు ఏర్పరచిన ఒక నియమం. దానికి మార్పును కలిగించాడు మహాబలి. భగవంతుని ఆజ్ఞను మీరి ఏమి చేసినా దండింపవలసినదే. దేవతల ఆర్తధ్వనిని విని సహించలేక, వారి దుఃఖాన్ని తీర్చడం కోసం ఇంద్రునకు అతడు కోల్పోయిన త్రైలోక్య రాజ్యాధిపత్యం తిరిగి అతనికి కలిగించడం కోసం ఈ అవతారం ఏర్పడినది. అయినా, భగవంతుడు దేవతలను అనుగ్రహించడంతో పాటు మహాబలికి కూడా అనుగ్రహాన్ని చూపించాడు. సర్వలోక మహేశ్వరుడైన తనను ఒక అసురుని వద్ద యాచించే విధంగా తనను మలచుకున్నాడు, భగవంతుడు. ఇది అతని పురుషోత్తమత్వంలో చేరుతుంది అని అంటారు, మన పూర్వాచార్యులు. "మహాబలి ఐశ్వర్యాన్ని అంతటినీ గ్రహించడమే చాలు, అతనిని ఇంకా కూడా నిగ్రహించనక్కరలేదు "అని భగవంతుని దగ్గర బ్రహ్మ ప్రార్థించాడు. వెంటనే భగవంతుడు "తాను మహాబలి ఐశ్వర్యాన్ని గ్రహించడం నిగ్రహించడం కాదు, అతనిని అనుగ్రహించడమే" అనే విషయాన్ని "బ్రహ్మన్! య మనుగృహ్ణామి తద్విశో విధునేమ్యహమ్ యన్మదః పురుషః స్తబ్ధో లోకం మాం చావమన్యతే" (శ్రీమద్భాగవతం–8–22–24) అని భగవంతుడు అన్నాడు. "యస్యాహమనుగృహ్ణామి హరిష్యే తద్ధనం శనైః " (శ్రీమద్భాగవతం–10–88–8) అని ధర్మపుత్రుని దగ్గరకూడా ఈ విధంగానే అన్నాడు, భగవంతుడు. ఈ రెండు శ్లోకాలకు "యస్యానుగ్రహ మిచ్ఛామి తస్య విత్తం హరామ్యహమ్" అనేదే అర్థం.

మహాబలి పరమ భాగవతోత్తముడైన ప్రహ్లాదుని మనుమడు. ఇతని తండ్రి అయిన విరోచనుడు కూడా విష్ణుభక్తిలో గొప్పవాడు. బ్రాహ్మణుల వద్ద చాలా మర్యాదను, ప్రేమను కలవాడు. దేవతలు వంచక బుద్ధితో బ్రాహ్మణ వేషాన్ని ధరించి తన ఆయుస్సును యాచించినప్పుడు, ఈ విషయాన్ని తెలిసికూడా వారికి తన ఆయుస్సును విరోచనుడు ఇచ్చాడు. వీరి సంతతిలో పుట్టినవాడు కనుక మహాబలికూడా పరమ ధార్మికుడు. అందులోనూ ఔదార్య గుణంలో చాలా

గొప్పవాడై ప్రకాశించాడు. ఎన్నో మంచి కార్యాలను లోకుల హితం కోసం చేశాడు. తన ప్రజలను చక్కగా పాలించాడు. ఈ కారణాలవల్ల అతడు భగవత్ స్వభావాన్ని కలిగినవాడై వెలిగాడు. "ప్రహ్లాదుని వంశంలో జన్మించిన ఎవరిని నేను వధించను" అని నరసింహావతార కాలంలో భగవంతుడు వరం ఇచ్చినట్లు కంబ మహాకవి తెలియజేస్తారు. భగవంతుడు మహాబలి విషయంలో చేసిన అనుగ్రహం ఎటువంటిది?

1) భగవంతుడు తన రెండు పాదాలతో అన్ని లోకాలనూ కొలిచి, మహాబలి ఐశ్వర్యాన్ని అపహరించి, అతనికి కల "నాది" అనే మమకారాన్ని పోగొట్టాడు. తన మూడవ పాదాన్ని అతని శిరస్సుపై పెట్టి, అతనికి కల "నేను" అనే అహంకారాన్ని లేకుండా చేశాడు.

2) పాతాళలోకంలో అతడు అతని కుటుంబ సభ్యులతో, ఇంకా అతనికి చెందినవారితో సుఖంగా జీవించేటట్లు అనుగ్రహించాడు. భగవంతుడు ఎందుకు పాతాళలోకంలోకి బలిని గెంటి వేశాడు? అని మనకు సందేహం కలగవచ్చు. బలిని భగవంతుడు పాతాళలోకంలోకి గెంటి వేశాడు, బంధించాడు –అని మనం చెప్పకూడదు. భగవంతుడు మహాబలికి మనసులో తోచిన భావానికి అనుగుణంగానే పాతాళ లోకంలో అతనిని ఉంచాడు. తనకు త్రిలోకాధిపత్యం వద్దు. భగవంతుని శ్రీ చరణాలలోనే ఉజ్జీవనం కావాలి– అనే భావమే బలి మనసులో దృఢంగా ఉన్నది. స్వామి –దాస భావమే అతనికి భగవానుని విషయంలో ఉన్నది.

3) మహాబలి తన మనసులో మూడు విషయాలను గూర్చి విచారించి చూచాడు. అవి ఏమంటే, తనకు త్రైలోక్యాధిపత్యం గొప్ప పురుషార్థమా? లేక, సత్యలోకంలో భగవంతుని శ్రీ పాదతీర్థాన్ని శిరస్సులో ధరించడం

శ్రేయస్సా? లేక, పాతాళ లోకాలను కొలిచిన భగవంతుని శ్రీ చరణాల ధూళిని శిరస్సుపై ధరించి, అతని శ్రీ చరణ సమీపంలో నివాసాన్ని కోరడం గొప్పదా? అని ఆలోచించాడు. ఇంతకుముందే వామనుడు అశ్వమేధ యాగశాలకు వచ్చిన సమయంలో అతనికి పాదపూజ చేసి అతని శ్రీపాద తీర్థాన్ని తన శిరస్సుపై ధరించి అయినందున ధరించినవాడు కనుక, అతనికి వామనుని విషయంలో స్వామి–భావమే అతిశయించి ఉన్నది. విష్ణుభక్తులైన ప్రహ్లాదుడు, విరోచనుల సంతతిలో పుట్టినవాడు అయినందున, భగవంతుని చరణాలలో రుచి కలిగి, మూడవ పాదాన్ని తన శిరస్సుపై పెట్టమని తన శిరస్సును చూపించాడు, మహాబలి. పాతాళ లోకంలో భగవంతుని పాదధూళి శిరస్సుతో ధరించే గొప్ప ప్రయోజనాన్ని పొంది అతడు తరించాడు.

4) భగవంతుడు విశ్వకర్మను పిలిచి, సుతల లోకంలో మహాబలికి అన్ని భోగాలూ నిండిన ఒక అందమైన నివాస స్థానం నిర్మించమని అతనిని నియమించాడు. అంతేకాక, దానిని తాను, తన చక్రాయుధం ద్వారపాలకులుగా నిలిచి రక్షిస్తానని కూడా తెలియజేశాడు.

5) రాబోయే మన్వంతరంలో అతనికి ఇంద్రపదవిని ఇస్తానని, అప్పుడు అతనికి తన విషయంగా ఉండే భక్తిని పూర్ణంగా కలుగజేసి, తరువాత ఇంద్రపదవి ముగిసే ఈ సమయంలో, అతనిని తన దగ్గరకు చేర్చుకుంటాను అని కూడా వరం ఇచ్చాడు.

సంప్రదాయంలో భగవంతుడు ఇంద్రునకు, దేవతలకు, మహాబలికి చేసిన అనుగ్రహాలను ముఖ్యంగా చెప్పలేదు. అతడు రెండు పాదాలతో ఆక్రమించి లోకాలను కొలవడమే మన ఆళ్వారుల చేత, మన పూర్వాచార్యుల చేత ముఖ్యంగా కీర్తింపబడుతున్నది. భగవంతుడు లోకాలను కొలిచిన కాలంలో

అతడు పాదస్పర్శ పడని వ్యక్తి కానీ, అర్థం కాని లేదు భగవంతుడు అన్ని లోకాలకూ తల్లిగా ఉన్నందువల్లే లోకాలను అన్నిటినీ తన పాదాలతో కొలిచాడు అని దీనికి గల కారణాన్ని మన పూర్వాచార్యులు. తెలియజేశారు భగవంతుడు లోకాలను కొలవడం మాతృత్వం కారణంగా ఏర్పడిన కార్యం అని దీని భావం. మహా వ్యాఖ్యాతలు అయిన పెరియ వాచ్చాన్ పిళ్ళై ఈ ఒక దృష్టాంతం మూలంగా భగవంతుని వాస్తవమైన స్థితిని చాలా ఆశ్చర్యకరంగా వర్ణించారు.

ఈ దృష్టాంతం చాలా ముఖ్యమైనది. ఒక బిడ్డ తొట్టిలో నిద్రపోతున్నది. తల్లి తన బిడ్డను చూస్తున్నది. ఆమెకు తన బిడ్డపై ప్రేమ పొంగి వచ్చింది. నిద్రపోయే బిడ్డను ఆ విధంగానే ఎత్తుకొని, శిరస్సును వాసన చూచి, తన గుండెలపై పెట్టుకున్నది. ఈ విధంగా తల్లి ప్రేమ పొంగి తనను ఎత్తుకోవడాన్ని ఆ బిడ్డకు తెలియదు. ఐయినా, తల్లి తన సత్త స్ఫురించేటట్లు, తన అనుభవం కోసం ఆ బిడ్డను ఎత్తుకుని తన గుండెలకు హత్తుకుంటుంది. ఈ విధంగానే భగవంతుడు కూడా విక్రమించి లోకాలను కొలిచాడు. "అనాదిమాయయా సుప్తః" (మాండూక్య ఉపనిషత్ 2–21) అనే విధంగా సంసారి జీవులం అయిన మనం అనాదికాలంగా మాయచే కట్టుబడి ఉన్నాము. ఆత్మకు నిద్ర అంటే– భగవద్విషయ జ్ఞానం లేకపోవడమే. భగవంతుని గూర్చిన జ్ఞానం కలగడం ఆత్మకు మెలకువ రావడం. నిద్రపోయే మన ఆత్మలకు మెలకువ, అంటే, భగవంతుని విషయంలో రుచి లేనందువల్ల భగవంతుడు మనకు చేసిన అనుగ్రహాన్ని, అంటే, భగవంతుని శ్రీచరణ స్పర్శను మనం తెలియలేదు. భగవంతుడు తనకు ఉండే మాతృత్వం కారణంగా తన బిడ్డలు అని మనలను తలచి, తన శ్రీ చరణాన్ని పెట్టి ఆనందించాడు.

ఈ సందర్భంలో "ఉఱంగుకిఱ ప్రజైయై తాయ్ ముదుకిలే అణైత్తుక్కొండు కిడక్కుమాపోలే, తాన్ అఱింద సంబంధమే హేతువాక విడమాట్టాదే, విముఖరానార్ తలైయిలుమ్ తిరువడికళై వైక్కైయాలే, వాత్సల్యమ్ శొల్లుకిఱదు" (శరణాగతి గద్య వ్యాఖ్యానం– 6) (నిద్రపోయే బిడ్డను తల్లి హృదయానికి హత్తుకొని దగ్గరకు తీసుకున్నట్లుగా, తాను తెలిసికొన్న మాతృత్వ

రూప సంబంధమే కారణంగా ఆ బిడ్డను విడువలేక, విముఖులై ఉండేవారి తలపై కూడా తన శ్రీచరణాన్ని త్రివిక్రమమూర్తి పెట్టినందున, వాత్సల్యం చెప్పబడుతున్నది),

"విచక్రమే పృథివీ మేష ఏతామ్" ఎన్నిఅపడియే గుణాగుణ నిరూపణమ్ పణ్ణాదే సర్వప్రాణికళ్ పక్కలిలుమ్ తిరువడిగళై వైత్తపడి. వ్యాప్తియిలే వరైతల్ ఇల్లాదాప్పోలే ఆయ్ ట్రు, ఇదువుమ్ వ్యాప్తిక్కు క్కరుత్తు. ఇవట్రినుడైయ సత్తై ఉండాక్కుకైక్కాక. ఇంగు ఇవట్రోడే స్పర్శమ్ తనక్కు ధారకమాకవిఱే నినైత్తిరుప్పదు. ఇవట్రుక్కు అపేక్షితమ్ ఇన్ఱిక్కే ఇరుక్కచ్చెయ్ దేయుమ్, ఉఱంగుకిఱ ప్రజైయై అణైత్తుక్కొండు కిడక్కుమ్ మాతావైప్పోలే ఇవట్రోట్టై స్పర్శమ్ తనక్కుత్తాన్ ఉకక్కిఱానిఱే. " (తిరుప్పావై వ్యాఖ్యానం –3) ("విచక్రమే పృథివీ మేష ఏతామ్"– ఈ భూమిని అంతటినీ ఆక్రమించాడు) అనే విధంగా గుణదోషాల నిరూపణం చేయకుండా, ప్రాణులు అందరి విషయంలో తన పాదాలను పెట్టిన రీతి ఇది. భగవంతుని వ్యాప్తిలో ఏ లోటు లేని విధంగానే, అతడు అందరి తలలపై పాదాలు పెట్టడంలో ఏ లోటూ లేదు. వ్యాప్తికి తాత్పర్యం ఏమంటే– ప్రాణులకు సత్తను కలిగించడమే. ఇక్కడ త్రివిక్రముడు జీవులతో సంబంధం తనకు ధారకంగా కదా భావించాడు. జీవులు త్రివిక్రముని పాదస్పర్శను అపేక్షించక పోయినా, నిద్రపోయే బిడ్డను గుండెలకు హత్తుకునే తల్లివలె, జీవులతో సంబంధం వల్ల తనకు తానే భగవంతుడు ఆనందించాడు కదా) అని ఈ విధంగా ఉండే పెరియ వాచ్చాన్ పిళ్ళై శ్రీసూక్తులు ఇక్కడ అనుసంధేయాలు. ఇంద్రుని కార్యాన్ని చేయడం అనేది వ్యాజం మాత్రమే. దీనిని ఒక కారణంగా గ్రహించి, ఈ సంసార మండలంలో ఉండే తన సంతానం అయిన మనలను దగ్గరకు తీసుకొని, ఆనందాఅనుభవాన్ని పొందాడు, త్రివిక్రముడు– అని తత్త్వం తెలిసిన మన పూర్వాచార్యులు పలికారు.

ఈ విధంగా త్రివిక్రమావతారంలో భగవంతుడు మన విషయంలో తాను పొందిన మాతృత్వాన్ని వ్యక్తం చేసిన రీతిని కొంచెం అనుభవంలోకి తెచ్చుకున్నాము. ఈ విధంగానే, భగవంతుడు మాతృత్వాన్ని ప్రదర్శించిన అర్చావతారం కూడా ఉంది. అర్చావతార మూర్తులలో చాలా ముఖ్యమైన రూపం శ్రీ వేంకటేశ్వర స్వామి రూపం. అందరికీ కులదైవంగా వెలిగేవాడు ఇతడే. ఇతనికి

ఎన్నో వైభవాలు ఉన్నాయి. వాటిలో ఒకటి– ఇతడు దివ్యసూరులకు, ఈ లోకంలోనివారికి అనుగ్రహించేటట్లుగా తిరుమలలో వేంచేసి ఉండే సన్నివేశం ప్రధానమైనది, ఎందుకంటే, ఇది ఇతడు తన మాతృత్వ ప్రయుక్తంగా ప్రదర్శించే ఒక అనుగ్రహ విశేషంగా ఉన్నందున –అని మన పూర్వాచార్యులు అంటారు. నిత్యసూరులు, ఈ లోకంలో ఉండేవారు శ్రీవేంకటేశ్వరస్వామిని ఆశ్రయిస్తున్నారు. నిత్య సూరులు పై లోకంలో నుండి కిందకు దిగి, శ్రీ వేంకటేశ్వర స్వామిని సేవించి ఆనందిస్తారు. శ్రీ వేంకటేశ్వరుడు వారిని రక్షించి, అనుగ్రహిస్తాడు. ఈ లోకంలోని వారు కొండపైకి ఎక్కి, తిరుమలలో వేంచేసి ఉండే శ్రీ వేంకటేశ్వర స్వామిని సేవించి ఆనందిస్తారు వారిని అందరిని రక్షించి అనుగ్రహిస్తాడు, స్వామి.

భగవానుని ఈ వైభవాన్ని ఒక ఉదాహరణ ద్వారా మన పూర్వాచార్యులు విశదీకరిస్తారు. కవల పిల్లలను ప్రసవించిన ఒక తల్లి ఒక వైపు ఒక బిడ్డను, ఇంకొక వైపు ఇంకొక బిడ్డను ఒకే సమయంలో పెట్టుకొని తన పాలను ఇచ్చి రక్షించేటట్లుగా, వాత్సల్యం అనే మహా గుణం అతిశయించి ఉండే వేంకటేశ్వరుడు కూడా ఒకే సమయంలో పరమపద వాసులను, భూలోక వాసులను రక్షిస్తున్నాడు, "ఎన్ కణ్ పాశమ్ వైత్త పరమ్ శుడర్ శోది" (తిరువాయ్ మొళి –3–3–4) (నా విషయంలో వాత్సల్యాన్ని కలిగిన వేంకటేశ్వరుడు అనే గొప్ప తేజస్సు) అని అంటూ నమ్మాళ్వారులు శ్రీ వేంకటేశ్వరుని ఉద్దేశించి పలికారు.

నమ్మాళ్వారులు తిరువాయ్ మొళిలో తాము మంగళాశాసనం చేసే అర్చావతార మూర్తులు ఒక్కొక్కరిలోనూ ముఖ్యంగా ప్రకాశించే ఒక మహా గుణాన్ని గూర్చి తెలియజేశారు అనే విషయాన్ని వారి మనసును అనుసరించి శ్రీ అళకియ మణవాళ నాయనార్ అనే పూర్వాచార్యులు ఆచార్య హృదయం అనే గొప్ప గ్రంథంలో తెలియజేశారు. ఈ సందర్భంలో శ్రీ వేంకటేశ్వరుని వద్ద ముఖ్యంగా ప్రకాశించే మహాగుణం వాత్సల్యమే అనే విషయాన్ని "మణ్ణోర్ విణ్ణోర్ వైప్పిల్ పోకిన్ట ఏళులకుక్కుయిర్ పాశమ్ వైత్త నికరిల్ వాత్సల్యమ్ ఉజ్వలమ్" (160) అని ఆచార్య హృదయ చూర్ణిక తెలియజేస్తున్నది. భగవానుడు మనకు తల్లియై, మనకు ఏమి మంచిని చేస్తున్నాడు? అనే విషయాన్ని మన

విషయంలో వాత్సల్య గుణం తల ఎత్తిన శ్రీవేంకటేశ్వరుని వైభవాన్ని పురస్కరించుకొని మనం చక్కగా తెలియవచ్చు. వాత్సల్య గుణం అంటే ఏమి? అని అంటే, అప్పుడే తాను ప్రసవించిన లేగదూడ విషయంలో ఒక తల్లి ఆవుకు ఉండే ప్రేమ వాత్సల్యం అని చెప్పబడుతున్నది. ఒక ఆవు తాను లేగదూడను ప్రసవించినప్పుడు, ఆ ఆవుగర్భం నుండి బయటకు వచ్చే దూడ శరీరం రక్త మాంసమయంగా ఉంటుంది. తల్లి ఆవు ఈ విధంగా ఉండే లేగదూడ శరీరాన్ని ప్రేమతో తన నాలుకతో నాకి, దాని శరీరంలో ఉండే ఈ దోషాలను అన్నిటిని తొలగిస్తుంది. ఈ విధంగా తల్లి ఆవు తన లేగదూడ పట్ల దగ్గర ఉండే దోషాలను దోషాలుగా చూడడం లేదు. తన దూడ దగ్గర ఉండే దోషాలు ఆ ఆవుకు భోగ్యాలుగా, అంటే, గుణాలుగానే తోస్తున్నాయి.

ఈ విధంగానే జీవుల అందరి విషయంలో అద్వితీయమైన తల్లి అయిన శ్రీవేంకటేశ్వరుడు కూడా ఒక తల్లి ఆవు తన దూడ శరీరాన్ని శుభ్రం చేయడం వలే, మన ఆత్మలను శోధనం చేసి, అంటే, మన దగ్గర ఉండే ఆవిద్య మొదలైన దోషాలను పోగొట్టి, మనలను అమలాత్మలుగా, పరిశుద్ధాత్మలుగా చేసి, మన స్వరూపం ప్రకాశించేటట్లు చేస్తున్నాడు, ఇంతే కాదు, తల్లి ఆవు తన దూడ దగ్గరకు ఎవ్వరినీ రానివ్వదు. దూడ దగ్గరకు వచ్చేవారిని అది దూరంగా తరిమి వేస్తుంది. తన దూడకు ఎవరు ఏమి చేస్తారో? అనే భావంతో దానికి ఎక్కడనుండో ఒక మొరటుతనం వస్తుంది. అది తన దూడ దగ్గరకు ఎవరు వచ్చినా, తన కొమ్ములతో పొడిచి, గిట్టలతో గుచ్చి, దూరంగా తరిమి వేస్తుంది. వేంకటేశ్వరుడు కూడా తన భక్తుల విషయంలో వారిని కంటికి రెప్పవలె కాపాడుతాడు. వారిని అన్ని విధాలైన ఆపదలనుండి కాపాడతాడు. ఈ విధంగా మన అవిద్యాది దోషాలను పోగొట్టడం అనేది, మనలను చెడ్డ శక్తులనుండి కాపాడడం అనేది శ్రీవేంకటేశ్వరుడు మన విషయంలో కలిగి ఉండే వాత్సల్యం అనే మహాగుణ కార్యాలుగా గ్రహింపబడుతున్నాయి.

భగవంతుడు ఈ లోకంలోని కొందరిని తనకు తల్లిగా గ్రహించడం

ఈ శ్లోకాన్ని చక్కగా గమనించి పరిశీలించినప్పుడు ఎన్నో విషయాలు తోస్తూనే ఉంటాయి అనే విషయాన్ని ఇంతకుముందే తెలియజేశాను. ఈ సందర్భంలో మనం చాలా ముఖ్యంగా కొన్ని చరిత్రలను తెలుసుకోవాలి. లోకాలకు అన్నిటికీ భగవంతుడు తల్లి, అందరూ అతని బిడ్డలు అనేది ఆశ్చర్యం కాదు. ఈ సంసార మండలంలో మృగాలతో, అసురులతో, ఆచార్యులతో, ఆళ్వారులతో తేడా లేకుండా కొందరు వ్యక్తులు భగవంతుని తమకు పుత్రునిగా, తమను అతనికి తల్లిగా భావించి, ఆ స్వామి విషయంలో వాత్సల్య పయుక్తమైన ప్రేమను కలిగి ఉన్నారు అని, భగవంతుడు కూడా వారు తన విషయంలో కలిగి ఉండే తల్లి ప్రేమను ఆదరించి, ఆనందించి, చక్కగా స్వీకరించాడు అనే విషయం తప్పక మనం తెలియవలసిన వాస్తవాలు. ఈ విశేష వ్యక్తులు వారు వారు తాము ఉండే స్థితిలో భగవంతుని విషయంలో పుత్ర దృష్టిని కలిగి ఉన్నారు. భగవంతుడు కూడా వారితో ఈ విధమైన సంబంధం ఏర్పడే సమయంలో ఈ విశేషవ్యక్తుల విషయంలో "భగవంతుడు జీవులకు తల్లి" అనే సంబంధం తారుమారుగా అవుతుంది అని ఏర్పడుతున్నది.

జీవుల విషయంలో భగవంతునకు ఉండేది రక్షకత్వం. మనలను భగవంతుడు రక్షించేవాడై, మనం అతనిచే రక్షింపబడేవారమై ఉన్నాము. జీవాత్మకు, పరమాత్మకు మధ్య ఉండే ఈ సంబంధం తారుమారై, జీవాత్మ తనను రక్షకునిగాను, పరమాత్మను తనచే రక్షింపబడేవాడుగాను భావించి, "భగవంతునకు ఏమీ హాని ఏర్పడ కూడదు, అంతేకాక, అతనికి అన్ని విధాలైన మంగళాలు కలగాలి" –అని ఆశించడం మంగళాశాసన పరత అని అనబడుతుంది. ఇటువంటి స్థితి ఆ స్వామిని సాక్షాత్తుగా దర్శించినప్పుడు గాని, లేక, సాక్షాత్తుగా దర్శిస్తున్నట్లుగా భావన కలిగినప్పుడు గాని కొందరు విశేష వ్యక్తులలో ఏర్పడుతున్నది. ఈ విధంగా భగవంతునకు మంగళాశాసన పరుడై ఉండడం ఆత్మ పొందదగిన ఒక గొప్ప స్థితి. భగవానునితో సంబంధం నేరుగా లభించిన కాలంలో ఆ స్వామి విషయంలో వాత్సల్య ప్రయుక్తమైన గొప్ప ప్రీతి విశేషం కొందరు కలిగి ఉన్నారు– అనే విషయం మనం తెలియవచ్చు.

పూతనా మోక్ష వృత్తాంతం

శ్రీ త్రివిక్రముడు ఉత్తముడు, పురుషోత్తముడు అని కీర్తింపబడుతున్నాడు అనే విషయాన్ని గూర్చి ఇంతకు ముందు కొంచెం తెలిసికొన్నాము. పురుషోత్తముడు మహోపకారకుడు, అందరి కోరికలను పూర్తి చేస్తాడు అని భావం. దీనికి తగినట్లు ఏర్పడినదే– పూతనా మోక్ష వృత్తాంతం.

శ్రీ వామన మూర్తి మహాబలి అశ్వమేధ యాగం జరిగే చోటుకు వెళ్లిన కాలంలో అక్కడ ఉండే బ్రాహ్మణోత్తములతో, అసురులుతోపాటు అందరూ భగవంతుని రూప సౌందర్యంలో, తేజస్సులో మోహాన్ని పొందారు. మహాబలికి రత్నమాల అనే ఒక కుమార్తె ఉన్నది. ఆమెకు పుత్ర భాగ్యం కలుగలేదు. ఆమె వామన మూర్తిని చూచింది. వామన రూపంలో, సౌందర్య సంపదతో నిండి ఉండే ఆ భగవానుని విషయంలో ఆమెకు తల్లి ప్రేమ పొంగి వచ్చింది. అతనిని అమాంతంగా ఎత్తుకొని, కౌగలించుకుని, ముద్దు పెట్టుకొని, తన ఒడిలో పెట్టుకొని పాలను ఇవ్వాలి అనే ఆశ ఆమెకు కలిగింది. పురుషోత్తముడైన భగవంతుడు ఆమె మనస్సులో కలిగిన ఈ భావాన్ని గమనించాడు. కొంచెం సేపు గడచి తరువాత శ్రీ వామనుడు త్రివిక్రముడై విక్రమించి, లోకాలను కొలిచి మహాబలి ఐశ్వర్యాన్ని అంతటినీ అపహరించాడు. దీనిని అంతటినీ రత్నమాల గమనించింది. తన తండ్రిని త్రివిక్రముడు మోసగించాడనే సంగతిని ఆమె తెలిసి కొన్నది. వెంటనే ఆమెకు వామనమూర్తి విషయంలో కలిగిన తల్లి ప్రేమ అన్నది అంతరించి, విరోధభావం తల ఎత్తింది. కోపంతో అతనిని వధించి నశింప చేయాలి అని తహ తహ లాడింది. భగవంతుడు ఆమె మనసులో ఏర్పడిన ఈ భావాన్ని కూడా తెలుసుకున్నాడు.

ఇది రత్నమాల యొక్క చరిత్ర. అ తరువాత భగవంతుడు శ్రీ కృష్ణుడై అవతరించిన కాలంలో ఆ స్వామి దివ్య సంకల్పం మూలంగా రత్నమాల

పూతనగా పుట్టింది. పూతనయొక్క పూర్వజన్మ అయిన రత్నమాల యొక్క చరిత్ర బ్రహ్మవైవర్త పురాణంలో బదరికాశ్రమంలో నరనారాయణుడు అయిన భగవానుడు నారదునకు తెలిపినట్లు కనిపిస్తున్నది. భగవంతుడైన శ్రీ కృష్ణుడు రేపల్లెకు వేంచేసి కొద్ది దినాలు మాత్రం గడచిన సమయంలో, అతడు ఎక్కడ ఉన్నాడు? అనే విషయాన్ని తెలియని కంసుడు అతనిని గమనించి తెలిసికొని వధించడం కోసం పూతనను పంపించాడు.

శ్రీరామావతారానికి, శ్రీ కృష్ణావతారానికి మధ్య సామ్య వైషమ్యాలు రెండు ఎన్నో ఉన్నాయి. సామ్యాలలో ఒకటి ఏమంటే, ఈ రెండు అవతారాలలో భగవంతుడు మొదట ఒక స్త్రీనే వధించాడు. ఇదే విషయంలో వైషమ్యం కూడా ఉన్నది. అది ఏమంటే, రామావతారంలో తాటకిని మొట్టమొదట వధించాడు అయితే ఆమెకు మోక్షం లభించినట్లు చరిత్ర లేదు. శ్రీకృష్ణావతారంలో మొదట భగవంతుడు పూతనను వధించాడు, అయితే ఆమెకు వెంటనే మోక్షాన్ని అనుగ్రహించాడు.

పూతన చాలా బలం కలిగిన రాక్షస స్త్రీ. వేయి పర్వత శిఖరాలను పొడి పొడి చేసి, దానిని అంతటినీ మోస్తూ ఆకాశంలో అనాయాసంగా ఎగుర గలిగిన శక్తి కలిగినది. ఆమె ఒక అందమైన స్త్రీ వేషాన్ని ధరించి, ప్రతి గ్రామంలోనూ సంచరిస్తూ వచ్చింది. ఆమెకు శ్రీకృష్ణుడు ఎక్కడ ఉన్నాడు? అనే విషయం తెలియలేదు. అందువల్ల ఆ సమయంలో ఆమె సంచరించే చోట ఉండే గ్రామాలలో పుట్టిన చంటి బిడ్డలను అందరిని వధించాలని తీర్మానించుకొన్నది. వరుసగా ఒక్కొక్క గ్రామంలోకి పోయి, అక్కడ ఏదైనా చంటిబిడ్డ పుట్టినట్లయితే, దానిని ఒడిలో పెట్టుకొని లాలించి, స్తన్యాన్ని ఇవ్వడం మూలంగా ఆ బిడ్డకు విషం ఇచ్చి, తరువాత అక్కడ నుండి తొలగిపోయి, వేరొక గ్రామానికి వెళ్ళిపోయేది. కొంచెం సేపటిలోనే ఆమె దగ్గర పాలు తాగిన బిడ్డ చనిపోయేది ఈ విధంగా ఏడు దినాలు గడిచాయి. ఆ తరువాతనే ఆమె గోకులం ఆమె కంటికి కనిపించినది. చూచినవారి అందరి కళ్ళను ఆకర్షించే రూపంతో ఆమె రేపల్లెలోకి ప్రవేశించి, నందగోపుని ఇంటి లోపలకి వచ్చింది. యశోద ఆమెను చూచి, "ఈమె ఏదో ఒక ఉన్నత కుటుంబం

నుండి వచ్చిన స్త్రీ వలె ఉన్నది!" అని ఆశ్చర్యపడి, ఆమెకి స్వాగతం పలికింది. శ్రీకృష్ణుడు పుట్టిన దగ్గరనుండి రేపల్లెలోని స్త్రీలు అందరూ ఒక్కొక్కరుగా వచ్చి శ్రీకృష్ణుని ఒడిలో పెట్టుకొని, ప్రేమతో అతనితో ఆటలాడడం అలవాటు అయినందున, యశోదాదేవి కూడా పూతనను గూర్చి ఏమీ సందేహ పడలేదు.

"వ్రజదేశానికి రాణి అయిన యశోదా! నేను మధురానగరానికి చెందిన ఒక బ్రాహ్మణుని పత్నిని. మధుర నగరానికి వచ్చిన కొంతమంది ద్వారా నీకు ఈ పెద్ద వయస్సులో అన్ని లక్షణాలతో కూడిన ఒక మగ బిడ్డ పుట్టాడు అనే శుభకరమైన వార్తను విని, ఆ బిడ్డను చూసి ఆశీర్వదించాలి అనే ఆశతో ఇక్కడకు వచ్చాను. అన్ని మంగళాలతో నిండి ఉండే నా స్తన్యం నుండి ఎల్లప్పుడు అమృతంవంటి పాలు ప్రవహిస్తూనే ఉంటాయి. దీనిని తాగితే నీ బిడ్డ ఏ నాశనం లేని శరీరాన్ని, కీర్తిని పొంది వెలుగుతాడు. నీకువలె, నీ బిడ్డకు కూడా అన్ని మంగళాలు కలగాలని నేను తల్లిపాలను ఇవ్వాలని వచ్చాను. "

ఈ విధంగా పలుకుతూ పూతన తొట్టిలో ఉండే శ్రీకృష్ణుని దగ్గరకు వచ్చింది. యశోదాదేవి తొట్టిలో నిద్రపోతున్న శ్రీకృష్ణుని పైకి తీసి ఆమెకు ఇచ్చి, ఇంటి లోపల తన పనులను చూసుకోవడం కోసం వెళ్ళిపోయింది. పూతన శ్రీకృష్ణుని తన ఒడిలో పెట్టుకొన్నది. అతడు నిద్ర పోతున్న సర్పరజ్జువు అని భావించి ఒడిలో పెట్టుకున్నట్లుగా ఉన్నది అని శుకమహర్షి అంటారు. ఏ శ్రీకృష్ణ భగవానుని వినాశనం కోసం తాను ప్రయత్నిస్తున్నదో, ఆ శ్రీకృష్ణుని చేతిలోనే కొంచెం సేపటిలో తన ప్రాణాలు పోగొట్టుకొనబోతున్నది అని తెలియని పూతన తన ఒడిలో ఉండే అతనికి విషం కలిసిన పాలను ఇవ్వడం ఆరంభించింది. శ్రీకృష్ణ భగవానుడు ఆమె ఇచ్చిన స్తన్యక్షీరం, విషం, ఆమె ప్రాణాలు– అనే మూడింటినీ కలిపి కొంచెం కొంచెంగా తాగడం ఆరంభించాడు. "నన్ను వదిలి పెట్టు, నన్ను వదిలి పెట్టు" అని బాధను సహించలేక అరుస్తూ, శ్రీకృష్ణ భగవానుని కింద పడవేయడం కోసం ఆమె ఆమె ప్రయత్నించింది. ఆది సాధ్యం కానందువల్ల భగవానుని కూడా మోస్తూ బయటకు పరిగెత్తి ఆకాశమార్గంలో మధురానగరం వైపు పోవడం ఆరంభించింది. కొంచెం దూరం వెళ్ళి, దాటగానే భగవంతుని లీలా శక్తి ఆమెను అదుమగా, ఆమె తన రాక్షస శరీరంతో. ప్రాణాలను వదిలింది. పిడుగు పడినట్లుగా పెద్ద శబ్దంతో 12 మైళ్ల దూరం కంసునకు చెందిన వనంలో

ఉండే వృక్షాలు విరుస్తూ, ఆమె భౌతిక శరీరం భూమిపై పడింది. భగవంతుడు ఆమెను కొంచెంసేపు తన నేత్రాలతో వీక్షించాడు. ఆమె తన పెద్ద రాక్షస శరీరంతో మరణించి కింద పడేటప్పుడు దైవీ స్వభావాన్ని కలిగిన గోకులంలోని చెట్లు, లతలు, వృక్షాలు దానివల్ల బాధింప పడకూడదు దానికి బదులుగా కంసునకు, అతనికి చెందిన దుష్టులకు ఉపయోగపడే ఆసురస్వభావాన్ని కలిగిన వనం నాశనం కావాలి అనేదే దాని ప్రయోజనం.

భాగవతంలోని పదవ స్కంధంలో ఆరవ అధ్యాయంలో పూతన చరిత్ర వర్ణింపబడింది.

ఇందులో,

1) పూతన నందగోపుని ఇంటిలో ప్రవేశించిన వెంటనే భగవానుడైన శ్రీకృష్ణుడు తన నేత్రాలను మూసి కొన్నాడు– అని,

2) శ్రీకృష్ణ భగవానుడు పూతన దగ్గర స్తన్యాన్ని తాగాడు –అని,

3) గోపాలకులు ఆమె మృత శరీరాన్ని ఖండ ఖండాలుగా ఖండించారు, దాని నుండి సుగంధం వీచిందని చెప్పబడింది. ఈ మూడు విషయాలను శుకులు భాగవతంలో ప్రస్తావన చేశారు.

మన వంటి వారికి ఇది చాలా సాధారణంగా, చిన్న విషయాలుగా తోస్తాయి. మహానుభావులైన పెద్దలు భగవంతుని చరిత్రలను అనుభవించే కాలంలో చిన్న చిన్న విషయాలను కూడా చాలా నిశితంగా గమనించి, వాటిలోని భావార్థాలను తెలియజేస్తారు. ఈ మూడు విషయాలను గూర్చి కొంచెం వివరంగా తెలియజేస్తాను.

భగవంతుడైన శ్రీకృష్ణుడు పూతనను చూడకుండా తన నేత్రాలను మూసికోవడం

శ్రీకృష్ణ భగవానుడు పూతన పాలను ఇచ్చేటప్పుడు ఆమెను చూడకుండా ఎందుకు తన నేత్రాలను మూసి కొన్నాడు? అనేదానికి ఎన్నో విధాలైన కారణాలను మన పూర్వాచార్యులు నిర్వహించి పలికారు. భగవంతుడు ఎందుకు వెన్నను చాలా ఆశపడి భుజించాడు? అనేదానికి చాలా కారణాలు చెప్పబడుతున్నాయి. భగవంతుడు ఎందుకు శిశుపాలునకు మోక్షం ఇచ్చాడు

అనేదానికి నారద భగవానుడు, శ్రీయామునులు, భగవద్రామానుజులు, వేదాంత దేశికులు అనే నలుగురు వేరువేరు కారణాలను చూపించారు. ద్రౌపది ప్రపత్తి ఎందుకు ఫలించలేదు? అనేదానికి సుప్రసిద్ధ మహాచార్యులైన తిరుమళిశై అణ్ణా అప్పంగార్ స్వామి, శ్రీపెరంబూదూర్ ఒన్టాన ఎంబార్ జీయర్ స్వామి వేరు వేరు కారణాలను చూపించారు. భగవంతుడు ఏ కారణంవల్ల ఇక్ష్వాకు వంశంలో దశరథ చక్రవర్తికి కుమారుడుగా జన్మించాడు అనేదానికి ఎన్నో కారణాలు చెప్పబడుతున్నాయి. ఈ విధంగానే దివ్యప్రబంధ వ్యాఖ్యానాలలో పలు సందర్భాలలో మన పూర్వాచార్యులు నిర్వహణ చేశారు. శాస్త్ర గ్రంథాలలో భగవంతుని చరిత్రలను వర్ణించే కాలంలో పలుచోట్ల ఆ కారణబహుత్వం కనిపిస్తున్నా, ఒక కారణం ఇంకొక కారణాన్ని బాధించదు. నిర్వాహ భేదాలు ఉన్నప్పటికీ, ఒక నిర్వాహం ఇంకొక నిర్వాహానికి దూషణం కాబోదు. ఇక, భగవంతుడు అయిన శ్రీకృష్ణుడు పూతనను చూడకుండా ఎందుకు తన కళ్ళను మూసుకున్నాడు? అనే ప్రశ్నకు గల కారణాలను చూద్దాం.

1) భగవంతుడు నందగోపాలునకు కుమారుడై జన్మించి కొన్ని దినాలు మాత్రమే అయినందున, చిన్న బిడ్డలకు ఉండే స్వభావాన్ని ఈ విధంగా భగవానుడు వ్యక్తం చేశాడు అని ఒక సమాధానం. పూతన విషం ఇవ్వబోతున్నది. విషం చాలా కఠినమైనది. సాధారణంగా బిడ్డలకు మందు ఇచ్చేటప్పుడు అది వారికి చేదుగా ఉంటుంది. దానిని గ్రహించడం కఠినంగా ఉంటుంది. కనుక బిడ్డలు మందులు తాగేటప్పుడు కళ్ళు మూసుకుంటారు. ఆ విధంగానే ఇక్కడ కూడా విషం తాగే సమయంలో చంటి బిడ్డ అయిన శ్రీకృష్ణుడు కళ్ళు మూసుకున్నాడు. భగవంతుడు చంటి బిడ్డగా ఉండే తన స్థితికి తగినట్లు తన కళ్ళను మూసుకున్నాడు. "పరావర నిఖిల జగన్మోహన మనోనయనహారి దివ్యచేష్టితాని కుర్వన్" (పెద్దవారు, చిన్న వారు అనే తేడా లేకుండా అందరి కళ్ళను, మనసును అపహరించే విధంగా పలు దివ్య లీలలు చేసేవాడై) (శ్రీ గీతాభాష్యం –అవతారిక) అని శ్రీరామానుజులు పలికిన విధంగా, అందరి మనసులను అపహరించ

గలిగిన లీలలను చేయాలని సంకల్పించి జన్మించినవాడు కనుక, శ్రీకృష్ణ భగవానుడు తన కన్నులను మూసుకోవడం ఒక బాల్య లీలగానే అనుభవించదగినది.

2) చాలా దుష్టురాలు, అవిద్యా స్వరూపమై ఉండేదైన పూతనను కంటితో చూడకూడదు –అనే భావంతో భగవానుడు తన నేత్రాలను మూసి కొన్నాడు అనేది పెద్దలు చేసిన ఇంకొక నిర్వాహం.

3) భగవంతుడు అమృతమథనం చేసే సమయంలో వ్యక్తమైన విషాన్ని శివుడు తాగాడు. ఇప్పుడు తాను కూడా విషాన్ని తాగవలసి వచ్చినందున, భగవంతుడు తన నేత్రాలను మూసుకొని, శివుని మనసులో తలుస్తున్నాడు అనేది ఇంకొక నిర్వాహం.

4) స్త్రీ అయిన ఈ పూతను వధించవలసి వస్తున్నదే! ఈమె వధించే కాలంలో మరణం ఈమెకు చాలా బాధను కలిగిస్తుందే! ఈమెకు కలిగే ఈ దుర్దశను ఏ విధంగా చూడడం! అని భగవంతుడు భావించాడు. అయినా, ఈమె అనువదించడం ద్వారా కఠినమైన ఈమె రాక్షస జీవనం ముగిసిపోయి, పరమపదంలో ఈమెకు అచింత్యమైనది అంటే, ఇంద్రియాల చేత తెలియడానికి సాధ్యం కానిది, దివ్యమైనది, అంటే, అప్రాకృతమైనది, అందమైనది, కాంతితో నిండినది, నిరంతరమైనది, మహానందంతో నిండి ఉండే జీవనాన్ని భగవంతుడు ఇవ్వబోతున్నాడు కనుక, దానిని భావించి సమాధాన పడుతున్నాడు –అని భగవంతుడు తన నేత్రాలను మూసి కోవడానికి ఇంకొక సమాధానం చెప్పబడింది.

5) కపట వేషాన్ని ధరించి వచ్చిన పూతన తనకు స్తన్యాన్ని ఇవ్వడం కోసం వచ్చింది. ఆమె కోరిక పూర్తి కావాలి అని భగవంతుడు తన నేత్రాలను మూసికొన్నాడు అని ఒక సమాధానం. అంటే, భగవంతుడు తన నేత్రాలను తెరచి ఆమెను చూచి చూచినట్లయితే, ఆమె కపట వేషం తొలగి, ఘోరమైన రాక్షస శరీరం అందరి కళ్ళకు కనిపిస్తుంది. యశోదాదేవి ఆమెను చూచి చాలా భయపడుతుంది. తరువాత గోపాలకులు వేలాయుధాలతో ఆమెతో యుద్ధం చేయడం ఆరంభిస్తారు.

తరువాత నందగోపుని గృహం యుద్ధరంగం అయిపోతుంది. ఇందువల్ల పూతన మనోరథం పూర్తి కాకుండా పోతుంది – అని భావించి భగవంతుడు తన నేత్రాలను మూసి కొన్నాడు అని మరి ఒక సమాధానం.

6) శ్రీకృష్ణ భగవానుడు తన నేత్రాలను మూసుకోవడానికి ఇంకా వేరొక భావం చెప్పబడుతున్నది. అది ఏమంటే, పూతన భగవానునకు విషం ఇవ్వడం కోసం వచ్చింది అని అంటే, భగవానుని కడుపులో అణగి ఉండే లోకాలలోని జీవరాసులు అన్నీ, భగవంతుడు విషాన్ని భుజిస్తే దానివల్ల తమకు ఏమి హాని కలుగుతుందో! అని భయపడవచ్చు. అందుచేత భగవానుడు తన కన్నులను మూసుకొని తన చూపును తన ఉదరంలో ఉండే జీవరాసుల వైపు ప్రసరింపచేసి, "మీకు ఆపద ఏమి రాదు, మీరు భయపడకండి" అని అభయాన్ని ఇవ్వడం కోసం కన్నులు మూసి కొన్నాడు అనేది ఇంకొక సమాధానం.

7) భగవానుడు తామర పూల వంటి నేత్రాలను కలిగినవాడు కనుక, తన నేత్రాలతో పూతనను చూస్తే, ఆమె తన నేత్ర సౌందర్యాన్ని చూచి, తాను నారాయణుడు అనే విషయాన్ని తెలుసుకొని భయపడితే తర్వాత ఏమి చేయాలి? అని భావించి భగవంతుడు తన తిరునేత్రాలను మూసి కొన్నాడు అనే ఒక సమాధానం చెప్పబడింది.

8) శ్రీ రామావతారంలో భగవంతుడు వనవాసం చేసే సమయంలో, శూర్పణఖ అనే రాక్షసి సీతారాములు, లక్ష్మణుడు ఉండే చోటుకు వచ్చి, వారితో సంభాషించింది. మీరు ఎవరు ఈ కఠినమైన అరణ్యానికి ఏవిధంగా వచ్చారు? అని అడిగింది పురుషోత్తముడైనందున శ్రీరాముడు ఆమెను తన నేత్రాలతో చూసిన సమయంలో రాక్షసి అయినా, ఆమె విషయంలో కూడా శ్రీరామునకు అనుకూల భావం కలిగింది. ఋజు బుద్ధితో శ్రీరాముడు ఆమెకు తన చరిత్రను తెలియజేశాడు. ఈ విధంగా ఆమె విషయంలో ఏర్పడిన అనుకూల భావానికి కారణం భగవంతుడు ఆమెను తన నేత్రాలతో చూడడమే.

ఇది తరువాత పెద్ద ప్రమాదానికి కారణమై, సీతారాములు విశ్లేషించి, గొప్ప దుఃఖాన్ని పొందడానికి హేతువు అయినది. ఈ కారణం వల్ల ఆ భగవంతుడు, మళ్ళీ తాను పూతనను కన్నెత్తి చూస్తే, ఆమె పట్ల అనుకూల భావం ఏర్పడి పోతుందో! ఏమో! అని భయపడి, తన నేత్రాలను మూసుకొన్నాడు అని వేరొక కారణం చెప్పబడినది.

భగవానుడైన శ్రీ కృష్ణుడు పూతన దగ్గర స్తన్య క్షీరాన్ని తాగడం

శ్రీభాగవతంలో భగవానుడు పూతన దగ్గర ఆమె స్తనాలనుండి విషాన్ని, ఆమె ప్రాణాలను పీల్చి వేశాడు –అని మాత్రం వర్ణింపబడలేదు. దీనికి బదులుగా, అతడు ఆమె దగ్గర స్తన్య క్షీరాన్ని తాగాడు అనేదానినే ప్రధానంగా శుకుడు వర్ణించాడు. ఈ సందర్భంలో ఋషి అభిప్రాయం ఏమో మనకు చక్కగా తెలియాలికదా. పూతన భగవంతుని విషయంలో విరోధ భావాన్ని కలిగినదై, విషం కలిసిన పాలను ఇచ్చినప్పటికీ, ఆమె భగవంతుని విషయంలో పూర్వజన్మలో కొంచెంసేపు కలిగి ఉన్న మాతృత్వ భావనను భగవానుడు ఆమెలో ఆరోపించుకొని, ఆమె స్తన్య క్షీరాన్ని స్వీకరించాడు. ఈ కారణం వల్ల శుకమహర్షి "భగవానుడు పూతన యొక్క స్తన్య క్షీరాన్ని స్వీకరించాడు" అనే విషయాన్నే ముఖ్యంగా పలికారు. రత్నమాల ఏదో కొంచెం కాలం భగవంతుని పట్ల మాతృత్వ దృష్టిని కలిగి ఉన్న కారణంగా, ఆమె మరు జన్మలో ఒక క్షణకాలం స్వామి ఆమెను తల్లిగా స్వీకరించి, ఆమె ఇచ్చిన స్తన్యాన్ని గ్రహించి, ఆమెకు మోక్షాన్ని ఇచ్చాడు. పూతన తన చూచుకాలకు విషాన్ని పూసుకొని, దాని ద్వారా శ్రీకృష్ణునకు పాలు ఇచ్చింది. అయితే, భగవంతుడు విషంగా చేయబడిన స్తన్య క్షీరాన్ని అమృతంగా గ్రహించి, దానిని పీల్చాడు అని చరిత్ర. విషంగా చేయబడిన పాలు అమృతంగా ఏ విధంగా అయినది? అనేది ప్రశ్న. ఏ విధంగా పరమపావనమైన గంగా నది అనేది తన సంబంధంతో అందరి దోషాలను పోగొడుతుందో, ఆ విధంగానే అమృతాన్ని స్రవించే భగవానుని యొక్క సంబంధంచేత దోషాలు తొలగి అమృతమైనది అని భావం. భగవంతుని తిరుమంజన తీర్థమైన గంగానదికి ఉండే శక్తి భగవానునకు లేకుండా పోతుందా?

పూతన మృతశరీరాన్ని దహనం చేసినప్పుడు దానినుండి సుగంధం వీచడంలోని తాత్పర్యం

హృదయంలో కొంచెం కూడా జాలి లేకుండా, పసిబాలుని లీలగా చంపే స్వభావాన్ని కలిగినది, మనుషుల రక్తం ఆహారంగా స్వీకరించేది, దురాచారం నిండినది, రాక్షసి అయిన పూతనశరీరమైనా, అది భగవంతుడైన శ్రీకృష్ణుడు ఆమె దగ్గర స్తన్యాన్ని స్వీకరించాడు అనేదే కారణంగా ఆ శరీరం దోషాలు లేనిది అయినది. బ్రహ్మ మొదలైన దేవతలు కానీ, పరమపదంలో ఉండే దివ్య సూరులు కానీ, దివ్య మహిషీ వర్గం కానీ, అందరూ ఎవరి చరణాలను పరమోద్దేశంగా భావిస్తారో, ఆ స్వామి దివ్యమంగళ విగ్రహాన్ని దగ్గరకు తీసికొన్నందున, చాలా నీచమైన స్వభావాన్ని, నీచమైన చరిత్రనూ కల పూతన యొక్క ఆత్మ, శరీరం అనే రెండు దోషాలు లేని స్వభావాన్ని పొందాయి– అని భగవానుని సంబంధాన్ని కారణంగా పలికారు, శ్రీశుకమహర్షి.

శ్రీ మహాభారతంలో ఒకచోట కుంతీదేవి శ్రీకృష్ణుని ముందు ఆ స్వామి అవతార రహస్యాన్ని విన్నపించడం ప్రస్తావించబడింది. తనను దర్శించేవారి అందరి మనసును అపహరించి, వారి హృదయంలో ప్రవేశించి, వారికి తన విషయంలో భక్తిని కలిగించి, వారిని దోషం లేనివారినిగా చేయడం కోసం ఈ లోకంలోకి వచ్చి జన్మించాడు భగవంతుడైన శ్రీకృష్ణుడు– అని ఆమె అంటుంది. ఆత్మకు దోషం సంసారం. సంసారం అనే దోషం తీరిపోతే ఇక అది నివసించడం పరమపదంలోనే. అక్కడే పరిపూర్ణమైన ఆత్మస్వరూపావిర్భావం జరుగుతుంది. భగవంతుడైన శ్రీకృష్ణుడు పూతన యొక్క ఆత్మను దోషం లేనిదిగా చేసేటప్పుడు, ఆమె చరమ శరీరాన్ని అమలంగా, అంటే, దోషం లేనిదిగా చేశాడు అనేదే ఇక్కడ విశేషం.

శ్రీరామావతారం కాలంలో భగవానుడు శబరి చేతితో ఇచ్చిన ఫలాలను గ్రహించి, ఆమెకు మోక్షాన్ని ఇచ్చాడు. శ్రీ కృష్ణావతారచరిత్ర అంతకంటే గొప్పది. పూతనకు కల విరోధ భావాన్ని భగవంతుడు అనుకూల భావంగానే గ్రహించాడు. ఇక్కడ మనసులో కొంచెం కూడా దయ లేని క్రూర రాక్షసి అయిన పూతనకు

భగవంతుడు మోక్షాన్ని ఇవ్వడం తగినదా? అనే ఒక సందేహం కలుగుతుంది. నందగోపాలునకు సంతానం కలిగిన సంగతి వెంటనే కంసునకు తెలుపబడినది అయితే, కంసుడు కానీ, పూతన కాని, ఆ బిడ్డయే శ్రీకృష్ణుడు అనే విషయాన్ని తెలియలేదు. పూతన శ్రీకృష్ణుడు ఎక్కడ ఉన్నాడు? అని తెలియలేక, సమీపంలో ఉండే గ్రామాలు అన్నిటిలో ప్రవేశించి, అక్కడ నూతనంగా పుట్టిన బిడ్డలను అందరిని పూతన వధిస్తున్నది.

"కంటకేనైవ కంటకమ్" (ముల్లును ముల్లుతోనే తీయాలి) అనే న్యాయాన్ని అనుసరించి భగవంతుడు ఈ అభిప్రాయాన్ని ఆమె మనసులో కలిగించాడు. పూతన చేత చంపబడిన బిడ్డలు అందరూ కంసునకు సహాయపడటం కోసం నరరూపంలో వచ్చి పుట్టిన అసురులే. ఆసుర శక్తులైన ఆ బిడ్డలను పూతన అనే ఆసుర శక్తితోనే భగవంతుడు వధించాడు. ఈ విధంగా ఈ విషయంలో కూడా పూతన భగవంతునకు అనుకూలంగానే ప్రవర్తించినది అయినది. ఇందువల్ల భగవానుడు పూతనకు మోక్షం ఇవ్వడం తగదు అనే ఆక్షేపణకు అవకాశం లేదు– అనే విషయాన్ని మనం తెలియవచ్చు. పూతన సూక్ష్మ శరీరాన్ని గ్రహించి, చక్కగా అలంకరించబడిన విమానంలో ఎక్కి, దివ్య లోకానికి వెళ్ళింది.

"య ఏతత్ పూతనా మోక్షం కర్మ కృష్ణస్య చాద్భుతమ్, నిశమ్య శ్రద్ధయా యుక్తో గోవిందే లభతే గతిమ్" అనే ఈ శ్లోకం ఈ అధ్యాయం చివరలో కనిపిస్తున్నది. ఇందులో "పూతనా వధమ్" అని నిర్దేశించకుండా, “పూతనా మోక్ష వృత్తాంతమ్" అనే శుకమహర్షి పలికారు. శ్రద్ధతో దీనిని పఠించేవారికి, వినేవారికి కృష్ణ భక్తి కలుగుతుంది అని ఫలశ్రుతిని కూడా తెలియజేశారు.

శ్రీకృష్ణ భగవానుని విషయంలో విరోధం కలిగినదై, ఆ స్వామికి, వంచనతో కూడిన వాత్సల్య భావాన్ని ఆరోపించుకుని, విషం కలిసిన స్తన్యాన్ని ఇచ్చి, చంపాలని ప్రయత్నించిన పూతనకే ఉత్తమోత్తమ గతి కలిగింది– అని అంటే, ఆ స్వామి పట్ల నిజంగానే వాత్సల్య ప్రయుక్తమైన, అతి మాత్రమైన ప్రేమను చూపిన గోకులంలోని పశువులకు, గోపికలకు కలిగిన ఆనందాన్ని గురించి ఇక

చెప్పాలా? అని అంటారు, శుకమహర్షి. ఈ సందర్భంలో వారు మనసులో భావించిన చరిత్ర ఏది?

శ్రీకృష్ణుడు జన్మించినది మధురలోనా?, లేక, రేపల్లెలోనా? అనే విచారం రాగా, శ్రీకృష్ణుడు స్తన్యాన్ని తాగినది రేపల్లెలో కనుక, అక్కడే అతడు పుట్టినట్లు భావించాలి అని అంటారు, మన ఆచార్యులు. వాస్తవానికి శ్రీకృష్ణుడు యశోదాదేవి దగ్గర మాత్రమే స్తన్యాన్ని తాగాడు అని మాత్రం కాదు, అతడు పూతన దగ్గర కూడా పాలను తాగాడు అని మాత్రమే కాదు, అతడు రేపల్లెలోని తల్లి ఆవులు అన్నిటినీ, రేపల్లె లోని గోపికలను అందరిని తనకి తల్లులుగా భావించిన కాలం ఉన్నది. ఈ విధంగానే, శ్రీకృష్ణుడు భుజించినది వెన్న మాత్రమే కాదు, ఆవుల పాలు, దధ్యోదనం కూడా శ్రీకృష్ణుడు చాలా ఆశ పడి భుజించిన వస్తువులే. వ్రజ దేశంలో శ్రీకృష్ణునకు చాలా ఇష్టమైన మజ్జిగ పులుసుకు బృందావని అని పేరు. కృష్ణునకు చాలా ఇష్టమైనది అనే కారణం వల్లనే విశేష దినాలలో ఈ మజ్జిగ పులుసు చేయడం అలవాటులో వచ్చింది. మన ఆచార్యులు వ్యాఖ్యానాలలో, ముఖ్యంగా ఈడులో, ఈ మజ్జిగ పులుసును ప్రస్తావిస్తారు.

ఒకనాడు శ్రీకృష్ణుడు మిగిలిన తన తోటి గోపాలకులతో కలసి పశువులను మేపడం కోసం వనానికి వెళ్ళినప్పుడు, బ్రహ్మ ఆవు దూడలను, గోపాలబాలురను అపహరించి తీసుకొని పోయాడు. ఇందువల్ల ఒక సంవత్సర కాలం శ్రీకృష్ణుడు గోపాలబాలురుగా, లేగదూడలుగా మారాడు ఈ విషయాన్ని ఏమీ తెలియని ఆవులు ఎల్లప్పుడూ లేగదూడలుగా మారిన భగవంతుని విషయంలో అధికమైన వాత్సల్యంతో పాలను స్రవించాయి. గోపికలు కూడా భగవానుడే గోపాలబాలురుగా మారాడు అనే విషయాన్ని తెలియకపోయినా, ఇంతకుముందే తమ పిల్లల విషయంలో చూపిన వాత్సల్యం కంటే అధికమైన వాత్సల్యాన్ని, ఇప్పుడు తమ పిల్లలుగా మారిన భగవంతుని విషయంలో చూపించారు.

ఈ విధంగా భగవంతుడు రాక్షసి అయిన పూతనను తల్లిగా భావించి, ఆమె దగ్గర పాలు తాగాడు. ఆవులను కూడా తన తల్లులుగా భావించి వాటి పాలను

గ్రహించాడు. ఉత్తమాధికారులు అయిన గోపికలను కూడా తనకు తల్లులుగా భావించి, వారు, యశోదవలె, ఆవు పాలను చక్కగా కాచి, అందులో కలకండ, పరిమళ ద్రవ్యాలు చేర్చి, ఎంతో ప్రేమతో ఇవ్వగా, దానిని కూడా చాలా ఆశతో గ్రహించాడు. ఈ విధంగా గోకులం అంతా వాత్సల్యంతో ఒక సంవత్సర కాలం శ్రీకృష్ణుని పెంచింది. ఇది శ్రీకృష్ణావతారానికి కల చాలా గొప్పతనాలలో చాలా విలక్షణమైనది. భగవంతుని అవతారాలలో ఇక దేనిలోనూ ఇటువంటి విలక్షణమైన సందర్భం ఏర్పడలేదు. మహర్షులలో, వాల్మీకి భగవానుడు శ్రీరామావతారంలో సీతాదేవి రెండవ సారి శ్రీరాముని విడచి, తన ఆశ్రమంలో నివసించేటపుడు ఆమె ఈ విషయంలో వాత్సల్యాన్ని కలిగి ఉన్నాడు అనే విషయాన్ని మన పూర్వాచార్యులు తెలియజేశారు.

ఆళ్వారులలో, పెరియాళ్వారు, కులశేఖరాళ్వారు తాము భగవంతుని సాక్షాత్కారాన్ని పొందిన దశలో, ఆ స్వామిపట్ల తమకు గల మాతృత్వ భావనను ఆశ్చర్యకరంగా వ్యక్తం చేశారు. విభవావతారాలకు ప్రతినిధి అయిన అర్చావతారంలో, అంటే కంచి వరదరాజస్వామి విషయంలో నడాదూర్ అమ్మాళ్, తిరునారాయణ పురం తిరు నారాయణస్వామి విషయంలో ఆయ్ జనన్యాచార్యులు తమకు ఉండే మాతృత్వ భావాన్ని అతిమాత్రప్రేమతో స్వామి కోసం పాలను కాచి సమర్పించడంద్వారా వ్యక్తం చేసి, ఆ కారణం వల్ల ఆ అర్చామూర్తులచే తల్లిగా సంభావింపబడిన గొప్పతనాన్ని పొందారు. ఇంతేకాక, శ్రీవైష్ణవుల గృహాలలో, ఆచార్య పురుషుల తిరుమాళిగలలో వేంచేసి ఉండే భగవంతుడు తన భక్తులు తనకు ఎంతో ప్రీతితో సమర్పించే పాలను స్వీకరిస్తున్నాడు.

ఈ విధంగా భగవంతుడు లోకానికి తాను తల్లిగా ఉండడం మాత్రమే కాదు, లోకంలో కొందరిని తనకి తల్లిగా గ్రహించాడు. భగవంతుని మనం తల్లిగా భావించటం గొప్పదా? లేక, మనలను అతడు తల్లిగా భావించడం గొప్పదా? అని అంటే, దీనికి ఏ విధమైన సమాధానం మనం నిశ్చయించి చెప్పలేము. ఇది వారి వారి భావ విశేషాలును అనుసరించి, భగవంతుని సంకల్పం అనుసరించి

చెప్పవలసిన విషయం. అయితే, పరమపదంలో మనకు ఆ స్వామితో అన్ని విధాలైన సంబంధాలు, దానికి తగినట్లు ఏర్పడే అనుభవాలు తప్పక ఉంటాయి అనే విషయాన్ని శాస్త్రాన్ని పురస్కరించుకొని మన పూర్వాచార్యులు నిర్ణయించారు.

మాధవుని పితృత్వం

ఇక మన విషయంలో భగవంతునకు ఉంది పితృత్వం అనేది ఏమి? అనే విషయాన్ని గమనిద్దాం మన నిరుపాధికతండ్రి అయిన మాధవుడు ఏవిధంగా అనుగ్రహిస్తున్నాడు? అనే విషయాన్ని కర్మ వశం చేత మనకు ఏర్పడిన తండ్రి చేసే హితం మూలంగా ఒక విధంగా తెలియవచ్చు. మనకు కర్మ చేత ఏర్పడే తండ్రి మన హితంలో దృష్టిని కలిగి ఉంటాడు. మాత ప్రియపరురాలుగా ఉంటుంది. తండ్రి హిత పరుడై ఉంటాడు అని శాస్త్రం చెబుతున్నది. నా బిడ్డకు ఏది ప్రియమో, దానిని చేస్తాను –అని తలచి ఆ విధంగా తల్లి చేస్తుంది. నా బిడ్డకు ఏది హితమో దాన్ని చేస్తాను– అనే విషయంలో దృష్టిని కలిగి ఉంటాడు, తండ్రి. ఈ విధంగా ఒక బిడ్డను గూర్చి దాని తల్లిదండ్రులకు భావన, ప్రయత్నం ఉంటాయి.

మన పుట్టుకకు మన తండ్రి కారణం అయి ఉంటాడు. అంటే, మనలను ఉత్పత్తి చేస్తాడు. మనం ఈ లోకంలో పుట్టడానికి కారణం అయి ఉండేవాడు తండ్రి. మనం పుట్టిన నాటినుండి మన హితంలో దృష్టిని కలిగి ఉంటాడు, తండ్రి. మనలను ఉద్దేశించి ఎన్నో కార్యాలను చేస్తాడు. మనలను విద్యలో, ఆటపాటలలో గొప్పవారిగా తీర్చిదిద్దడానికి ప్రయత్నం చేస్తాడు. మనం చెడ్డ దారిని అనుసరించి తిరుగకుండా ఉండడం కోసం మంచి ఆచారం, అనుష్ఠానాలను కలిగినవారినిగా తీర్చిదిద్దుతాడు. మనం చెడ్డ దారిని అనుసరించడానికి ప్రయత్నం చేస్తే, మనలను శిక్షించి, మంచి దారిలో పెడతాడు. ఈ విధంగా –

1) మన ఉత్పత్తికి కారణమై ఉండడం,

2) మన జీవితంలో దృష్టిని కలిగి ఉండడం,

3) శిక్షించి మంచి దారిలో పెట్టడం

అని మన తండ్రిని మనలను ఉద్దేశించి చేసే కార్యాలు మూడు విధాలుగా ఉంటాయి. ఈ విధంగానే మన నిరుపాధిక తండ్రి అయిన భగవంతుడు కూడా మన విషయంలో హితపరుడై ఉంటాడు. దీని అర్థం ఏమంటే–

1) చేతనాచేతన రూపమైన ఈ జగత్తుకు సృష్టికర్తగా భగవంతుడు ఉన్నాడు. ప్రళయ కాలంలో రెక్కలు విరిగిన పక్షి వలె శరీర సంబంధం లేకుండా ఉండే సంసారి జీవులమైన మనకు, ఆ ప్రళయ కాలం ముగిసి, సృష్టి ఆరంభం అవుతున్న సమయంలో, కరణ కళేబరాలను ఇచ్చి, మనలను ప్రవృత్తినివృత్తులలో శక్తి కలిగిన వారినిగా చేస్తాడు. (కళేబరం అంటే శరీరం. కరణాలు– కర్మేంద్రియాలు ఐదు, జ్ఞానేంద్రియాలు అయిదు, మనసు 1, ఈ విధంగా 11 ఇంద్రియాలు)

భగవంతుడు అనుగ్రహించిన ఈ ప్రవృత్తిని వృత్తులనే శక్తులను ఆధారంగా చేసుకొని మనం చెడ్డదారిలో వెళ్ళకుండా, వాటిని మంచి దారిలో ప్రవర్తింప చేసి, మంచి జీవనాన్ని పొందడం కోసం శాస్త్రాన్ని ఆ భగవంతుడు ఇస్తాడు. శాస్త్రం అనేది, మనం ఇంద్రియాలతో తెలియడానికి సాధ్యం కాని అర్థాలను తెలుపుతుంది. "ఇది చెడ్డ, ఇది మంచి" అని తెలియజేసే ఆజ్ఞావాక్యాల మూలంగా మనలను మంచి పెడుతుంది. తత్వం, హితం, పురుషార్థం– అనే మూడు విషయాలను గూర్చి, వీని మూలంగా మనం ఏ విధంగా నడుచుకోవాలి? ఏ విధంగా నడచు కోకూడదు? మనం ఎందుకోసం ఏ విధంగా జీవించాలి? అని మొదలైన విషయాలను శాస్త్రం మనకు తెలుపుతున్నది. మంచిది ఏది? చెడ్డది ఏది? అనే విషయాన్ని తెలుసుకొని, మంచిని అనుసరించడం కోసం, చెడ్డను విడువడం కోసం కారణమై శాస్త్రం మనకు పలు విధాలుగా ఉపదేశిస్తున్నది. ఈ విధంగా మనకు జీవన హేతువుగా శాస్త్ర ప్రదానం చేసి, భగవంతుడు మనలను రక్షిస్తున్నాడు.

2) భగవంతుడు మనకు అనుగ్రహించిన ప్రవృత్తి నివృత్తి శక్తులతో మనం చేసే పుణ్యపాప కార్యాలకు తగిన విధంగా ప్రయోజనాన్ని ఇస్తున్నందున, మనలను శిక్షించేవాడై, మనలను మంచి దారిలో పెట్టేవాడై ఉన్నాడు.

ఈ విధంగా మనకు నిరుపాధిక తండ్రి అయిన భగవంతుడు మన కోసం చేసే మూడు విధాలైన హితాలను మణవాళ మహాముని చాలా అందంగా తెలియజేశారు. అర్చావతార స్థలాలలో ఉండే భగవంతుని మనం దగ్గరకు వెళ్లి సేవించే కాలంలో మన మనసులోని భావం ఏ విధంగా ఉండాలి? అనే విషయాన్ని

"ఈశ్వరనై క్కండాల్ పితానై క్కండాపోలేయుమ్" అని శ్రీ పిళ్ళైలోకాచార్యులవారు శ్రీ వచన భూషణ గ్రంథంలో (చూర్ణిక– 243) అన్నారు. "1) అడియే కరణ కళేబరంగళై తందు, 2) ఆవట్రై కొండు వ్యాపరియామల్ నల్ వళి నడక్కుంబడి శాస్త్రంగళై క్కాట్టి, 3) అకృత్య కరణాదికళిల్ శిక్షిత్తు, 4) సర్వావస్థైకళిలుమ్ తన్నుడైయ హితమే పార్తు పోరుమ్ ఈశ్వరనై అర్చా స్థలంగళిల్ కణ్ణారక్కండాల్ ఉత్పాదకనాయ్, విద్యాప్రదనాయ్, అపథే ప్రవృత్తనాకాదపడి నియమిత్తు నడత్తిక్కొండుపోరుమ్ హితైషియాన పితానై క్కండాల్పోలే స్నేహ సాధ్వస వినయంగళై ఉడైయవనాయ్ క్కొండు నమక్కు హితపరన్ ఎన్ను నినైత్తుమ్" (సృష్టి ఆరంభంలో కరణ కళేబరాలను ఇచ్చి, వాటితో ఇష్టం వచ్చినట్లు తిరుగ కుండా నియమించి, మంచి దారిలో నడిచేటట్లుగా చేయడం కోసం శాస్త్రాన్ని అనుగ్రహించి, చేయకూడని పనులను చేస్తే శిక్షించి, అన్ని దశలలో తనకు హితాన్ని చేయాలని చూచే భగవంతుని అర్చావతార స్థలాలలో దర్శించినట్లయితే –అతనిని మనకు ఉత్పాదకుడై, విద్యాప్రదుడై, చెడ్డ దారిలో ప్రవర్తించకుండా ఉండేటట్లు నియమించి, నడిపించేవాడైన తండ్రిని చూసినట్లుగా, స్నేహం, భయం, వినయం– అనే వీటితో కూడినవాడై, "ఇతడు మనకు హితపరుడు" అని భావించాలి) అని ఈ విధంగా ఈ సందర్భంలో వ్యాఖ్యానంలో శ్రీ వరవరమునులు అనుగ్రహించడం స్మరించ దగినది.

ఇక, ఈ శ్లోకానికి ఉండే అన్యాపదేశ తాత్పర్యార్థం, లక్ష్మీదేవికి ఉండే మాతృత్వం, భగవంతునకు ఉండే మాధవత్వం అనే మూడు విషయాలను తెలియజేస్తాను.

“సర్వేషా మేవ లోకానాం పితా మాతా చ మాధవః,

గచ్ఛధ్వ మేనం శరణం శరణ్యం పురుషర్షభాః"

(అన్ని లోకాలకు తల్లి, తండ్రి మాధవుడు. శరణ్యుడైన ఇతనిని పురుషులలో గొప్పవారైన మీరు శరణం పొందండి)

అనే శ్లోకంలో "మాధవః" అనే పదం ప్రాణ స్థానీయమైనది. ఈ శ్లోకానికి ఉండే అన్యాప దేశతాత్పర్యార్థాన్ని ఈ పదాన్ని పురస్కరించుకొనే నిర్ణయించాలి. శ్రీ మార్కండేయ భగవానుడు "మనకు తల్లిగా, తండ్రిగా, శరణు పొందదగిన వాడు భగవానుడు ఉన్నాడు" అని చెప్పేటప్పుడు భగవానుని మాధవునిగానే, అంటే, లక్ష్మీదేవి వల్లభుని గానే నిర్దేశించారు. దీని అర్థం ఏమి? తల్లిగా, తండ్రిగా, శరణు పొందదగినవాడుగా ఉండే భగవానుడు మనకు అనుగ్రహించాలి అంటే, దానికి లక్ష్మీదేవి యొక్క కటాక్షం కలుగడం ఆవశ్యకం. భగవానుని మాతృత్వం, పితృత్వం, శరణ్యత్వం– అనే మూడు అతని మాధవత్వానికి ప్రకారాలుగానే ఉన్నాయి. మనకు మాధవుడే తల్లి, మనకు మాధవుడే తండ్రి, మనకు మాధవుడే శరణ్యుడు –అని భావం. ఇదే ఇక్కడ అన్యాపదేశతాత్పర్యార్థం. లక్ష్మీదేవితో తనకు ఉండే సంబంధం చేత భగవంతుడు మనకు అనుగ్రహించేవాడు అవుతున్నాడు. భగవానుని గొప్పతనాలకు అన్నిటికీ లక్ష్మీదేవియే కారణం అవుతున్నది అనేది సంప్రదాయం. పుష్పానికి పరిమళంవల్ల వచ్చే గొప్పతనం వలె, రత్నానికి కాంతి వల్ల వచ్చే గొప్పతనం వలె, లక్ష్మీదేవి సంబంధంచేత భగవంతునకు గొప్పతనం కలుగుతుంది. భగవంతుని గొప్పతనాలు అన్నిటికీ ఈమె కారణంగా ఉన్నందున ఈమె వైభవం వాచామగోచరం అని మనం తెలియాలి.

మాధవత్వం అంటే శ్రియఃపతిత్వం. ఇది భగవానుని పురుషోత్తమత్వానికి వాచకమై ఉన్నది. లక్ష్మీదేవి వల్లనే అతడు పురుషోత్తముడు అవుతున్నాడు. "కాంతస్తే పురుషోత్తమః" అని లక్ష్మీదేవిని విషయంగా కలిగిన స్తోత్రాన్ని ఆరంభిస్తారు, యామునులు. "పురుషోత్తమః తే కాంతః"– పురుషోత్తముడైన భగవంతుడు నీకు ప్రియమైన పతి– అనే అర్థాన్ని గ్రహించడం ఒక విధం. "తే కాంతః పురుషోత్తమః"– నీకు పతియై ఉన్నందున అతడు పురుషోత్తముడు– అవుతున్నాడు అని పదాలను మార్చిన క్రమంలో అర్థాన్ని గ్రహించడంవల్ల లక్ష్మీదేవి యొక్క వైభవం చక్కగా తెలుస్తుంది. ఈ వైభవం ఆమెకు గల పురుషకారమే. దీనిని గూర్చి తరువాత తెలియజేస్తాను.

భగవానుని ఉద్దేశించి పత్నీత్వం, చేతనులమైన మనలను ఉద్దేశించి మాతృత్వం– అనేవి లక్ష్మీదేవికి ఉండే రెండు స్వభావాలు. ఇక్కడ ఒక ప్రశ్న ఏర్పడుతుంది. అది ఏమంటే– భగవంతుడు మనకు తల్లియై ఉన్నాడు అనే వాస్తవాన్ని గురించి కొన్ని విషయాలు ఇంతకుముందు చెప్పబడినవి. భగవంతుడు మనకు తల్లియై ఉన్నాడు– అని అంటే, లక్ష్మీదేవికి కూడా మనకు తల్లిగా ఉన్నది –అనేది ఏ విధంగా కుదురుతుంది? మనలను ఉద్దేశించి దివ్య దంపతులు ఇద్దరికీ మాతృత్వం ఉన్నదా? అని అంటే, శాస్త్రం భగవంతుడు లక్ష్మీదేవి అనే ఇద్దరిని కూడా మనకు తల్లిగానే తెలుపుతున్నది. మనలను ఉద్దేశించి లక్ష్మీదేవికి మాతృత్వం ఉన్నది. మనలను ఉద్దేశించి భగవంతునకు కూడా మాతృత్వం ఉన్నది.

లోకానుభవంలో మనం ఒక వాస్తవాన్ని చూడవచ్చు. అది ఏమంటే, మాతృభావన అనేది ఒకరిని ఉద్దేశించి ఇంకొకరికి మాత్రమే ఉంటుంది –అనే నియమం లేదు. ఎవరిని ఉద్దేశించి అయినా, ఎవరికి అయినా, వారు కోరితే మాతృభావన కలుగవచ్చు. మాతృత్వం అనేది ప్రధానంగా రక్షకత్వాన్ని తెలుపుతుంది. ఈ విధంగా మాతృభావన కలిగే కాలంలో ఎవరికి ఈ భావం కలుగుతుందో, వారు భగవానుని స్థానంలో ఉండి, దాని కారణంగా మాతృత్వం కారణంగా ఏర్పడే రక్షణను నిర్వహిస్తారు. ఇది మనకు నిరుపాధిక తల్లి అయిన భగవంతుని సంకల్పం వల్ల ఏర్పడవచ్చు. ఈ విధంగా మాతృత్వం కారణంగా లోకంలో ఏర్పడే రక్షణలు అన్నీ భగవంతుని రక్షకత్వంలో చేరుతాయి. ఇవి

భగవంతుడు అద్వారకంగా చేసే రక్షణలు అనబడతాయి. వీటికి మించి, భగవానుడు మనకు నేరుగానే రక్షకుడుగా కూడా ఉంటాడు.

లోకంలో ఒకరిని ఉద్దేశించి అతనిని కన్న తల్లికి మాత్రమే తల్లి ప్రేమ ఉంటుంది అనే నియమం లేదు. ఒకడు మంచి గుణాలను, మంచి సంస్కారాలను, మంచి తేజస్సును కలిగినవాడై ఉంటే, పలువురకు అతని విషయంలో తల్లి ప్రేమ కలుగవచ్చు. ఒకనిని కన్న తల్లి మాత్రమే తల్లిపాశంతో ఉండదు. అయితే, ఇంకా కొందరు కూడా అతని విషయంలో తల్లి ప్రేమను పొందుతారు. ఈ విధంగా ఉండే అనుభవాలను మన లోకంలో అక్కడక్కడ చూస్తాము. ఈ అనుభవాలు ముఖ్యమైనవి కావు. మన విషయంలో దివ్య దంపతులలో చూడబడే మాతృత్వమే ముఖ్యం. ఎందుకంటే, ఇది మనలను ఈ సంసారం నుండి విడిపించి, వారి శ్రీపాదాల సమీపంలో నిరంతరంగా పొందే ఉజ్జీవనానికి దారి చూపుతుంది.

"తే కాంతః పురుషోత్తమః" అని శ్రీ యామునులు పలకడం మన మనసులో చక్కగా గుర్తుపెట్టుకోవాలి. ఎందుకంటే, లక్ష్మీదేవి వైభవాన్ని పురస్కరించుకునే మనం భగవంతుని గొప్పతనాలను నిశ్చయించుకోవాలి. లక్ష్మీదేవి వల్లనే భగవంతుడు పురుషోత్తముడు అవుతున్నాడు. లక్ష్మీదేవికి పురుషకారం వైభవం ఉన్నది.

"త్వం మాతా సర్వలోకానాం దేవదేవో హరిః పితా" (శ్రీ విష్ణు పురాణం– 1–9 –126) (అన్ని లోకాలకు తల్లివివై నీవు ఉన్నావు. దేవదేవుడైన హరి తండ్రియై ఉన్నాడు) అని శ్రీ పరాశర భగవానులు పలికారు. "అఖిల జగన్మాతరమ్" (సకల లోకాలకు లక్ష్మి తల్లి అయి ఉన్నది. అన్ని లోకాలలో ఉండే చేతనులు అందరి విషయంలో గొప్ప వాత్సల్యాన్ని కలిగినది) అని శరణాగతి గద్య స్తోత్రంలో భగవద్రామానుజులు పలికారు. మనలను ఉద్దేశించి లక్ష్మీదేవి కల మాతృత్వం 1) పురుష కారత్వం, 2) కైంకర్య ప్రతి సంబంధిత్వం –అని రెండు విధాలుగా ఉంటుంది. తన బిడ్డలైన సంసారి జీవుల రక్షణలో దృష్టిని కలిగి ఉండి, వారిని తండ్రి అయిన భగవంతుని సమీపానికి చేరుస్తుంది. జీవులు

ఈ లోకంలో, పరమపదంలో చేసే సేవలను చూచి సంతోషించి భగవంతునితో కలసి స్వీకరిస్తుంది.

లక్ష్మీదేవికి "శ్రీ:" అనే నామం ఉన్నది. ఈ పేరుకు అనేక విధాలుగా వ్యుత్పత్తులను చెప్పి, పలు విధాలైన అర్థాలను పెద్దలు వివరిస్తారు. వీటిలో ముఖ్యమైనవి ఉభయ విభూతి శేషిత్వాన్ని తెలుపుతాయి. "శ్రీయత ఇతి శ్రీ:" – అనే కర్మణి వ్యుత్పత్తి లక్ష్మీదేవికి ఉండే, ఆమె భగవంతుని ఎల్లప్పుడూ ఆశ్రయించి ఉంటుంది అనే విషయాన్ని తెలియజేస్తున్నది, "శ్రయత ఇతి శ్రీ:" – అనే కర్తరివ్యుత్పత్తి వల్ల, అంటే, లోకాలకు అన్నిటికీ తల్లి అనే సంబంధానికి తగినట్లు, జీవులు అందరిచే ఆశ్రయింపడేది అని, భగవంతుని పత్ని అనే సంబంధానికి తగినట్లు, భగవంతుని ఆశ్రయిస్తున్నది అని ఈమెకు కల వైభవాలు తెలుపబడుతున్నాయి.

మాధవుడు అయినందున మనకు తండ్రి అయిన మాధవుని దగ్గరకు మనలను లక్ష్మీదేవి చేరుస్తుంది. అప్పుడు భగవంతుడు మనలను తన దగ్గరకు చేర్చుకుంటాడు. ఆ స్వామి మనలను తన దగ్గరకు చేర్చుకునేటట్లు లక్ష్మీదేవి సహాయపడుతుంది. సంసారులమైన మనం కర్మాధీనమైన అవిద్య మొదలైన దోషాలను కలిగినవారమై, అందువల్ల భగవంతుని విషయంలో విముఖులమై, అతని దగ్గరకు చేరకుండా ఉంటాము. అటువంటి మనలను సంస్కరించి భగవంతుని విషయంలో ఆభిముఖ్యం కలిగినవారినిగా చేసి, పలువిధాలుగా అతనిని ప్రాప్యంగా, ప్రాపకంగా గ్రహించి ఆ స్వామి చరణాలలో మనం ఆశ్రయించేటట్లు చేస్తుంది.

"నిత్యసంసారుల విషయంలో స్వతంత్రుడు అయిన భగవంతుని కటాక్షం లక్ష్మీదేవి పురుషకారం లేకపోతే సంభవించదు" అని తిరువాయ్ మొళి ఈడు వ్యాఖ్యానానికి కల ముదల్ శ్రియఃపతి జీయర్ అరుంబదం తెలుపుతున్నది. మనం భగవంతుని చరణాలను ఆశ్రయించే కాలంలో "ఇతడు మన బిడ్డ, తండ్రి అయిన మీ దగ్గరకు శరణాగతుడై వచ్చాడు, ఇతనిని మీరు అంగీకరించాలి, ఇతనిని మీ కృప మొదలైన కళ్యాణ గుణాలకు విషయంగా చేసికోవాలి. శాస్త్ర మర్యాద అనే కారణాన్ని చూపి మీరు ఇతనిని అంగీకరించకుండా ఉండకూడదు.

ఇతడు పూర్వం ఎటువంటి వాడు అయినా, మీరు ఇతనిని స్వీకరించి అనుగ్రహించాలి" అని అంటూ మనలను గూర్చి భగవంతుని దగ్గర పలికి, ఆ స్వామికి కల కళ్యాణ గుణాలకు మనలను విషయంగా లక్ష్మీదేవి చేస్తుంది. లక్ష్మీదేవి విషయంలో గొప్ప రాసిక్యాన్ని కలిగిన భగవంతుడు కూడా "నీవు చెప్పినట్లే కానీ" అని అంటాడు. ఈ విధంగా ఆ స్వామి దగ్గర శరణాగతి చేసిన మనలను లక్ష్మీదేవి చేసే పురుషకార ఫలంగా స్వీకరిస్తాడు. మన పాపాలను అతడు గమనించడు.

ఈ విషయాన్ని మన పూర్వాచార్యులు చాలా రసవంతంగా అనుభవిస్తారు. ఒక సంసారి జీవుడు భగవంతుని సమక్షంలోకి వచ్చి నిలిచాడు. భగవంతుడు అతనిని చూచాడు. సర్వజ్ఞుడైన భగవంతుని మనస్సులోకి ఇతడు పూర్వం చేసిన పాపకర్మలు అన్నీ వచ్చాయి. "ఈ విధంగా ఎన్నో పాపాలను చేసి, ఏ జంకూ లేకుండా నా ముందుకు వచ్చి ఈ విధంగా నిలచినాడే! ఎంత ధైర్యం వీడికి! "అని భగవంతుని మనసులో కోపం పొంగివచ్చింది. పాప కర్మలను చేసినవారిని దండించాలి– అని శాస్త్రం తెలుపుతున్నది. శాస్త్ర మర్యాదను అనుసరించి చేయడం అనేది భగవంతుని పని. "శాస్త్ర మర్యాదను అనుసరించి ఇతడు చేసిన పాపాలకు తగినట్లు ఇతనిని శిక్షించాలి" అని భగవంతుడు భావిస్తాడు. "అకలకిల్లేన్" (క్షణకాలం కూడా విడిచి ఉండలేను) అనే విధంగా భగవంతునితో ఎల్లప్పుడూ కలసి ఉండే లక్ష్మీదేవి భగవంతుని మనసులో కలిగిన కోపాన్ని గమనించింది. ఆమె ఆ స్వామిని చూచి "ఈ లోకంలో కర్మలకు వశమై ఉండేవారు ఎవరు పాపాలు చేయలేదు? ఇతడు పాపాలను చేశాడు అని భావించకూడదు. మిమ్ములను ఆశ్రయించాడుకదా" అని అంటుంది.

అప్పుడు భగవంతుడు లక్ష్మీ దేవిని చూసి "ఇతని నేను అంగీకరిస్తే లోకంలో శాస్త్రానికి చోటు అనేది లేకుండా పోతుందే! తరువాత శాస్త్రం ఏ విధంగా నిలుస్తుంది? శాస్త్ర మర్యాద ఏమి అవుతుంది? లోకంలో శాస్త్రం జీవించాలి, ప్రకాశించాలి అనే విషయం కదా ముఖ్యం. నేను ఇతనిని ఏ విధంగా స్వీకరించగలను? ఇతని నేను దండించి తీరాలి" అని అంటాడు.

ఆ తరువాత మళ్లీ లక్ష్మీదేవి భగవంతునితో ఈ విధంగా అంటుంది. "మీకు లోకంలో శాస్త్ర మర్యాదను నిలబెట్టాలి అనే బాధ్యత మాత్రమే కాదు. లోకంలో శాస్త్రం నిలచినంత మాత్రంతో చాలదు. మీకు ఎన్నో కళ్యాణ గుణాలు ఉన్నాయి. శాస్త్రం కంటే గొప్పవి అయిన మీ ఈ కళ్యాణ గుణాలు ప్రకాశించాలి. ఈ కళ్యాణ గుణాలు లోకంలో ప్రకాశించినపుడే, పలువురి సంసారుల విషయంలో అవి ఫలించి, వారి ఉజ్జీవనానికి దారి కలుగుతుంది. మీరు ఇతనిని స్వీకరిస్తేనే మీ కళ్యాణ గుణాలు ప్రకాశిస్తాయి. "

లక్ష్మీదేవి పోలిన ఈ మాటలను విన్న భగవంతుడు శాస్త్ర మర్యాదను దాటి ఏ విధంగా ఒకనిని అనుగ్రహించాలి? అని మనసులో సందేహ పడ్డాడు. అప్పుడు లక్ష్మీదేవి "ఈ లోకంలో పాపాలు చేసిన ఏ సంసారి జీవాత్మ నిన్ను ఆశ్రయించడో, అతని విషయంలో శాస్త్ర మర్యాదను ప్రవర్తింప చేయి. ఎవడు పూర్వం పాపాలను చేసిన నిన్ను ఆశ్రయిస్తాడో, అతనిని దండించకుండా, నీ కళ్యాణ గుణాలకు విషయంగా చేయి" అని ఒకే సమయంలో శాస్త్ర మర్యాద, కళ్యాణ గుణాలు ప్రకాశించే ఉపాయాన్ని తెలియజేస్తుంది. చాలా అందంగా లక్ష్మీదేవి తెలిపిన ఈ ఉపాయాన్ని భగవంతుడు అంగీకరిస్తాడు. భగవానునకు లక్ష్మీదేవి పలికిన ఈ మాట చాలా సరి అయినది అని తోస్తుంది. అతడు తన దగ్గరకు వచ్చి ఆశ్రయించిన సంసారి జీవాత్మను అనుగ్రహిస్తాడు.

ఇదే లక్ష్మీదేవి చేసే పురుషకారం. దీనినే కొంచెం శాస్త్ర సంప్రదాయ రీతిలో తెలియజేస్తాను. లక్ష్మీదేవి పురుషకారం చేయడానికి ముందు భగవంతుడు పురుషుడై ఉంటాడు, అంటే, స్వాతంత్ర్యం అనే గుణాన్ని అధికంగా కలిగి ఉంటాడు. దీని అర్థం ఏమంటే– సంసారి జీవుని విషయంలో శాస్త్రాన్ని అనుసరించి దండించేవాడై ఉంటాడు. అంటే, వారికి వారు చేసిన కర్మలకు అనుగుణంగా ఫలాన్ని ఇవ్వడంలో ఆసక్తిని కలిగి ఉంటాడు. ఇటువంటి భగవానుని తన ఉపదేశంతో, అందంతో మార్చి, అతనిని పురుషోత్తముడు అయేటట్లు లక్ష్మీదేవి చేస్తుంది. అంటే, సంసారి జీవులను అంగీకరించడంలో అతనికి ఆసక్తి కలిగినవానినిగా చేస్తుంది. అంటే, అతనిని సంసారి చేతనుల విషయంలో వారు వారు కోరిన పురుషార్థాలను అనేకంగా ఇచ్చేవాడై, ముఖ్యంగా, మోక్షాన్ని ఇచ్చేవాడై అవుతున్నాడు. ఈ విధంగా భగవంతుడు

పురుషోత్తముడై వెలగడానికి శ్రీదేవి కారణం అవుతున్నది. దీనివల్ల ప్రయోజనం పొందేది సంసారులమైన మనమే.

"తే కాంతః పురుషోత్తమః" – పురుషోత్తమత్వం అనేది భగవంతునకు స్వభావంగానే, అంటే, సహజంగానే కల ఒక వైభవం కదా. అతడు పురుషోత్తముడు కావడానికి స్త్రీలలో ఉత్తమురాలైన లక్ష్మీదేవి కారణం అవుతున్నది– అని ఏ విధంగా చెప్పగలం? అని అంటే, భగవంతుని దగ్గర ఇంతకు ముందు లేని పురుషోత్తమత్వాన్ని లక్ష్మీదేవి అతనిలో కొత్తగా సృష్టిస్తున్నది అని అర్థం కాదు. భగవంతునకు సహజంగా ఉండే పురుషోత్తమత్వం అనేది అతని నిరంకుశ స్వాతంత్ర్యం చేత ఆణగిపోయిన దశలో ఉంటుంది. అతని స్వాతంత్ర్యం అణగి పోయేటట్లు చేసి, ఆ స్వాతంత్రం చేత అణగిపోయి ఉండే పురుషోత్తమత్వాన్ని తల ఎత్తేటట్లు చేసి, దానిని తన ఉపదేశవచనాతో, అందంతో వృద్ధి పొందించి, అది తన సంతానమైన సంసారి జీవుల విషయంలో ఫలించేటట్లుగా లక్ష్మీదేవి చేస్తుంది. భగవంతుని ఉద్దేశించి లక్ష్మీదేవి విషయంలో మనం దర్శించే పురుషకార స్వభావం.

ఇక, తన సంతానం అయిన సంసారి జీవుల విషయంలో లక్ష్మీదేవి చూపించే చ అనుగ్రహం ఎటువంటిది? ్అనే విషయాన్ని చూద్దాం. సంసారులం అయిన మనం అపురుషులుగా ఉన్నాము. అంటే, భగవంతునకు అభిమఖులుగా కాకుండా, విముఖులమై ఉన్నాము. అంటే, భగవంతుని విషయంలో అనుకూల భావం లేకుండా ఉన్నాము, అంటే, భగవంతుని ఏ విధంగానూ కోరకుండా, అతనిని కన్నెత్తి కూడా చూడకుండా ఉన్నాము. మన ఈ దశను లక్ష్మీదేవి తన అనుగ్రహంతో మార్చుతున్నది. తన కటాక్ష విశేషంచేత మనకు కల ఈ స్థితిని మార్చి, మనకు భగవంతుని విషయంలో అనుకూల భావం తల ఎత్తేటట్లు చేస్తున్నది. లక్ష్మీదేవి కటాక్షం మూలంగా ఏనాడు భగవంతుని మనం ఆశ్రయిస్తున్నామో, ఆనాడే మనం పురుషులం అవుతున్నాము.

భగవద్రామానుజులు శరణాగతి గద్యంలో "పారమార్థిక" అని ఆరంభమయే రెండవ చూర్ణికలో లక్ష్మీదేవి విషయంలో తమకు 1) భగవంతుని పట్ల శరణాగతి నిష్ఠను, 2) భగవంతుని కైంకర్యంలో రుచి కలగాలని ప్రార్థించారు. లక్ష్మీదేవి అనుగ్రహం ఉన్నప్పుడే ఒకడు 1) భగవంతుని దగ్గర శరణాగతుడుగా, 2) భగవంతుని ప్రాప్యంగా, ప్రాపకంగా తలచేవాడుగా, 3) భగవద్భాగవతాచార్యుల విషయంలో అనుకూల వృత్తులను కలిగినవాడుగా కాగలడు. ఈ విధంగా ఉండడమే పురుషత్వం అనబడుతుంది. కనుక ఈ విధంగా అపురుషులమై ఉండే మనలను పురుషులుగా అయ్యేటట్లు లక్ష్మీదేవి చేస్తున్నది ఇదే సంసారి జీవులమైన మన విషయంలో లక్ష్మీదేవి చేసే పురుషకారం.

లక్ష్మీదేవి పురుషకారం వల్ల ఒకడు అపురుషుడై ఉండే స్థితిని విడిచిపెట్టి, పురుషుడై ఉండే స్థితిని పొందుతున్నాడు. అతనికి ఉండే పురుషత్వం అనేది ఏమి? పురుషుడు అంటే ఎవరు? –అనే ప్రశ్నకు సమాధానాన్ని తిరుమழிశై అణ్ణా అప్పంగార్ స్వామి చాలా అందంగా తెలియజేశారు. "అగ్రగంతా పురుషః "అనేది వారి దివ్యమైన వచనం. "అగ్రగంత"గా ఉండేవాడు పురుషుడు అనబడుతున్నాడు. భగవంతుని సన్నిధానంలో ముందడుగు వేసేవాడు అగ్రగంత అనబడుతున్నాడు. అన్ని విధాలుగా భగవంతుని ఆశ్రయించి ఉండేవాడు అగ్ర గంత. భగవంతుడే ప్రాప్యం, ప్రాపకం అని తలచే వాడు అగ్రగంత. భగవంతుడు, లక్ష్మీదేవి అనే దివ్య దంపతుల విషయంలో కైంకర్యం చేసే విషయంలో ముందడుగు వేసేవాడు అగ్రగంత. భగవద్విషయంలో చాలా దృఢమైన నిశ్చయాన్ని కలవాడు అగ్రగంత. భాగవత గోష్ఠికి ప్రధానుడై, భాగవతగోష్ఠిని ముందు ఉండి నడిపిస్తూ ఉండేవాడు అగ్రగంత. భగవద్భక్తికి ప్రహ్లాదుని వలె, భగవద్విషయంలో స్థిరమైన అనుకూల భావాన్ని కలిగి ఉండడానికి మహాబలివలె, దివ్యదంపతుల విషయంలో చేసే కైంకర్యానికి లక్ష్మణుని వలె, భగవత్ పారతంత్ర్యానికి భరతుని వలె వెలిగేవాడే అగ్రగంత అవుతున్నాడు.

అగ్రగంత– పురుషులలో లక్ష్మణుని వైభవం

భగవద్రామానుజుల కాలక్షేప గోష్ఠిలోనుండి శ్రీవేంకటేశ్వరనకు పుష్పకైంకర్యం చేయడంకోసం శ్రీ అనంతార్యులు ఒక్కరు మాత్రమే ముందుకు వచ్చారు. "మీరే సుమా మగవారంటే" అని వారిని శ్రీరామానుజులు పొగిడారు. ఈ సందర్భంలో "ఆణ్, పెణ్" (ఆడ, మగ) అనే వ్యవహారం కనిపిస్తున్నది. భగవచ్ఛేషత్వ నిష్ఠను కలిగినవాడే పురుషుడు– అని దీని అర్థం. "లక్ష్మణో లక్ష్మి సంపన్నః " (బాల కాండం –18 –29) అని శ్రీ వాల్మీకి భగవానునిచే కీర్తింప బడిన లక్ష్మణుని స్థితిని ఉద్దేశించే శ్రీరామానుజులు ఈ విధంగా అనంతార్యులను ప్రశంసించారు –అని మన తెలియాలి.

భగవత్ శేషత్వాన్ని కలిగినవారి గోష్టిలో అగ్రగణ్యులై ఉండేవాడు, లక్ష్మణుడు. శ్రీరామ పట్టాభిషేకం కోసం అన్ని ఏర్పాట్లు చేయబడి, అందరూ తయారుగా ఉండే సమయంలో, సుమంత్రుడిని మూలంగా పిలువబడిన శ్రీరాముడు దశరథ చక్రవర్తి దగ్గరకు వెళ్ళాడు. అక్కడ దశరథుని సమక్షంలో కైకేయి రాముని చూచి, "నీవు 14 సంవత్సరాలు అరణ్యంలో నివసించాలి, భరతుడు రాజ్య పాలన చేయాలి నివసించాలి" అనేది నీ తండ్రిగారి కోరిక –అని తెలియజేసింది. శ్రీరాముడు కోసల సామ్రాజ్య పట్టాభిషేకం కోల్పోయాడు. అతడు అరణ్యానికి వెళ్ళడం కోసం సిద్ధం కావడానికి ముందే ఈ విషయం లక్ష్మణునకు తెలిసింది. వెంటనే లక్ష్మణుడు తన చేతిలో గడ్డపార, బుట్ట మొదలైనవానిని తీసుకొని శ్రీరామునితో పాటు అరణ్యానికి వెళ్ళడం కోసం సిద్ధం అయినాడు. శ్రీరామునితో లక్ష్మణుడు గాని, లేక, సీతగాని అరణ్యానికి వెళ్ళాలి– అని కైకేయి వరం అడగలేదు. ఆమె శ్రీరాముడు ఒక్కడు మాత్రం అరణ్యానికి వెళ్ళాలి అనే అడిగింది. శ్రీరాముడు అరణ్యవాసం చేయాలి అనే విషయం ప్రసక్తం అయినప్పుడు, లక్ష్మణుడు శ్రీ రామ కైంకర్యంకోసం ముందుకు వచ్చాడు. అందరూ ఆశించినట్లు శ్రీరామ పట్టాభిషేకం జరుగలేదు. కానీ, లక్ష్మణునకు శ్రీరామ కైంకర్య పట్టాభిషేకం జరిగింది. దివ్యదంపతుల సన్నిధిలో కైంకర్యం చేయడానికి లక్ష్మణునకు కల ఆశను, ఆ దంపతులిద్దరి విషయంలో అతడు కలిగి

ఉండే కైంకర్యంలోని నిష్ఠను. శ్రీ వాల్మీకి మహాముని చక్కగా వర్ణించాడు. దీనిని అనుసరించి మన పూర్వాచార్యులు కూడా లక్ష్మణుని వైభవాన్ని విస్తృతంగా పలుచోట్ల నిరూపించారు.

"ఇళైయ పెరుమాళ్, పిరియిల్ తరియామై మున్నిట్టు అడిమై శెయ్య, ఎల్లా అడిమై శెయ్య వేణుమ్, ఏవి కొళ్ళవుమ్ వేణుమ్– ఎన్దార్" (లక్ష్మణుడు శ్రీ రాముని విడిస్తే తాను జీవించలేను అనే విషయాన్ని పురస్కరించుకొని, కైంకర్యం చేయాలి, అన్ని విధాలైన కైంకర్యాలు చేయాలి, అది కూడా అడిగి నియమింపబడిన చేయాలి అని అన్నారు) అనేది శ్రీవచన భూషణ గ్రంథంలో గల 84వ చూర్ణికలోని ఒక భాగం. దీనికి గల వ్యాఖ్యానాలు, అరుంబదం– అనే వీటినుండి సర్వశేషి, పరమశేషి అయిన భగవానుని విషయంలో శేషభూతులమైన మనకు ఉండవలసిన స్వభావ విశేషాలను లక్ష్మణుడు ఏ విధంగా వ్యక్తం చేశాడు? అనే విషయాన్ని మనం తెలియవచ్చు. వీటిని క్రమంగా సంగ్రహంగా విజ్ఞాపన చేస్తాను.

1) భగవంతుని విడిస్తే బతుక లేక పోవడం

మన పూర్వాచార్యులు పంచకాల పరాయణులుగానే ఉన్నారు. శేషభూతునకు ఎల్లప్పుడు శేషిని విడిచి బ్రతుకలేక పోయే స్థితి కలగాలి. భగవత్ సంబంధం ఎల్లప్పుడూ స్థిరంగా ఉండాలి. లక్ష్మణునకు ఇదే నిరూపకంగా ఏర్పడింది. శ్రీరామావతారఘట్టంలో వాల్మీకి మహాముని నాలుగు శ్లోకాలతో లక్ష్మణుని స్వభావాన్ని ఆశ్చర్యకరంగా వర్ణిస్తారు. ఆ శ్లోకం ఈ విధంగా ఉన్నది

"బాల్యాత్ ప్రభృతిసుస్నిగ్ధో లక్ష్మణ లక్ష్మివర్ధనః,

రామస్య లోకరామస్య ప్రాదుః జేష్ఠస్య నిత్యశః" (శ్రీ రామాయణం– బాలకాండం– 18 –27)

లక్ష్మణో లక్ష్మి వర్ధనః– కైంకర్య సంపదను వృద్ధి చేసే లక్ష్మణుడు, ప్రాదుః జేష్ఠస్య–తన కంటే పెద్దవాడు, తోడబుట్టినవాడు, లోకరామస్య –లోకాన్ని ఆనందింపజేసేవాడు అయిన, రామస్య– రామునకు, బాల్యాత్ ప్రభృతి–చిన్నతనం నుండి (ఇది సామాన్యమైన అర్థం అయినా, ఇక్కడ అర్థ స్వారస్యాన్ని బట్టి పుట్టిన మరుక్షణం నుండి– అని తాత్పర్యం), నిత్యశః– ఎల్లప్పుడు, సుస్నిగ్ధః– చాలా ప్రేమను కలిగి ఉన్నాడు.

తులసి చెట్టు మొలిచిన క్షణంనుండి సువాసనతో పాటుగా మొలిచేటట్టు, లక్ష్మణుడు తాను జన్మించిన క్షణంనుండి మిక్కిలి ప్రేమతో శ్రీరాముని విడచి క్షణం కూడా ఉండలేనివాడై, శేషత్వకృత్యాలను చేస్తూ వచ్చాడు.

"సర్వప్రియకర స్తస్య రామస్యాపి శరీరతః,

లక్ష్మణో లక్ష్మి సంపన్నః బహిప్రాణ ఇవాపరః" (బాల కాండం– 18 –28)

సర్వప్రియకరః– తన మనోవాక్కాయాలు అనే మూడు కారణాలతో శ్రీరాముని సంతోషాన్ని ఉద్దేశించి సేవలను చేసేవాడు, లక్ష్మి సంపన్నః–కైంకర్యసంపదను కలవాడు అయిన, లక్ష్మణః–లక్ష్మణుడు, రామస్య–రామునకు, శరీరాత్– శరీరం కంటే, అపరః– వేరయిన, (ప్రాణమై, అంటే), బహిః ప్రాణః –ప్రాణమే ఒక రూపాన్ని ధరించి బయటకు వచ్చినట్లు (ప్రకాశించాడు)

లోకంలోని అందరిని తన కళ్యాణ గుణాలతో, సౌందర్యంతో ఆనందింప చేస్తాడు, శ్రీరాముడు. ఆ శ్రీరాముని తన మూడు కరణాలతో లక్ష్మణుడు

ఆనందింప చేస్తాడు– అని భావం. ఈ కారణం వల్ల శ్రీరామునకు ప్రియమైన, శరీరంలో ఉండే ప్రాణం వలె, శరీరానికి బయట సంచరించే వేరొక ప్రాణంగా లక్ష్మణుడు ప్రకాశించాడు. అతడు శ్రీరామునకు ప్రాణసమానుడు –అని వర్ణింపబడుతున్నాడు.

ఇక, తర్వాత శ్లోకంలో శ్రీరామునకు ఉండే లక్ష్మణుని విడిచి ఉంటే ధరించ లేకపోవడం – అనే స్వభావాన్ని వాల్మీకి మహర్షి వ్యక్తం చేస్తున్నాడు.

“న చ తేన వినా నిద్రాం లభతే పురుషోత్తమః,

మృష్టమన్న ముపానీత మశ్నామి న చ తం వినా" (శ్రీ రామాయణం– బాలకాండం –18 –29)

పురుషోత్తమః– పురుషులలో గొప్పవాడైన శ్రీరాముడు, తేన వినా –లక్ష్మణుడు లేకుండా, నిద్రాం– నిద్రను, లభతే న– పొందడం లేదు, తం వినా–లక్ష్మణుడు లేకుండా, ఉపానీతం–తీసుకొని రాబడిన, మృష్టమన్నం– గొప్ప అన్నాన్ని, అశ్నాతి న హి –భుజించడం లేదు.

ఈ సందర్భంలో వినోదంగా ఒక చరిత్ర చెప్పబడుతున్నది. దశరథ చక్రవర్తికి నలుగురు కుమారులు పుట్టగానే, వారిని వేరు వేరు తొట్లలో వశిష్ఠుడు ఉంచాడు. శ్రీరామునకు తరువాత పుట్టినవాడు భరతుడు కనుక, అతనిని తరువాత తొట్టిలో పెట్టారు. శ్రీరామునకు తరువాత, అంటే, శ్రీరాముని తొట్టికి, లక్ష్మణుని తొట్టికి మధ్యలో ఉండే ఒక తొట్టిలో, భరతుని పెట్టారు. అప్పుడు శ్రీరాముడు నిద్రపోకుండా ఏడవడం ఆరంభించాడు. బిడ్డకు ఏమి కీడు జరిగిందో! ఏమో! అని భయపడి, అతనికి ఆహారం ఇవ్వడం, దిష్టి తీయడం, రక్ష కట్టడం, మందులను ఇవ్వడం, వైద్యం చేయడం– అని ఈ విధంగా ఏమి చేసినా శ్రీరాముడు ఏడుపు

ఆపలేదు. తరువాత సుమంత్రుని సలహాను అనుసరించి దశరథుడు వశిష్ఠుని పిలుచుకొని వచ్చి, అతనికి ఈ విషయాన్ని తెలియజేశాడు. అతడు అప్పుడు లక్ష్మణుడు నిద్ర పోతున్న తొట్టివి తీసుకొని వచ్చి, శ్రీరాముని తొట్టికి తరువాత పెట్టమని సేవకులకు చెప్పాడు. వారు కూడా ఆ విధంగానే చేశారు. వెంటనే శ్రీరాముడు ఏడవడం కొంచెం తగ్గింది. వశిష్ట మహర్షి దీనిని గమనించి లక్ష్మణుని శ్రీరాముని తొట్టిలోనే పరుండ బెట్టమన్నాడు. సేవకులు ఆ విధంగా చేయగా, వెంటనే శ్రీరాముడు ఏడుపును పూర్తిగా ఆపు చేసాడు. తరువాత ఈ విధంగానే భరతుని, శత్రుఘ్నుని వశిష్ఠుడు ఒకే తొట్టిలో పరుండేటట్లు చేశాడు– అనేది ఆ చరిత్ర.

"యదా హి హయమారూఢో మృగయాం యాతి రాఘవః.

తదైనం పృష్ఠతోఽన్వేతి స ధనుః పరిపాలయన్" (బాలకాండమ్–18–30)

యదా– ఎప్పుడు, రాఘవః– రఘుకులంలో పుట్టిన రాముడు, హయం– గుర్రంలో, ఆరూఢః–ఎక్కినవాడై, మృగయా– వేట కోసం, యాతి– వెళుతున్నాడో, తదా– అప్పుడు, సః– ఆ లక్ష్మణుడు, ఏనం– ఈ శ్రీ రాముని రక్షించడం కోసం, సధనుః– విల్లును ధరించినవాడై, పృష్ఠతః– శ్రీరాముని వెనుక, అన్వేతి– అనుసరిస్తున్నాడు.

ఈ నాలుగు శ్లోకాలు శ్రీ రామాయణంలో అవతార ఘట్టంలో కైంకర్య శ్రీమంతుడైన లక్ష్మణుని వైభవాన్ని చక్కగా తెలియజేస్తున్నాయి. ఇదే కాక, లక్ష్మణుని వైభవాన్ని శూర్పణఖ చాలా ఆశ్చర్యకరంగా రావణునకు తెలియజేసినట్లు అరణ్యకాండలో వర్ణింప బడినది.

"భ్రాతా చాస్య మహాతేజా గుణత స్తుల్యవిక్రమః,

అనురక్తశ్చ భక్తశ్చ లక్ష్మణో నామ వీర్యవాన్.

అమర్షీ దుర్జయో జేతా విక్రమ్తో బుద్ధిమాన్ బలీ,

రామస్య దక్షిణో బాహుః నిత్యం ప్రాణ ఇవాపరః" (అరణ్య కాండం– 34 –13, 14)

అనేది శూర్పణఖ పల్కిన వాక్యం.

అస్య– ఈ, రామస్య– శ్రీరామునకు, దక్షిణః– కుడి, బాహుః – బాహువై ఉండేవాడు, నిత్యం– ఎల్లప్పుడు, బహిః ప్రాణః– బయట సంచరించే ప్రాణమై ఉండేవాడు, లక్ష్మణో నామ – లక్ష్మణుడు అనే పేరు కలవాడు, మహాతేజాః– గొప్ప తేజస్సు కలవాడు, గుణతః– గుణాలతో, తుల్య విక్రమః– సమానమైన పరాక్రమం కలవాడు, అను రక్తః చ– విశ్వాసంతో అనువర్తించేవాడు, భక్తః చ– ఎక్కువ ప్రేమను కలవాడు, వీర్యవాన్– పరాక్రమశాలి, అమర్షీ– ప్రారంభించిన కార్యాన్ని చక్కగా పూర్తి చేయగలిగిన సాహసాన్ని కలవాడు, దుర్జయః– ఎవరికీ జయించడానికి సాధ్యం కానివాడు, జేతా– అందరినీ జయించేవాడు, విక్రమీ– యుద్ధంలో వీరుడై పరాక్రమమించేవాడు, బుద్ధిమాన్ – బుద్ధిమంతుడు, బలీ– బలవంతుడు.

దివ్య దంపతుల విషయంలో కైంకర్య శ్రీమంతుడై ఉండేవానికి ఉండవలసిన సద్గుణాలను కలిగినవాడు. లక్ష్మణుడు – అనే విషయాన్ని ఇక్కడ మనం సారంగా తెలియవచ్చు. లక్ష్మణునకు ఉండే కైంకర్యనిష్ఠ ఎటువంటిదో తర్వాత కూడా మనం తెలిసికుంటున్నాము. ఇక, లక్ష్మణునకు కల, శ్రీరాముని విడిచి ఉంటే నిలువ లేని స్థితి అనే మహా గుణాన్ని మనకు పూర్వాచార్యులు తెలియజేసిన విషయాన్ని గమనిద్దాం.

"రామేణ బహుభిః సాంత్వైర్నిషిద్ధః" (శ్రీ రామాయణం– అయోధ్యా కాండం– 31 –6) శ్రీరామునిచే పలు విధాలుగా మంచి మాటలతో మరపింపబడినవాడై) అనే విధంగా శ్రీరాముడు "నీవు నాతో అరణ్యానికి రావద్దు" అని నిర్బంధించి

చెప్పేటప్పుడు, లక్ష్మణుడు సీతాదేవి సమక్షంలో శ్రీరామునితో పలికిన మాటలు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

"కురుష్వ మామనుచరం వైధర్మ్యం నేహ విద్యతే,

కృతార్థోఽహం భవిష్యామి తవ చార్థటప్రకల్పతే (అయోధ్య కాండం –31– 24)

తవ అర్థం– నీకు సీతాదేవికి చేసే కైంకర్యం, ప్రకల్పతే– చక్కగా సిద్ధించడం కోసం, మామ్– నన్ను, అనుచరం– నీతో పాటు వచ్చేవానినిగా, కురుష్వ –నియమించాలి, ఇహ–ఈ విషయంలో, వైధర్మ్యం న విద్యతే– ధర్మ విరోధం ఏదీ ఉండదు, అహం– ఇందువల్ల, శేషభూతుడనైన నేను, కృతార్థం– ఫలాన్ని పొందినవాడను, భవిష్యామి– కాగలను –అని విన్నపించాడు, లక్ష్మణుడు.

ఈ శ్లోకంలో వైధర్మ్యం అనే పదం ముఖ్యార్థగర్భితం, దీనికి –ఆనృశంస్యలక్షణ ధర్మహాని– అని, ధర్మిస్వరూప నాశనం– అని రెండు విధాలైన అర్థాలను తిరుమళిశై అణ్ణావప్పంగార్ అనే పేరుతో ప్రసిద్ధులైన వాధూల వీరరాఘవాచార్యస్వామివారు తెలియజేస్తారు. ఇక్ష్వాకు కులంలో పుట్టినవారికి ఆనృశంస్యం, అంటే, కారుణ్యం కులధర్మం. "ఆనృశంస్యం పరో ధర్మః" (శ్రీరామాయణం– సుందరకాండం– 38 –11) (కరుణ గొప్ప ధర్మం) అనే కలిగినవాడు శ్రీరాముడు. తనను విడచిపెడితే బతుకలేనివాడు, తనను ఎల్లప్పుడు అనుసరించి, సేవలను చేసేవాడైన లక్ష్మణుని తనతో అరణ్యానికి తీసుకుని పోయినట్లయితే శ్రీరామునకు కులధర్మంలో ఏ హాని కలుగదు– అని అర్థం. ఇది లక్ష్మణుని అభిప్రాయానికి సారమైన అర్థం అనేది మొదటి వివరణం. శ్రీరాముడు తనను తీసికొని అరణ్యానికి వెళ్ళినట్లయితే, భగవచ్ఛేషత్వం అనే తన ఆత్మస్వరూపానికి ఏ హాని లేదు– అని లక్ష్మణుని మనసుకు అనుగుణంగా అర్థాన్ని గ్రహించడం రెండవ అర్థనిర్వాహం. ఈ రెండు నిర్వాహాలు లక్ష్మణునకు శ్రీరాముని విడచి ఉన్నట్లయితే నిలచి ఉండ లేకపోవడాన్ని సూచిస్తున్నాయి.

తరువాత శ్రీరాముడు, సీతాదేవి లక్ష్మణుతో కలసి అరణ్యానికి వెళ్లి గంగానదిని దాటిన తరువాత, మళ్లీ లక్ష్మణుని చూచి శ్రీరాముడు "నీవు అరణ్యానికి రావడం విరమించాలి" అని నిర్బంధంగా పలికాడు. ఆ సమయంలో లక్ష్మణుడు శ్రీరామునితో ఈ విధంగా అన్నాడు.

"న చ సీతా త్వయా హీనా న చాహ మపి రాఘవ,

ముహూర్తం మపి జీవావ జలాత్ మత్స్యావివోద్ధృతౌ" (అయోధ్య కాండం– 53–31)

హే రాఘవ– రఘు కులంలో పుట్టినవాడా, త్వయా హీనా– నిన్ను విడిచి ఉన్నట్లయితే, న చ సీతా– సీత కూడా బతకలేదు, న చ అహమ అపి – నేను కూడా బతకలేను, జీవావ యది– ఆ విధంగా జీవించినట్లయితే, జలాత్–నీటిలోనుండి, ఉద్ధృతౌ– బయటకు తీయబడిన, మత్స్యౌ ఇవ –రెండు చేపల వలె, ముహూర్తం– ఒక్క క్షణ కాలం, జీవావ –జీవించగలం.

నీటి సంబంధం ఉన్నంత సేపు మాత్రమే నీటిలోనుండి బయటకు తీసిన చేపలు బతికి ఉండేటట్లు, నీవు మమ్ములను అరణ్యాలకు తీసుకుని పోతావు అనే ఆశ ఉన్నంత వరకు మాత్రమే మేము జీవిస్తాము అని లక్ష్మణుడు అంటున్నాడు. పూర్వం ప్రస్తావించిన "కురుష్వ మామనుచరమ్" అనే శ్లోకంలో ఉండే "వైధర్మ్యం నేహ విద్యతే" అనేది శ్రీరాముని విడచి ఉన్నట్లయితే తాను బతుకు లేకపోవడాన్ని పురస్కరించుకొని, కైంకర్యం చేయాలి–అనే లక్ష్మణునకు ఉండే ఆశను తెలుపుతున్నది, ఈ శ్లోకం.

"న చ అహమపి" అని, తాను శ్రీరాముని విడిచి ఉన్నట్లయితే, తాను బతుకు లేకపోవడాన్ని పురస్కరించుకొని, తనను ఆజ్ఞాపించి కైంకర్యంలో గ్రహించాలి– అనే లక్ష్మణుని మనసులోని అర్థాన్ని తెలుపుతున్నది– అని

వాధూల వీరరాఘవాచార్యస్వామివారు తెలియజేశారు. శేషిభూతుని ఉద్దేశించి శేషభూతునకు ఇటువంటి స్వభావం మొట్టమొదట కలగాలి– అనేది ఇక్కడ తాత్పర్యం.

2) దివ్య దంపతులకు కైంకర్యం చేసేటప్పుడు తన శేష త్వానికి తగినట్లు కైంకర్యం చేయాలి

"ధనురాదాయ సగుణం ఖనిత్రపిటకాధరః,

అగ్రత స్టే గమిష్యామి పంథాన మనుదర్శయన్,

ఆహరిష్యామి తే నిత్యం మూలాని చ ఫలాని చ,

వన్యాని యాని చాన్యాని స్వాహారాణి తపస్వినామ్" (అయోధ్యా కాండం– 31–23, 24)

సగుణం –అల్లెతాడుతో కూడిన, ధనుః– విల్లును, ఆదాయ– తీసుకొని, ఖనిత్ర– గడ్డపారను, పిటకా– పూలపండ్ల బుట్టను, ధరః– శిరస్సులో ధరించినవాడనై, పంథానం– మార్గాన్ని, అనుదర్శయన్– అనుసరిస్తూ చూపిస్తూ ఉండేవాడనై, (రాళ్ళు ముళ్ళు మొదలైనవి ఏమీ లేకుండా దారిని సరి చేస్తూ– అని ఇక్కడ అభిప్రాయం), అగ్రతః –ముందుగానే, గమిష్యామి– వెళ్ళగలను, తపస్వినాం– తాపసులకు, స్వాహారాణి–వారికి మంచి ఆహారమైన, మూలాని చ – దుంపలను, ఫలాని చ–పండ్లను, అన్యాని– ఇంకా మిగిలిన, వన్యాని –అరణ్యంలో దొరికే, యాని–ఏవి ఉన్నాయో, తాని– వాటిని కూడా, తే– నీకు, నిత్యం–ఎల్లప్పుడు, ఆహరిష్యామి– తీసుకుని వచ్చి ఇస్తాను –అని లక్ష్మణుడు శ్రీరామునితో చేసిన విజ్ఞాపనవల్ల ఈ విషయాన్ని మనం తెలియవచ్చు. ఈ రెండు శ్లోకాలను ఉద్దేశించియే "అడిమై శెయ్యవేణుమ్"అని (శ్రీవచన భూషణం– 54వ చూర్ణికలో) చెప్పబడింది.

3) ఈ కైంకర్యమే –అనే నియమం లేకుండా, అంటే, "దీనినే చేస్తాను, దీనినే చేస్తాను" అనే ఒక నియమం లేకుండా, అన్ని సేవలను చేయాలి

లక్ష్మణుని ఈ స్థితిని శ్రీవాల్మీకి భగవానుడు చక్కగా వర్ణించాడు. శ్రీరాముడు అరణ్యాలకి వెళ్లేటప్పుడు తనను కూడా వెంట తీసుకొని వెళ్ళమని శ్రీరాముని దగ్గర ప్రార్థించే సమయంలో,

భవాంస్తు సహ వైదేహ్యా గిరిసానుషు రంస్యతే,

అహం సర్వం కరిష్యామి జాగ్రతః స్వపతశ్చ తే" (శ్రీ రామాయణం– అయోధ్యకాండం– 31 –25)

భవాంస్తు– నీవు, వైదేహ్యా –సీతాదేవితో పాటు, గిరిసానుషు– కొండచరియలలో, రంస్యతే– ఆనందిస్తావు, జాగ్రతః– నీవు మేల్కొని ఉన్నప్పుడు, స్వపతః– నీవు నిద్రించేటప్పుడు, ఏతే–నీకు, అహం– నేను, సర్వం– అన్ని సేవలను, కరిష్యామి –చేస్తాను– అని లక్ష్మణుడు విజ్ఞాపన చేశాడు.

"అహం సర్వం కరిష్యామి" అనేది ఇక్కడ ప్రాణసమానమైన మాట. ఇందులో ఉండే సర్వశబ్దం అనేది– అన్నిచోట్ల, అన్ని కాలాలలో, అన్ని స్థితులలో, దివ్య దంపతుల విషయంలో సకలవిధ కైంకర్యాలను చేయడం తెలియజేస్తుంది. అంటే, సర్వ శబ్దం "అన్ని విధాలుగా" అనేదానికి వాచకం. "ఆరాధనం హి పరిపూర్ణ శేషవృత్తిః" అని గీతాభాష్యంలో (18 –25) భగవద్రామానుజులు ఆగ్రహించిన అర్థాన్నే ఇది తెలుపుతున్నది. అంటే, మన కాలం, శక్తి, ధనం, అన్ని భగవంతుని విషయంలోనే ఉపయోగపడాలి– అని భావం. ఇదే మనం భగవంతుని విషయంలో చేయవలసిన నిజమైన తిరువారాధన. ఏదో కొంచెం సేపు తిరువారాధన సమర్పించి ఉపచారాలు చేస్తే మాత్రం అది తిరువారాధన కాబోదు.

ఆదిశేషుని అవతార విశేషమైన లక్ష్మణుడు దివ్యదంపతులకు వనవాస కాలంలో నిరంతరం చేసిన సేవలోని, వైలక్షణ్యాన్ని పొగడి, అనుభవించే కాలంలో

కులశేఖరులు "శుట్రమెల్లామ్ పిన్ తొడర తొల్ కన మడైందవనే" (బంధువులందరూ వెంటరాగా అరణ్యాలకు పోయినవాడా!) అని శ్రీరాముని ఉద్దేశించి అనుగ్రహించారు. వనవాస కాలంలో దివ్య దంపతులకు తాను ఒక్కడై ఉండి, ఉండి సేవలను చేశాడు. ఆ సేవలు, బంధువులందరూ శ్రీరామునితో కూడా ఉండి, సేవలను చేసి ఉంటే ఏవిధంగా గొప్పగా, పరిపూర్ణంగా ఉండి ఉంటాయో, ఆ విధంగా, లక్ష్మణుడు చేసిన సేవలన్నీ గొప్పగా, పరిపూర్ణంగా ఉన్నాయి– అని కులశేఖరులు పొగిడారు. సీతారాములకు సంబంధించిన అందరు బంధువుల స్థానంలో తానొక్కడే ఉండి, వారు చేసే అన్ని సేవలను చేయాలని ఆశ పడే ఆశకు తగినట్లు అంతరంగ కైంకర్యం చేశాడు, లక్ష్మణుడు. ఇదే ప్రమేయరక్షణకైంకర్యం సంభవించిన రీతి. అంటే, ప్రమేయమైన (ప్రమాణంతో శాస్త్రంద్వారా తెలియబడే) భగవంతునకు అంతరంగ కైంకర్యం చేసి, రక్షించిన లక్ష్మణుని రీతి.

"అహం సర్వం కరిష్యామి" అనేదానిని ఉద్దేశించి "ఎల్లా అడిమైకళుమ్ శెయ్యవేణుమ్" అని మూలంలో శ్రీవచనభూషణంలోని 80 నాలుగవ చూర్ణికలో చెప్పబడింది.

4) కైంకర్యం చేసేటప్పుడు స్వాతంత్ర్రం అనే దోషం (తన ఆనందం అనే హేయం, అంటే, కైంకర్యానందాన్ని అనుభవించేటప్పుడు తాను అనుభవించాలి అనే దృష్టిని కలిగి ఉండే దోషం) కలవకుండా ఉండేటట్లు, "ఉచితమైన కైంకర్యంలో నన్ను వినియోగించాలి" అని ప్రార్థిస్తూ, శేషికి ఇష్టమైన, అన్ని విధాలైన కైంకర్యాలను చేయాలి.

శ్రీరాముడు, సీతాదేవి లక్ష్మణునితో కలసి పంచవటికి వెళ్ళగానే, శ్రీరాముడు లక్ష్మణుని చూచి

"వనరామణ్యకం యత్ర జలరామణ్యకం తథా,

సన్నికృష్టం చ యత్ర స్యాత్ సమిత్పుష్పకుశోదకమ్" (అరణ్య కాండం– 15 –5)

(అందమైన వృక్షాలు దట్టంగా ఉన్నది నీటి సముద్రం కలిగినది, సమిధలు, పూలు, దర్భలు, జలం దగ్గరలో దొరికేది అయిన ఒక చోటును చూచి, పర్ణశాల నిర్మించు) అని శ్రీరాముడు లక్ష్మణునితో అన్నాడు. అప్పుడు లక్ష్మణుడు శ్రీరాముని వద్ద విజ్ఞాపన చేసిన ఈ క్రింది మాటలు అతనికి గల ఈ స్వభావవిశేషాన్ని చక్కగా తెలియజేస్తున్నాయి.

"ఏవముక్తస్తు రామేణ లక్ష్మణః సంయుతాంజలిః,

సీతా సమక్షం కాకు త్స్థ మిదం వచనమబ్రవీత్" (అరణ్య కాండం– 15– 6)

రామేణ–రామునిచే, ఏవముక్తః– ఈ విధంగా చెప్పబడిన, లక్ష్మణః– లక్ష్మణుడు, సంయతాంజలిః– అంజలిని చేసినవాడై, సీతా సమక్షం– సీతాదేవి ముందు, కాకుత్స్థం– శ్రీరాముని చూచి, ఇదం వచనమ్ అబ్రవీత్– ఈ మాటను పలికాడు.

“పరవానస్మి కాకుత్స్థ! త్వయి వర్ష శతం స్థితే,

స్వయంతు రుచిరే దేశే క్రియతా మితి మాం వద" (అరణ్య కాండం– 15– 7)

కాకుత్స్థ– కకుత్స్థుని వంశంలో జన్మించినవాడా, త్వయి– నీవు, వర్ష శతం– ఎన్ని సంవత్సరాలు, స్థితే– ఉన్నప్పటికీ, పరవానస్మి– నేను నీకు పరతంత్రుడనై ఉన్నాను, స్వయం తు– నీవు స్వయంగానే, రుచిరే– అందమై దేశంలో, క్రియతాం ఇతి –పర్ణశాలను నిర్మించు అని, మాం వద– నన్ను నియమించు.

"పరవానస్మి" అని ప్రారంభమయే ఈ శ్లోకాన్ని దృష్టిలో పెట్టుకునే "ఉచితకైంకర్యత్తిల్ ఏవిక్కొళ్ళవేణుమ్" (తగిన కైంకర్యంలో ఆజ్ఞాపించి వినియోగించుకోవాలి) అని మూలంలో (శ్రీ వచనభూషణ దివ్యగ్రంథం 84వ

చూర్ణికలో) చెప్పబడింది. "త్వయి వర్షశతం స్థితే" అనేది "నీవు చిరకాలం వర్ధిల్లాలి" అనే మంగళాశాసనాన్ని తెలుపుతుంది.

5) “స్వయంపాకత్తిల్ వయిట్రై పెరుక్కియవన్ ఒప్పాణుణ్ణమాట్టాదాప్పోలే కైంకర్యాభినివేశత్తై పెరుక్కి క్కొండుపలవాఱు అడిమై శెయ్యవేణుమ్”

స్వయంపాకం అనేది –ఒకడు తన కోసం తానే వంట చేసుకుని భుజించడాన్ని తెలుపుతుంది. తన కోసం తానే వంట చేసికొనేవాడు సరిపోతుందో! సరిపోదో! అనే సందేహంతో పరిమితికి మించి అధికంగా వంట చేసికొని, తరువాత, చేసికొన్న వంట వ్యర్థంగా పోతుందే!అని దానిని అంతటినీ భుజించి, పొట్టను పెంచుకుంటాడు. ఈ విధంగా అలవాటు పడినవాడు పంక్తిలో పదిమందితో కలసి భుజించ లేడు. లక్ష్మణుని స్థితి కూడా ఇటువంటిదే. 13, 14 సంవత్సరాలు అరణ్యంలో సీతారాములకు పలువురు చేయవలసిన సేవలను అన్నిటిని తానొక్కడే చేశాడు. కైంకర్యంలో అభినివేశం అనే పొట్టను పెంచుకొన్నాడు, లక్ష్మణుడు. ఈ కారణం చేత ఆ దివ్యదంపతులు అయోధ్యకు తిరిగి వచ్చి పట్టాభిషేకం చేసుకున్నప్పుడు, వారి విషయంలో కైంకర్యం చేయడానికి ఎంతోమంది అక్కడ ఉన్నప్పటికీ, దానిని ఎవరితోనూ పంచుకొని చేయకుండా, ఒకే కాలంలో వారికి అందరికి సమానంగా, తాను ఒక్కడే, ఒంటరిగానే తన ఒక చేతితో గొడుగును ఎత్తిపట్టుకొని, ఇంకొక చేతితో తెల్లని చామరాన్ని వీస్తూ సేవలు చేశాడు. ఈ ఉదంతానికి ఆధారంగా శ్రీ వరవరమునులు ఈ క్రింద ఇవ్వబడిన పాద్మపురాణ వచనాన్ని ప్రస్తావన చేయడాన్ని ఇక్కడ అనుసంధించాలి.

"అథ తస్మిన్ దినే పుణ్యే శుభలగ్నే శుభాన్వితే,

రాఘవస్యాభిషేకార్థం మంగళం చక్రిరే జనాః"

అథ– తరువాత, తస్మిన్ దినేష్– పట్టాభిషేక దినంలో, శుభలగ్నం– మంచి లగ్నంలో, శుభాన్వితే– చక్కని ముహూర్తంలో, రాఘవస్య– రఘు కులంలో పుట్టిన శ్రీరామునకు, అభిషేకార్థం –పట్టాభిషేకం కోసం, జనాః– అయోధ్యా పురజనులు, మంగళం– మంగళ కార్యాలను, చక్రిరే– చేశారు.

"మంత్రపూతజలైః శుద్ధైః మునయః సంశ్రిత వ్రతాః,

జపంతో వైష్ణవం సూక్తం చతుర్వేదమయాన్ శుభాన్,

అభిషేకం శుభం చక్రుః కాకుత్స్థం జగతాం పతిమ్, "

సంశ్రిత వ్రతాః –పరిశుద్ధమైన మనస్సును కలిగిన, మునయః– మననశీలురైన ఋషులు, చతుర్వేదమయాన్–నాలుగు వేదాల స్వరూపాలైన, శుభాన్ –శుభకరంగా ఉండే, వైష్ణవాన్ సూక్తాన్– మహావిష్ణు వైభవాన్ని తెలియజేసే మంత్రాలను, జపంతః– జపిస్తూ ఉన్నవారై, శుద్ధైః– పరిశుద్ధమైన, మంత్ర పూతజలైః– వేదాంత మంత్రాలతో పవిత్రాలైన జలాలతో, జగతాం పతిం– లోకానికి ప్రభువైన, కాకుత్స్థం –కకుత్స్థ వంశంలో పుట్టిన శ్రీరామునకు, శుభం అభిషేకం చక్రిరే –మంగళ స్నానం చేయించారు.

"తస్మిన్ శుభ్రతమే లగ్నే దేవ దుందుభయో దివి,

నినేదుః పుష్పవర్షాణి ववర్షుశ్చ సమంతతః"

తస్మిన్ –అటువంటి, శుభ లగ్నే– మంగళ లగ్నంలో, దివి– ఆకాశంలో, దేవదుందుభయః– దేవదుందుభులు మొదలైన వాద్యాలు, నినేదుః– మోగాయి, సమంతతః– నాలుగు పక్కల, పుష్పవర్షాణి– పూలవర్షం, ववర్షుः–కురిపించారు.

“దివ్యాంబరైః భూషణైశ్చ దివ్యగంధానులేపనైః,

పుష్పైః నానావిధైః దివ్యైః దేవ్యా సహా రఘూద్వహః,

అలంకృతశ్చ శశుభే మునిభిః వేదపారగైః"

వేదపారగైః– వేదలను పరిపూర్ణంగా తెలిసికొన్న, మునిభిః– మహాములతో కూడినవాడు, దివ్యాంబరైః– దివ్యమైన వస్త్రాలతో, భూషణైః– దివ్యాభరణాలతో, దివ్య గంధానులేపనైః– చక్కని వాసన కల చందనాలతో, దివ్యైః– దివ్యమైన, నానావిధైః– అనేక విధాలైన, పుష్పైః– పూలతో, అలంకృతః– అలంకరింపబడినవాడు, దేవ్యా సహా– సీతాదేవితో కూడి ఉన్నవాడైన, రఘూద్వహః– రఘు శ్రేష్ఠుడైన శ్రీరాముడు, శుశుభే– ప్రకాశించాడు.

"ఛత్రం చామరం దివ్యం ధృళతవాన్ లక్ష్మణ స్తదా,

పార్శ్వే భరతశత్రుఘ్నౌ తాళవృంతౌ వివేజతుః"

తదా– అప్పుడు, లక్ష్మణః– లక్ష్మణుడు, దివ్యం ఛత్రం చామరం చ– దివ్యమైన తెల్లని గొడుగును, తెల్లని చామరాన్ని, ధృతవాన్ –ధరించాడు, భరత శత్రుఘ్నౌ– భరతుడు, శత్రుఘ్నుడు, పార్శ్వే–రెండు పక్కల, తాళవృతం–విసనకర్రతో, వివేజతుః–వీచారు.

"దర్పణం ప్రదదౌ శ్రీమాన్ రాక్షసేంద్రో విభీషణః,

దధార పూర్ణకలశం సుగ్రీవో వానరేశ్వరః".

శ్రీమాన్ – కైంకర్య సంపద నిండినవాడు, రాక్షసేశ్వరః– రాక్షసులకు ప్రభువు అయిన, విభీషణః – విభీషణుడు, దర్పణం– అద్దాన్ని, ప్రదదౌ– ఇచ్చాడు,

వానరేశ్వరః –వానరులకు అధిపతి అయిన, సుగ్రీవః– సుగ్రీవుడు, పూర్ణ కలశం– పూర్ణకుంభాన్ని, దధార– ధరించి సేవ చేశాడు.

"జాంబవాంశ్చ మహాతేజాః పుష్పమాలాం మనోహరామ్,

వాలి పుత్రస్తు తాంబూలం కర్పూరం చ దదౌ ప్రియాత్"

మహా తేజాః జాంబవాన్– గొప్ప తేజస్సు కలిగిన జాంబవంతుడు, మనోహరాం పుష్పమాలాం– గొప్పతనాన్ని కలిగిన, మనసుకు ప్రియమైన, పూలమాలను, దదౌ– సమర్పించాడు, వాలి పుత్రస్తు– వాలికి కమారుడైన అంగదుడు, కర్పూరం తాంబూలం – కర్పూరంతో కూడిన తాంబూలాన్ని, ప్రియాత్ దదౌ – ప్రీతితో ఇచ్చాడు.

"హనుమాన్ దీపికాం దివ్యాం సుషేణస్తు ధ్వజం శుభమ్,

పరివార్య మహాత్మానం మంత్రిణః సముపాసిరే"

హనుమాన్ దీపికాం దివ్యాం– హనుమంతుడు దివ్యమైన చేతి దీపాన్ని పట్టుకొని, సుషేణః తు– సుషేణుడు, శుభం ధ్వజం– అందమైన ధ్వజాన్ని పట్టుకొని, మంత్రిణః– మంత్రులు, మహాత్మానం పరివార్య – మహాత్ముడైన శ్రీరాముని చుట్టి, సముపాసిరే–సేవించారు.

పాద్మపురాణం ఉత్తరఖండం 49 వ అధ్యాయంలో ఉండే ఈ తొమ్మిది శ్లోకాలు శ్రీరాముని పట్టాభిషేకంలో అతనికి అంతరంగ పురుషులు చేసిన కైంకర్యాన్ని వివరిస్తున్నది. మన పెద్దలు ప్రతిదినం పురాణాలను పారాయణం చేసి ఆనందించడం అలవాటుగా పెట్టుకున్నారు. శ్రీ మణవాళ మహామునుల

అనుగ్రహం వల్ల మనం ఈ శ్లోకాలను అయినా తెలిసికొని ఆనందించే భాగ్యాన్ని పొందినవారం అయ్యాము.

పురుషత్వం –శ్రీ భరతుని వైభవం

దివ్యదంపతుల విషయంలో కైంకర్యానికి అగ్రగంతగా, అంటే, ముందడుగు వేసేవాడుగా ఉండే లక్ష్మణుని రీతిని ఒక విధంగా తెలిసికొన్నాము. భరతుని స్థితి కూడా ఇటువంటిదే. "అగ్రగంతా పురుషః "అనేదానికి శ్రీ భరతాళ్వాన్ ఇంకొక ఉదాహరణగా వెలుగుతున్నాడు. భగవత్పారతంత్ర్యం కలవారి గోష్ఠిలో అగ్రగంతగా భరతుడు ఉన్నాడు. శ్రీరాముని మనస్సును అనుసరించి వర్తించడం పారతంత్ర్యం అనబడుతుంది.

భరతుడు కేకయ దేశంనుండి అయోధ్యకు తిరిగి తీసుకొని రాబడ్డాడు. శ్రీరాముడు సీతాదేవి లక్ష్మణుడు అరణ్యాలకి వెళ్ళగా, దశరథ చక్రవర్తి మరణించాడు అనే విషయాన్ని భరతునకు తెలియజేయడం జరిగింది. ఇక్ష్వాకు వంశంలో జన్మించిన ప్రభువులకు అందరికీ పట్టాభిషేకం చేసే కులగురువు వశిష్ఠుడు, తల్లులు, మంత్రులు మొదలైన అధికారులు, ప్రజలు అందరూ ఒకటిగా కలిసి భరతునకు పట్టాభిషేకం జరిపించాలని నిర్బంధించారు. "రాజ్యం అరాచకం అయిపోతుంది, నీవే రాజ్యాన్ని పాలించాలి– అనేది దశరథ చక్రవర్తి ఉద్దేశ్యం. శ్రీరామునకు కూడా అదే అభిప్రాయం. అందువల్ల నీవు పట్టాభిషేకం చేసుకోవాలి" అని అందరూ ఎన్ని విధాలుగా నిర్బంధించినా, భరతుడు దానికి అంగీకరించలేదు. "తన స్వరూపానికి తగిన కార్యం ఏది?" అనే విషయంలో స్పష్టమైన, తీవ్రమైన అభిప్రాయంతోఅతడు ఉన్నాడు. అతని మనస్సు శ్రీరాముని అనుసరించి ఉన్నది.

"ఈ రాజ్యం నా సొంతం కాదు. శ్రీరామునకు చెందినది. ఈ రాజ్యం వలె, శ్రీరామునకు తమ్ముడనైన నేను కూడా అతని సొత్తు. శ్రీరామునకు పరతంత్రుడను. అంటే, అతని ఇష్టప్రకారం నడుచుకోవలసినవాడనై ఉన్నాను. అతనికి నేను దాసుడను. నా ఈ స్థితిలో ఏ విధమైన మార్పు లేదు. నేను శ్రీరాముడు ఉండే చోటుకు పోయి, అయోధ్యకు తిరిగివచ్చి పట్టాభిషేకం

చేసుకోమని అతనిని ప్రార్థిస్తాను. ఒకవేళ, " తండ్రి మాట ప్రకారం 14 సంవత్సరాలు నేను అరణ్యంలోనే నివసిస్తాను" – అని అతడు అంటే, నేను ఈ 14 సంవత్సరాలు అరణ్యాలలోనే ఉంటాను. శ్రీరాముడు తిరిగి వచ్చి రాజ్యాన్ని పాలించనీ! "– అని అన్నాడు.

దివ్య దంపతులైన సీతారాములకు పరతంత్రుడైనందున, రాజ్యం అనే ఐశ్వర్యం భరతునకు విరోధి అయినది. తనకు రాజ్యం వద్దు– అని అనడంలో చాలా తీవ్రంగా ఉండే భరతుని స్థితి మనం కీర్తించ దగినది. భగవద్విషయంలో మనకు ఈ స్థితి కలగాలి. ఎందుకంటే, లోకుల రీతి ఒక విధంగా ఉంటుంది. అది ఆత్మస్వరూపం తెలిసినవాని స్థితికి అనుకూలంగా ఉండదు. భగవద్భక్తుల స్థితులను, కార్యాలను లోకంలో ఉండేవారు తెలిసి కోలేరు. వారికి తెలిసికోవడం కూడా సాధ్యం కాదు. వారు, తాము భావించే రీతిలోనే ఇతడు ఉండాలి –అని ఎదురు చూస్తారు. అయితే, ఇతడు ఆ విధంగా ఉండలేడు. భగవంతుని విషయంలో స్థిరమైన మనసును కలవాడై భరతుడు ఉన్నాడు.

భగవంతుని కైంకర్యంలో విషయంలో రుచి కలిగినవారికి లోకులతో సంబంధం రుచించదు. "నాట్టారోడు ఇయల్ వొళిందు నారణనై నణ్ణినమే" (తిరువాయ్ మొழி –10 –6–2) (ఈ లోకంలోనివారితో సంబంధాన్ని పోగొట్టుకొని, నారాయణుని ఆశ్రయించాము) అనేది నమ్మాళ్వారుల పాశురం. ఇక్కడ "నాట్టార్" అంటే– భగవద్విషయాన్ని తప్ప మిగిలిన లౌకిక విషయాలలో ఆసక్తి కలిగినవారు. అంటే, " ఉండియే ఉడైయే ఉకందోడుమ్ " (మంచి ఆహారాన్ని తిని మంచి బట్టలను కట్టుకొని ఆనందించే) (పెరుమాళ్ తిరుమొழி –3–4) అనే విధంగా ఆనందించి, లోకంలో సంచరించే జనులు. అంటే, "యానే ఎన్ననదే" (నేనే, నాదే) (తిరువాయ్ మొழி– 2–9–9) అని అహంకార మమకారాలకు వశమైనవారు. 1) ఇతర విషయాలలో ప్రావణ్యం, 2) అళ్వారులను ఆశ్రయించకుండా ఉండడం– అనేవి ఈ రెండు దోషాలు– అని ఇక్కడ నంజీయర్ అనే పూర్వాచార్యులు చేసిన వ్యాఖ్యానం.

"ఇయల్వు ఒళిందు"– ఈ విధంగా ఉండేవారితో తమకు గల సంబంధాన్ని పోగొట్టుకుని– అని దీని అర్థం. దీనిని నంబిళ్ళై అనే పూర్వాచార్యులు. "ఓ! ఓ! ఉలకినదు ఇయల్వే" (అయ్యో! ఈ లోకంలోనివారి తీరు ఏమి?) తిరువాశిరియమ్ – 6), "ఇవై ఎన్ట ఉలకియఱ్ఱో?" ఇది ఏమి లోకంలోనివారి తీరు?) (తిరువాయ్ మొళి– 4–9–1), "కొడు ఉలకమ్ కాట్టేలే" (క్రూరమైన ఈ లోకాన్ని నాకు చూపించకు) (తిరువాయ్ మొళి– 4–9–7) అని అంటూ ఈ లోకంలోనివారిని విడిచి పెట్టి, "ఉంగళోడు ఎంగళిడై ఇల్లై" (తిరువాయ్ మొళి– 8–2–7) (మీతో మాకు సంబంధం లేదు) అని వారితో తమకు ఉండే సంబంధాన్ని పోగొట్టుకున్నారు, ఆళ్వారులు.

ఈ విధంగా కర్మానుగుణంగా కలిగిన బంధువుల సంబంధాన్ని పోగొట్టుకొని,

"నారణనై నణ్ణి" – జీవులందరికీ స్వాభావికంగా, సహజంగా బంధువైన సర్వేశ్వరుని ఆశ్రయించి– అని అర్థం. శాస్త్రం, "జీవులకు అందరికీ భగవంతుడు అన్ని విధాలైన బంధువుగా ఉండేవాడు" –అని ఘోషించడానికి అనుగుణంగా లోకులతో సంబంధాన్ని పోగొట్టుకొని, భగవంతుని సకలవిధబంధువుగా ఆశ్రయించాలి. అనేదే ఇక్కడ అభిప్రాయం

"భగవంతుడు మనకు సకలవిధ బంధువుగా ఉన్నాడు" అనేదానికి ఏమి అభిప్రాయం? సకలవిధబంధుత్వం అంటే –సర్వ ప్రకారోపకారకత్వం, అన్ని విధాలుగా మంచిని చేసేవాడై ఉండడం– అని అర్థం పూర్వాచార్యులలో ఒకరైన అళకియ మణవాళ చ్చీయర్ వ్యాఖ్యానించారు. బంధుత్వం– రక్షకత్వం అని పెరియ వాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్యానం. సర్వప్రకారోపకారకత్వం పరమపదంలో కూడా ఉన్నది. లీలావిభూతిలో, అంటే, ఈ సంసారి జీవుల విషయంలో భగవంతుని రక్షకత్వ ప్రయుక్తమైన ఉపకారకత్వం విశేషంగా ఉంటుంది– అని చెప్పినందున దానిని చక్కగా ప్రస్తావించడం పెరియ వాచ్చాన్ పిళ్ళై వ్యాఖ్యానంలోని తాత్పర్యం. ఒక్కొక్క జీవాత్మను భగవంతుడు ధరించి, అతనిలో వ్యాపించి, నియమించడం అతని సర్వప్రకార రక్షకత్వంలోకి చేరుతుంది– అని ఒక అర్థన్ని నంబిళ్ళై అనే ఆచార్యులు తిరువాయ్ మొళి ఈడు వ్యాఖ్యానానికి గల మొదటి అవతారిక

అయిన ముదల్ శ్రియఃపతిలో అన్నారు. 1) నిత్యవిభూతిలో నిత్యసూరులకు అన్నివిధాలైన బంధువుగా ఉంటూ, వారికి పలు విధాలైన అనుభవ కైంకర్యాలను ఇవ్వడం, 2) వారు చేసే కైంకర్యాలను లక్ష్మీదేవితో కలసి గ్రహించి ఆనందించడం –అని భగవంతుని ఉపకారత్వం రెండు విధాలుగా ఉంటుంది. తమ తల్లులతో, కులగురువు వశిష్టునితో, రాజ్యంలోని ప్రజలతో ఏ తేడా లేకుండా, అందరూ తన తలపై రాజ్యభారాన్ని, అంటే, స్వాతంత్ర్యం అనే భారాన్ని పెట్టాలని చూడగా, తనకు సహజంగా కల భగవత్పారతంత్ర్యం అనే సంపదను కొంచెం కూడా, ఒక క్షణం అయినా పోగొట్టుకోకుండా ఉండడంలో చాలా స్థిరమైన మనసును కలవాడై, భరతుడు ఉన్నాడు. ఇతని గొప్పతనాలను శ్రీవాల్మీకి భగవానుని అభిప్రాయాన్ని అనుసరించి మన పూర్వాచార్యులు అనేక విధాలుగా వివరించారు. సంప్రదాయ గ్రంథాలలో శ్రీ భరతుని గొప్పతనాలు చాలా విస్తృతంగా వివరింపబడ్డాయి. అయితే, గ్రంథం చాలా పెద్దది అవుతుంది అనే భయంతో నేను ఇక్కడ వాటిని వివరించడం లేదు. ఇక, ఆ తరువాత చెప్పవలసిన విషయాన్ని ప్రస్తావన చేస్తాను.

పురుషత్వం –మహాబలి చరిత్ర

భగవద్భక్తుడై ఉండడం అంత సులభం కాదు. ఏనాటికీ భగవంతుని ఆశ్రయించి ఉండాలి, ఆ స్వామికి కైంకర్యం చేయాలి– అని అంటే, దానికి ఎన్నో ఆటంకాలు, అవరోధాలు కలుగుతాయి. తనతో ఉండేవారుకూడా విరోధ భావాన్ని కలిగి ఉంటారు తప్ప, అనుకూలంగా ఉండరు. వీటినన్నిటినీ అధిగమించి, ఒకడు భగవంతుని అభిప్రాయాన్ని అనుసరించి వర్తించాలి. ఇది లోకంలో సర్వసాధారణంగా సంభవించే విషయం. లోకనియతి ఇది. దీనిని గూర్చి మనం ఏమీ చేయలేము. ఏది భక్తి? భగవద్విషయంలో ఒకడు ప్రవేశించిన కాలంలో ఎన్నో ఆటంకాలు కలుగుతాయి. అయితే వీటిని అతడు లెక్క పెట్టకూడదు. ఇదే నిజమైన భక్తి. ఇదే భగవంతుడు మన దగ్గర ఎదురుచూచే విషయం. శ్రీ ప్రహ్లాదుని చరిత్ర వంటిదే, అతని మనుమడు అయిన మహాబలి యొక్క చరిత్రకూడా. అది చాలా గొప్పది, చాలా ఉన్నతమైనది కూడా– అని అంటే అది అతిశయోక్తి కాదు అసురుడు అయిన మహాబలికూడా అగ్రగంతయై, పురుషుడై, వెలిగినవాడే. భగవద్విషయంలో స్నేహాన్ని, అనుకూలభావాన్ని అపరిమితంగా

కలిగి వెలిగిన మహాబలి చరిత్రలోనుండి కొన్ని విషయాలను పరిశుద్ధమైన మనసుతో ఇక అనుభవిద్దాం.

ఇంతకుముందు నేను చెప్పిన విధంగా మహాబలికి ప్రాణభిక్ష పెట్టినవాడు, శుక్రాచార్యుడు. ఇతని అనుగ్రహంవల్లనే మహాబలి బతికి బయటపడ్డాడు, అంతేకాక, ఇంద్రుడు మొదలైన దేవతలనుజయించి, మహాబలి త్రైలోక్య రాజ్యధిపత్యాన్ని సంపాదించడానికి ఈ శుక్రాచార్యులే. కారణం. మహాబలికి కులగురువు కూడా ఇతడే.

"ఇక్కడకు బ్రాహ్మణ బ్రహ్మచారి వేషం ధరించి నీ, దగ్గరకు భిక్ష కోసం వచ్చినవాడు సాక్షాత్తు మహావిష్ణువే సుమా. ఇతడు దేవతల కార్యం సాధించడం కోసం ఇక్కడకు వచ్చాడు. ఇతడు దేవతలు కోల్పోయిన ఐశ్వర్యాన్ని నీ దగ్గర నుండి గ్రహించి, తిరిగి వారికి ఇవ్వడం కోసం వచ్చాడు. ఇతని దగ్గర నీవు జాగ్రత్తగా లేకపోతే నిన్ను మోసం చేసి, నీ, ఐశ్వర్యం తేజస్సు, కీర్తి అంతటి అపహరించి వేస్తాడు. ఇతనికి నీవు దానం ఇవ్వకు" అని అంటూ శుక్రాచార్యుడు మహాబలిని హెచ్చరించాడు.

కానీ, మహాబలి మాత్రం భగవంతునకు అతడు కోరినట్లుగా దానం ఇవ్వాలి– అని తన మనసులో దృఢంగా నిర్ణయించుకున్నాడు. మహాబలి గొప్ప ధార్మికుడు. ముల్లోకాలను యజ్ఞం భూమిగా మార్చినవాడు. అతడు చేసిన దాన ధర్మాలకు, యజ్ఞ యాగాలకు అంతు లేదు. తన ప్రజలను కంటికి రెప్పలా కాపాడాడు. శుక్రాచార్యుడు హెచ్చరించినా, అందరికీ అన్నిటినీ ధారాళంగా ఇచ్చే స్వభావాన్ని కలిగినవాడైన అతని మనస్సు చాలా సాత్వికంగా, కొంచెం కూడా చలించకుండా చాలా స్థిరంగా ఉన్నది. అతనికి చివరి వరకు భగవంతుని విషయంలో విరోధ భావమే. కలుగలేదు. భగవంతుని విషయంలో గొప్ప స్నేహాన్ని, అనుకూల భావాన్ని కలిగినవాడు, ఆ స్వామి మనసును అనుసరించేవాడైన మహాబలి శుక్రాచార్యుని దగ్గర చెప్పే వచనాలు చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తాయి.

"ఇక్కడకు వామనుని రూపంలో నా దగ్గరకు వచ్చినవాడు శ్రీమహావిష్ణువే కానీ, అతడు నాకు విరోధ భావంతో వచ్చినవాడే కానీ, అతడు నన్ను

మోసగించడం కోసం వచ్చినవాడే కానీ. అతడు దేవతల సాధించడం కోసమే వచ్చినవాడు కానీ. సర్వలోక మహేశ్వరుడైన శ్రీ మహావిష్ణువు నా దగ్గరకు యాచించేవాడై వచ్చాడు. యాగం మొదలైన వైదిక కర్మలచే పూజింపబడే శ్రీమహావిష్ణువే నేరుగా వచ్చాడు అంటే, మాకంటే భాగ్యశాలి ఇంకా ఎవరు వేరొకరు ఉండగలరు? అతనికి దానం ఇవ్వకుండా ఉండడం నాకు ఏ విధంగా సాధ్యం అవుతుంది? నేను నరకాన్ని చూచి భయపడడం లేదు. ఎంత దుఃఖం కలిగినా, అధికార, ఐశ్వర్యాలు కోల్పోయినా, వాటికోసం నేను భయపడడం లేదు. కానీ, ఒక బ్రాహ్మణుని మోసగించడానికి భయపడుతున్నాను" అని గంభీరమైన మనస్సును కలవాడు, సత్య ప్రతిజ్ఞను కలవాడు అయిన మహాబలి అన్నాడు.

"నా మాటను కాదని వామనునకు దానం ఇచ్చినందున నీవు నీ ఐశ్వర్యాన్ని పోగొట్టుకుంటావు" అని శుక్రాచార్యుడు మహాబలిని శపించాడు. అయినా, మహాబలి తన మనసులో ఏ విధమైన విచారం పొందకుండా, పరిశుద్ధమైన మనస్సు కలవాడై, భగవంతుని చేతిలో తీర్థాన్ని పోసి, అతనికి అతడు కోరిన మూడు అడుగుల నేలను దానం చేశాడు. వెంటనే, భగవంతుడు త్రివిక్రముడై, రెండు పాదాలతో కింది లోకాలను, పై లోకాలకు అన్నిటిని ఆక్రమించి మూడవ పాదానికి మహాబలి ఏమి చేయబోతాడు? అని గమనిస్తూ ఉన్నాడు. మహాబలికి చెందిన అసురులు తమ ఆయుధాలను ధరించి, భగవంతుని చంపడం కోసం ప్రయత్నించారు. వారికి, భగవంతుని పరివారమైన నందుడు, సనందుడు, జయ విజయులు, ప్రబలుడు, ఉత్పలుడు, కుముదుడు, కుముదాక్షుడు, విష్వక్సేనుడు, గరుడుడు, సుదర్శనుడు మొదలైనవారితో యుద్ధం ఆరంభమైంది. ఆ సమయంలో మహాబలి వారిని చూచి, ఈ విధంగా అన్నాడు.

"ఇక్కడకు వచ్చినవాడు మహావిష్ణువు. ఇతడు నాశనం లేనివాడు. ఏ భగవానుని అనుగ్రహంవల్ల మనం ఇంతకుముందు దేవతలను జయించి, త్రైలోక్య రాజ్యాధిపత్యం అనే సంపదను పొంది, క్షేమాన్ని పొందామో, ఆ భగవంతుడే ఇప్పుడు దేవతలను అనుగ్రహించడం కోసం ఇక్కడకు వచ్చాడు. ఇతని యుద్ధంలో జయించడం మీకు సాధ్యం కాదు. కాలం ఇప్పుడు అసురులకు అనుకూలంగా లేదు. దేహబలంతో, బుద్ధిబలంతో, మంత్రబలంతో, లేక, ఇక ఏ

విధమైన బలంతో కాలాన్ని చేయించ లేము. ఇతనితో మీరు యుద్ధం చేయవద్దు. మనకు మళ్లీ కాలం అనుకూలం అయ్యే వరకు వేచి ఉందాం"

ఈ సందర్భంలోకూడా మహాబలి కాలం గొప్పతనాన్ని– కాలాన్ని అనుసరించి మన పనులు ఉండాలి అనే విషయాన్ని– తెలియజేస్తున్నాడు. అయితే, మహాబలి మాటను వినేవారు అక్కడ ఎవ్వరూ లేరు. భగవద్విషయంలో మహాబలికి ఉన్న మహా విశ్వాసాన్ని అతనికి చెందినవారు ఎవరు తెలిసికో లేకపోయారు. అతనిని అందరూ విడచిపెట్టి, వేరొక చోటికి వెళ్ళిపోయారు. అతని కుమార్తె అయిన రత్నమాల మాత్రం భగవంతుని వధించాలని ప్రయత్నించినప్పుడు, ఆమెను మహాబలి ఆమెను అడ్డుకున్నాడు. అప్పుడు ఆమె వెనుకకు వెళ్ళి పోయింది. అప్పుడు భగవంతుని అభిప్రాయాన్ని అనుసరించి గరుడుడు మహాబలిని వరుణపాశాలతో బంధించాడు. భగవంతుడు అప్పుడు మహాబలి దగ్గర తన మూడవ అడుగుకోసం చోటును అడిగాడు.

ఈ సందర్భంలోనే మనం మహాబలియొక్క గొప్పతనాన్ని చక్కగా తెలుసుకోవాలి. వినేవారి అందరి గుండెలను పిండి వేసే చరిత్ర మహాబలిది. గొప్ప ధార్మికుడు, విష్ణుభక్తుడు అయిన మహాబలి అభిప్రాయం ఏమి? త్రైలోక్యాధిపత్యాన్ని పోగొట్టుకుంటున్నాడు. దానితోపాటు, తన గొప్ప కీర్తి, గొప్పతేజస్సు, ఎవరికీ ఓడించడానికి సాధ్యం కాని పరాక్రమం, ఐశ్వర్యం అనే అన్నిటిని పోగొట్టుకొని నిలచాడు. అంతవరకూ అతనిని ఆశ్రయించి ఉండే అందరూ అతనిని విడిచి దూరంగా తొలగి పోయారు. తన బంధువులను, చుట్టాలను పోగొట్టుకున్నాడు. ఇంతకుమించి, అతడు వరుణ పాశాలలతో బంధింపబడి నిశ్చేష్టుడై ఉన్నాడు.

లోకం దృష్టిలో చూస్తే దారిద్యం, అవమానం, వీటితో పాటు, చాలా క్లిష్ట దశ అనేవి మహాబలికి ఇప్పుడు కలిగాయి. అయితే, భగవంతుని అంగీకారానికి ముందు పలువురు గొప్ప అధికారులకు కలిగే దశ ఇది. అందువల్లనే ఇటువంటి కష్టమైన దశలో కూడా అతని మనస్సు ఏ విధమైన వికారాన్ని పొందలేదు. దానికి బదులుగా, తన మనసులో చాలా సంతోషంతో భగవంతుని "పురుషోత్తముడవు" అని స్తోత్రం చేశాడు. భగవంతుని పాదధూళి సంబంధం

పొందిన పాతాళలోకంలో ఉజ్జీవనాన్ని కోరాడు. భగవంతుని పాదాలలో తన శిరస్సును సమర్పించాడు. ఇదే మహాబలియొక్క గొప్పతనం.

తన విషయంలో మహాబలి చూపిన అభినివేశాన్ని చూచి భగవంతుడు చాలా సంతోషించాడు. అక్కడ ఉండే బ్రహ్మ, శివుడు మొదలైన అందరు దేవతలు ఈ సన్నివేశాన్ని చూడగానే చలించిపోయారు. శ్రీ ప్రహ్లాదుడు కూడా అక్కడకు వచ్చి భగవంతుని స్తుతించాడు. 1) ఐశ్వర్యం ఆత్మకు మోహాన్ని కలిగిస్తుంది –అని, 2) దీని వల్ల అది ఆత్మయొక్క నిజ స్వరూపాన్ని తెలియనీయకుండా అడ్డు పడుతుంది –అని, 3) ఈ కారణం చేత భగవంతుడు తన భక్తుల ఐశ్వర్యాన్ని అపహరించడం కూడా అనుగ్రహమే– అని ప్రహ్లాదుడు అన్నాడు.

మనకు జ్ఞానం లేదు. మనకు అష్టాదశ పురాణాలలో పరిచయం అనేదే లేదు. భగవద్రామానుజులకు పౌరాణికులు అని ఒక నామం ఉన్నది అని కూడా మనకు తెలియదు. వారు పురాణాలలో చాలా అభినివేశం కలవారు. అయితే, మనం ఆ©పురాణాల నుండి చాలా దూరంగా ఉన్నాము. శ్రీమద్భాగవతం మొదలైన పురాణాలలో మహాబలియొక్క చరిత్ర చాలా ఆశ్చర్యకరంగా వర్ణింపబడింది. ఇతడు ఏదో ఒక అసురుడు కదా– అని మనం ఇతనినిగూర్చి చాలా సాధారణంగా భావిస్తాము. పుణ్యకర్మలచే సంపాదింపబడిన లోకాలను శుద్ధమనోభావంతో భగవంతునకు సమర్పించిన, దానికి మించి, భగవంతుని శ్రీచరణాలకు సమర్పించిన మహాబలియొక్క వైభవాన్ని మన మనసులో భావించి నోటితో చక్కగా కీర్తించాలి. భగవంతుడే దీనిని రెండు సార్లు చేశాడు. భగవంతుడు వామనమూర్తియై, యాగశాలకు వెళ్ళిన సమయంలో అతని నోరారా కీర్తించాడు. తరువాత త్రివిక్రముడై, అవతారం ఎత్తినపుడుకూడా మహాబలిని కీర్తించాడు.

"పలు పుణ్యకర్మల ఫలంగా కలిగే మంచి వంశంలో జన్మ, ఐశ్వర్యం, మంచి అందం, కీర్తి, తేజస్సు, ధనం, విద్య మొదలైన సంపదలు అన్నీ ఒకడు మదాన్ని పొంది, ఆత్మ హితాన్ని పోగొట్టుకోవడానికి కారణాలు అవుతున్నాయి. ఒకడు ఆత్మహితాన్ని పొందడానికి అడ్డుగా ఉండే వీటిని పోగొట్టుకోవడంవల్ల, నా భక్తుడు విచారాన్ని పొందడు. మహాబలికి నేను పలు విధాలుగా కష్టాలను కలిగించాను.

అయినా అతడు మోహాన్ని గాని, దుఃఖాన్ని గాని పొందకుండా, నా మాయను జయించాడు."

అంతేకాక, ఇంకా పలు విధాలుగా మహాబలిని భగవంతుడు కీర్తించాడు. తరువాత, మహబలి దేవతలు ఆశపడే నగరం అని, లోకంలో విశ్వకర్మచే సృష్టింపబడిన వాసస్థానానికి తన తాత అయిన ప్రహ్లాదునితో, ఇంకా తన కుటుంబ సభ్యులతో కలసి వెళ్ళాడు. అక్కడ ప్రహ్లాదుని దగ్గర "తాను ఏ విధంగా కాలాన్ని గడపాలి?" అనే విషయాన్ని అనుగ్రహించమని ప్రార్థించాడు.

ప్రహ్లాదుడు కూడా భగవంతునకు తిరువారాధన సమర్పించడంలోని మహిమను, భగవంతునకు ఏవిధంగా తిరువారాదనను సమర్పించాలి—అనే విషయాన్ని గురించి బలికి వివరంగా ఉపదేశించాడు. వామన పురాణం చివరలో రెండు అధ్యాయాలలో ఈ విషయాలు కనబడుతున్నాయి. మహాబలి తనకోసం విశ్వకర్మచే తీసికొనిరాబడి ప్రతిష్ట చేయబడిన కేశవస్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఆ భగవంతునకు తిరువారాధన చేస్తూ కాలాన్ని గడపుతున్నాడు.

మహాబలి చరిత్రను చూచినప్పుడు కొన్ని విధాలైన విచారాలు మనకి కలుగుతాయి. ఎన్నో విధానాలైన గొప్పతనాలు ఉన్నా, సంగ్రహంగా చెప్పాలంటే, భగవంతుని విషయంలో మిక్కిలి అనుకూల భావాన్ని పొందినవాడైనా, మహాబలికి ఇంకా మోక్షం కలగలేదు. ఇప్పుడు నడుస్తున్నది ఏడవ మన్వంతరంలో 28వ చతుర్యుగం. 71 చతుర్యుగాలు కలిగినది ఒక మన్వంతరం ఈ యుగం ముగిసి, దీనికి తరువాత, 43 చతుర్యుగాలు పూర్తి అయిన తరువాత వచ్చే 78 మన్వంతరంలో ఇంద్రలోకాధిపత్యాన్ని పొంది, తరువాత, అది పూర్తి అయ్యే సమయంలోనే బలికి మోక్షం కలుగుతుంది. ఇది చాలా దూరంలో ఉండే కాలం. అయితే, అతని కుమార్తె అయిన రత్నమాల శ్రీకృష్ణావతారం కాలంలోనే మోక్ష పొందింది. దీనికి గల కారణం ఏమై ఉంటుంది? ఐశ్వర్యం, కీర్తి, పరాక్రమం, తేజస్సు, ధార్మికత్వం, మనోధైర్యంవంటి ఎన్నో గొప్పతనాలు పొందినా, మహాబలి భగవత్ప్రాప్తి గొప్ప పురుషార్థం అని తెలియకుండా, ఐశ్వర్యానుభవాన్ని, అంటే, త్రైలోక్యరాజ్యాధిపత్యాన్ని మిక్కిలిగా కోరినందువల్ల, అతని పరమపద ప్రాప్తికి ఆలస్యం అయినది.

రత్నమాల ఒక స్త్రీ, అందులోనూ, వంధ్య. ఆమె విషయంలో భగవత్ప్రాప్తికి తప్పక కావలసినవి యోగ్యతలు ఏమీ లేవు. శాస్త్రం స్త్రీశూద్రులను పాపయోనులని తెలుపుతున్నది. అయినా, ఒక సంసారిజీవాత్మ దగ్గర ఏమి ఉండాలో అది ఆమె దగ్గర ఉన్నది. ఆమె, తెలిసో, తెలియకో, ఒక్క క్షణ కాలం భగవానుని కోరింది, ఆమె, భగవానుని అతడు భగవంతుడు అనే విషయాన్ని తెలియకుండానే కోరింది. ఆమె క్షణకాలం మాత్రమే భగవంతుని పుత్రదృష్టితో చూచింది. అయితే, అదే ఆమెను అనుగ్రహించడానికి పురుషోత్తముడైన భగవంతునకు సరిపోయింది. భగవంతుడు దీనిని చాలా గొప్ప విషయంగా భావించి, ఆమెను అనుగ్రహించాడు. రత్నమాలయొక్క చరిత్ర భగవానుని స్వాతంత్ర ప్రయుక్తమైన అనుగ్రహానికి ఒక ఉదాహరణగా వెలుగుతున్నది. ఇక్కడ మనం తెలియవలసిన తత్వం ఏమి? మనం ఎల్లప్పుడు భగవంతుని కోరాలి. మనం భగవంతుని పొందడానికి ఆశ పడాలి. మనకు ఎన్నో సంస్కారాలు ఉన్నా, మనకు ఎంతో సంపద ఉన్నా, భగవంతుని ప్రాప్తికి ఆశపడే ఎత్తుకు మనం ఎదగలేదు అంటే, ఏమీ ప్రయోజనం లేదు.

ఎవని దగ్గర ఔదార్యం అనే గొప్ప గుణం గొప్పగా వెలుగుతున్నదో, ఎవడు పరమ ధార్మికుడై ఉన్నాడో, ఎవని దగ్గర ఆత్మగుణపూర్తి ఉన్నదో, ఎవని దగ్గర స్వాభిమానం అనేది లేదో, అతని దగ్గర భగవంతుని అంశ వచ్చి చేరుతుంది. మన పూర్వాచార్యులు ఇటువంటి గుణవిశేషాలను కలిగినవారై ఉన్నారు. వారు ఆత్మగుణసంపన్నులై ప్రకాశించారు. వారు స్వార్థం, వక్రస్వభావం, లోకంలోని భోగాలలో, ఆశ, స్వాభిమానం, ఇతరుల అభివృద్ధిని చూచి సహించలేకపోవడంవంటి దోషాలను అన్నిటినీ దాటినవారే. ఎల్లప్పుడూ భగవంతుడు అనే విషయంలోనే మనస్సు, వాక్కు, శరీరం– అనే మూడు కరణాలను స్థిరంగా నిలిపినవారై, భగవంతుని పొందడంలోనే దృఢమైన దృష్టిని కలవారై, ప్రాప్యం కోసం తగిన ఉపాయం భగవంతుడే–అనే బలమైన నిశ్చయాన్ని కలవారై, మిగిలిన లౌకిక విషయాలలో ఆసక్తి లేనివారై ప్రకాశించారు. ఇటువంటి గుణవిశేషాలను కలిగినవాడే నిజమైన శ్రీవైష్ణవులు కాగలరు. మిగిలినవారు శ్రీవైష్ణవవేషాన్ని ధరించినవారు మాత్రమే.

మహాబలి ఒక వైష్ణవునకు, భగవద్భక్తునకు, ఉండవలసిన ఈ గుణాలలో, ఔదార్యం, ధార్మికత్వం, భగవంతుని విషయంలో, భగవంతుని భక్తుల విషయంలో అనుకూలమైన భావంవంటి కొన్ని మంచి గుణాలను కలిగి ఉన్నా, పరమభాగవతోత్తములైన ప్రహ్లాదుడు, విరోచనుడు పుట్టిన వంశంలో జన్మించినవాడైనా, భగవంతుని ప్రాప్తి మాత్రమే పరమ పురుషార్థం అనే తత్వాన్ని తెలిసినవాడు కాలేకపోయాడు. అతని విషయంలో స్వాభిమానం, సుఖభోగాలలో రుచి, దేవతల విషయంలో విరోధభావంవంటి కొన్ని కొరతలు ఉన్నాయి. ఇంతకు ముందే నేను చెప్పినట్లు, భగవంతుడు చేసిన కట్టడి అయిన ఇంద్రపదవిని ఇతడు మార్చాడు. ఈ విధంగా కొన్ని దోషాలు ఇతని దగ్గర ఉన్నందున ఇతడు భగవంతుని ప్రాప్తిని పొందడంలో ఆలస్యం అయినది.

తన విషయంలో పవిత్రమైన మనసును కలిగిన మహాబలికి భగవంతుడు ఎందువల్ల పలు దుఃఖాలను కలిగించాడు? ఎన్నో విధాలుగా పరీక్ష చేశాడు. ప్రహ్లాదుడు, గోపికలు, నమ్మాళ్వారులువంటి అధికారులు కూడా ఎన్నో కష్టాలను అనుభవించారు. భగవద్భక్తులైన వీరు అందరూ గొప్ప అధికారులే. చాలా గొప్ప చరిత్రను కలిగినవారే. భగవంతుని చూస్తే, అతడు సర్వజ్ఞుడు. అందరి హృదయాలలో నివసించేవాడు. అతనికి, పవిత్రమైన హృదయం కలిగిన, గొప్ప భక్తి కలవారైనా వీరి స్థితి తెలియకుండా ఉండదు కదా. అయినా, ఎందుకు వీరికి ఇన్ని కష్టాలను ఇచ్చి పరీక్ష చేశాడు?

భగవంతుడు వీరిని ఈ విధంగా పరీక్ష చేయడం మనకోసమే. వీరి వైభవం మనకు చక్కగా తెలియాలి –అనే ఉద్దేశ్యంతో వీరిని ఈ విధంగా భగవంతుడు శోధించాడు. వీరిని అనేకవిధాలైన పరీక్షలకు గురిచేసి, వీరి స్థితిని మన వంటివారికి వ్యక్తం చేసి చూపి, మనకు భగవంతుడు తెలియజేశాడు. మనం ఏ సమయంలోనూ వీరి స్థితిని పొందడానికి సాధ్యం కాదు. మనకు భావించడానికి కూడా సాధ్యం కాని పరిమితిలో వైభవాన్ని కలిగిన, గొప్ప అధికారులైన వీరిని మనం ఎల్లప్పుడు భావశుద్ధితో మనసులో భావించి, పొగడుతూ ఉన్నాము అంటే, మనం వీరి స్థితికి ఎదగ లేకపోయినా, వీరిని మనస్సులో భావించిన

మనలను కూడా "నఱ్ఱన్టుక్కు శురక్కుమ్బశు తోల్ కన్టుక్కుమ్ ఇరంగుమాపోలే" (నిజమైన లేగదూడను చూచి పాలను ఇచ్చే గోవు చాట పెయ్యను కూచి కూడా పాలు ఇచ్చినట్లు) అని పెరియ వాచ్చాన్ పిళ్ళై పలికిన విధంగా, వీరి సంబంధాన్ని చూచి, మనలను కూడా, వీరి స్థానంలో మనలను భావించి భగవంతుడు మనకు కూడా ఉజ్జీవనాన్ని అనుగ్రహిస్తాడు. ఇది భగవానుని కారుణికత్వంలో ఒక విశేషం.

మహాబలి చరిత్రను పరీక్షించి చూచినప్పుడు "అగ్రగంతా పురుషః" అనేదానికి అతడు ఒక ఉదాహరణగా వెలుగుతున్నాడు– అని తెలుస్తున్నది. త్రైలోక్య రాజ్యాధిపత్యాన్ని ఆశపడిన బలికి, తరువాత భగవంతుని శ్రీచరణాల విషయంలో ఏ విధంగా రుచి కలిగింది? దీనికి లక్ష్మీదేవి కటాక్షం కారణమే– అని మన పూర్వాచార్యులు తెలుపుతున్నారు. లక్ష్మీదేవి కటాక్షం ఒక్కటి మాత్రమే ఒకనిని భగవద్విషయంలో స్థిరమైన చిత్తం కలిగినవానినిగా చేస్తుంది. లక్ష్మీ కటాక్షం ఉంటే, ఒకడు అగ్రగంత, అంటే, పురుషుడు కాగలడు. ఇది ఆమెకు గల వైభవం. లక్ష్మీదేవి సంబంధం, అంటే, అనుగ్రహం, ఎంత ఆవశ్యకం–అనేదానిని దీనివల్ల మనం చక్కగా తెలుసుకోవడానికి సాధ్యం అవుతుంది. ఈ తత్వాన్ని శ్రీరామావతారకాలంలో లక్ష్మణుడు, భరతుడు– అనే వీరి విషయంలో గమనించాము కదా.

అయితే, వామనమూర్తి బ్రహ్మచారి కదా! ఆ స్వామితో లక్ష్మీదేవి కలసి ఉండడానికి ప్రసక్తి లేదు కదా! లక్ష్మీదేవి సన్నిధి లేనప్పుడు మహాబలి ఏ విధంగా అగ్రగంత అయిన పురుషుడు అయినాడు? అనే ప్రశ్న ఇక్కడ కలుగుతుంది. ఇక్కడే వేదాంతాచార్యులు ఆశ్చర్యకరంగా ఒక విషయాన్ని అనుగ్రహించారు. లక్ష్మీదేవి ఏ దశలోనూ భగవంతుని విడచి ఉండదు. లక్ష్మీ దేవి "అకలకిల్లేన్ ఇఱైయుమ్"అని భగవంతుని ఏనాడు విడచి ఉండని తత్వం కదా. దీనికి శ్రీవామన అవతారం కూడా ఒక ఉదాహరణమే. భగవంతుడు వామనుడై అవతరించిన కాలంలో కూడా లక్ష్మీదేవి ఆ స్వామి విడిచి ఉండలేదు. వామనుడు మహాబలి దగ్గరకు వెళ్ళినప్పుడు కూడా ఆమె "అకలకల్లేన్ ఇఱైయుమ్ ఎన్ను

అలర్ మేల్ మంగై ఉఱై మార్బన్"(ఏనాడు విడిచి ఉండని లక్ష్మీదేవిని వక్షస్థలంలో కలిగినవాడుగానే) వెళ్ళాడు అని శ్రీ వేదాంతాచార్యులు అనుగ్రహించారు. సువాసన అనేది ఏనాడూ పూను విడిచి ఉండకుండా దానితోనే ఉండి, దానికి ఒక విశేషణంగా ఉండేటట్లు, లక్ష్మీదేవి కూడా భగవంతునితో ఎల్లప్పుడూ కలసి ఉండి, అతని ఆత్మ శక్తిగా ఉన్నది. భగవంతుడు ఆయా అవతారాలకు చేరిన గుణవిశేషాలతో ప్రకాశిస్తున్నాడు. అతని ప్రతి అవతారంలోనూ లక్ష్మీదేవి ఆ స్వామితో కలసియే ఉంటున్నది. శ్రీ వామనమూర్తి లక్ష్మీదేవి వేంచేసి ఉండే తన వక్షఃస్థలాన్ని, ఆమె ఆ విధంగా వేంచేసి ఉండడం ఎవరికీ తెలియకుండా ఉండేటట్లు, జింకతోలుతో కప్పుకొని మహాబలి దగ్గరకు వెళ్ళాడు– అని వేదాంత చార్యులు అనుగ్రహించారు. ఈ విధంగా ఆ సమయంలో కూడా లక్ష్మీదేవి ఉన్నది–అని తెలుస్తున్నది.

పరమభాగవతోత్తమడైన ప్రహ్లాదుడు, విష్ణుభక్తుడైన, అతని కుమారుడైన విరోచనుడు –అనే వీరి సంతతిలో జన్మించినవాడైనందున, ఎన్నో మంచి గుణాలు కలిగినవాడు అయినందున, పరమధార్మికుడు అయినందున, భగవానునకు శ్రీచరణ పూజలు చేసినవాడు అయినందున, వామనమూర్తి వక్షస్థలంలో అధివసించి ఉండే లక్ష్మీయొక్క కటాక్షం మహాబలికి లభించింది– అని భావించడంలో ఔచిత్యం ఉన్నది. లక్ష్మీదేవి కటాక్షంవల్ల అతడు అగ్రగంత అయిన పురుషుడు అయినాడు –అని అనడానికి ఒక అవకాశం ఉన్నది. ఈ విధంగా లక్ష్మీదేవి కటాక్షానికి కల వైభవాన్ని అగ్రగంతలైన పురుషుల చరిత్రవల్ల తెలిసికొనగలుగుతున్నాము. లక్ష్మీదేవియొక్క కటాక్షం ఉన్నప్పుడే సంసారి జీవులం అయిన మనం కూడా భగవంతుని ఆశ్రయించి, తరించవచ్చు.

1) ఇటువంటి వైభవాన్ని కలిగిన లక్ష్మీదేవికి వల్లభుడై భగవంతుడు ఉన్నాడు,
2) అతడు మాధవుడై ఉండే స్థితి లక్ష్మీ దేవితో అతడు కలసి ఉండే స్థితి,
3) మాధవుడైన స్థితి భగవంతుడు పురుషోత్తమత్వాన్ని పరిపూర్ణంగా కలిగిన స్థితి,

4) మాధవుడైన స్థితి భగవంతుడు మనలను అనుగ్రహించాలి అనే భావంతో లక్ష్మీ దేవితో కలసి ఉండే స్థితి,

5) భగవంతుడు మాధవుడై వేంచేసి ఉండే స్థితి, మనం అన్ని విధాలుగా దివ్యదంపతులను ఆశ్రయించి, తరించే స్థితి. ఈ విధంగా భగవంతుడు మాధవుడై, లక్ష్మీదేవికి వల్లభుడై ఉండే స్థితి –అనే వీటికి కల వైభవాలను మార్కండేయ మహర్షి కీర్తిస్తున్నాడు.

మాధవుని భగవంతుని శరణ్యత్వం సకలశాస్త్రసారం. భగవంతుని శరణ్యత్వాన్ని అన్ని శాస్త్రాలు తెలుపుతున్నాయి. భగవంతుని చాలా గొప్పవైన వైభవాలలో శరణ్యత్వం ఒకటి. దీనినిగూర్చి తెలిసినవాడే మోక్షసామ్రాజ్యాన్ని పొందడానికి తగిన యోగ్యతను కలవాడు అవుతాడు. మనం భగవంతుని ఆశ్రయించే కాలంలో °అతడు శరణ్యుడు°– అనే భావంతో ఆశ్రయించాలి. మనం చేసే శరణాగతికి విషయమైనవాడు అర్చావతారమూర్తి అనేది సంప్రదాయం. శాస్త్రసంప్రదాయగ్రంథాలలో భగవంతుని శరణ్యత్వం చాలా విశదంగా రూపింపబడినప్పటికి పెద్దలు దీనిని మూడు విధాలుగా అనుభవంలోకి తెచ్చుకొన్నారు. భగవంతుని శరణ్యత్వాన్ని గురించి మనం మొట్టమొదట శ్రీరామాయణాన్ని పురస్కరించుకొని తెలియాలి. మాధవుని శరణ్యత్వ ప్రకాశకంగానే శ్రీవాల్మీకి రామాయణం ప్రకాశిస్తున్నది. శ్రీరామాయణం శరణాగతి ధర్మాన్ని వివరిస్తున్నది. వేదపురుషుని అవతార విశేషమైన శ్రీరామాయణానికి శరణాగతిశాస్త్రం అనే ప్రసిద్ధి ఉన్నది. వేద పురుషుడు చాలా గొప్పది అయిన ధర్మంగా తెలిపిన శరణాగతినిగూర్చి పలు తత్వాలను వివరించడంలోనే శ్రీరామాయణానికి ప్రధానమైన దృష్టి ఉన్నది. భగవంతుడు ఒక్కడే శరణ్యుడు– అనే విషయాన్ని, అతనిని శరణంగా ఆశ్రయించడమే గొప్ప ధర్మం– అనే విషయాన్ని వివరించడంకోసమే శ్రీరామాయణం అవతరించింది, కనుక, మనకు శ్రీరామాయణం తప్పక తెలియదగినది.

శ్రీ రామాయణంలో "సర్వలోకశరణ్యాయ రాఘవాయ మహాత్మనే" అని విభీషణుడు పల్కిన వాక్యం ఉన్నది. దీనికి వివరణంగానే నమ్మాళ్వారులు తిరువాయ్ మొళిలోని మొదటి ఆరు శతకాలతో భగవంతుని శరణ్యత్వాన్ని చాలా వివరంగా నిరూపించారు. భగవంతుని పరత్వం, కారణత్వం, నియంతృత్వం, వ్యాపకత్వం– అనే నాలుగు గుణాలు క్రమంగా తిరువాయ్ మొళిలోని మొదటి నాలుగు శతకాలలో నిరూపింపబడ్డాయి. భగవంతుని సౌలభ్యం (కారుణికత్వం) ఐదవ శతకంలో నిరూపింపబడినది. ఈ ఐదింటివల్ల సిద్ధమైన అతని శరణ్యత్వం ఆరవ శతకంలో నిరూపింపబడినది. ఈ విధంగా, రెండవ దశలో భగవంతుని శరణ్యత్వాన్ని గూర్చి ఆళ్వారుల దివ్యప్రబంధసూక్తుల సహాయంతో మనం తెలియవచ్చు.

మూడవ దశలో మన పూర్వాచార్యులు, శ్రీ రామాయణం, తిరువాయ్ మొళితో పాటు సకల శాస్త్రాలను విస్తృతంగా పరిశీలించి, శాస్త్ర క్రమంలో భగవంతుని శరణ్యత్వాన్ని అనేక విధాలుగా నిరూపించారు. మనం దివ్యప్రబంధ వ్యాఖ్యానాలను, రహస్య గ్రంథాలను ఆచార్య ముఖంగా అధికరించి, భగవంతుని శరణ్యత్వాన్ని గూర్చిన స్పష్టమైన దృఢమైన జ్ఞానాన్ని పొంది ఆనందించవచ్చు.

ఈ సందర్భంలో ఒక ప్రశ్న కలుగుతుంది. ఎందువల్ల మనం ఇంతగా గ్రంథాలను పురస్కరించుకొని భగవంతుని శరణ్యత్వాన్ని చాలా వివరంగా తెలుసుకోవాలి? భగవంతుని అతడు శరణ్యుడు –అని తెలిస్తే మాత్రం చాలదా? ఏదో అతని శరణ్యత్వాన్ని గూర్చి పైపైన కొన్ని అర్థాలను మాత్రం తెలిస్తే చాలదా? ఆశ్రయించి కాలంలోనే "భగవంతుని శరణ్యుడు" అని భావించి ఆశ్రయించాము కదా. అది చాలదా? అని అడిగితే, “చాలదు" అనే సమాధానం చెప్పవలసి ఉన్నది.

భగవంతుని శరణ్యత్వాన్ని గూర్చి మనం ఎందువల్ల ఇంత విస్తృతంగా తెలుసుకోవాలి? అని అంటే, శ్రీవైష్ణవులమైన మనం తప్పక ఆశ్రయించవలసిన గొప్ప ధర్మమే శరణాగతి. మన సంప్రదాయంలో "వేదమార్గప్రతిష్ఠాపనాచార్య

"అని పెద్దలను విశేషించి నిర్దేశించడం సంప్రదాయం. వేదమార్గమార్గం ఏది అని అంటే, శరణాగతియే వేదమార్గం. వేదపురుషుడు పలు ధర్మాలను ఒకదాని తరవాత ఇంకొక దానిని పలుకుతూ వచ్చే క్రమంలో, చివరిగా, శరణాగతి మనం తప్పక ఆశ్రయించవలసి గొప్ప ధర్మాలలో గొప్ప ధర్మమని తెలియజేశాడు. ఒక సంసారి జీవాత్మ తన ఆత్మ క్షేమంకోసం ఆశ్రయించవలసిన ధర్మాలలో చాలా ముఖ్యమైనది శరణాగతి ధర్మం –అనే విషయాన్ని వేదమే స్వయంగా ఈ క్రింది విధంగా తెలియజేసింది.

"న్యాస ఇత్యాహుః మనీషిణో బ్రహ్మాణమ్, తస్మాన్న్యాసమేషాం తపసా మతిరిక్త మాహుః" (తైత్తిరీయ నారాయణమ్– 50) (న్యాసం (అంటే శరణాగతి) బ్రహ్మం అని జ్ఞానులు పలుకుతున్నారు. అందుచేత న్యాసాన్ని తపస్సులలో గొప్ప ధర్మంగా చెబుతున్నారు) అని,

"సత్యం తపో దమో దానం ధర్మః ప్రజానా మగ్నయోఽగ్నిహోత్రం యజ్ఞో మానసం న్యాసః" (తైత్తిరీయ నారాయణం– 51) (జీవరాసులకు మంచిని కలిగించే సత్యం, శరీరాన్ని కృశింపచేసి ఆచరించే తపస్సు, వైరాగ్యం, శాంతి, సత్పురుషులకు దానం ఇవ్వడం, పుణ్యం చేయడం, మంచి సంతానాన్ని పొందడం, యజ్ఞం, హోమం చేసే అగ్నులు, అగ్నిహోత్రం, ఆత్మజ్ఞానం, శరణాగతి అనే ఈ పన్నెండు ఒకదానికి మించి ఇంకొకటి గొప్పవి) అని వేదమే స్పష్టంగా తెలిపింది.

"యో బ్రహ్మాణం విదధాతి పూర్వం యో వై వేదాంశ్చ ప్రహిణోతి తస్మై,

తం హ దేవ మాత్మబుద్ధిప్రసాదం ముముక్షుర్వై శరణ మహం ప్రపద్యే" (శ్వేతాశ్వతరోపనిషత్ –6 –18)

(ఎవడు బ్రహ్మను ముందు సృష్టించాడో, ఎవడు వేదాలను అతనికి ఉపదేశించాడో, అటువంటి దేవుడు, తన విషయంలోని జ్ఞానాన్ని ప్రకాశింప

చేసేవాడు అయిన పరమపురుషుని మోక్షాన్ని పొందాలని కోరి నేను శరణు పొందుతున్నాను) అని వేద పురుషుడు ఆచరించినదికూడా శరణాగతియే. అయితే, భగవంతుని దగ్గర ఒకడు శరణాగతుడు కావడం అంత సులభం కాదు. ఎందుకంటే, శరణాగతి అనేది ఒక బుద్ధివిశేషం. శరణాగతి అనేది ఒక నిష్ఠ. భగవంతుడు శరణ్యుడు అనే భావంతో ఆశ్రయించడానికి, ఆశ్రయించిన తరువాత ఫలం తప్పక లభిస్తుంది– అని దృఢంగా నమ్మి ఉండడానికి అనుగుణమైన బుద్ధివిశేషం సంసారులం అయిన మనకు అంత సులభంగా ఏర్పడదు. అనాది కాలంగా కర్మకు వశులమై, లౌకిక విషయాలలో నిమగ్నమై సంచరించే మనకు భగవంతుని విషయంలో దృఢమైన నమ్మిక ఏర్పడడం అంత సులభం కాదు. శరణాగతి నిష్ఠ అనే బుద్ధివిశేషం మన వద్ద కలిగి, అది స్థిరంగా ఉండడానికి శరణ్యుడైన భగవానుని గూర్చిన, (చెప్పాలంటే, సంగ్రహంగా, ఆ స్వామియొక్క శరణ్యత్వాన్ని గూర్చిన) లోతయిన, విస్తృతమైన, విశదమైన జ్ఞానం కలగడం చాలా ఆవశ్యకం.

అందువల్లనే సకలశాస్త్రాలు మనకోసం అవతరించాయి. మనం శరణాగతి నిష్ఠ అనే ఆత్మహితాన్ని పొంది తరించడంకోసం మహర్షులు, ఆళ్వారులు, పూర్వాచార్యులు ఎన్నో మహా గ్రంథాలను అనుగ్రహించారు. వీటిలో చూపబడిన, భగవంతుని గూర్చిన తత్వాలను తెలుసుకోవడం కోసం మనకు ఒక జీవితకాలం సరిపోదు. అయినప్పటికీ, భగవంతుడు "మనకోసం" అని అనుగ్రహంతో ఇచ్చిన కాలాన్ని వ్యర్థంగా పోనివ్వకుండా, యథాశక్తి యథా రుచి, యథాసౌకర్యం ఈ గ్రంథాలలో కొన్నిటిని అయినా అధికరించి, భగవంతుని విషయంలో మనం నిష్ఠను పొందాలి. సమాశ్రయణకాలంలో మనం భగవంతుని సన్నిధిలో చేసే శరణాగతి అనేది శరణాగతి నిష్ఠలో మొదటి మెట్టు. ఈ అవస్థ ఇంకా, ఇంకా అభివృద్ధి చెందాలి. దీని లోపల ఉండే పలు సంస్కారాలు మనకు సిద్ధించాలి.

మనకు భగవంతుడు కాకుండా మిగిలిన విషయాలలో ఉండే సంబంధం లేకుండా పోవాలి. సంగ్రహంగా, పత్ని, పుత్రాదుల విషయంలో ఉండే అభినివేశం క్రమంగా తగ్గాలి. లోకంలోని సుఖాలలోను, భోగాలలోను ఉండే రుచి నశించాలి. సులభమైన, సాధారణమైన జీవనాన్ని సాగించాలి. శాస్త్రవిశ్వాసం ఏర్పడి, శాస్త్రానుష్ఠానంలో శ్రద్ధ కలగాలి. స్వార్థం, స్వాభిమానం, వక్రమైన మనోభావం–

అనే దోషాలు లేకుండా పోవాలి. ఆత్మగుణాలను అభివృద్ధి చేసుకోవాలి. శరణాగతి నిష్ఠ కలగడానికి ఇవి అన్ని తప్పక ఉండాలి. క్రమ క్రమంగానే మనం ఈ సంస్కారాలను పొందగలుగుతాము. వీటికి అన్నిటికి మూలంగా ఉండేది శరణ్యునిగూర్చిన జ్ఞానం. కనుక, మహర్షులు, ఆళ్వారులు, పూర్వాచార్యులు దీనిని విస్తృతంగా నిరూపణం చేశారు. ఇక, శ్రీరామాయణాన్ని దృష్టిలో పెట్టుకొని భగవంతుని శరణ్యత్వానికి సంబంధించిన కొన్ని అర్థ విశేషాలను తెలిసికొందాం.

మాధవుని శరణ్యత్వం –శ్రీరామాయణ నిర్ణయం

"సర్వేషా మేవ లోకానాం పితా మాతా చ మాధవః,

గచ్ఛధ్వ మేనం శరణం శరణ్యం పురుషర్షభాః"

(అన్ని లోకాలకు తండ్రి, తల్లి మాధవుడు. శరణ్యుడైన ఇతనిని పురుషులలో గొప్పవారైన శరణు పొందండి.) అనే శ్లోకంలోని విశేషాలను విస్తృతంగా మనం గమనిస్తూ ఉన్నాము. మనకు ఎల్లప్పుడు అనుసంధానంలో ఉండవలసిన భగవానుని వైభవాలలో ఆ స్వామియొక్క మాతృత్వం, పితృత్వం, మాధవత్వం, శరణ్యత్వం– అనే ఇవి నాలుగు చాలా ముఖ్యమైనవి. భగవంతునకు కల ఈ నాలుగు వైభవాలను మన అనుసంధాన సౌకర్యాన్ని ఉద్దేశించి ఈ శ్లోకంలో ఒక చోట చేర్చి, మార్కండేయ మహర్షి అనుగ్రహించారు. భగవంతుని తండ్రిగా, తల్లిగా, మాధవునిగా, శరణ్యునిగా అనుభవించడం సత్యభామా వల్లభుడైన శ్రీకృష్ణుని. ఈ దివ్యదంపతుల సమక్షంలోనే ఈ శ్లోకం అవతరించింది– అనే విషయం కూడా ఇంతకుముందు చూశాము. భగవంతుని గురించిన తత్వాలను అతని చరిత్రలను పురస్కరించుకొని తెలిసికోవడం– అనే క్రమానికి తగినట్లు అతని మాతృత్వాన్ని శ్రీవామన త్రివిక్రమావతార వైభవాలతో కొంచం గమనించాము. ఇప్పుడు, మాధవుని శరణ్యత్వాన్ని శ్రీరామావతారాన్ని ఆధారంగా చేసుకొని తెలిసిపోవడంఅనేది ఇప్పుడు మనకు ప్రాప్తమైనది.

ఇక్కడ ఒక ప్రశ్న కలుగుతుంది. ఈ శ్లోకం శ్రీకృష్ణుని విషయంగాకదా అవతరించింది. శ్రీ మార్కండేయ మహర్షి శ్రీకృష్ణుని వైభవాన్ని ఈ శ్లోకంలో

తెలియజేశారు. ఇందువల్ల మనకు కూడా అతని చరిత్రను ఆధారంగా చేసికోని ఈ శ్లోకంలోని అర్థాలను అనుభవించవలసి ఉండగా, ఆ విధంగా కాకుండా, మిగిలిన అవతారాల రూపాల వైభవాలను పురస్కరించుకొని ఈ శ్లోకంలోని అర్థ విశేషాలను నిరూపించడం ఏవిధంగా తగినది? అనేది ఆ ప్రశ్న. ఇక్కడ ఒక విషయాన్ని మనం చాలా ముఖ్యంగా తెలిసికోవలసి ఉన్నది. వేదవ్యాస భగవానుడు శ్రీమద్భాగవత మహాపురాణంలో శ్రీకృష్ణుని మత్స్యావతారం మొదలైన అన్ని అవతారాలను ఎత్తినవానినిగా తెలియజేస్తారు. దీనినిబట్టి చూస్తే శ్రీ కృష్ణావతారం మూర్తియే శ్రీరామావతారంగాకూడా అవతరించాడు– అని తెలుస్తున్నది.

"కూడారై వెల్లుమ్ శీర్ గోవిన్దా" అని శ్రీకృష్ణుని చూచి గోదాదేవి పలుకుతున్నది. దీనికి శ్రీకృష్ణావతారపరంగానే వ్యాఖ్యానం అనుగ్రహించవలసి ఉండగా, ఆ విధంగా కాకుండా వ్యాఖ్యాత అయిన పెరియ వాచ్చాన్ పిళ్లై మొత్తంగా శ్రీరామావతారపరంగానే వ్యాఖ్యానించారు. శ్రీరామావతారభగవానుడే కృష్ణావతారంతో పాటు అన్ని అవతారాలను ఎత్తాడు–అని తిరుమంగై ఆళ్వార్ అభిప్రాయానికి తగినట్లు వ్యాఖ్యానాన్ని ఈ విధంగా పెరియ వాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించారు. భగవంతుని అవతార మూర్తులలో ధర్మ భేదం లేదు కనుక, ఒక అవతార మూర్తియొక్క వైభవాన్ని ఇంకొక అవతారమూర్తి వైభవంతో సమర్థించి వివరించడంలో ఏ కొరతా లేదు. ఇక, శ్రీరామాయణాన్ని ఆధారంగా చేసుకొని భగవంతుని శరణ్యత్వాన్ని గురించి విజ్ఞాపన చేస్తాను.

శ్రీరామాయణం శరణాగతి శాస్త్రం

భగవానుని అసాధారణ ధర్మాలు ఎన్నో ఉన్నప్పటికీ, వాటిలో చాలా ముఖ్యమైనది శరణ్యత్వం. ఇది చాలా చక్కగా ప్రకాశించిన అవతారం శ్రీరామావతారం.

"అభయం సర్వభూతేభ్యో దదామి ఏతత్ వ్రతం మమ" (యుద్ధ కాండం– 18 –33) (ప్రాణులందరికి అభయం ఇస్తాను, ఇది నావ్రతం) అనే విధంగా భగవంతుడు శరణాగత రక్షణను ఒక వ్రతంగా పరిగ్రహించిన అవతారం

శ్రీరామావతారం. భగవంతుడు ఎందువల్ల రఘుకులంలో అవతరించాడు?—అనేదానికి ఎన్నో కారణాలు చెప్పబడుతున్నాయి. శరణ్యత్వాన్ని ఆ అవతారానికి ముఖ్య ప్రయోజనంగా భగవంతుడు చేసుకోబోతున్నాడు, గనుక, దానికి తగినట్లు "ఆనృశంస్యం పరో ధర్మః" (సుందరకాండం —38 —41) (ఆనృశంస్యం అంటే —తనను ఆశ్రయించినవారి విషయంలో చూపే కరుణ) అనే విధంగా కారుణికత్వం కులధర్మంగా కలిగి ఉండేది రఘుకులం కనుక, రఘు కులంలో అవతరించాడు—అని ఒక కారణం చెప్పబడుతున్నది. శరణు అని వచ్చినవారికి అభయం ఇచ్చే కులం రఘుకులం. రఘుకుల నాయకుడు శ్రీ రాముడు. శ్రీకృష్ణావతారంలో ఎంతో అభినివేశాన్ని కలిగిన నమ్మాళ్వారులుకూడా శ్రీరాముడే శరణ్యుడు అనే విషయాన్ని—

"తయదఱ్కు మకన్ తన్నైయల్ట మట్రిలేన్ తంజమాకవే" (తిరువాయ్ మొళి —3—6—8) (దశరథుని కుమారుని తప్ప ఇక వేరు ఎవ్వరిని శరణ్యునిగా కలిగినవాడను కాను) అని అన్నారు. భగవంతుడు తనను సర్వలోకశరణ్యునిగా చక్కగా నిరూపించుకున్న అవతారం, శ్రీరామావతారం. భగవంతుడు శరణ్యుడైన తన అభిప్రాయం ఉండే రీతిని చక్కగా వ్యక్తం చేసిన అవతారం, శ్రీరామావతారం. ఇది శ్రీరామావతారానికి ఉండే ఒక వైలక్షణ్యం.

ఒక సంసారి జీవాత్మ ఆశ్రయించదగిన, ఆచరించదగిన శ్రీ వైష్ణవ ధర్మాలలో చాలా ఉన్నతమైనది శరణాగతినిష్ఠ. అంటే, భగవంతుని సిద్ధోపాయంగా, శరణ్యునిగా, ఆశ్రయించే ధర్మం. సంసారి జీవాత్మకు ఇది పరమ ధర్మం. శరణాగతి అంటే ఏమిటి?

"ఆహమస్మ్యపరాధానా మాలయోఽకించనోఽగతిః

త్వమేవోపాయభూతో మే భవేతి ప్రార్థనామతిః

శరణాగతిః సా దేవేఽస్మిన్ ప్రయుజ్యతామ్" (అహిర్బుధ్న్యసంహిత— 36 —38)

"నేను సకలదోషాలకు ఆకరమై ఉన్నాను. నిన్ను తప్ప వేరు ఏ ఉపాయాన్ని లేనివాడను, నిన్ను తప్ప వేరే ఉపేయాన్ని లేనివాడను, నీవే నాకు ఉపాయం కావాలి" అని ప్రార్థించే జ్ఞానమే శరణాగతి అనబడుతున్నది. అది ఈ దేవుని విషయంలో ప్రయోగింపబడాలి) అనే శాస్త్రవచనం "శరణాగతి అంటే ఏమి?"అనే విషయాన్ని తెలుపుతున్నది. భగవంతుని ముందు ఒకడు తన స్థితిని, అంటే, అకించనుడై, అనన్యగతికుడై ఉండే స్థితిని తెలిపి, లక్ష్మీదేవి సమక్షంలో అతనిని ఆశ్రయించడం శరణాగతి అనబడుతుంది.

శరణ్యత్వం అంటే ఏమి? ఎవడు శరణం అనబడుతున్నాడు? శరణవరణార్హత్వం శరణ్యత్వం అనబడుతుంది. శరణు పొందదగినవాడై ఉండే స్వభావమే శరణ్యత్వం. అందరూ తనని శరణంగా ఆశ్రయించే స్వభావాన్ని, గుణవిశేషాలను కలవాడు శరణ్యుడు. శరణ్యత్వాన్ని తనకు ధర్మంగా కలిగి ప్రకాశించేవాడు శరణ్యుడు అవుతాడు. అంటే, మనం శరణంగా ఆశ్రయించడానికి తగినవాడు శరణ్యుడు అనబడుతున్నాడు. తన వద్దకు వచ్చి, శరణు పొందినవారిని రక్షించడం అంటే– వారి అనిష్ట నివృత్తి, ఇష్ట ప్రాప్తి –అనే రెండిటికి కారణమై ఉండడం అతనికి కల పరమధర్మం.

భగవంతునకు శరణ్యత్వం అనేది స్వరూపం, అంటే, అసాధారణ ధర్మం. దీనిని రెండు విధాలుగా మన పూర్వాచార్యులు నిరూపించారు. భగవంతుడు సిద్ధోపాయంగా, అంటే, సిద్ధధర్మంగా ఉన్నందున, సర్వలోకశరణ్యుడుగా వెలుగుతున్నాడు. ఈ కారణంవల్ల భగవంతుని సర్వలోకశరణ్యునిగా తెలియడానికి ముందు అతనిని సిద్ధధర్మంగా తెలియడం చాలా ఆవశ్యకం. సిద్ధోపాయరూపమైన, అంటే, సిద్ధధర్మమైన భగవంతుని శరణంగా ఆశ్రయించడమే శరణాగతి అవుతుంది. ధర్మం అనే పదం ఒకడు పొందాలని కోరే ఫలానికి ఏది కారణమో, దానిని తెలుపుతుంది. వారు వారు కోరే ప్రయోజనాలు సిద్ధించడానికి ముఖ్య కారణంగా, మూలకారణంగా ఉన్నందువల్ల శాస్త్రం ధర్మం అనే పదంతో భగవంతుని నిర్దేశించింది.

"యే చ వేదవిదో విప్రా యే చాధ్యాత్మవిదో జనాః,

తే వదంతి మహాత్మానం కృష్ణం ధర్మం సనాతనమ్" (భారతం –ఆరణ్యపర్వం– 71 –123)

(వేదాన్ని తెలిసిన వైదికులు, వేదాంతాన్ని తెలిసిన విద్వాంసులు మహాపురుషుడైన శ్రీకృష్ణుని సనాతనమైన ధర్మంగా పలుకుతున్నారు) అని మహాభారతం పలికింది

" రామో విగ్రహవాన్ ధర్మః సాధుః సత్యపరాక్రమః,

రాజా సర్వస్య లోకస్య దేవానాం మఘువానివ" (శ్రీ రామాయణం– అరణ్య కాండం– 37 –13)

(రాముడు ధర్మమే మూర్తిభవించినవాడు, మంచి ప్రవర్తన కలవాడు, సత్యమైన పరాక్రమం కలవాడు. దేవతలకు ఇంద్రుడు ప్రభువు అయినట్లు, అన్ని లోకాలకు ఇతడే ప్రభువు) అని మారీచుని మాట.

శాస్త్రాలలో చెప్పబడిన ధర్మాలను– సాధ్యధర్మాలు అని, సిద్ధ ధర్మం– అని రెండు విధాలుగా విభాగించాలి. అన్ని సాధ్యధర్మాలకు, భగవంతుడనే సిద్ధ ధర్మానికి మధ్య చాలా తేడా ఉన్నది. సాధ్యధర్మం ఏది అయినా, అది ఇంకొకదాని సహాయాన్ని కోరకుండా ఉండదు. కానీ, భగవంతుడు అయితే, ఇంకొకదాని దేని సహాయాన్ని కోరడు– అని మాత్రమే కాదు, ఆ విధంగా ఇంకొకదాని సహాయాన్ని సహించడు కూడా. సాధ్యధర్మాల కంటే సిద్ధధర్మం అయిన భగవానుని వైలక్షణ్యాన్ని మనసులో పెట్టుకునే శ్రీమార్కండేయ మహర్షి అతనిని సర్వలోక శరణ్యునిగా అందరికీ తెలియజేశారు. సిద్ధధర్మం అయిన భగవంతునకు కల గొప్పతనాలు మనకి బాగా వ్యక్తం కావాలి.

ఒకని ప్రయత్నంవల్ల సాధింపబడవలసిన ధర్మం సాధ్యధర్మం అనబడుతుంది. ఈ విధంగా ఒకడు చేసిన ప్రయత్నంతో సాధింపబడకుండా, ఎప్పటికీ సర్వత్ర మనకోసం మన వెంటే ఉండి ఇష్టసిద్ధిని పొందేటట్లు అంటే, మనం కోరిన ప్రయోజనాలను పొందేటట్లు ప్రకాశించే ధర్మం సిద్ధధర్మం అనబడుతుంది. నిత్యసిద్ధమైన, అంటే మనం, ఎప్పుడు కావాలన్నా అప్పుడు ఆశ్రయించి ఫలం

పొందేటట్లు సిద్ధంగా ఉండే స్థితిలో ఉండే, ధర్మం భగవంతుడు. భగవంతుడు అనే ధర్మం ఏనాడూ, అంతట ప్రకాశిస్తూ ఉన్నందున, సాధ్యధర్మాలను సాధించవలసిన ఉన్నట్లు అతనిని సాధించవలసిన అవసరం లేదు. అతడు మనం ఆశ్రయించవలసి ధర్మమై అంతట ఉన్నాడు.

శాస్త్రాలలో మోక్ష సాధనంగా భగవద్భక్తి విధింపబడినది. ఈ భక్తిని సాధనభక్తి అనే పేరుతో నిర్దేశిస్తారు. వేదాంతసిద్ధమైన మోక్షోపాయం భగవద్భక్తియే అనే విషయాన్ని జగదాచార్యులు భగవద్రామానుజులు శ్రీ భాష్యం మొదలైన గ్రంథాలలో చాలా విశదంగా నిరూపించారు. భక్తి అంటే ఏమి? పరమ పురుషుని ప్రేమతో చింతించే చింతన భక్తి అనబడుతుంది. మనసు శుద్ధంగా లేనప్పుడు, అది పరమాత్మను చింతించే భాగ్యాన్ని పొంద లేదు. దేనిని చేస్తే మనసు శుద్ధిని పొందుతుందో, దానిని చేయడం చాలా ఆవశ్యకం. చిత్తశుద్ధి పొందడానికి కర్మయోగం ఆవశ్యకం అని శాస్త్రం చెబుతున్నది. అందుచేత, ఒకడు భగవంతుని విషయంలో భక్తి కలిగి ఉండాలంటే, అతడు కర్మయోగం ద్వారా చిత్తశుద్ధిని పొంది, ఆ విధంగా పొందిన పరిశుద్ధమైన మనసుతో పరమపురుషుని చింతించాలి. ఈ విధంగా భక్తి అనేది జీవుని ప్రయత్నం వల్ల ఏర్పడుతున్నది. శాస్త్రాలలో చెప్పబడిన భగవద్భక్తి ఎటువంటిది? అనే విషయాన్ని తెలిసికొని దాని ప్రకారం ప్రయత్నం చేసినట్లయితే భక్తి కలుగుతుంది. ఈ విధంగా ప్రయత్నం చేయకపోతే భక్తి కలుగదు. నేను ఇంతకుముందే చెప్పినట్లు భగవంతుడు అనే ధర్మం ఎల్లప్పుడూ, అంతట ఉండేది ధర్మం. దీనిని ఎవరూ, ఏ ప్రయత్నం ద్వారా, ఏ సమయంలోనూ, ఏ విధంగానూ సాధించవలసిన ఆవశ్యకత లేనే లేదు.

ఈ విధంగానే, ఫలాన్ని ఇచ్చే దశలో కూడా, సాధ్య ధర్మాలు, సిద్ధ ధర్మం– అనే భగవంతుడు వేరు వేరు స్వభావాలను కలిగి ఉంటారు. సాధ్యధర్మాలకు స్వయంగా ఫలాన్ని ఇచ్చేశక్తి లేదు. ఇవి ఫలాన్ని ఇచ్చే కాలంలో భగవంతుని అనుగ్రహాన్ని ఎదురు చూస్తాయి. ఫలాన్ని ఇచ్చేవాడు భగవంతుడు ఒక్కడే. సాధ్యధర్మాలకు ఫలకారణత్వం, అంటే, పరంపరగా కారణమై ఉండే స్వభావం మాత్రం ఉన్నది. గొప్ప జ్ఞానం, గొప్ప శక్తి కల భగవంతుడు ఒక్కడు మాత్రమే మనకు ఫలాన్ని, అంటే, మనం కోరిన ప్రయోజనాన్ని, ఇవ్వడంలో సమర్థుడు. సాధ్య ధర్మాలకు ఆ శక్తి లేదు. అందుచేత సాధ్య ధర్మాలు తాము ఆచరింపబడే

కాలంలో చేతనుని, ఫలాన్ని ఇచ్చే కాలంలో భగవంతుని ఎదురు చూస్తాయి. అందుచేత ఇవి నిరపేక్షోపాయాలు కానే కావు. భగవంతుడు ఒక్కడే ఎవరి సహాయాన్ని ఎదురుచూడని ఉపాయమై వెలుగుతున్నాడు. అంటే, భగవంతుడు ఒక్కడే ఇతరుల సహాయాన్ని దేనిని ఎదురు చూడకుండా మన కార్యాన్ని పూర్తి చేయగలిగిన సమర్థుడు. శ్రీ మార్కండేయ మహర్షి మిగిలిన ధర్మాల కంటే సిద్ధధర్మం అయిన భగవంతుని వైలక్షణ్యాన్ని మనసులో పెట్టుకుని అతనిని శరణ్యునిగా మనకు ఉపదేశించారు.

ఇంతేకాక, సిద్ధోపాయమైన భగవంతుడు, ఒక జీవునిచే ఆశ్రయించబడే కాలంలో, ఆ జీవుడు వేరొక ఉపాయాన్ని ఆశ్రయించినవాడైతే, ఆ విధంగా అతడు తనకంటే ఇంకొక ఉపాయాన్ని ఆశ్రయించడం ఎంత మాత్రం సహించడు. మన పూర్వాచార్యులు భగవంతునకు కల ఈ స్వభావాన్ని అందమైన ఒక ఉదాహరణాన్ని చూపించి వివరిస్తారు. ఇంద్రజిత్తు ప్రయోగించిన బ్రహ్మాస్త్రంతో కట్టుబడిన హనుమంతుని రాక్షసులు జనపనార దారంతో బంధించారు. అప్పుడు ఆ బ్రహ్మాస్త్రం శక్తి హనుమంతుని విడిచి పెట్టింది. అంటే, బ్రహ్మాస్త్రం జనపనార దారంతో కట్టిన కట్టును సహించలేదు. ఆ విధంగానే, భగవంతుడు కూడా ఉపాయం అయ్యేటప్పుడు ఇంకొక ఉపాయసంబంధాన్ని ఏమాత్రం సహించడు.

దీనికి ప్రమాణాలు ఉన్నాయి.

"మామేవ యే ప్రపద్యంతే మాయా మేతాం తరంతి తే" (భగవద్గీత– 07–14) (ఎవరు నన్నే శరణు పొందుతున్నారు వారు ఈ మాయను దాటుతున్నారు) అని,

"తమేవ చాద్యం పురుషం ప్రపద్యే యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణి" (భగవద్గీత–15 –14) (అన్నిటికీ ఎవరి దగ్గరనుండి అనాది కాలంగా గుణమయవిషయాలలో అభినివేశం ఆత్మలకు కలుగుతున్నదో, అటువంటి పరమపురుషుని నా అజ్ఞానం మొదలైనవి తీరడంకోసం శరణు పొందుతున్నాను)

అని,

" తమేవ శరణం గచ్ఛ సర్వ భావేన భారత!

తత్ ప్రసాదాత్ పరాం శాంతిం స్థానం ప్రాప్స్యసిశాశ్వతమ్" (భగవద్గీత– 18 –62) (భరతకులంలో పుట్టిన వాడా! ఆ పరమాత్మ అయిన నన్ను అన్ని విధాలుగా శరణు పొందు. అటువంటి నా అనుగ్రహంతో అన్ని కర్మ బంధాలనుండి విముక్తిని, స్థిరమైన మోక్షస్థానం అయిన పరమపదాన్ని పొందుతావు),

" సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ" (భగవద్గీత– 18 –66) (భక్తి కలుగకుండా అడ్డుపడే పాపాలకు తగిన ప్రాయశ్చిత్త కర్మలను అన్నిటినీ విడిచిపెట్టి, నన్నే శరణు పొందు) అని,

" త్వమేవోపాయభూతో మే భవ" (అహిర్బుధ్న్యసంహిత –36– 38) (నీవే నాకు ఉపాయం కావాలి) అని.

"ఆయెనక్కు నిన్ పాదమే శరణాక త్తందొళిందాయ్" (తిరువాయ్ మొழி) (నాకు ఉపాయాన్ని అనుగ్రహించే సమయంలో నీ చరణాలనే ఉపాయంగా ఇచ్చావు)

అని కల ప్రమాణ వచనాలలో ఉండే ఏవకారం "భగవంతుడు ప్రాప్యానికి ఉపాయం అయే సమయంలో అతడే ముఖ్య కారణం అవుతున్నాడు. ఇక ఏదీ కూడా ముఖ్య కారణంగానో, సహాయ కారణంగానో కావడం లేదు" అనే గొప్ప అర్థాన్ని తెలుపుతున్నది. భగవానుని శరణంగా ఆశ్రయించడానికి "అతనిని శరణంగా ఆశ్రయించాలి" అని కోరే కోరిక కారణం అవుతుంది. ఈ కోరిక కలగడానికి "భగవంతుడు ఒక్కడే శరణు పొందదగినవాడు" అనే జ్ఞానం కారణం అవుతుంది. ఈ జ్ఞానం కలగడానికి అతని అనుగ్రహమే కారణం. ఈ విధంగా ఒక క్రమం శాస్త్రంలో చెప్పబడింది. అంటే, భగవానుని సహజమైన, మధురమైన

కృపకు లక్ష్యమై, దానివల్ల భగవంతుడు ఒక్కడే ఉపాయం, శరణు పొందతగినవాడు అనే జ్ఞానాన్ని పొంది, ఆ తరువాత, అతనిని శరణంగా ఆశ్రయించాలని కోరి, తరువాత ఈ కోరిక కారణంగా జీవుడు భగవంతుని శరణంగా ఆశ్రయిస్తున్నాడు–అని అర్థం. ఈ అర్థం "ఆత్మబుద్ధి ప్రసాదమ్", " ఎన్ ఉణర్వినుళ్ళేఇరుత్తినేన్, అదువుమ్ అవనదు ఇన్నరుళే" అనే ప్రమాణాల వల్ల స్పష్టమవుతున్నది.

ఈ విధంగా ఇటువంటి గొప్పతనాలను కలిగి వెలిగే భగవంతునకు ఒక్కనికే శరణ్యత్వం అనేది సిద్ధిస్తున్నది అని తెలుస్తున్నది. భగవంతుడు సర్వలోకశరణ్యుడు అనే విషయం మన పూర్వాచార్యులు ఇంకొక విధంగా కూడా నిరూపించారు. భగవంతుని దగ్గర పరత్వం, సౌలభ్యం, రక్షకత్వం–. అనే మూడు విధాలైన కళ్యాణ గుణాలు మెండుగా ఉన్నాయి. శరణ్యుడు గుణాధికుడు– అనే అభిప్రాయంలో నమ్మాళ్వారులు శ్రీవేంకటేశ్వరుని ఉద్దేశించి, " ఉలప్పిల్ కీర్తి అమ్మానే " (తిరువాయ్ మొళి– 6–10– 1) అని అన్నారు. గుణాధికుడు అనేదానికి కల్యాణగుణయోగంలో సర్వాధికుడు, అందరికంటే గొప్పవాడై వెలుగుతున్నాడు– అని అర్థం. పరత్వం అనేది గొప్పతనాన్ని సూచిస్తుంది. సౌలభ్యం అనేది అందరు దగ్గరకు వచ్చి ఆశ్రయించడానికి తగిన స్వభావాన్ని తెలుపుతుంది. రక్షకత్వం అనేది తనను ఆశ్రయించినవారిని, అంటే, తన దగ్గరకు శరణాగతులై వచ్చినవారిని రక్షించే స్వభావాన్ని తెలుపుతుంది, అంటే, వారి అనిష్టాన్ని తీర్చి ఇష్టప్రాప్తిని కలిగించే స్వభావాన్ని తెలుపుతుంది. భగవంతుని సర్వరక్షకత్వం అనేది– సర్వశక్తిత్వం, పరమకారుణికత్వం, హితప్రవర్తకత్వం అని మూడు విధాలుగా ఉంటుంది –అని అంటారు, వేదాంతాచార్యులు.

ఈ విధంగా భగవంతుడు మూడు విధాలైన కళ్యాణగుణాలతో చక్కగా ప్రకాశించేవాడై, అంటే, శరణ్యుడై వెలిగే అవతారం శ్రీరామావతారం. శరణాగతుడు, శరణ్యుడు– అనే ఇద్దరికీ వారు వారు ఉండే స్థితులలో పరమధర్మంగా ఉండే శరణాగతి అనేది శ్రీ రామాయణంలోని ముఖ్య ప్రమేయం అని శ్రీ పెరియవాచ్చాన్ పిళ్ళై అన్నారు. శ్రీరామాయణాన్ని శరణాగతి శాస్త్రం అని వారు కీర్తించారు. శ్రీ రామాయణం శరణాగతి వేదం అనే ప్రబంధం అని వేదాంతాచార్యులు అనుగ్రహించారు.

శ్రీరామాయణం అనేది– 1) శ్రీరాముని ఫరత్వప్రకారాన్నిగూర్చి, 2) దీనికి విరుద్ధమైన ఆ స్వామియొక్క సౌలభ్యయొక్క ప్రకారాన్ని గూర్చి, 3) సాధు పరిత్రాణం, దుష్కృత వినాశం, ధర్మ సంస్థాపనం– అని మూడు విధాలుగా ఉండే శ్రీరాముని సర్వరక్షత్వం– అనే ఈ మూడిటినిగూర్చి, ఈ మూడు అంతర్భవించి ఉండే శరణ్యత్వానికి అనుగుణమైన స్వభావ విశేషాలనుగూర్చి, ఇంకా, శరణాగతునకు, అంటే, శరణాగతులకు ఉండవలసిన అధికారి విశేషణాన్ని, అంటే, యోగ్యతను, సంభావిత స్వభావాలను (తనను వచ్చి చేరే స్వభావాలను) గూర్చిప్రధానంగా ప్రతిపాదిస్తున్నది. శ్రీరామాయణంలో శరణాగతి ప్రకరణాలు అనేకంగా కనిపిస్తాయి. వీటిలో శరణాగతిధర్మంలోని విశేషధర్మాలు చాలా తెలుపబడ్డాయి. ఈ కారణాల వల్ల శ్రీరామాయణం శరణాగతి శాస్త్రమని మన పూర్వాచార్యులు కీర్తించారు.

భగవంతుడు తనకు అసాధారణ ధర్మమైన శరణ్యత్వాన్ని వ్యక్తం చేసిన ప్రకారాలను ఆకారాలను అనేక విధాలుగా వాల్మీకి మహాముని నిరూపించారు. తేనెలో ఊరిన ద్రాక్షవలె శ్రీరామాయణాన్ని ఆధారంగా చేసికొని, శ్రీరామావతారం అనుభవంలోనే ఊనికను కలిగి, ఆ అనుభవం వల్ల తన్మయత్వాన్ని పొందినవారు, పరమకారుణికులైన మన పూర్వాచార్యులు. శ్రీవాల్మీకి భగవానుని హృదయాన్ని మనవంటివారు కూడా చక్కగా తెలిసికొని అనుభవించేటట్లు స్పష్టంగా వారు వివరించారు. వారిలో, శ్రీ పెరియ వాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించిన తనిశ్లోకి వ్యాఖ్యానం, అభయ ప్రదానసారం, శ్రీ వేదాంత దేశికులు అనుగ్రహించిన అభయ ప్రదానసారం– అనే గ్రంథాలు ముఖ్యంగా ప్రస్తావించదగినవి.

1) శ్రీ వాల్మీకి భగవానుడు శరణాగతియే పరమ ధర్మం అనే విషయాన్ని తెలిపే ప్రకారాన్ని,
2) శరణాగతి ప్రకరణాల తాత్పర్యార్థాలను ఏ విధంగా తెలుపుతున్నారు? అనే విషయాన్ని,

3) శ్రీ రాముడు శరణ్యుడు అనే విషయాన్ని సీతాదేవి, శ్రీ విభీషణుడు, బ్రహ్మ– అనే వీరి వచనాల వల్ల ఏ విధంగా నిరూపిస్తున్నారు? అనే విషయాన్ని,
4) శరణాగత రక్షణం పరమ ధర్మం– అని శరణ్యుని అధ్యయవసాయం ఉండే రీతిని ఏ విధంగా ఉపపాదిస్తున్నారు? –అనే విషయాన్ని,
5) శ్రీరాముని శరణ్యత్వనిరూపకం అయిన పరత్వం ఉండే ఏ విధంగా ఉపపాదిస్తున్నారు? అనే విషయాన్ని,
6) దీనికి విరుద్ధమైన శ్రీరాముని సౌలభ్యం, సౌశీల్యం మొదలైన గుణాలు ఉండే రీతిని ఏ విధంగా తెలియజేశారు? అనే విషయాన్ని,
7) సాధు పరిత్రాణం దుష్కృత్ వినాశం, ధర్మసంస్థాపనం అని భగవానుని మూడు విధాలుగా ఉండే రక్షకత్వం (ఇది సామాన్య రక్షణ) ఉండే రీతిని ఏ విధంగా వివరిస్తున్నారు? అనే విషయాన్ని,
8) శ్రీరాముని విశేష రక్షణ ప్రకారాన్ని ఏ విధంగా తెలియజేస్తున్నారు? అనే విషయాన్ని,
9) శ్రీ రామాయణానికి హృదయస్థానంలో విభీషణ శరణాగతి ప్రకరణం ఏర్పడి ఉండే ప్రకారాన్ని,
10) శరణాగతికి ఫలం కైంకర్యం అనే విషయాన్ని ఏ విధంగా చూపుతున్నారు? అనే విషయాన్ని ఈ మహాచార్యుల సూక్తులను ఆధారంగా చేసుకొని తెలియవచ్చు. వీటినుండి కొన్ని విశేషాలను విజ్ఞాపన చేస్తాను.

శరణాగతియే పరమధర్మం

1) బ్రహ్మ మొదలైన దేవతలు రావణుని వధకోసం భగవానుని దగ్గర శరణాగతి ధర్మాన్ని ఆచరించారు. దేవతలే కాక, లక్ష్మణుడు, భరతుడు, దండకారణ్యమునులు, విభీషణుడు– అనే ఉన్నతులైన అధికారులుకూడా శరణాగతిని అనుష్ఠించారు. ఉన్నతాధికారులైన వీరి అందరి అనుష్ఠానంవల్ల శరణాగతి గొప్ప ధర్మం –అనే విషయాన్ని మనం తెలియవచ్చు.

2) శ్రీరామాయణంలో శరణాగతి ప్రకరణాలలో వ్యక్తమయ్యే తాత్పర్యార్థాలు.

శ్రీరామాయణంలో మొదటి నుండి చివరి వరకు శరణాగతి సందర్భాలు ఎన్నో కనిపిస్తాయి. బాలకాండలో దేవతలు చేసిన శరణాగతి, అయోధ్యాకాండలో లక్ష్మణుడు చేసిన శరణాగతి, ఆరణ్యకాండలో దండకారణ్యమునులు చేసిన శరణాగతి– అనే వీనిని వాల్మీకి భగవానుడు అందంగా వర్ణించారు. కిష్కింధా కాండలో లక్ష్మణుని దగ్గర అంజలి చేయడం– అనే ప్రపత్తి చేయమని హనుమంతుడు సుగ్రీవ మహారాజుకు చెప్పాడని తెలుపబడింది. సుందరకాండలో త్రిజట రాక్షసస్త్రీలను సీతాదేవి దగ్గర శరణాగతి చేసేటట్లు ఉపదేశించడం గమనించదగినది. యుద్ధకాండలో విభీషణ శరణాగతి ఘట్టం చాలా ముఖ్యమైనది. శరణాగతి ప్రకరణాలలో శరణాగతియొక్క విశేష ధర్మాలు, శరణ్యుడు అయిన శ్రీరాముని స్వరూప స్వభావ విశేషాలు, శరణాగతులకు ఉండవలసిన యోగ్యతలు, సంభావిత స్వభావాలు– అనే వీటిని వాల్మీకి భగవానుడు చక్కగా నిరూపించారు.

దేవతలు చేసిన శరణాగతి

దశరథ చక్రవర్తి పుత్రకామేష్టి యాగాన్ని చేసేటప్పుడు బ్రహ్మ మొదలైన దేవతలు ఆ యాగంలో తమ తమ హవిర్భాగాలను పొందాలని వచ్చి అందరు కలిశారు. మిగిలిన దేవతలు అందరు బ్రహ్మతో "నీ అనుగ్రహం చేత బలాన్ని పొందిన రావణుడు మమ్ములను అందరిని చాలా బాధపెడుతున్నాడు. అతనిని వధించే మాకు శక్తి లేదు. నీవు దీనికి తగిన ఉపాయాన్ని ఆలోచించాలి" అని ప్రార్థించారు. ఆ సమయంలో బ్రహ్మ " నేను రావణునకు వరాలను ఇచ్చాను. అయితే, వాని ఫలితం లేకుండా చేయడానికి నావల్ల కాదు. భగవంతుడైన నారాయణుడు ఒక్కడే ఇప్పుడు మనలను రక్షించగలడు. మానవులను ఒక వస్తువుగా లెక్కపెట్టనివాడు కనుక, మానవుల వల్ల తనకు మరణం రాదు– అనే భావనతో మానవులవల్ల అభయాన్ని అతడు కోరలేదు. అందుచేత అతనికి మరణం మానవుని వల్లే కలగాలి " అని అన్నాడు. తమను దైవంగా భావించినవారు అందరు తమను కాపాడుకోవడంలో తాము శక్తిలేనివారు అనే

విషయాన్ని తెలిసికొని, భగవంతుడైన నారాయణుడే తమను కాపాడాలి– అని దేవతలు కోరారు. ఈ విధంగా దేవతలు రక్షణ కోరిన కాలంలో "వీరిని రక్షించడానికి తగిన సమయం లభించిందికదా" అనే ఆనందంతో ఏర్పడిన కాంతితో, శంఖం, చక్రం మొదలైన దివ్యాయుధాలను ధరించిన భుజాలతో, భక్తులను రక్షించడంకోసం ఏర్పడిన తొందరతో బద్ధకటియై, అంతటా వ్యాపించినవాడై ఈ ప్రపంచానికి స్వామి అయిన ఆ భగవంతుడు చక్రవర్తియొక్క యజ్ఞభూమికి వేంచేశాడు. ఈ సందర్భంలో

"ఏతస్మిన్ అంతరే విష్ణు రుపయాతో మహాద్యుతిః,

శంఖచక్రగదాపాణిః పీతవాసా జగత్పతిః" (శ్రీ రామాయణం– బాలకాండం– 15–16) అనే శ్లోకాన్ని గమనించాలి. భగవంతుడు మిగిలిన దేవతలవలె దశరథ చక్రవర్తి ఉత్తర భాగంలో చేసే పుత్రకామేష్టి యాగంలో హవిస్సును పొంది భుజించే దృష్టితో రాలేదు– అని మనం గమనించాలి. ఈ విధంగా శ్రీ వైకుంఠంలోనుండి వేంచేసిన భగవంతుని సభలో బ్రహ్మతో కలసి ఉండే దేవతలు అందరూ,

విష్ణో! పుత్రత్వమాగచ్చ కృత్వాత్మానం చతుర్విధమ్,

తత్ర త్వం మానుషో భూత్వా ప్రవృద్ధం లోకకంటకమ్,

అవధ్యం దేవతైః విష్ణో! సమరే జహి రావణమ్" (శ్రీ రామాయణం– బాలకాండం– 15– 21, 22) (ఓ విష్ణు దేవా! దశరథ చక్రవర్తియొక్క భార్యలు ముగ్గురి దగ్గర నీవు నాలుగు రూపాలను పొంది, అవతరించి, దేవతలచే వధించడానికి సాధ్యం కాని రావణుని చంపి, మమ్ములను రక్షించాలి) అని ప్రార్థించారు. పరమపురుషుడు కూడా–

"ఏవ ముక్తస్తు దేవేశో విష్ణుః. త్రిదశ పుంగవః,

పితామహ పురోగాన్ తాన్ సర్వలోకనమస్కృతః,

అబ్రవీత్ త్రిదశాన్ సర్వాన్ సమేతాన్ ధర్మసంహితాన్" (బాల కాండం –15– 26, 27) (ఈ విధంగా ప్రార్థింపబడినవాడు, నిత్యసూరులను పాలించేవాడు,

దేవతలకు ప్రభువు, అందరిచే ప్రార్థింపబడేవాడు అయిన విష్ణువు, శరణాగతి అనే ధర్మంతో చేరి ఒకటిగా కలిసిన దేవతలను అందరిని చూచి ఈ విధంగా అన్నాడు,)

"భయం త్యజత భద్రం వో హితార్థం యుధి రావణమ్,

సపుత్రపౌత్రం సామాత్యం సమంత్రిజ్ఞాతిబాంధవమ్,

హత్వా క్రూరం దురాత్మానం దేవర్షీణాం భయావహమ్,

దశ వర్ష సహస్రాణి దశ వర్ష శతాని చ" (బాల కాండం– 15 –28, 29)

దేవతలారా! మీరు భయాన్ని విడిచిపెట్టండి. మీకు మంగళం కలుగుతుంది. రావణుని అతనికి సంబంధించిన పుత్రులు, పౌత్రులు, మంత్రులు, జ్ఞాతులు, బంధువులు, స్నేహితులు అనే అందరిని వధించి, నశింపజేసి, ఈ భూమిని రక్షిస్తూ పదకొండు వేల సంవత్సరాలు నేను భూమిలో నివసిస్తాను) అని అభయ ప్రదానం చేసిన చరిత్ర శ్రీ వాల్మీకి భగవానుడు విస్తృతంగా వర్ణించాడు. ఈ ప్రకరణంలో పలు విశేషాలు తెలుపడుతున్నాయి.

1) ఉన్నత అధికారులైన బ్రహ్మ మొదలైన దేవతలు భగవానుని దగ్గర రావణ వధ కోసం శరణాగతి చేసినందున, వారి ఆచరణ వల్ల శరణాగతి పరమ ధర్మం– అని ప్రతిష్ఠింపబడినది.

2) వారు చేసిన శరణాగతిని అంగీకరించి, భగవంతుడు వారికి అభయప్రదానం చేశాడు. తరువాత, తాను అభయం ఇచ్చిన విధంగానే వారిని రక్షించడంకోసం "ఆత్మానం మానుషం మన్యే" అనే విధంగా మానవరూపంలో దశరథ చక్రవర్తికి కుమారుడై అవతరించి, రావణుని వధించి, ఈ విధంగా దేవతలు చేసిన శరణాగతిని సఫలం చేయడంవల్ల శరణాగతరక్షణ శరణ్యుడయిన భగవంతునకు పరమధర్మం –అనే విషయం ప్రతిష్ఠింపబడినది.

3) బ్రహ్మ మొదలైన దేవతలచే ఆశ్రయింపబడినందున అతని శరణ్యత్వం ప్రతిష్ఠించబడినది.

4) శరణ్యత్వానికి తప్పక కావలసిన భగవంతుని కారుణికత్వం, లోకహితైషిత్వం– లోకంలోనివారికి హితం చేయడంలో గురి కలిగి ఉండడం–" ఈ భూమిని పరిపాలిస్తూ పదకొండు వేల సంవత్సరాల కాలం నేను నివసించ బోతాను" అనే రెండు గుణాలు అతని మాటల వల్ల స్పష్టమవుతున్నవి.

5) a– ధర్మం అనే పదం ఏది ప్రయోజనానికి, అంటే, ఒకడు పొందే హితానికి సాధనం అవుతున్నదో దానిని నిర్దేశిస్తుంది –అని,

b– వారు వారు పొందే ఫలాలకు భగవంతుడు కూడా కారణం అవుతున్నాడు కనుక, అతడు ధర్మశబ్దంచేత నిర్దేశింపబడుతున్నాడు అని,

c– ఇటువంటి భగవానుడు మిగిలిన ధర్మాలవలె ప్రయత్నశక్తితో సృష్టింపబడేవాడు కాడు. అతడు నిత్యసిద్ధుడు ఉండేవాడై అని పూర్వం తెలుపబడింది.

ఈ సందర్భంలో మనకు ఒక సందేహం కలుగవచ్చు. అది ఏమంటే, భగవానుడు సిద్ధధర్మమై ఉన్నట్లయితే, ఆయా సమయాలలో వారు వారు కోరిన ప్రయోజనాలు భగవంతుడనే ధర్మంవల్ల సహజంగానే ఏ విధమైన ఆటంకాలు లేకుండా ఎందుకు కలగడం లేదు? అనే ఒక సంశయం మనకు కలుగవచ్చు.

భగవంతుడు సిద్ధ ధర్మమై, అందరిచే ఆశ్రయింబడి ప్రయోజనాన్ని పొందే రీతిలో ఉన్నప్పటికీ, మనం ఎందుకు అతనిని ఆశ్రయించడం లేదు?అని కూడా సందేహం కలుగవచ్చు.

భగవంతుడు సిద్ధధర్మంగా ఉన్నప్పటికీ, అతనిద్వారా కార్యం సాధించాలి అనే ఆశ మనకు కలగడం లేదు. మనమే మనకు కావలసిన హితాలను సాధించుకోవాలనే ప్రయత్నాలను చేస్తున్నాము. భగవానుడు అనే ఉపాయాన్ని ఆశ్రయించాలి– అనే కోరిక కలిగి, మన స్వరూపానికి తగని ప్రయత్నాలను వదలి పెట్టినప్పుడే, అతడు మన కార్యాన్ని తన తలకెత్తుకుంటాడు. ఈ సత్యాన్ని

రావణ వధకోసం బ్రహ్మాది దేవతలు భగవంతుని దగ్గర చేసిన శరణాగతి వల్ల మనం గమనించవచ్చు.

ఇవన్ పాశురమ్ కేట్టవాఱే అవన్ తిరువుళ్ళముకక్కుమ్" (దేవుడు చేసే ప్రార్థన వినగానే భగవంతుని మనసు ఆనందిస్తుంది అని శ్రీపిళ్ళైలోకాచార్యులవారు అనుగ్రహించారు. అతడు మనలను రక్షించాలి అంటే, అతడు చేసే రక్షణను అడ్డుపెట్టకుండా ఉండడం, "అతడు మనలను రక్షించాలి" అని కోరడం—అనేవి ఆవశ్యకం. " రక్షాపేక్షాం ప్రతీక్షతే" —భగవంతుడు మనం చేసే రక్షణాపేక్షను కోరతాడు —అనే ప్రమాణాన్ని అనుసరించి, అతడు మనలను రక్షించేటప్పుడు "నన్ను నీవు రక్షించాలి, నా అనిష్టాన్ని పోగొట్టి, ఇష్టాన్ని అనుగ్రహించాలి" అని మనం ప్రార్థించిన తర్వాతే, అతడు మనలను రక్షిస్తాడు. జీవులు చేసే ప్రార్థనను ఎదురు చూచి, దానిని పొందిన తరువాతే కార్యాన్ని చేయాలి— అనే భగవానునకు ఉండే స్వభావవిశేషాన్ని ఈ దేవతల శరణాగతి ప్రకరణంలో తాత్పర్యార్థంగా మనం తెలియవచ్చు.

లక్ష్మణుని శరణాగతి

"స భ్రాతుః చరణౌ గాఢం నిపీడ్య రఘునందనః,

సీతామువాచాతియశాః రాఘవం చ మహావ్రతమ్" (అయోధ్య కాండం— 30—12)

(గొప్ప కీర్తిని కలవాడైన లక్ష్మణుడు తన అన్నగారైన శ్రీరాముని చరణాలను గాఢంగా పట్టుకొని, సీతాదేవి వద్ద విజ్ఞాపన చేశాడు. ఆ తరువాత, శరణాగత రక్షణ దీక్షను కల శ్రీరాముని దగ్గర విజ్ఞాపన చేశాడు) అనే విధంగా సీతాదేవి సమక్షంలో శ్రీరాముని లక్ష్మణుడు ఆశ్రయించాడు. అతడు ఈ దివ్యదంపతుల దగ్గర చేసిన శరణాగతిని తెలిపే ఈ శ్లోకంలో శరణాగతి చేసేటప్పుడు లక్ష్మీదేవి పురుషకారం పూర్వకంగా శరణాగతిని చేయాలి— అని తెలుపబడింది. లక్ష్మణుడు చేసిన శరణాగతి ద్వయమంత్ర వివరణపరం— అనే దానిని మన పూర్వాచార్యులు

వివరించారు. శరణాగతికి ప్రయోజనంగా లక్ష్మణుడు ప్రార్థించినది కైంకర్యమే అనే విషయాన్ని

"కురుష్వ మామనుచరం వైధర్మ్మం నేహ విద్యతే,

కృతార్థోఽహం భవిష్యామి తవ చార్థః ప్రకల్పతే" (అయోధ్య కాండం– 31 –24)

తవ అర్థః– నీకు సీతాదేవికి చేసే సేవ, ప్రకల్పతే – చక్కగా సమకూరడం కోసం, మామ్– నన్ను, అనుచరం– నీకు అనుచరునిగా, కురుష్వ–నియమించుకోవాలి, ఇహ–ఈ విషయంలో, వైధర్మ్యం, న విద్యతే –ధర్మ విరోధం ఏదీ లేదు, అహం– దీనివల్ల శేష భూతుడను అయిన నేను, కృతార్థః– ఫలాన్ని పొందినవాడను, భవిష్యామి– కాగలను,

"భవాం స్తు సహవైదేహ్యా గిరిసానుషు రంస్యతే,

అహం సర్వం కరిష్యామి జాగ్రతః స్వపతశ్చ తే" (అయోధ్య కాండం– 31– 25)

భవాం స్తు– నీవు, వైదేహ్యా సహ – సీతాదేవితో పాటు, గిరిసానుషు– పర్వత చరియలపై, రంస్యతే– ఆనందించబోతావు, జాగ్రతః– మేలుకొన్న సమయంలో, స్వపతః– నిద్రపోయే సమయంలో, తే– నీకు, అహం– నేను, సర్వం –అన్ని సేవలను, కరిష్యామి –చేస్తాను.

"పరవానస్మి కాకుత్ స్థ! త్వయి వర్షశతం స్థితే,

స్వయం తు రుచిరే దేశే క్రియతామతి మాం వద" (అరణ్య కాండం –15 –7)

కాకుత్ స్థ–ककుత్ స్థ వంశంలో జన్మించిన శ్రీరామా!, త్వయి– నీవు, వర్షశతం –ఎన్ని సంవత్సరాలు, స్థితే– ఉన్నప్పటికీ, పరవానస్మి– నీకు పరతంత్రుడనై ఉన్నాను, స్వయం తు– నీవు స్వయంగానే, రుచిరే– అందమైన, దేశే–ప్రదేశంలో, క్రియతామ్– ఆశ్రమాన్ని నిర్మించు అని, మామ్ వద – నన్ను నియమించాలి.

అని ఈ విధంగా లక్ష్మణుడు శ్రీరాముని దగ్గర చేసిన విన్నపాలు తెలుపుతున్నాయి. శరణాగతికి ఫలం దివ్యదంపతుల విషయంలో సిద్ధించే కైంకర్యమే– అనే విషయం లక్ష్మణుని శరణాగతిలో సారంగా తెలుపబడిన తత్త్వం.

భరతుని శరణాగతి

ఒక చేతనుడు భగవంతుని శరణంగా ఆశ్రయించేటప్పుడు ఇతడు ఆశ్రయించే ఆశ్రయణం భగవంతుని మనసును అనుసరించి ఉండాలి– అనేది శరణాగతికి సంబంధించిన ఒక తత్వం. ఈ తత్వాన్ని భరతుని శరణాగతిలో తాత్పర్యార్థంగా మనం తెలియవచ్చు. ఇక ఈ విషయాన్ని విస్తృతంగా గమనిద్దాం.

శ్రీ రాముడు సీతాదేవితో పాటు, లక్ష్మణునితోపాటు కలసి చిత్రకూటంలో నివసించే సమయంలో, శ్రీరాముని అయోధ్యా నగరానికి వెంటనే తిరిగి తీసికొని వచ్చి పట్టాభిషేకం జరిపించాలి– అనే గొప్ప ఆర్తితో భరతుడు వశిష్ఠుడు మొదలైన ఆచార్యులతోను, కౌసల్య మొదలైన తల్లులతోను, సుమంత్రుడు, జాబాలి మొదలైన పెద్దలతోను, బంధుమిత్రులతోను, మంత్రులతోను, సైన్యంతోను, నగర జనాలతోను కలసి అక్కడకు వచ్చాడు. శ్రీరాముని శ్రీచరణ పద్మాలను ఉపాయంగా ఆశ్రయించి, “నీవు ఇప్పుడే అయోధ్యకు తిరిగి వచ్చి పట్టాభిషేకానికి చేసుకోవాలి" అని చాలా ఆర్తితో ప్రార్థించాడు. శ్రీ భరతునితో కలసి వచ్చిన అందరూ కూడా ఆ విధంగానే శ్రీరాముని ప్రార్థించారు.

కానీ, శ్రీరాముడు మాత్రం వీరి ప్రార్థనకు అంగీకరించి, అయోధ్యకు తిరిగి వచ్చి రాజ్య పట్టాభిషేకం చేసికోవడానికి అంగీకరించలేదు. శ్రీరామునకు ఆశ్రితపారతంత్ర్యం అనే గుణం ఆ సమయంలో అతిశయించ లేదు. స్వాతంత్ర్యమే ఎక్కువగా ప్రకాశించింది. అందుచేత అతడు పితృవాక్య పరిపాలన అనే సామాన్య ధర్మాన్ని అనుసరించడంలోనే ఆసక్తి కలవాడై ప్రకాశించాడు. శ్రీరాముడు తన పాదుకలను భరతునకు ఇవ్వగా, అతడు వాటిని పొంది, నందిగ్రామానికి తిరిగి వచ్చి, వాటికి అక్కడ పట్టాభిషేకం చేసి, వాటికి పరతంత్రుడై 14 సంవత్సరాల కాలం రాజ్య పరిపాలన చేస్తూ, శ్రీరాముని రాక కోసం ఎదురు చూస్తూ కాలాన్ని గడిపాడు.

1) శ్రీ భరతుని శరణాగతి ఫలించలేదు– అనే విషయాన్ని, 2) దానికి కారణం ఏమి?అనే ఈ విషయాన్ని, కొందరు చెప్పే కారణాలు సరి అయినవు కాదు– అని, 3) భరతుని శరణాగతి ఫలించక పోవడానికి నిజమైన కారణం ఏమిటి? అనే విషయాన్ని ఇకపై విస్తృతంగా వివరిస్తాను.

అయితే, కొందరు, ఒక రీతిలో భరతుని శరణాగతి ఫలించింది –అని చెప్పాలి అని అంటారు. అంటే, "భరతుడు కేకయ దేశం నుండి అయోధ్యకు తిరిగి వచ్చిన తరువాత, తన తల్లి కైకేయి దగ్గరకు వెళ్లి నమస్కరించాడు. అప్పుడు ఆమె భరతుని చూచి "రాజన్!" అని సంబోధించి, అతనితో మాట్లాడడం ఆరంభించింది. ఆమె చేసిన ఆ సంబోధనను విని భరతుడు భగవత్పారతంత్ర్యం అనే తన స్వరూపం తన దగ్గరనుండి దొంగిలింపబడింది– అని భావించి, చాలా ఆక్రోశించాడు. ఈ కొరత తీరేటట్లు శ్రీరాముడు తన పాదుకలను అతనికి ఇవ్వగా, వాటికి పరతంత్రుడై, రాజ్యాన్ని పాలించమని శ్రీరాముని దగ్గర ఆజ్ఞను పొందినందున, శ్రీ భరతుడు అంతకుముందు తాను కోల్పోయిన పరతంత్ర్యాన్ని శరణాగతి ఫలంగా పొందాడు– అని తెలుస్తున్నది. ఈ కారణంవల్ల భరతుడు చేసిన శరణాగతి ఫలించింది– అనే చెప్పాలి– అని కొందరు అంటారు.

అయితే, ఈ వివరణ సరి అయినది కాదు. శ్రీభరతుని శరణాగతి ఫలించలేదు– అనేదే సిద్ధాంతం. దీనికి గల కారణాలను ఇప్పుడు వివరంగా చూద్దాం.

శ్రీవాల్మీకి భగవానుడు భరతుని చరిత్రను వర్ణించేటప్పుడు, చాలా ఆర్తితో భరతుడు శ్రీరాముని శరణు పొందాడు– అనే విషయాన్ని స్పష్టంగా తెలియజేశాడు.

“ఇత్యుక్తః కైకయీపుత్రః కాకుత్స్థేన మహాత్మనా,

ప్రగృహ్య బలవత్ భూయః ప్రాంజలిః వాక్యమబ్రవీత్" (అయోధ్య కాండం –104–4)

మహాత్మనా– మహాత్ముడు అయిన, కాకుత్ స్థేన–ककుత్ స్థ వంశంలో జన్మించిన శ్రీరామునిచే, ప్రగృహ్య బలవత్ భూయః – బ్రహ్మాంగా ప్రేమతో ఆలింగనం చేసుకొని, ఇతి–ఈ విధంగా, ఉక్తః– చెప్పబడిన, కైకయీ పుత్రః –కైకేయి పుత్రుడైన భరతః, ప్రాంజలిః– అంజలిని చేసినవాడై, వాక్యమ్ అబ్రవీత్–మాటను చెప్పాడు.

"తస్య మే దాసభూతస్య ప్రసాదం కర్తుమర్హసి,

అభిషించస్వ చాద్యైవ రాజ్యేన మఘువానివ" (శ్రీ రామాయణం– 104–8)

దాసస్య–దాసుడు అయిన, తస్య మే– నాకు, ప్రసాదం కర్తమర్హసి– నీవు అనుగ్రహించదగి ఉన్నావు, అద్య ఏవ– ఈనాడే, మఘువాన్ ఇవ–దేవేంద్రుని వలె నీవు, రాజ్యే– రాజ్యంలో, అభిషించస్వ– అభిషేకం చేసికోవాలి.

"ఏవముక్త్వా మహాబాహుః సబాష్పః కైకయీసుతః,

రామస్య శిరసా పాదౌ జగ్రాహ విధివత్ పునః" (అయోధ్య కాండం– 104– 14)

మహాబాహుః– విశాలమైన బాహువులను కలవాడైన, కైకయీసుతః– కైకేయి కుమారుడైన భరతుడు, సబాష్పః– కన్నీటితో నిండినవాడై, ఇతి– ఈ విధంగా, ఉక్త్వా–ప్రార్థించి, రామస్య పాదౌ– శ్రీరాముని పాదాలను, పునః– మళ్లీ, శిరసా–తలతో, విధివత్– శాస్త్ర ప్రకారం, జగ్రాహ –నమస్కరించాడు, శరణాగతి చేశాడు– అని వాల్మీకి భగవానుడు అన్నాడు. ఈ శ్లోకాలలో

1) "అద్యైవ అభిషించస్వ" అనే ప్రయోగం "ఇప్పుడే పట్టాభిషేకం చేసుకోవాలి" అనేది భరతుడు కోరిన ప్రయోజనం– అనే విషయాన్ని,

2) "సబాష్పః" అనే ప్రయోగం శ్రీ భరతునకు కల ఆర్తిని,

3) "రామస్య పాదౌ శిరసా జగ్రాహ" అనే ప్రయోగం శ్రీ భరతుడు శ్రీరాముని శ్రీ చరణాలను ఉపాయంగా ఆశ్రయించాడు– అనే విషయాన్ని,

4) "విధివత్" అనే ప్రయోగం ఆ విధంగా ఆశ్రయించేటప్పుడు శ్రీ భరతుడు క్రమానుసారంగానే ఆశ్రయించాడు– అనే విషయాన్ని తెలుపుతున్నాయి. ఇందువల్ల శ్రీభరతుడు శ్రీరాముని ఆర్తితో క్రమంలోనే శరణంగా ఆశ్రయించాడు– అనేది ఈ శ్లోకాలలో తేలిన అర్థంగా తెలుస్తున్నది. ఆర్తితో శరణం పొందినవారికి అప్పుడే ఫలం లభిస్తుంది అనేది శాస్త్ర సిద్ధం. అయితే, శ్రీ రాముని ఆర్తితో శరణు పొందిన భరతునకు అతడు కోరిన ప్రయోజనాన్ని పొందాడా? అని అంటే, "పొందలేదు "అని వాల్మీకి భగవానుడు బదులు పలుకుతున్నాడు.

“స కామ మనవాప్యైవ రామపాదా వుపస్పృశన్,

నందిగ్రామేఽకరోత్ రాజ్యం రామాగమనకాంక్షయా" (బాల కాండం –1–37)

(శ్రీ భరతుడు తన కోరిక నెరవేరకుండానే శ్రీరాముని చరణాలైన పాదులను ప్రతి దినం సేవిస్తూ, శ్రీరాముని రాక కోసం ఎదురు చూస్తూ, నంది గ్రామంలో నుండి రాజ్యపరిపాలన చేశాడు) అనేది వాల్మీకి సూక్తి. ఇందువల్ల శ్రీ భరతుని శరణాగతి ఫలించలేదు– అనేది స్పష్టమవుతున్నది. శ్రీరాముడే భరతుడు ఏ ప్రయోజనాన్ని ఉద్దేశించి శరణాగతి చేశాడో, ఆ ప్రయోజనం అతనికి లభించలేదు– అనే విషయాన్ని స్పష్టంగానే పలికాడు. రావణవధ పూర్తి అయిన తరువాత శ్రీవిభీషణునకు లంకారాజ్యపట్టాభిషేకం లక్ష్మణునిద్వారా శ్రీరాముడు జరిపించాడు. పట్టాభిషేక కార్యక్రమాలు పూర్తి అయిన తరువాత, శ్రీరామునకు అభిషేకం మొదలైన పలు విధాలై ఉపచారాలను, మర్యాదలను చేయాలని తలచి, ఆ విధంగానే రాముని దగ్గర విన్నవించాడు. అప్పుడు శ్రీరాముడు,

"న ఖల్వేతన్న కుర్యాం తే వచనం రాక్షసేశ్వర!,

తం తు భ్రాతరం ద్రష్టుం భరతం త్వరతే మనః,

మాం నివర్తయితుం యోఽసౌ చిత్రకూటముపాగతః,

శిరసా యాచత స్తస్య వచనం న కృతం మయా" (యుద్ధ కాండం– 121– 18, 19)

(రాక్షస రాజా! నీ ఈ విజ్ఞాపనను అంగీకరించలేను. ఎందుకంటే, ఏ భరతుడు నన్ను తిరిగి తీసుకుని పోవడం కోసం చిత్రకూటానికి వచ్చాడో, తలతో ప్రార్థించిన అతని విజ్ఞాపన నాచే అంగీకరింపబడలేదు) అని అన్నాడు.

భరతుని శరణాగతి ఫలించకపోవడానికి ఏమి కారణం? శ్రీరాముడు తన స్వాతంత్ర్యం అతిశయించినవాడై, అయోధ్యకు తిరిగి రావడానికి అంగీకరించలేదు. ఈ విషయాన్ని తరువాత విజ్ఞాపన చేస్తాను. మొదట దీనిని గూర్చి ఇతరులు పలికే అర్థాలను ముందుగా గమనిద్దాం.

పూర్వపక్షం –1 –భరతుడు చేసిన శరణాగతికి ముందే దేవతలు రావణ వధ కోసం తనను శరణాగతి చేసినందున, వారు కోరిన ప్రయోజనాన్ని కలిగించడం కోసం నిశ్చయించుకున్న శ్రీరాముడు వనవాసం అనే నెపంతో అరణ్యానికి వచ్చినందున, దేవతలు చేసిన శరణాగతిని మొదట సఫలం చేసి, తరువాత భరతుడు చేసిన శరణాగతిని సఫలం చేయాలనే క్రమాన్ని భావించినందున, అతడు భరతుని ప్రార్థనకు అంగీకరించి అయోధ్యకు తిరిగి రాలేదు –అనే ఒక పరిహారం చెప్పబడుతున్నది.

ఈ వాదం సరి అయినది కాదు– అని తెలుస్తున్నది. ఎందుకంటే, దేవతలు చేసిన శరణాగతి దృప్తశరణాగతి. భరతుడు చేసిన శరణాగతి ఆర్తశరణాగతి. శ్రీరామాయణం దేవతలు చేసిన శరణాగతిని గురించి తెలిపేటప్పుడు వారు రావణవధను ఆశించి భగవంతుని వద్ద శరణాగతి చేశారని చెప్పబడింది తప్ప, ఆ వధ ఈ సమయంలోనే తప్పక చేయబడాలి–అని ఒక నిర్దిష్టమైన కాలం చెప్పబడలేదు. ఈ సందర్భంలో "అవధ్యం త్వై వధైర్విష్ణో! సమరే జహి రావణమ్" (బాల కాండం– 15 –22) అనేది దేవతలు పలికిన మాట. భరతుడు అయితే "అద్యైవ" (ఇప్పుడే) అని కాలాన్ని నిర్దేశించి ప్రయోజనాన్ని ప్రార్థించాడు. దేవతలు కోరిన ఫలం రావణ వధ. భరతుడు కోరిన ప్రయోజనం శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చి పట్టాభిషేకం చేసికోవాలి అనేది. ఈ రెండు ఒకే కాలంలో జరగాలి అని దేవతలు, విభీషణుడు కోరలేదు. ఆవిధంగా కోరి ఉంటే, శ్రీరాముడు

దేవతలు చేసిన శరణాగతిని మొదట సఫలం చేయాలని భావించి, శ్రీ భరతుడు ప్రార్థించిన విధంగా అయోధ్యకు రాలేదు– అని చెప్పవచ్చు. దేవతలు చేసిన శరణాగతి దృప్తశరణాగతి. తాము చేసిన శరణాగతికి ప్రయోజనం లభించేటప్పుడు లభించనీ! అని వేచి ఉండేవారు దృప్తప్రపన్నులు. దేవతలు తాము చేసిన శరణాగతి ఫలించే కాలం వరకు వేచి ఉండగలిగినవారు. శ్రీభరతుడు చేసిన శరణాగతి ఆర్తశరణాగతి. తాను చేసిన శరణాగతికి ఫలం కోసం తహతహతో ఎదురు చూచేవాడు, భరతుడు. శ్రీరాముడు భరతుడు కోరినట్లు అయోధ్యకు తిరిగి వచ్చి, పట్టాభిషేకం చేసుకుని, తరువాత ఏదో ఒక కారణం ఆధారంగా చేసుకొని, మళ్లీ వనానికి వెళ్లి ఉండవచ్చు. కానీ ఆ విధంగా జరుగలేదు కదా!

పూర్వపక్షం–2 –శ్రీరాముని మనస్సు గాయపడేటట్లు భరతుడు కొన్ని దోషాలను కలిగి ఉండవచ్చు. భరతుని శరణాగతి ఫలించనందువల్ల ఈ విధంగా ఊహించే అవకాశం ఉన్నది– అనేది రెండవ పరిహారం.

ఇది కూడా మనం అంగీకరించదగినది కాదు శ్రీ భరతుని అవతార రహస్యాన్ని తెలిసినపుడు, శ్రీరాముడు ఏ విధంగా పాపం లేనివాడై ఉంటాడో, ఆ విధంగానే, శ్రీ భరతుడు కూడా పాపం లేనివాడే. శ్రీరామునకు, సీతాదేవికి అంతరంగ కైంకర్యం చేసిన లక్ష్మణుని కంటే, ఆ దివ్యదంపతుల విషయంలో పారతంత్ర్యనిష్ఠను కల భరతుని గొప్పతనం ఉన్నతమైనది.

పూర్వపక్షం–3 –ఇక మూడవ పరిహారం చెప్పబడే రీతిని గమనిద్దాం. శరణాగతికి కొన్ని అంగాలు ఉన్నాయి. పెద్దలను ముందు ఉంచుకోవడం, లక్ష్మీదేవి పురుష కారాన్ని పురస్కరించు కోవడం మొదలైనవి ఈ అంగాలు. శ్రీభరతుడు చేసిన శరణాగతి ఫలించకుండా పోవడానికి కారణం ఈ అంగాలలో ఏదో ఒకటి రెండు కొరతపడి ఉండి ఉండవచ్చు.

ఇది కూడా సరి అయినది కాదు. మనం అంగీకరించదగినది కానే కాదు. “రామస్య శిరసా పాదౌ జగ్రాహ విధివత్ పునః" అని వాల్మీకి భగవానుడు పలికిన సూక్తి ఇంతకుముందు ప్రస్తావింపబడింది కదా. ”విధివత్" అనే మాట శ్రీభరతుడు శ్రీరాముని క్రమంలోనే శరణాగతి చేశాడు అనే విషయాన్ని తెలుపుతున్నది.

పూర్వపక్షం–4 –తండ్రి, తల్లి– అనే వీరిని పూజించడం పరమధర్మం– అనే విషయాన్ని తన ఆచరణ ద్వారా లోకంలో స్థాపించడం కోసం అవతరించినవాడు, శ్రీరాముడు. కన్న తల్లి అని, సవతి తల్లి అని ఏ కొంచెం తేడా కూడా లేని వైభవం కలవాడు శ్రీరాముడు. తనకు సవతి తల్లి అయిన కైకేయి మాటను అనుసరించి, కిరీటాన్ని కూడా శ్రీరాముడు వదులుకున్నాడు. ఈ విధంగా తాను పూజించిన తల్లి అయిన కైకను అనేక పర్యాయాలు భరతుడు దూషించి గర్హించి పలుకడం శ్రీరాముని మనస్సు గాయపడడానికి కారణమైనది. ఈ కారణం చేత భరతుడు కోరినట్లు శ్రీరాముడు అనుగ్రహించలేదు. చిత్రకూటంలో శ్రీరాముడు భరతునకు తన పాదుకలను ఇచ్చేటపుడు "మాతరం రక్ష కైకేయీమ్" (అయోధ్యకాండం –113 –27) (నీ తల్లి అయిన కైకేయికి సేవలనుచేయడం ద్వారా కాపాడు) అని పలికిన మాటలు, 14 సంవత్సరాలు వనవాసం చేసి, తిరిగి నంది గ్రామానికి శ్రీరాముడు వచ్చినప్పుడు, అతని ముందే "పూజితా మామికా మాతా" (శ్రీ రామ పట్టాభిషేక సర్గ) అని భరతుడు పలికిన మాట ఇక్కడ గమనించదగినవి. ఇదే పూర్వపక్షంలో నాల్గవ పరిహారం.

ఈ పరిహారం ఒక విధంగా రామాయణంలో చెప్పబడి ఉండడం నిజమే అయినా, దీనిని పరిహారంగా చెప్పడానికి లేదు. దీనిని గురించి కొంచెం వివరంగా విజ్ఞాపన చేస్తాను.

శ్రీ మార్కండేయుడు "శ్రియఃపతి అయిన సర్వేశ్వరుడే జీవులందరికీ ఎల్లప్పుడు రక్షకులైన తల్లి. తండ్రి అవుతున్నాడు" అని తెలియజేసే శ్లోకంలోని అర్థాలను మనం తెలుసుకుంటున్నాము. అందరికీ తల్లిగా, తండ్రిగా భగవంతుడు కావడం మన కర్మఫలం వల్ల కాదు. మనకు, అతనికి మధ్య ఉండే సంబంధం సహజమైనది, నిత్య సిద్ధమైనది అనే విషయాన్ని ఇంతకుముందే

గమనించాము. ఈ విధంగా ఉండే సంబంధం పరమాత్మ అయిన శ్రీరామునకు, జీవాత్మలైన లక్ష్మణుడు, భరతుడు మొదలైనవారికి మధ్య ఉన్నది. అయితే, ఇటువంటి సంబంధం భరతునకు, కైకేయికి మధ్య లేదు. శ్రీరాముని విషయంలో దశరథ చక్రవర్తి, కైకేయి విరుద్ధమైన ప్రయత్నాలు చేశారు. అంటే, శ్రీరామునకు పట్టాభిషేకం చేయాలి సంకల్పించిన ముహూర్తంలో వీరు అతనిని వనానికి పంపించారు. ఆ విధంగా లక్ష్మణుని విషయంలో అతనిని కన్నతల్లి అయిన సుమిత్రాదేవి కాని, తండ్రి అయిన దశరథ చక్రవర్తి గాని చేయలేదు. అయినా, లక్ష్మణుడు దశరథ చక్రవర్తిని, సుమిత్రాదేవిని తన కన్నతండ్రులుగా భావించకుండా, శ్రీరామునే తన తల్లిగా, తండ్రిగా, ఇంకా మిగిలిన అన్ని విధాలైన బంధువులుగా భావించి, అన్నివిధాలైన సేవలనూ అతనికి చేసి ఆనందించాడు. ఈ విధంగా లక్ష్మణుడు ప్రవర్తించడానికి అతనికి శ్రీరాముని విషయంలో ఉన్న భక్తియే కారణం.

లక్ష్మణునివలె శ్రీ రాముని విషయంలో భక్తి కలిగిన భరతునకు ఆ స్వామి విషయంలో విపరీత ప్రవర్తనను చేసిన కైకేయి పట్ల మనసు సహిస్తుందా? భరతుడు తన తల్లిని ఏవగించుకోవడం శాస్త్రప్రకారం ఏ విధంగా దోషం అవుతుంది? భగవంతుని విషయంలో విరుద్ధభావాన్ని కలిగిన తల్లిని వెంటనే విడిచిపెట్టడం శాస్త్రం నిర్దేశించిన క్రమమే కదా! ఇందువల్ల నాల్గవ పరిహారం కూడా మనం అంగీకరించదగినది కాదు అని తెలుస్తున్నది.

అయితే, "మాతరం రక్ష కైకేయీమ్, మా దోషం కురు, తాం ప్రతి" అని శ్రీరాముడు, "పూజితా మామికా మాతా" అని భరతుడు అన్నాడు కదా– అని అంటే, వీటిని ముఖ్యవిషయంగా మన పూర్వాచార్యులు పరిగణించలేదు. జీవుని యథార్థస్థితిని గమనిస్తే, కైకేయిని భరతుడు గర్హించడం దోషం కాదు– అనే విషయం ఎవరూ కాదనడానికి వీలు లేనిది. ఈ విషయంలో శ్రీరామాయణంనుండి కొన్ని విషయాలను మనం తెలియడం అవసరం.

తండ్రి, ఆచార్యుడు–అనే ఈ ఇద్దరిలో తండ్రి శరీరాన్ని కలిగించి, దానిని అభివృద్ధి చేస్తాడు, ఆచార్యుడు అయితే, అతనికి జ్ఞానాన్ని ఉపదేశించి, అతని ఆత్మను వృద్ధి చేస్తాడు. ఈ విధంగా ఒక జీవునకు ఇద్దరూ సహాయపడేవారు

అయినా, జ్ఞానాన్ని కలిగించే ఆచార్యుడు చాలా గొప్పవాడుగా భావింపబడుతున్నాడు. ఆచార్యుని ఆజ్ఞను అనుసరించి ప్రవర్తించడం చాలా ముఖ్యం. ఈ వాస్తవాన్ని తెలియజేసి,

"ప్రజ్ఞాం దదాతి చాచార్యః తస్మాత్ స గురురుచ్యతే,

సోఽహం తే పితురాచార్యః తవ చైవ పరంతప!,

మమ త్వం వచనం కుర్వన్ నాతివర్తేః సతాం గతిమ్" (అయోధ్య కాండం –111 –3, 4)

"శ్రీరామా! నేను నీకు, నీ తండ్రికి ఆచార్యుడను. అందువల్ల నా మాట ప్రకారం ఈ వనవాసం విడిచిపెట్టి, రాజ్యాన్ని అంగీకరించి, పట్టాభిషేకానికి చేసుకో" అని వశిష్ఠుడు అన్నాడు. ఇంతేకాక,

"భరతస్య వచః కుర్వన్ యాచమానస్య రాఘవ!

ఆత్మానం నాతివర్తే స్త్వం సత్యధర్మ పరాక్రమ" (అయోధ్య కాండం– 111– 7)

(శ్రీరామా! నీవు పరమ పురుషుడు కదా! నీ విషయంలో భక్తిని కలవారిలో భరతుడు గొప్పవాడు కదా! అతని విషయంలోపరతంత్రుడవై, అతని మనస్సు ప్రకారం నడచుకోవడం నీకు గొప్ప సంపద సుమా! ఇప్పుడు భరతుడు కోరిన విధంగా అయోధ్యకు వచ్చి, పట్టాభిషేకం చేసుకోకపోతే నీవు నీ గొప్ప సంపద అయిన ఆశ్రితపారతంత్ర్యాన్ని కోల్పోతావు) అని అన్నాడు.

స్వతంత్రుడైన భగవంతునకు ఆశ్రితపారతంత్ర్యం అనేది ఉన్నది. అది అతనికి గొప్ప సంపద. ఆశ్రితపారతంత్ర్యం అంటే –భగవంతుడు, తనను ప్రేమతో ఆదరించేవారు ఎవరో, వారు చెప్పినట్లు చేసి, వారి చేతిలో మనిషిగా ఉండడమే. (శ్రీకృష్ణుడు పంచపాండవుల కోసం దూతగా పోవడం, అర్జునునకు సారధిగా కావడం ప్రసిద్ధం).

ఈ విధంగా వశిష్ఠుడు చెప్పిన మాటలను విన్న శ్రీరాముడు కొన్ని వచనాలను పలికాడు. శరీరం లేనివానికి జ్ఞానం కలగడానికి, ఆచార్యుడు

జ్ఞానాన్ని ఉపదేశించడానికి అవకాశం లేదు. గోడ ఉంటేనే చిత్రాన్ని చిత్రించడం వీలవుతుంది—అనే విధంగా, జ్ఞానం కలగడానికి శరీరం చాలా ఆవశ్యకం. "శరీర మాద్యం ఖలు ధర్మసాధనమ్" అని కీర్తింపబడే శరీరాన్ని కలిగించి, దానిని వృద్ధి చేయడానికి తండ్రి, తల్లి నోములు నోస్తారు. తల్లి పది నెలలు మోసి, అరుదైన ఫలంగా పొందిన తర్వాత కూడా, ఇతడు ఏమీ తెలియకుండా ఉండేటప్పుడు చిన్నతనంలో ఇతని కోసం పడరాని పాట్లు పడి, తల్లిదండ్రులు సహాయ పడతారు. కనుక వీరు ఆచార్యుని కంటే గొప్పవారు. ఆచార్యుని కంటే తండ్రికి ఆధిక్యమున్నది. ఆచార్యుని మాట కంటే తండ్రి మాటకు ఎక్కువ విలువ ఉన్నది. అందుచేత తండ్రి వచనమే ఎక్కువ ఆదరించదగినది. ఇదే శ్రీరాముడు పలికిన సమాధానం. ఈ సందర్భంలో,

“స హి రాజా జనయితా పితా దశరథో మమ,

అజ్ఞాతం యన్మయా తస్య న తన్మిథ్యా భవిష్యతి" (అయోధ్య కాండం— 111—11)

(దశరథ చక్రవర్తి నన్ను కన్న తండ్రి, వారి ఆజ్ఞను నేను వ్యర్థం చేయకూడదు) అని శ్రీరాముని మాట. దీనిని కొంచెం విచారించి చూడాలి.

రామా! ఆశ్రితపారతంత్ర్యం అనే సంపదను పోగొట్టుకోకుండా, భరతుని కోరికను నెరవేర్చు— అని వశిష్ఠుడు పలికిన మాటకు శ్రీరాముడు ఏమీ బదులు చెప్పినట్లు తెలియలేదు. శ్రీ రాముడు పలికిన రీతిలోనే తల్లిదండ్రులకు గొప్పతనం ఉన్నది—అనేది ఒక విధంగా వాస్తవమే అయినా, ఆచార్యుని కంటే తల్లిదండ్రులకు ఆధిక్యం ఉన్నది—అని అంటే, అది తల్లిదండ్రుల కంటే ఆచార్యునకు ఆధిక్యం చెప్పే శాస్త్రంతో విరోధిస్తుంది కదా. ఇదే కాక, తల్లిని, తండ్రిని విడిచిపెట్టమని చెప్పిన శాస్త్రంవలె, ఆచార్యుని విడిచిపెట్టమని చెప్పిన శాస్త్రం ఉన్నదా? లేదు కదా! అక్షరాలను నేర్పించిన గురువులను విడువమని చెప్పిన శాస్త్రం ఉండడం నిజమే. అష్టాక్షరిని ఉపదేశించిన ఆచార్యుడు భగవానుని కంటే గొప్పవాడు కదా. వశిష్ఠుడు శ్రీరామునకు అష్టాక్షరిని ఉపదేశించిన ఆచార్యుడు కదా. లోకంలో తన ఉపదేశ వచనాలతో, కార్యాలతో ధర్మాన్ని స్థాపించడం కోసం అవతరించినవాడు,

ఆ విధంగానే స్థాపించినవాడు అయిన శ్రీరాముడు “ఆచార్యుని వచనం ఆదరించదగినది కాదు, తండ్రి వచనమే ఆదరించదగినది” అని చెప్పేవాడు అయితే, అతనికి ఎవరు సమాధానం చెప్పగలరు? సర్వస్వతంత్రుని కాదని చెప్పడం సాధ్యమవుతుందా? శ్రీరాముని మనస్సు అప్పుడే అయోధ్యకు వచ్చి పట్టాభిషేకం చేసుకోవడానికి అవకాశం ఇవ్వలేదు –అనేదే తప్ప, వేరే దృష్టి ఏదీ లేదు– అనేదే ఇక్కడ మనం గ్రహించవలసిన విషయం.

ఈ సందర్భంలో ఇంకొక చరిత్రను కూడా మనం తెలియాలి. భరతుడు తన కోరికను శ్రీరాముడు అంగీకరించనందున, " శ్రీరాముడు నివసించే ఆశ్రమం వాకిటిలో దర్భలను పరచుకుని, వాటిపై నిరాహారుడనై, శ్రీరాముడు అయోధ్యకు తిరిగి వచ్చేవరకు ప్రాయోపవేశం చేస్తాను"– అనే భావంతో సుమంత్రుని చూచి "దర్భలను తీసుకుని రా" అని అన్నాడు. "ఆ విధంగా చేయడం శ్రీరాముని మనసుకు అనుకూలం కాదు"– అనే భావంతో సుమంత్రుడు దర్భలను తీసుకుని రాలేదు. అప్పుడు భరతుడు–

"శేష్యే పురస్తాత్ శాలాయాం యావన్మే న ప్రసీదతి" (అయోధ్య కాండం– 111–14)

(పర్ణశాల వాకిటిలో నిరాహారంగా ప్రాయోపవేశం చేస్తూ పడుకుంటాను) అని తానే దర్భలను పరచుకుని, వాటిపై పడుకోవడానికి ప్రయత్నం చేశాడు. ఆ సమయంలో శ్రీరాముడు అక్కడకు వచ్చి భరతుడు చేసే పనిని చూసి,

"కిం మాం భరత! కుర్వాణం తాత ప్రత్యుపవేక్ష్యసి?" (అయోధ్య కాండం– 111–16) (నాయనా! భరతా! నేను నీకు ఈ ఏమి కీడు చేశాను అని ఈ విధంగా నిర్బంధిస్తున్నావు?)

నాయనా! నేను నీ స్వామిని. నీవు నా సొత్తు. నిన్ను నా కోరికకు తగినట్లు ఉపయోగించుకోవాలని అనుకున్నాను. అయితే, చేయకూడని పనులు చేయాలి అని నీకు తోచింది కాబోలు. ఈ విధంగా చేయడం నీకు తగునా? ఈ విధంగా చేయకూడని పనిని నీవు చేసి, చేయవలసిన పనిని నేను చేయకుండా అడ్డు

పడడానికి ప్రయత్నిస్తున్నావు. ఇది నీకు చేయదగినది కాదు" అని ఇక్కడ శ్రీరామునకు అభిప్రాయమని తెలుస్తున్నది.

"బ్రాహ్మణో హ్యేకపార్శ్వేన నరాన్ రోద్ధు మిహార్హతి,

న తు మూర్ధాభిషిక్తానాం విధిః ప్రత్యుపవేశనే" (అయోధ్య కాండం –111– 17) "దర్భలను పరిచి పడుకోవడం అనేది బ్రాహ్మణులకు కల ధర్మం. బ్రాహ్మణుడు ఒకడు "ఈ సమయంలో తిరిగి ఇవ్వాలి" అని ఒక నియమం పెట్టి, అప్పుగా ఇంకొకరికి ఇస్తాడు. ఆ విధంగా అప్పు తీసుకున్నవాడు ఋణం ఇచ్చిన బ్రాహ్మణునకు ఇవ్వవలసిన ధనాన్ని చెప్పిన కాలంలో ఇవ్వకపోతే, అప్పు ఇచ్చిన బ్రాహ్మణుడు అప్పు తీసుకున్నవాని ఇంటి వాకిటిలో, నీవు ఇప్పుడు చేయదలచిన విధంగా, దర్భలను పరచుకొని పడుకోవడం క్రమం. కానీ, ఈ ధర్మం క్షత్రియుడవైన నీకు తగినది కాదు. నీవు ఇంకొక వర్ణానికి సంబంధించిన క్రమాన్ని అనుసరిస్తున్నవాడవు కనుక నీకు పాపం వస్తుంది. ఇక, ఈ విధంగా పాపకార్యాన్ని చేయను –అని ప్రమాణం చేసి, నీటిని తాకి, నన్ను తాకు. ఇదే నీవు చేసిన పాపానికి తగిన పరిహారం"– అని భరతుని చూచి శ్రీరాముడు అన్నాడు. ఈ విధంగా భరతుడు కూడా పరిహారాన్ని చేశాడు –అని చరిత్ర.

శ్రీరాముడు దశరథచక్రవర్తి కుమారుడు కనుక క్షత్రియుడు. అంతేకాక ఇతని పాదుకలు అభిషేకం చేయబడినందున మూర్ధాభిషిక్త క్షత్రియుడు– అని చెప్పడానికి అడ్డు లేదు. అయినా, వానరులతో సముద్ర తీరాన్ని చేరి, ఉప్పొంగే సముద్రాన్ని చూచిన కాలంలో, దానిని దాటడానికి తగిన ఉపాయాలను గురించి విచారించి, " ఈ సముద్రాన్ని దాటి ఆవలి తీరాన్ని చేరడానికి 1) సముద్రుని ఉద్దేశించి అతడు అనుగ్రహించేటట్లు ఈ సముద్ర తీరంలో నే దర్భలను పరచుకుని వాటిపై శయనించడం, 2) ఆనకట్ట కట్టడం, 3) ఈ సముద్రంలో నీరు కొంచెం కూడా లేకుండా ఎండగట్టడం–అని పలు ఉపాయాలు ఉన్నాయి. వాటిలో, సముద్రతీరంలో దర్భలను పరచుకొని శయనించడమే గొప్ప ఉపాయం– అని అన్నాడు.

"తపసా సేతుబంధేన సాగరోచ్ఛోషణేన వా,

సర్వథా సుసమర్థోఽస్మి సాగరస్యాస్య లంఘనే"

అనే శ్రీరాముని వచనాన్ని ఇక్కడ స్మరించాలి. ఈ శ్లోకంలో ఉండే "తపసా" అనే ప్రయోగం గమనించదగినవి. ఇంతేకాక, " ధర్మాత్మా" అని పొగడబడే విభీషణుడు కూడా,

"సముద్రం రాఘవో రాజా శరణం గంతు మర్హతి" (యుద్ధ కాండం– 19– 31)

(ప్రభువైన శ్రీరాముడు సముద్రుని శరణు పొందడం తగినది) అని అన్నాడు. శ్రీరాముడు కూడా సముద్రునకు ఎదురుగా దర్భశయనంలో శయనించాడు– అనేది చరిత్ర. అభిషేకం చేసుకోని భరతుని చూచి "ఇది బ్రాహ్మణ ధర్మం, అభిషిక్త క్షత్రియునకు చేయదగిన ధర్మం కాదు, ఈ విధంగా నీవు చేయడం పాపం"అని పలికిన శ్రీరాముడు ఇంతకుముందు తెలిపినట్లుగా అభిషేకం చేసికొన్న క్షత్రియుడైన తాను ఈ విధంగా చేయడం క్రమమేనా?

అంతేకాక, భరతుడు శ్రీరామునకు తమ్ముడు కనుక, అభిషేకానికి యోగ్యుడు కాడు, కేకయదేశంనుండి తిరిగి అయోధ్యకు వచ్చి, తన తల్లి ఇంటిలో తండ్రి దశరథుడు మరణించడం విని, భూమిలో పడి దొర్లుతూ ఏడ్చినపుడు తన తల్లి తనను చూచి "రాజన్!" అని పిలిచిన పిలువడం సహించలేకపోయాడు కదా, భరతుడు.

ఇంతేకాక, కులగురువు తన గురువు అయిన శ్రీవశిష్ఠుడు" రాజ్యాన్ని స్వీకరించి అభిషేకం చేసుకో" అని తనతో అన్నప్పుడు, భరతుడు, "వశిష్ఠుడు చాలా పూజించబడదగినవాడు" అనే విషయాన్ని చూడకుండా, అతనిని పలు విధాలుగా దూషిస్తూ, " నేను, రాజ్యం శ్రీరామునకు వాస్తవంగా సొత్తుగా ఉండగా, ఈ రాజ్యాన్ని నేను ఏ విధంగా వహించడం సాధ్యం?"అని పెద్ద సభలో ఏడుస్తూ, పలికిన మహానుభావుడు కదా భరతుడు.

ఇంతేకాక, "ఆర్తియే ఒక రూపాన్ని పొంది వచ్చింది" అనే విధంగా ఉండే భరతుడు కులగురువైన వశిష్ఠునితో, సుమంత్రుడు మొదలైన పెద్దలతో, మంత్రులతో, తల్లులతో, ఇంకా, అయోధ్యా పురజనులతో కలసి చిత్రకూటానికి

వచ్చి, శ్రీరాముని పాదపద్మాలలో వేరు తెగిన చెట్టువలె పడి, అయోధ్యకు తిరిగి వచ్చి పట్టాభిషేకం చేసికొమ్మని శ్రీరాముని ప్రార్థించాడు కదా.

భరతుని వాస్తవమైన స్థితి ఈ విధంగా ఉండగా, అతనికి పాపం అనేది ఉన్నదా? ఇతడు క్షత్రియుడు అయినా, మూర్ధాభిషిక్త క్షత్రియుడు అని అనడానికి అవకాశం ఉన్నదా? పాపానికే అవకాశం లేనప్పుడు, పరమపురుషుడు పరిహారాన్ని చేయమని ఆజ్ఞాపించడం తగినదా? అయితే, శ్రీరాముడు ఆజ్ఞాపించినట్లు భరతుడు పరిహారాన్ని చేశాడు కదా? అని కొందరు ప్రశ్నించవచ్చు. శ్రీరాముడు వనానికి రావడానికి తన పాపమే కారణం– అని పలికినవాడు, నిజానికి పాపం అనేది ఏ మాత్రం లేనివాడు అయిన భరతుడు తననుగూర్చి తాను భావించడానికి తగినట్లు పరిహారాన్ని చేసికొన్నాడు తప్ప, నిజానికి పాపం ఉన్నందువల్ల పరిహారాన్ని చేసుకున్నాడు– అనేది ఇక్కడ విషయం కాదు –అని మనం తెలియాలి.

ఈ సందర్భంలో తన శక్తికి తగినట్లు నడుచుకునే భరతుడు స్వామి అయిన శ్రీరాముని మనస్సుకు అనుగుణంగా లేని, దర్భలను పరిచి దానిపై శయనించడం అనే కార్యాన్ని చేయాలని ప్రయత్నించడం సక్రమమేనా? అనే ప్రశ్న ఏర్పడుతుంది. భరతుడు శ్రీరాముని అభిప్రాయాన్ని అనుసరించి నడవవలసిన తన స్థితికి తగని ఈ కార్యాన్ని చేయాలని ప్రయత్నించడం శ్రీరాముని విషయంలో ఉండే భక్తివల్లనే కదా! అందుచేత ఇది ఏ విధంగా దోషమని మనం భావించడానికి వీలవుతుంది? నమ్మాళ్వార్, తిరుమంగై ఆళ్వార్ వంటివారు భగవంతుని పొందలేని సమయంలో తమ ప్రాణాన్ని భరించలేక, ఆ స్వామిని క్రమం తప్పి అయినా పొందాలి అని మడల్ ఎక్కడం, దూతలను పంపించడం మొదలైన కార్యాలను, అవి తమ స్వరూపానికి తగని అయినా, చేయడం ఏ విధంగా వారి భక్తియొక్క ఆధిక్యంవల్ల సంభవించాయో, ఆ విధంగానే శ్రీభరతుని ఈ కార్యంకూడా అతని భక్తియొక్క ఆధిక్యంచేత సంభవించింది అని మనం తెలియాలి. అందువల్ల భరతుడు దోషం లేనివాడు. అయినా, అతడు చేసిన పనిమాత్రం శ్రీరాముని మనస్సుకు అనుగుణంగా లేదు –అని మాత్రమే మనం గ్రహించడానికి సాధ్యం.

"భరతా కైకేయిని దూషించడం తగదు" అని, "ఆచార్యుల కంటే తండ్రికి ఆధిక్యమున్నందున, తండ్రి మాటే మనకు ఆదరించ దగినది" అని, "భరతా! నీవు పాపం చేసినందున పరిహారాన్ని చేసుకో" అని శ్రీరాముడు పలికిన మాటలకు యథాతథంగా, ఆ విధంగానే అర్థం గ్రహించకుండా, వాటిని సంకోచంపచేసి, ఈ మాటలకు అంతరార్థాన్ని శ్రీరాముని మనస్సు తగినట్లు కాకుండా గ్రహించడం ఏ విధంగా తగినది? అనే ఒక ఆక్షేపం ఇక్కడ కలుగవచ్చు. స్పష్టంగా తోచే అర్థం విడచి, వేరే ఒకటి అయిన అంతరార్థాన్ని గ్రహించడం—అనేది గొప్ప క్రమం అనే విషయాన్ని ఒక దృష్టాంతం ద్వారా తెలియజేస్తాను.

శ్రీరాముడు సుగ్రీవునితో స్నేహం చేశాడు. సుగ్రీవుడు కోరినట్టు వాలిని సంహరించి రాజ్యాన్ని, రుమ అనే సుగ్రీవుని భార్యను సుగ్రీవుడు పొంది, పూర్వం వలే ఆనందంగా కాలం గడిపేటట్లు చేశాడు. ఆ సమయంలో వాలికి, సుగ్రీవునకు రెండు పర్యాయాలు యుద్ధం జరిగింది. మొదట జరిగిన యుద్ధంలో శ్రీరాముడు వాలిని సంహరిస్తానని చెప్పినప్పటికీ, ఆ విధంగా సంహరించ లేదు. ఆ సమయంలో సుగ్రీవుడు తనకు సాధ్యం అయినంతవరకు వాలితో యుద్ధం చేసి, తనకంటే చాలా ఎక్కువ బలాన్ని కలిగిన వాలిచేత బాగా దెబ్బలు తిని, చివరకు సహించలేక వెన్ను చూపి పారిపోయాడు– అనే చరిత్ర ప్రసిద్ధమైనది. తరువాత సుగ్రీవుడు శ్రీరామునితో "రామా! నీవు చెప్పినట్లుగా ఎందుకు వాలిని చంపలేదు?" అని అడిగాడు. దానికి శ్రీరాముడు ఈక్రింది విధంగా సమాధానం పలికాడు.

“సుగ్రీవ శ్రూయతాం తాత! క్రోధం చ వ్యపనీయతామ్!

కారణం యేన బాణోఽయం న మయా స విసర్జితః,

అలంకారేణ వేషేణ ప్రమాణేన గదేన చ!

త్వం చ సుగ్రీవ వాలీ చ సదృశౌ స్థః పరస్పరమ్,

స్వరేణ వర్చసా చైవ ప్రేక్షితేన చ వానర!

విక్రమేణ చ వాక్యైశ్చ వ్యక్తిం వాం నోపలక్షయే,

తేనాహం రూపసాదృశ్యాత్ మోహితో వానరోత్తమ!

నోత్సృజామి మహావేగం శరం శత్రునిబర్హణమ్" (కిష్కింధా కాండం –12– 31–34)

ఈ శ్లోకాలలో పైన స్ఫురించే అర్థాన్ని ఈ విధంగా గమనించవచ్చు.

సుగ్రీవా! పోలికలోను, శరీర సన్నివేశంలోను, ఎత్తులోను, నడకలోను, గొంతులోను, తేజస్సులోను, చూపులోను, పరాక్రమంలోను, వాక్యాలలోను నీవు, వాలికూడా ఒకరితో ఒకరు చాలా పోలికతో ఉన్నారు. అందుచేత మీ ఇద్దరిలో ఎవరు వాలి, ఎవరు నీవు– అనే విషయం నేను తెలుసుకోలేకపోయాను. ఈ సందేహంలో నేను బాణాన్ని విడచి, అది ఒకవేళ నిన్ను తాకితే, ఆపద సంభవిస్తుంది–అని భయపడి, నేను ఏమీ చేయలేకపోయాను.

ఈ విధంగా పైపైకి తోచే అర్థాన్ని ఇక్కడ గ్రహించడం సమంజసం కాదు. గొప్ప జ్ఞాని అయిన శ్రీరామునకు వాలి సుగ్రీవుల మధ్య ఉండే తేడా నిజానికి తెలియడం సాధ్యం కాదా? అల్పమైన జ్ఞానాన్ని కలిగినవాడుకూడా దెబ్బలు కొట్టేవాడు వాలి అని, దెబ్బలు తినేవాడు సుగ్రీవుడు అని సులభంగా తెలియగలడు. ఈ సందర్భంలో మన పూర్వాచార్యుల అభిప్రాయం ఏది? అని మనం తెలుసుకోవాలి.

భగవంతుడు చేతనుని చూసి "నీవు, నీకు నా విషయంలో ఉండే ప్రేమను నా భక్తుల విషయంలో కూడా కలిగి ఉండు. ఆ విధంగా నీవు నా భక్తుల పట్ల ప్రేమను కలిగి ఉండకుండా ఉంటే, నీవు వారి విషయంలో అపచారపడినవాడవు అవుతావు. అందుచేత నీకు మాత్రం ప్రమాదం జరుగుతుంది, నష్టం జరుగుతుంది–అని భావించకు. నీవు, నీతో సంబంధం ఉండే ప్రపంచం కూడా నశిస్తుంది" అని అన్నాడు.

"యా ప్రీతిః మయి మద్భక్తేషు సదాస్తు తే,

అవమానక్రియా తేషాం సంహరత్యఖిలం జగత్" అని పలికిన భగవంతుని సూక్తిని గమనించాలి.

అందుచేత మనం ఇక్కడ ఒక తత్వాన్ని తెలియవచ్చు. ఒక జీవుడు భగవంతుని క్రమానుసారంగా ఆశ్రయించి, తాను కోరిన ప్రయోజనాన్ని పొందేటప్పుడు, అతడు భగవంతుని క్రమానుసారంగా ఆశ్రయించినా, అతని భక్తుల విషయంలో అపచారం కొంచెం కూడా చేయకుండా ఉండడం చాలా అవశ్యకం. ఈ విధంగా కాకుండా, అపచారం చేసినట్టయితే, అతడు తాను కోరిన ఫలాన్ని పొందలేడు. శరణాగతి ధర్మాన్ని మనం తెలిసేటప్పుడు, భగవద్భక్తుల విషయంలో కొంచెం కూడా అపచారం చేయకుండా ఉండడం ఆవశ్యకమైన క్రమం అనేది మనకి తెలియాలి,

మనం ఈ విషయాన్ని మనసులో పెట్టుకొని సుగ్రీవుని చరిత్రను గమనించాలి. సుగ్రీవుడు భగవంతుని విషయంలో భక్తి కలవాడు అనేది నిజమే అయినా, అతడు లక్ష్మణుని విషయంలో ఏ విధంగా ప్రేమను చూపించాలో, ఆ విధంగా చూపించినవాడు కాడు. సుగ్రీవుడు, శ్రీరాముడు అగ్నిసాక్షిగా స్నేహాన్ని చేసికొన్నారు. ఈ విధంగా స్నేహం చేసికొన్న తరువాత, సుగ్రీవుడు ఆకులు, పూలు నిండుగా ఉండే ఒక చెట్టు కొమ్మను విరిచి, భూమిపై వేసి, దానిపై శ్రీరామునితో పాటు కూర్చుని, అతనికి తన కోరికను తెలియజేసి, దానిని తీర్చమని ప్రార్థించాడు. ఈ విధంగా సుగ్రీవుడు, శ్రీరాముడు పూలు ఆకులు నిండుగా ఉండే చెట్టు కొమ్మపై కూర్చుని, పరస్పరం సంభాషించుకోవడం శ్రీరామాయణంలో చాలాసార్లు వర్ణింపబడింది. అయితే ఒక్కసారి కూడా లక్ష్మణునకు సుగ్రీవుడు ఈ విధంగా ఆసనాన్ని ఇచ్చి, ఉపచారం చేసిన చరిత్ర శ్రీరామాయణంలో ఎక్కడా చెప్పబడలేదు.

"తస్యైకాం పర్ణబహుళాం భంక్త్వా శాఖాం సుపుష్పితామ్,

సాలస్యాస్తీర్య సుగ్రీవః నిషసాద సరాఘవః" (శ్రీ రామాయణం– కిష్కింద కాండం– 8– 13) అనే శ్లోకాన్ని ఇక్కడ గమనించాలి.

సుగ్రీవుడు చేసిన ఈ పనిని చూచినప్పుడు, అతనికి లక్ష్మణుని విషయంలో కలిగి ఉండక పోవడం మాత్రమే కాకుండా, అతని విషయంలో అపచారం కూడా చేశాడు– అని తెలుస్తున్నది. దీనిని శ్రీరాముడు స్పష్టంగా చూచినవాడు కనుక, మొదట సుగ్రీవునకు వాలికి మధ్య యుద్ధం జరిగిన సమయంలో, వాలిని చంపడం అతని మనసుకు ఇష్టం లేకుండా ఉన్నది. తరువాత కూడా సుగ్రీవుడు తాను చేసిన తప్పును తెలుసుకుని, లక్ష్మణుని విషయంలో ఏ విధంగా ప్రేమను చూపించాలో ఆ విధంగా చూపించినట్లు చరిత్రలో చెప్పబడలేదు. అయినప్పటికీ, తనను ఆశ్రయించినవారిని తన భక్తుల అభిమానానికి పాత్రంగా చేసి, వారి కార్యాన్ని పూర్తి చేయడం అనేది భగవంతుని ఒక ఉన్నతమైన క్రమం. ఈ క్రమాన్ని మనసులో పెట్టుకొని, సుగ్రీవుని కంఠంలో లక్ష్మణుడు తన చేతులతో గుర్తుగా గజపుష్పమాల అలంకరించేటట్లు చేయడం ద్వారా, ఆ భాగవతోత్తముని ప్రేమకు సుగ్రీవుని లక్ష్యంగా శ్రీరాముడు చేశాడు. తరువాత వాలిని రెండవ సారి జరిగిన యుద్ధంలో శ్రీరామడు సంహరించి, సుగ్రీవునకు అతడు కోరిన ప్రయోజనాన్ని లభింపజేశాడు.

ఈ విధంగా పైపైకి తోచే అర్థంలో నిజంగా దృష్టి లేదు, లోపలి అర్థంలోనే ఉత్తముల మాటకు దృష్టి అని తెలుస్తున్నది. ఈ విధంగానే, భరతుని శరణాగతి ప్రకరణంలో ఉండే, పురుషోత్తముడైన శ్రీరాముని "మాతరం రక్ష కైకేయీమ్", "ఆజ్ఞాతం యన్మయా తస్య" అనే మాటలకు కూడా పైపైకి తోచే అర్థంలో దృష్టి లేదు, లోపలి అర్థంలోనే దృష్టి అని మనం తెలియాలి. ఈ విధంగా భరతుడు శ్రీరాముని క్రమానుసారంగా ఆశ్రయించినా, ఆ ఆశ్రయణం శ్రీరాముని మనసుకు అభిమతంగా లేని కారణం చేత అది ఫలించలేదు–అని తెలుస్తున్నది.

కాకాసుర వృత్తాంతం

ముందుగా కాకాసురుని చరిత్రను చూద్దాం. చిత్రకూటంలో శ్రీరాముడు సీతాదేవి ఒడిలో నిద్రించే కాలం అది. అప్పుడు ఇంద్రుని పుత్రుడు చెడ్డ బుద్ధితో కాక రూపాన్ని ధరించి, సీతాదేవిని దగ్గరకు వచ్చి, ఆమె శరీరాన్ని ముక్కుతో గాయపరిచాడు, ఆమె ఆ గాయం వల్ల కలిగిన బాధను తట్టుకోలేక, తన ఒడిలో

నిద్రపోతున్న శ్రీరాముని నిద్ర లేపింది. శ్రీరాముడు నిద్రలేచి జరిగిన సంఘటనను తెలుసుకుని, కాకాసురునిపై బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించాడు. అది కాకాసురుని తరిమింది. అతడు అందరి దగ్గరకు వెళ్ళి తనను రక్షించమని ప్రార్థించాడు. అయినప్పటికీ ఎవరూ అతనిని రక్షించలేదు. ఎక్కడా రక్షణ దొరకని కాకాసురుడు చివరకు గతి లేనివాడై, శ్రీరాముని ముందుకు వచ్చి పడ్డాడు. అతని ఆ స్థితిని చూచిన సీతాదేవి అతనిని రక్షించమని శ్రీరాముని ప్రార్థించింది. శ్రీరాముడు కూడా బ్రహ్మాస్త్రం వ్యర్థం కాకుండా ఉండేటట్టు కాకాసురుని రెండు కనులలో ఒక కన్నును ఆ అస్త్రానికి ఎరగా చేసి. ఆ అసురుని ప్రాణాన్ని రక్షించాడు– అనేది చరిత్ర.

ఈ చరిత్రను

"వాయుసేన తతః తేన బలవత్ క్లిశ్యమానయా,

స మయా బోధితః శ్రీమాన్ సుఖసుప్తః పరంతపః" (శ్రీ రామాయణం– సుందరకాండ –39– 25)

(తరువాత ఆ కాకాసురునిచే బలంగా బాధింపబడిన నేను నా ఒడిలో సుఖంగా నిద్ర పోతున్నవాడు, ఆ సన్నివేశంలో చాలా అందంగా ఉండేవాడు, శత్రువులను తపింప చేయగలిగినవాడు అయిన శ్రీరాముని నిద్ర లేపాను) అని,

“స పితా చ పరిత్యక్తః సురైశ్చ సమహర్షిభిః,

త్రీన్ లోకాన్ సంపరిక్రమ్య తమేవ శరణం గతః" (38– 34)

(ఆ కాకాసురుడు తండ్రిచే, తల్లిచే, మహర్షులచే, ఇంకా, దేవతలచే విడువబడినవాడై, మూడు లోకాలలో అంతటా సంచరించి తిరిగి, చివరకు ఆ శ్రీరాముని శరణు పొందాడు) అని,

"స తం నిపతితం భూమౌ శరణ్యః శరణాగతమ్,

వధార్హమపి కాకుత్ స్థః కృపయా పర్యపాలయత్" (38–35)

(శరణు పొందినవాడు, భూమిపై పడినవాడు అయిన అతనిని శరణు పొందదగినవాడైన శ్రీరాముడు తన కరుణతో కాపాడాడు) అని ఉండే శ్రీరామాయణవచనాల వల్ల,

"శిత్తిరకూడత్తు ఇరుప్పచ్చిఱు కాక్కై ములై తీండ

అత్తిరమే కొండెఱియ అనైత్తులకమ్ తిరిందోడి,

విత్తకనే!ఇరామా! నిన్బయమ ఎన్ఱు అళైప్ప

అత్తిరమే అదన్ కణ్ణై అఱుత్తదు మోరడ్డైయాళమ్"

అనే పెరియాళ్వార్ తిరుమొళి (3–10 –6) పాశురం వల్ల తెలియవచ్చు.

సీతాదేవి విషయంలో కాకాసురుడు, రావణుడు–ఇద్దరూ సహించలేని బాధను కలిగించారు. రావణుడు సీతాదేవిని ఎత్తుకొని పోయి చెరలో పెట్టాడు. అతడు, అతనికి చెందిన రాక్షస స్త్రీలు సీతాదేవికి చాలా బాధను కలిగించారు అనేది నిజమే. అయినా, సీతాదేవి శరీరంలో బాధను కలిగించలేదు, ఆ విధంగా కాకుండా ఆమె శరీరంలో బాధను కలిగించినవాడు, కాకాసురుడు. ఇటువంటి క్రూరమైన పాపాన్ని రావణుడు చేయలేదు. అందుచేత రావణుని పాపం కంటే కాకాసురుని పాపమే చాలా అధికం అని తెలుస్తున్నది. కాకాసురుడు బ్రహ్మాస్త్రంతో తరుమబడి, ఎక్కడా శరణు పొందలేక చివరకు రాముని ముందుకు వచ్చి పడ్డాడు. ఆ విధంగానే రావణుడు కూడా శ్రీరామునితో యుద్ధం చేసిన సమయంలో, మొదట శ్రీరాముని బాణాలతో కొట్టబడి, తన చేతిలో ఉండే విల్లును

విడిచిపెట్టి, రథంలో తాను ఉండే చోటును కూడా విడచిపెట్టి నిశ్చేష్టుడై పోయాడు– అని వాల్మీకి భగవానుడు తెలియజేశాడు.

ఈ విధంగా నిశ్చేష్టుడై పడి ఉండడం అనేది రావణుడు, కాకాసురుడు– అనే ఈ ఇద్దరికీ సమానమే అయినా, రావణుని కంటే కాకాసురుడు ఎక్కువ పాపాన్ని చేసినవాడైనా, రావణుడు లంకతో పాటుగా నశించి పోయాడు. కాకాసురుడు కేవలం ఒక కంటిని మాత్రం పోగొట్టుకొని, ప్రాణాలను దక్కించుకున్నాడు. కాకాసురునకు సీతాదేవి సాన్నిధ్యం, అందువల్ల అతనికి లభించిన సీతాదేవియొక్క సహజమైన కరుణ– అనేవి దీనికి కారణాలు– అని మన పూర్వాచార్యులు అంటారు.

ఈ సందర్భంలో "ఇవళ్ సన్నిధియాలే కాకమ్ తలై పెట్రదు. అదిల్లామైయాలే రావణన్ ముడిందాన్" (ముముక్షుప్పడి –135) (సీతాదేవి సన్నిధి వల్ల కాకాసురుడు తన ప్రాణాన్ని రక్షించుకున్నాడు, ఇది లేనందువల్ల రావణుడు నశించి పోయాడు) అనే శ్రీ పిళ్ళైలోకాచార్యులవారి సూక్తి స్మరించదగినది.

"ఇవళ్ సన్నిధియాలే అపరాధత్తై తీరక్కళియ చ్చెయ్ దు బ్రహ్మాస్త్రత్తుక్కు ఇలక్కాయ్ తలై అఱుప్పుణ్ణ త్తేడిన కాకమ్––– తలై పెట్రు పోయిట్రు. ఇప్పడి ఇరుక్కిఱ ఇవళ్ సన్నిధి ఇల్లామైయాలే పోక్కట్రు చ్చెయల్ మాండు నిన్ఱ నిలై ఒట్రిరుక్కచ్చెయ్ దేయుమ్, కాకత్తోపాది అపరాధముమ్ ఇన్ఱిక్కే యిరుక్క, రామ శరత్తు ఇలక్కాయ్ రావణన్ ముడిందు పోనాన్ ఎన్ఱె" (ఈమె సాన్నిధ్యం వల్ల, అపరాధాన్ని ఏ లోటూ లేకుండా చేసి, బ్రహ్మాస్త్రానికి లక్ష్యమై, తనను రక్షించేవారు ఎవరు? అని లోకం అంతా అన్వేషించిన కాకాసురుడు ప్రాణాలను దక్కించుకున్నాడు. ఆ విధంగా ఈమె సాన్నిధ్యం లేనందువల్ల, నిశ్చేష్టుడై ఉండడం అనేది ఇద్దరికీ సమానమే అయినా, కాకాసురునివలె తీరని అపరాధాన్ని చేయకపోయినా, రాముని బాణానికి లక్ష్యమై, రావణుడు నశించి పోయాడు) అనేసి శ్రీవరవరముల సూక్తికూడా స్మరించదగినది.

ఇంతవరకు చెప్పిన దానినిబట్టి, గొప్ప అపరాధం చేసినవాడు కూడా లక్ష్మీదేవిని పురస్కరించుకొన్నపుడు, భగవంతుని సహజమైన కృపకు లక్ష్యమై, హితాన్ని పొంది తరించవచ్చు– అనే తత్వం స్పష్టమవుతున్నది.

విభీషణ శరణాగతి

ఇంతవరకు, 1) భగవంతుడు గొప్ప ధర్మం అనే విషయాన్ని, 2) అతడు జీవుని ప్రార్థనను, ఆ చేతనుడు తనను ఆశ్రయించేటపుడు లక్ష్మీదేవిని ముందుంచుకోవడం ఎదురు చూస్తాడని, 3) జీవుడు భగవంతుని ఆశ్రయించేటపుడు ఆ ఆశ్రయణం భగవంతుని మనసుకు అభిమతమై ఉండాలి అనే విషయాన్ని గమనించాము. ఈ విధంగా ఉండే ధర్మం శ్రీరామాయణంలో సుస్థాపింపబడిన చోటు విభీషణశరణాగతి సందర్భం. ఇందులో మన పూర్వాచార్యులచేత నిరూపింపబడిన సారమైన అర్థవిశేషాలు ఎన్నో ఉన్నాయి. వాటిని ఇక విజ్ఞాపన చేస్తాను.

శ్రీరాముడు కూడా శరణాగతి ధర్మాన్ని అనుష్ఠించడం

దేవతలు, లక్ష్మణుడు, భరతుడు, దండకారణ్యమునులు, విభీషణుడు అనే ఉన్నతాధికారులకు మించి, అనుష్ఠానపరుడైన శ్రీరాముడు కూడా శరణాగతి ధర్మాన్ని ఆచరించి, శరణాగతియే గొప్ప ధర్మం– అనే విషయాన్ని స్థాపించాడు. శరణ్యుడై ఉండేవాడు భగవంతుడు ఒక్కడే. శరణాగతుడై ఉండవలసినవాడు సంసారి జీవుడే, భగవంతుడు కాదు. అయినా, శ్రీరామావతారం అనుష్ఠాన ప్రధానమైన అవతారం కనుక, భగవంతుడు శరణాగతి ధర్మాన్ని తానే శరణుడై శరణాగతుడై సుస్థాపించాడు. ఇది ఈ ఒక్క అవతారంలో మాత్రమే కనిపించే ఒక గొప్ప తనం.

"సుగ్రీవం శరణం గతః" (సుందరకాండం– 4–19) (శ్రీరాముడు సుగ్రీవుని శరణు పొందాడు) అనే విధంగా,

"సముద్రం రాఘవో రాధా శరణం గంతు మర్హతి" (యుద్ధ కాండం –19 –3) (ప్రభువైన శ్రీరాముడు సముద్రుని శరణం పొందడం తగినది) అనే విధంగా శ్రీరాముడు తనకు అసాధారణమైన ధర్మం శరణ్యత్వమైనా, శరణాగతి ధర్మాన్ని అనుష్ఠించడం ఎందుకంటే, సామాన్యులమైన మనవంటివారు పొందవలసిన విశేష ధర్మమైన శరణాగతిని సుస్థాపించడంకోసమే.

శరణాగతి సఫలం కావాలంటే, అది శరణ్యుని వద్ద చేయబడాలి. ఎవరి దగ్గర శరణాగతి చేయబడుతున్నదో, అతని దగ్గర శరణ్యత్వం (శరణ్యుని స్వభావం) ఉండాలి. అంతేకాదు, శరణాగతునకు అధికారిస్వరూపం (ఇది అధికారి విశేషణం, శరణాగతి చేయడానికి తగిన యోగ్యతలు అనేవి కూడా అంటారు) ఉండాలి. శరణాగతునకు ఉండవలసినవి– ఆకించన్యం, అనన్యగతిత్వం అనేవి. ఇవి రెండు చక్కగా ఉంటేనే శరణాగతి సఫలం అవుతుంది శ్రీరాముడు సముద్రుని దగ్గర చేసిన శరణాగతి ఫలించకపోవడానికి కారణం– శరణ్యుడైన సముద్రుని దగ్గర శరణ్యత్వం, శరణాగతుడు అయిన శ్రీరామునిలో శరణాగత స్వరూపం లేకపోవడమే.

శ్రీరాముడు శరణ్యుడు– అనే విషయాన్ని సీతాదేవి, విభీషణుడు, బ్రహ్మ అనే వీరి మాటల ద్వారా స్థాపించడం

సీతాదేవి వచనాలు

"మిత్రమౌపయికం కర్తుం రామః స్థానం పరీప్సతా,

వధం చానిచ్ఛతా ఘోరం త్వయాసౌ పురుషర్షభః,

విదితః స హి ధర్మజ్ఞః శరణాగత వత్సలః

తేన మైత్రీ భవతు తే యది జీవితు మిచ్ఛసి

ప్రసాదయస్వ తం చైనం శరణాగత వత్సలమ్

మాం చాస్మై ప్రయతో భూత్వా నిర్యాతయితు మర్హసి" (సుందరకాండం –21– 19, 20, 21)

(నీవు ప్రాణాలతో బ్రతికి ఉండాలి అంటే రామునితో స్నేహం చేసుకో. రాముడు పురుష శ్రేష్ఠుడు. ధర్మాన్ని తెలిసినవాడు. తనను శరణు పొందినవారిని దోషాలను కొంచెంకూడా గమనించడు. (ఈ సందర్భంలో వాత్సల్యశబ్దానికి దోషాదర్శనం– అనేది అర్థమని శ్రీవరవరమునుల వివరణం) ఘోరమైన వధను తప్పుకొని, ఏ లోటు లేని ఉజ్జీవనాన్ని కోరుకుంటే, నీవు శ్రీరామునితో స్నేహాన్ని చేసుకోవడంలో ఒక ఉపాయం ఉన్నది. నీ ఇంద్రియాలను అణచుకున్నవాడవై, నన్ను శ్రీరాముని దగ్గరకు అప్పగించి, అతనిని సంతోషపెట్టు) అని సీతాదేవి రావణునకు చేసిన ఉపదేశం.

విభీషణుని సూక్తి

"సర్వలోకశరణ్యాయ రాఘవాయ మహాత్మనే" (యుద్ధ కాండం –17 –5) (అన్ని లోకాలలో ఉండేవారికి శరణ్యుడైన, గొప్ప గుణాలను కల శ్రీరాముని), అని.

బ్రహ్మ మొదలైన దేవతల సూక్తి

"శరణ్యం శరణం చ త్వా మాహుః దివ్యా మహర్షయః" (యుద్ధకాండ– 120 –18)

(గొప్ప జ్ఞానాన్ని కల మహర్షులు నిన్నే ఉపాయంగా, పొందబడే ఫలంగా పలుకుతున్నారు) అని శ్రీరాముని శరణ్యత్వాన్ని సీతాదేవి, విభీషణుడు, బ్రహ్మ మొదలైన దేవతల మాటలవల్ల వాల్మీకి భగవానుడు స్థాపించాడు.

శరణాగత రక్షణం పరమధర్మం అనే శరణ్యుని అధ్యవసాయం ఉండే రీతిని తెలియజేయడం

1) భగవంతుడు దేవతల శరణాగతిని అంగీకరించి, దానిని సఫలం చేయడానికి నిర్ణయించుకుని శ్రీరామావతారాన్ని ఎత్తడం,

2) దండకారణ్యంలోని ఋషులను కాపాడడంకోసం శ్రీ రాముడు రాక్షసులను సంహరించే కాలంలో సీతాదేవి పలికిన మాటలు, దానికి శ్రీరాముడు పలికిన సమాధానం,

3) సీతాదేవి విషయంలో గొప్ప అపచారం చేసిన కాకాసురునకు ప్రాణభిక్షను పెట్టడం,

4) విభీషణుని కరుణించకూడదు అని వానరవీరులు ఆక్షేపించగా, దానికి శ్రీరాముడు తగిన సమాధానాలను ఇవ్వడం– అనే ఇవి అన్నీ శరణాగత రక్షణ పరమ ధర్మం అనే తన అభిప్రాయాన్ని స్థాపించడమే. వీటిని గూర్చి విస్తృతంగా విభీషణ శరణాగతి ప్రకరణంలో చూద్దాం.

శ్రీరాముని శరణ్యత్వ నిరూపకమైన పరత్వం ఉండే రీతిని నిరూపించడం

శ్రీరాముడు శ్రీమన్నారాయణుని అవతార విశేషం– అనే విషయాన్ని అతని అవతార చరిత్రను తెలిపే భాగంలో మనం ఇంతకు ముందే గమనించాము. ఇంతేకాక,

"స హి దైవైరుదీర్ణస్య రావణస్య వధార్థిభిః,

అర్థితో మానుషో లోకే జజ్ఞే విష్ణుః సనాతనః" (అయోధ్య కాండం– 1–7)

(దుర్మార్గుడైన రావణుని వధించడంకోసం దేవతలచేత ప్రార్థింపబడిన, సనాతనుడైన విష్ణువు మానవరూపంలో జన్మించాడు) అనే వచనాన్ని స్మరించాలి. ఇంతే కాక,

"వ్యక్త మేష మహాయోగీ పరమాత్మా సనాతనః,

అనాదిమధ్యనిధనః మహతః పరమో మహాన్,

తమసః పరమో ధాతా శంఖచక్రగదాధరః,

శ్రీవత్సవత్సాః నిత్యశ్రీ అజయ్యః శాశ్వతో ధ్రువః,

మానుషం వపురాస్థాయ విష్ణుః సత్యపరాక్రమః,

సర్వైః పరివృతో దేవైః వానరత్వ ముపాగతైః,

సర్వలోకేశ్వరః సాక్షాత్ లోకానాం హితకామ్యయా,

సరాక్షస పరీవారం హతవాం స్త్వాం మహద్యుతిః" (యుద్ధకాండం–114)

"ఇని యఱిన్దేన్ ఈశఱుక్కుమ్ నాన్ముగఱుక్కుమ్ దెయ్ వమ్, ఇని యఱిన్దేన్ ఎంబెరుమాన్ ఉన్నై" (నిన్ను బ్రహ్మకు శివునకు ప్రభువుగా తెలుసుకొన్నాను, స్వామీ! నిన్ను నేను గ్రహించాను) అనే విధంగా ఇంతవరకూ నేను తెలుసుకోలేకపోయాను, ఇప్పుడు తెలిసికొన్నాను. ఈ రాముడు సకల కళ్యాణ గుణాలకు సముద్రుడు. తనకు సాటి, మేటి ఎవరూ లేనివాడు. బ్రహ్మ, శివుడు, ఇంద్రుడు మొదలైన దేవతల కంటే అధికుడు. వైకుంఠంలో ఉండేవాడు, శంఖం మొదలైన ఆయుధాలను ధరించేవాడు. శ్రీవత్సం అనే పుట్టుమచ్చను వక్షఃస్థలంలో కలవాడు. లక్ష్మీదేవితో నిత్యసంబంధం కలవాడు. జయించడానికి సాధ్యం కానివాడు. సర్వలోక శరణ్యుడైన నారాయణుడే. లోకహితాన్ని దృష్టిలో పెట్టుకుని లోకకంటకుడవు అయిన నిన్ను మానవ రూపంతో అవతరించి వధించాడు అనే మండోదరివచనాలవల్ల శ్రీరాముడు నారాయణుడే అని స్పష్టంగా తెలుస్తున్నది. రావణ వధ తరువాత, బ్రహ్మ మొదలైన దేవతలు–

"కర్తా సర్వస్య లోకస్య శ్రేష్ఠో జ్ఞానవతాం వరః" (యుద్ధ కాండం– 120–6) (శ్రీరామా! నీవు అన్ని లోకాలకు కారణభూతుడవు. జ్ఞానం కలిగినవారిలో గొప్పవాడవై, అంతటా వ్యాపించి ఉన్నావు.) అని,

"త్వం త్రయాణాం హి లోకానామపి కర్తా స్వయంప్రభుః" (యుద్ధ కాండం– 120 –19) (శ్రీరామా! నీవే మూడు లోకాలను సృష్టించిన ఆదికారణమై, అందరిని మించినవాడవై ఉన్నావు) అని,

"జగత్ సర్వం శరీరం తే" (యుద్ధ కాండం –120 –26) (ఈ లోకం అంతా నీకు శరీరం) అని, ఇంకా పలు విధాలుగా శ్రీరాముని స్తోత్రం చేశారు. ఈ విధంగా వాల్మీకి భగవానుడు శ్రీరామాయణంలో శ్రీరాముని అవతార చరిత్రను తెలిపే సందర్భంలోనూ, అతని అవతారం ప్రయోజనాన్ని వివరించే సందర్భంలోనూ

దేవతలు, మండోదరి– అనే వీరి వాక్యాలతోను అతని దైవత్వాన్ని స్పష్టంగా వ్యక్తం చేశాడు. కనుక, శ్రీరాముడు నారాయణుడే– అని మనం తెలియవచ్చు.

"అహం వేద్మి మహాత్మానం రామం సత్యపరాక్రమమ్" (బాల కాండం– 19 –14) (శ్రీరాముని మహాత్మునిగా, సత్య పరాక్రమునిగా తెలుసుకుంటున్నాను) . ఇది విశ్వామిత్రుని వాక్కు.

"జృంభితం తద్ధనుః దృష్ట్వా శైవం విష్ణు పరాక్రమైః

అధికం మేనిరే విష్ణుం దేవాః సర్షిగణా స్తదా" (బాల కాండం –75 –20)

(విష్ణువుపరాక్రమంచేత శివుని విల్లు చలనం లేకుండా పోవడం గమనించి అక్కడ ఉండే దేవతలు, మునులు విష్ణువే అందరి కంటే గొప్పవాడు– అని తెలిసి కొన్నారు). ఇది పరశురాముని వాక్కు.

" అప్రమేయం హి తత్తేజః యస్య సా జనకాత్మజా" (అరణ్య కాండం –37 –18) (జనకరాజకుమార్తె అయిన సీతాదేవిని పత్నిగా కలిగిన రాముని తేజస్సు లెక్క కట్టడానికి వీలుకానిది). ఇది మారీచుని వాక్యం.

అకంపనుడు రావణునితో పల్కిన వాక్యాలు

"అసాధ్యః కుపితో రామః విక్రమేణ మహాయశాః,

ఆపగాయా సపూర్ణాయా వేగం పరిహరేత్ శరైః,

సతారగ్రహనక్షత్రం నభ శ్చాప్యవసాదయేత్,

అసౌ రామ స్తు మజ్జంతీం శ్రీమానభ్యుద్ధరేన్మహీమ్,

భిత్వా వేలాం సముద్రస్య లోకానాప్లావయేదిమామ్,

వేగం వాఽపి సముద్రస్య వాయుం వా విధమేచ్ఛరైః,

సంహృత్య వా పునర్లోకాన్ విక్రమేణ మహాయశాః,

శక్తః స పురుషవ్యాఘ్రః సృష్టుం పునరిమాః ప్రజాః,

న హి రామో దశగ్రీవ! శక్యో జేతుం త్వయా యుధి,

రక్షసాం వాఽపి లోకేన స్వర్గః పాపజనైరివ" (అరణ్య కాండం– 31– 23, 24, 25, 26, 27)

(కోపం పొందిన శ్రీరాముని పరాక్రమంతో ఎవరూ ఏనాడు గెలువలేరు. శ్రీరాముడు వీర్యంలో చాలా గొప్ప కీర్తిని కలవాడు. మహా వేగంగా ప్రవహించే నదీప్రవాహాన్ని బాణాలతో ఎవరు అడ్డగించగలరు? గొప్ప కీర్తిని కల శ్రీరాముడు స్థిరంగా ఉండే నక్షత్రాలు, నవగ్రహాలు కల ఆకాశాన్ని కూడా చెదరగొట్టగలిగిన సామర్థ్యాన్ని కలవాడు. సముద్రంలో మునిగి భూమిని పైకెత్తి నిలుపగలిగిన శక్తిని కలవాడు. సముద్ర తీరాన్ని భేదించి, లోకాలను అందులో ఉముడ్చగలశక్తి ని కలవాడు. తన బాణాలతో సముద్రం యొక్క ప్రవాహ వేగాన్ని, వాయువును అణచగలిగిన

గొప్ప కీర్తిని కల అతడు తాను కోరితే తన పరాక్రమంతో లోకాలను నశింప చేసి, మళ్ళీ తిరిగి ప్రజలను సృష్టించే సామర్థ్యం కలవాడు. పాపులు పదిమంది కూడినా, వారిచే స్వర్గాన్ని పొందడం సాధ్యం కానట్లు, నీకు పది తలలు ఉన్నప్పటికీ అతనిని నీవు జయించ లేవు. రాక్షసులు అందరూ కలసినప్పటికీ రాముని జయించలేరు.) అని ఈ విధంగా ఏనాడూ ఎవరికీ దేనికి భయపడని అకంపనుడు రాముని బాణాల దెబ్బకు భయపడి, జనస్థానంలో స్త్రీవేషాన్ని ధరించి, రాముని దగ్గర నుండి తప్పించుకొని వచ్చి, రావణునితో ఈ విధంగా మొర పెట్టాడు.

"తరుణౌ రూపసంపన్నౌ సుకుమారౌ మహాబలౌ,

పుండరీకవిశాలాక్షౌ చీరకృష్ణాజినాంబరౌ" (అరణ్య కాండం –19– 14) (ఇది శూర్పణఖ వాక్యం)

(యువకులు, అందం నిండుగా కలవారు, చాలా మృదువైన స్వభావం కలవారు, మహాబలశాలురు, అందమైన, విశాలమైన కన్నులను కలవారు, నారబట్టలను, కృష్ణాజినాన్ని ధరించినవారు అయిన రామలక్ష్మణులు). ఈ శ్లోకానికి పరత్వపరంగా, సౌలభ్య పరంగా, సౌందర్య పరంగా మూడు విధాలైన వ్యాఖ్యానాలను పెరియ వాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించారు.

హనుమంతుని వచనాలు

దేవాసుర నరేంద్రేషు యక్షరక్షోగణేషు చ,

విద్యాధరేషు సర్వేషు గంధర్వేషూరగేషు చ,

సిద్ధేషు కిన్నరేంద్రేషు పతత్త్రిషు చ సర్వతః,

సర్వభూతేషు సర్వత్ర సర్వలోకేషు నాస్తి సః,

యో రామం ప్రతియుధ్యేత విష్ణుతుల్య పరాక్రమమ్" (సుందరకాండం– 51– 40, 41, 42)

(శ్రీమహావిష్ణువుతో సమానమైన పరాక్రమాన్ని కల శ్రీరాముని ఎదిరించి యుద్ధం చెయ్యగలిగినవాడు ఎవడు దేవతలలో కాని, మానవులలో కాని, యక్షులలో కాని, రాక్షసులలో కాని, సర్పాలలో గాని, సిద్ధులలోకాని, కింనరులలో కానీ, పక్షులలో కాని, మరి ఏ ప్రాణులలో కాని, సర్వలోకాలలోను, ఏ చోట, ఏ కాలంలోనూ ఎవడూ లేడు) అని,

"బ్రహ్మా స్వయంభూః చతురాననో వా రుద్రః త్రినేత్రః త్రిపురాంతకో వా,

ఇంద్రో మహేంద్రః సురనాయకో వా త్రాతుం న శక్తా యుధి రామవధ్యమ్" (సుందరకాండం 51 45) అని హనుమంతుడు అన్నాడు. ఇంద్రుడు, రుద్రుడు, బ్రహ్మ అనే వీరికి రామునితో యుద్ధం చేసేవానిని రక్షించడం సాధ్యం కాదు –అని ఈ శ్లోక భావం. ఇంద్రుడు మూడు లోకాలకు ప్రభువైన ఉండే గొప్ప సంపదను

కలవాడు. దేవతల సైన్యాన్ని కలవాడు. మహా బలశాలి అయిన వృత్రాసురుడిని చంపి, మహేంద్రుడనే పేరు పొందాడు. ఇటువంటి గొప్పతనాన్ని కల ఇంద్రుడు కూడా నిన్ను రక్షించలేడు– అని హనుమంతుడు రావణునితో అన్నాడు.

ఆ విధంగా అయితే ఇంద్రుని కంటే బలం ఎక్కువగా కల రుద్రుడు రావణుని రక్షించగలడా? అనే సందేహం కలుగుతుంది. ఇంద్రుని కంటే రుద్రునకు ఎక్కువ గొప్పతనం ఉన్నది. త్రిపురాలను దహించిన వాడు, లలాట నేత్రంతో మన్మథుని దహించినవాడు, ప్రళయకాలంలో సంహార కర్తయై ఉండేవాడు అనే గొప్పతనాలను కల రుద్రునకు కూడా రామునితో విరోధం పెట్టుకున్నవారిని రక్షించడం వీలుకాదు. ఇటువంటి రుద్రునకు తండ్రి అయిన బ్రహ్మ అందరి కంటే గొప్పవాడు. భగవానుని నాభీకమలంనుండి పుట్టిన అతనికి కూడా రామునితో విరోధం పెట్టుకున్నవానిని రక్షించడం సాధ్యం కాదు– అని హనుమంతుడు అన్నాడు.

విభీషణుడు పలికిన మాటలు

"విధమేచ్చ పురీం లంకామ్" (సుందర కాండం –26 –27) (లంకను శ్రీరాముడు నశింపజేస్తాడు),

"యావన్న గృహ్ణంతి శిరాంసి బాణా రామేరితా రాక్షసపుంగవనామ్,

వజ్రోపమా వాయుసమానవేగా ప్రదీయతాం దాశరథాయ మైథిలీ" (యుద్ధ కాండం –14 –4)

(వజ్రాయుధంతో పోలినవి, వాయువేగంతో సమానమైన వేగాన్ని, గొప్పతనాన్ని కలిగినవి అయిన రామబాణాలు రాక్షసుల శిరస్సులను ఖండించడానికి ముందే సీతను రామచంద్రునకు తిరిగి సమర్పించు) అని రాముని సర్వశక్తిత్వాన్ని విభీషణుడు తెలియజేశాడు.

దీనికి ప్రతికోటి అయిన శ్రీరాముని సౌలభ్యం, సౌశీల్యం, మొదలైన గుణాలు ఉండే రీతిని తెలియజేయడం

1) నారాయణుడు తన పరత్వాన్ని చూడకుండా, మనుష్యుడై అవతరించిన సౌలభ్యం,

2) మానవుడై పుట్టినప్పటికీ, గొప్పదైన, దశరథ చక్రవర్తి కుమారుడైన తన పరతత్వాన్ని చూడకుండా, శ్రీరాముడు, శబరి, శ్రీసుగ్రీవ మహారాజు మొదలైనవారితో కలసి, ఏ తేడా లేకుండా ఉన్న సౌశీల్యం.

సాధుపరిత్రాణం, దుష్కృద్వినాశం, ధర్మసంస్థాపనం– అనే భగవంతుని మూడు విధాలైన భగవానుని రక్షకత్వప్రకారాలు ఉండే విధానం

సాధుపరిత్రాణం–– 1) విశ్వామిత్ర యాగసంరక్షణ చేయడం, 2) దండకారణ్యవాసులై ఋషులను రక్షించడం, 3) రావణుడు మొదలైనవారి వరబల భుజబలాలతో బాధపడే ఇంద్రుడు మొదలైనవారిని రక్షించడం.

1) దుష్కృద్వినాశం–– 1) మంచివారికి విరోధులైన తాటక, ఆమె కుమారులైన సుబాహుడు, మారీచుడు– అనే రాక్షసులను, వారికి చెందినవారిని, 2) ఖరుడు, దూషణుడు, త్రిశిరుడు మొదలైనవారిని, 3) రావణుడు కుంభకర్ణుడు, ఇంద్రజిత్తు మొదలైనవారిని సంహరించడం,

2) ధర్మ సంస్థాపనం–– శ్రీరామావతారానికి కల ఒక వైలక్ష్యణ్యం ఏమంటే, ఆ అవతారం అనుష్ఠాన ప్రధానమైన అవతారమై ఉండడం. సంసారి జీవులు వర్ణాశ్రమాలకు సంబంధించిన సామాన్యధర్మాలను తమ స్వభావాలకు తగిన విశేషధర్మాలను అనుష్ఠించాలి– అనే ఉద్దేశ్యంతోనే సర్వేశ్వరుడు శ్రీ రామావతారాన్ని ఎత్తి, ఈ సామాన్య విశేష ధర్మాలలో కొన్నిటిని ఆచరించి, తనను ఆశ్రయించిన ఉత్తమ అధికారులైన

> లక్ష్మణుడు, భరతుడు, విభీషణుడు మొదలైనవారు వాటిని ఆదరించి ఆచరించేటట్లు చేశాడు– అని శ్రీరామావతార రహస్యాన్ని. పెరియ వాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించారు.

భగవంతుడు ఉన్నతమైన క్షత్రియకులంలో ఇక్ష్వాకువంశంలో దశరథ చక్రవర్తికి పుత్రుడై అవతరించాడు. ధర్మసంస్థాపన అంటే ఏమి? అని అంటే,

భగవంతుడు సామాన్య ధర్మాలను స్థాపించాడు, అంటే, ఈ లోకంలో సంసారి జీవులు తనను ఆశ్రయించి, తరించవలసిన ధర్మాలను తాను ఆచరించి చూపి, నిలబెట్టాడు. ఇతడు చేసిన ధర్మసంస్థాపనం అనేది ఏమి? అని అంటే, భగవంతుడు సామాన్య ధర్మాలను సుస్థాపించాడు. వర్ణాశ్రమధర్మాలు సామాన్య ధర్మాలు. క్షత్రియుడైన తన దశకు తగినట్లు రాజ్యపరిపాలన ధర్మం, అంటే, బలహీనుని బలవంతుడు బాధించకుండా ఉండేటట్లు ప్రజలను రక్షించే ధర్మం, నూరు అశ్వమేధ యాగాలు చేసి, పితృవాక్య పరిపాలన చేసి, ఋషులను దేవతలను ఆశ్రయించడంవంటి పలు ధర్మాలను ఆచరించి చూపించాడు, శ్రీరాముడు. తాను తెలిసికొన్న శ్రీరాముని, అతని వైభవాలను అశోకవనంలో సీతాదేవిని దగ్గర విజ్ఞాపన చేసే హనుమంతుడు, " మర్యాదానాం చ లోకస్య కర్తా కారయితా చ సః" (సుందరకాండ– 35–11) (లోకంలో వారు వారు ఆచరించవలసిన ధర్మాలను నిశ్చయించేవాడు, వారిని ఆ ధర్మాల ప్రకారం నడిచేటట్లు చేసేవాడు, శ్రీరాముడు) అని అన్నాడు. శ్రీ నారద భగవానుడు కూడా

"స్వే స్వే ధర్మే నియోక్ష్యతి" (సుందరకాండం–1–96) (లోకంలో అందరూ తమ తమ ధర్మాలను ఆచరించేటట్లు చేస్తున్నాడు) అని శ్రీరాముడు చేసిన ధర్మసంస్థాపనను కీర్తించాడు.

2) అన్ని ధర్మాలకంటే గొప్పవాడైన తనను, అంటే, సిద్ధోపాయమైన తనను, అంటే, అన్ని లోకాలకూ శరణ్యుడైన తనను, చక్కగా సుస్థాపించాడు, భగవంతుడు. శరణ్యత్వం అనేది భగవంతునకు ఒక్కనికి మాత్రమే ఉండే కళ్యాణగుణం. శరణాగతి శబ్దంచేత చెప్పబడేవాడు భగవంతుడు. అంటే, శరణాగతి. అనేది సిద్ధోపాయరూపుడైన భగవంతుని ఒక్కని మాత్రమే నిర్దేశిస్తుంది.

శ్రీరాముడు చేసిన విశేషకటాక్షం

"రామో రామో రామ ఇతి ప్రజానా మభవన్ కథాः,

రామభూతం జగదభూత్ రామే రాజ్యే ప్రశాసతి" (యుద్ధ కాండం– 131 –102) (రాముడు, రాముడు, రాముడు– అని రాజ్యంలోని ప్రజలు ఎల్లప్పుడూ రాముని గురించే పలికారు. రాముడు రాజ్యాన్ని పాలించే సమయంలో లోకం అంతా రామమయం అయ్యింది) అని,

"తిర్యక్ యోనిగతా శ్చాపి సర్వే రామ మనువ్రతాः" (ఉత్తరకాండం– 109– 22)

"ఊర్వనవాక ప్పిఱందవై ఏల్లామ్ కూడ రామనై ప్పిన్ తొడర్ న్దన ఎన్ఱుమ్, తమ్ముడై అళకాలుమ్, శీలత్తాలుమ్ తమ్మి యొళియ చ్చెల్లాదపడి త్తిరుత్తి, మోక్షప్రదానమ్ పణ్ణినార్ ఎన్ఱు సాక్షాత్ అవతార ప్రయోజనమాన విశేషరక్షణత్తై చ్చొల్లుకైయాలుమ్" (తిర్యక్ జాతిలో పుట్టినవి కూడా రాముని అనుసరించాయి) అని తన అందంతో, శీలంతో, తాను లేకపోతే నిలువలేని రీతిలో ప్రాణులను అందరిని చేసి, మోక్షప్రదానాన్ని శ్రీరాముడు చేశాడు– అని సాక్షాత్ అతని అవతారప్రయోజనమైన విశేషం ధర్మాన్ని చెప్పినందువల్ల) అని పెరియ వాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించారు. ఈ రెండు ప్రమాణ వచనాలను, "అన్ఱు శరాశరంగళై వైకుందత్తేట్రి (పెరుమాళ్ తిరుమొళి –10 –10) అనే ఆళ్వార్ల సూక్తిని మనసులో పెట్టుకొని "పరవ్యూహాద్యవస్థాంతరంగళిఱ్ఱాట్టిల్ శ్రీరామావతారత్తుక్కు నిరవధికాకస్మిక సుహృత్తై చ్చొల్లుకిఱదు" అని తనిశ్లోక

వ్యాఖ్యానంలో ఆ ఆచార్యులు అన్నారు. భగవంతుడు పరమపదంలో ఉండే పరదశ కాని, పాలసముద్రంలో పరుండి ఉండే వ్యూహ దశ కానీ, అంతర్యామి దశ కాని, ఇంకా ఉండే విభవావతరాలు కానీ– ఈ స్థితులు అన్నిటికంటే శ్రీరామావతారం కల గొప్పతనం నిరవధిక ఆకస్మిక సుహృత్వం అనే వీనినే నిరూపకంగా కలిగినది– అని పెరియ వాచ్చాన్ పిళ్ళై తెలియజేశారు. ఈ విధంగా,

1) సాక్షాత్తూ నారాయణుని అవతారవిశేషం అయిన శ్రీరాముని పరత్వం ఉండే రీతిని,

2) శ్రీరాముని, శరణ్యత్వానికి అనుగుణంగాను, అతని పరత్వస్థాపకంగా ఉండే సర్వజ్ఞత్వం, సర్వశక్తి త్వం మొదలైన ప్రభావాలను,

3) శ్రీరాముని సౌలభ్యం, సౌశీల్యం, కారుణిత్వం మొదలైన సౌలభ్యప్రయుక్త గుణాలు ప్రకాశించే వైభవాన్ని,

4) సాధుపరిత్రాణం, దుష్కృత్ వినాశనం, ధర్మసంస్థాపనం– అని మూడు విధాలైన శ్రీరాముని సామాన్యరక్షకత్వం ఉండే రీతిని,

5) శ్రీరాముడు చేసిన విశేష రక్షణం –అనే విషయాలను అక్కడక్కడ పలుచోట్ల స్పష్టంగా తెలియజేసి,

శ్రీరాముని శరణ్యత్వాన్ని శ్రీరామాయణంలో శ్రీవాల్మీకి భగవానుడు స్థాపించాడు– అని మనం తెలియవచ్చు. ఇక, విభీషణ శరణాగతి ప్రకరణాన్ని గురించి కొన్ని విషయాలను తెలుసుకుందాం.

విభీషణ శరణాగతి ప్రకరణం

శరణాగతిశాస్త్రమైన శ్రీరామాయణానికి హృదయస్థానం విభీషణ శరణాగతి ప్రకరణం. దీనికి అభయప్రదానఘట్టం అని పేరు. శ్రీభరతుడు, లక్ష్మణుడు శ్రీరామునకు తోడబుట్టినవారు. వీరిని భగవదవతారం అని కాని, లేక నిత్యసూరుల అవతారం అని కానీ చెప్పవచ్చు. వీరు శ్రీరాముని వద్ద గొప్పదైన

శరణాగతి ధర్మాన్ని అనుష్ఠించారు– అనే విషయంలో ఆశ్చర్యం లేదు. కానీ, రాక్షసజాతిలో పుట్టిన శ్రీవిభీషణుడు శ్రీరాముని దగ్గర శరణాగతి చేశాడు. ఇది కదా ఆశ్చర్యకరమైన విషయం– అని మన పూర్వాచార్యులు పొగడుతారు. ఇతడు చేసిన శరణాగతి మర్యాదకు అనుకూలమైన ఈ ప్రకరణానికి ఉండే అర్థపూర్తిని శ్రీరామాయణంలో, వేరు ఏ సందర్భంలోనూ మనం చూడలేము. శరణ్యుని స్వరూపం, శరణాగతుని స్వరూపవైభవవిశేషాలు శరణాగతి ధర్మంలో అంతర్భవించి ఉండే ఇంకా పలు అంశాలు ఈ ప్రకరణంలో స్పష్టంగా తెలుపబడ్డాయి. శ్రీవాల్మీకి మహర్షి లక్ష్మణ శరణాగతి ప్రకరణంలో సంగ్రహంగా తెలిపిన అర్థాలను విభీషణ శరణాగతి ప్రకరణంలో చాలా విస్తృతంగా తెలియజేశారు. ఈ కారణాలచేత ఇది శ్రీరామాయణానికి హృదయం స్థానంగా ప్రకాశిస్తున్నది– అని మనం తెలియవచ్చు. భగవంతుడు సిద్ధధర్మంగా స్థాపింపబడిన ప్రకరణం ఇది అని ఇంతకు ముందే విజ్ఞాపన చేశాను. జీవుని ప్రయత్నంతో సాధింపబడే ధర్మం కాలం గడిచే కొద్దీ కొంచెం కొంచెంగా నశిస్తుంది. కనుక, ఆ ధర్మాన్ని సుస్థాపించడం అని చెప్పడంలో అర్థం ఉన్నది. ఎల్లప్పుడు, అంతటా సిద్ధంగా ఉండే భగవానుడనే ధర్మాన్ని అతడు అవతారం చేసి స్థాపిస్తున్నాడు– అని చెప్పడం ఏవిధంగా సరి అయినది? అనే ప్రశ్నకు సమాధానాన్ని ఈ ప్రకరణంలో మనం చూడవచ్చు. ఇక, ఈ ప్రకరణంలో ఉండే చరిత్రను, సారంగా ఉండే అర్థ విశేషాలను కొన్నిటిని విజ్ఞాపన చేస్తాను.

"పరమాపద్గతస్యాపి ధర్మే మమ మతిర్భవేత్" (ఉత్తరకాండం –10 –31)

(గొప్ప ఆపద వచ్చిన కాలంలో కూడా నా మనస్సు ధర్మంలోనే స్థిరంగా ఉండాలి) అని బ్రహ్మ దగ్గర వరాన్ని కోరి, అతనిచే

"ధర్మిష్ఠ స్త్వం యథా వత్స! తథా చైతత్ భవిష్యతి" (శ్రీరామాయణం– 10 –34)

(నాయనా! ధర్మంలో మనస్సు స్థిరంగా ఉండే నీవు కోరిన వరాన్ని ఇచ్చాను) అని వరం ఇవ్వబడినవాడు అయినందున, విభీషణుడు ధర్మాత్ముడైన గొప్పతనాన్ని కలవాడు. 1) పరమ ధార్మికుడు అని, ధర్మం అయిన భగవంతుని ఆశ్రయించాడు అని ఇతని వైభవాన్ని రెండు విధాలుగా మనం గమనించవచ్చు. శాస్త్రాలలో పరమ ధర్మంగా చెప్పబడిన శరణాగతిని తానే అనుష్ఠించి, శ్రీరాముని

సముద్రుని విషయంగా శరణాగతిని అనుష్ఠింప జేసి, ఈ లోకానికి ప్రకాశింపజేసిన గొప్పతనం కలవాడు, విభీషణుడు. ఇదేకాక, భగవంతుని విషయంలో శరణాగతి చేసినవాడు ఈ విధంగా ఉండాలి –అనేదానికి ఒక అద్వితీయమైన ఉదాహరణ పురుషునిగా ప్రకాశించాడు. ఒక శరణాగతునకు ఉండవలసిన స్వభావ విశేషాలను అన్నిటిని విభీషణుని పూర్తిగా కలిగి ఉన్నాడు– అనే సంగతిని శ్రీరామాయణంలో అక్కడక్కడ శ్రీవాల్మీకి భగవానుడు తెలియజేశాడు. దీనిని శ్రీరామాయణం శ్లోకార్థాలను, కథాభాగాలను వివరించే సందర్భంలో మన పూర్వాచార్యులు చక్కగా నిరూపించారు.

శ్రీరాముడు సముద్రతీరానికి లక్ష్మణుడు, సుగ్రీవుడు, వానరులు– అనే వీరితో కలసి చేరిన సమయంలో, లంకలో రావణునకు హితాన్ని పలకిన విభీషణుని రావణుడు, ఇంద్రజిత్తు చాలా కఠినంగా మాటలాడి, దూషించారు. వీరి నిందిలను విని సహించలేక విభీషణుడు తన చేతిలో గదను ధరించి, తనతో వచ్చిన తన మంత్రులు నలుగురితో పాటు ఆకాశంలోకి ఎగిరి వచ్చి, ఉత్తర సముద్ర తీరంలో ఆకాశంలోనే నిలిచాడు. రావణుని భవనంలో నుండి బయటకు వచ్చి ఆకాశంలో నిలిచిన విభీషణుని వాల్మీకి భగవానుడు "అంతరిక్షగతః శ్రీమాన్" అని పొగిడాడు.

లక్ష్మణుని స్థితి కూడా ఇటువంటిదే. "లక్ష్మణో లక్ష్మిసంపన్నః" అనే సూక్తిని ఇంతకుముందే మనం గమనించాము. లక్ష్మణుడు లక్ష్మీసంపన్నుడు. అతనికి ఉండే సంపద శ్రీరామకైంకర్యమే. ఈ విధంగానే శ్రీ గజేంద్రుని చరిత్రకూడా మనకు గోచరిస్తుంది. గజేంద్రుడు "స తు నాగవరః శ్రీమాన్" అని పొగడబడ్డాడు.

"పరమ పదమాపన్నో మనసాఽచింతయత్ హరిమ్,

స తు నాగవరః శ్రీమాన్ నారాయణపరాయణః" (విష్ణు ధర్మం –69– 47) అని అంటూ మహర్షి పొగిడాడు. ఒక మడుగు తీరంలో ఉండే గజేంద్రుడు అనే ఏనుగు ఆ మడుగులో వికసించిన తామర పువ్వును చూచి, "ఇది భగవానునకు తగినది" అని భావించి, దానిని తీసుకుని రావాలని మడుగు లోనికి వెళ్ళినప్పుడు, ఆ ఏనుగు కాలును ఆ మడుగులో ఉండే ఒక మొసలి పట్టుకొని

నీటి లోపలకి లాగడం ఆరంభించింది. దానిని విడిపించుకోవాలని గజేంద్రుడు చిరకాలం ప్రయత్నించి పోరాడి అలసిపోయాడు. మొసలి నీటి లోపలికి బలంగా లాగగా, గజేంద్రుని కాళ్ళు పొట్ట అన్ని లోపలికి మునిగిపోయాయి. కేవలం తొండం ఒక్కటి మాత్రమే బయట ఉన్నది–అనే స్థితిలోని గొప్ప ఆపద సంభవించింది. అప్పుడు ఆ గజేంద్రుడు "నారాయణా! ఓ మణివణ్ణా!నాకణ్ణెయాయ్!వారాయ్" (నారాయణా! మణివర్ణా! శేష శయనా!రావయ్యా) అని భగవంతుని ప్రార్థించింది. ఈ సమయంలో ఇతనిని మహర్షి "శ్రీమాన్ " అని పొగుడుతున్నాడు. మొసలి నోటిలో చిక్కుకుని బాధపడే కాలంలో, ఏ నిమిషం ప్రాణం పోతుందో! అనే గొప్ప ఆపద వచ్చిన కాలంలో, ఈ గజేంద్రుడునకు కలిగిన గొప్ప సంపద ఏమి? తన ప్రవృత్తిని, అంటే, రక్షణ ప్రయత్నాన్ని విరమించి, భగవంతుడు రక్షించాలి– అని ప్రార్థించి శరణాగతి చేయడమే గజేంద్రునకు కల సంపద. ఈ విధంగానే "అంతరిక్షగతః శ్రీమాన్" అయిన విభీషణునకు రావణుని, భార్యా మిత్రులను, బంధువులను, లంకలోని ఐశ్వర్యాన్ని విడిచిపెట్టి ఆకాశంలో ఏ విధమైన రక్షణ లేనివాడై నిలిచిన స్థితియే ఇతనికి కల సంపద. అన్యశేషత్వం తీరిన స్థితియే విభీషణునకు కల సంపద.

లోకంలో తన కర్మమూలంగా వచ్చే సంపదను కలవానిని "శ్రీమాన్" అని అంటున్నారు ఇది కొంచెం కూడా సరి కాదు భగవంతుని కృప కారణంగా జ్ఞానకార్యమైన భగవత్కైంకర్యాన్ని కలవాడే "శ్రీమాన్" కాగలడు. విభీషణుడు భగవత్కైంకర్యం అనే సంపదను పొందడానికి ముందే అతనిని "శ్రీమాన్" అని మహర్షి పొగిడాడు. విడువలసిన బంధువులను విషయాలను విడచినవారే. "శ్రీమాన్"అవుతున్నారు.

సుగ్రీవుడు విభీషణుని చూచి మనసులో చాలా సందేహాన్ని పొందాడు. విభీషణుని దగ్గర గదమాత్రం ఒకటి ఉన్నా, అతడు అన్ని ఆయుధాలను తీసుకొని వచ్చాడు– అని భావించాడు. ఈవిధంగా సుగ్రీవుని మనసులోని ఏర్పడిన కలంకం కర్మవశంవల్ల ఏర్పడినది కాదు. ఇది భగవానుని విషయంలో ఉండే అతిమాత్రమైన ప్రేమ వల్ల ఏర్పడిన కళంకం. ఇది చాలా శ్లాఘ్యమైనది– అని పెద్దలు అంటారు. వచ్చినవాడు రావణుని తమ్ముడు అయినందున, నలుగురు రాక్షసులతో వచ్చినందున, లంకలోనుండి వచ్చినందున, వీరి వల్ల

రామునకు ఏమి కీడు జరుగుతుందో! అని తన ప్రేమకు తగినట్లు భయపడి వారిని వధించాలని భావించి, సుగ్రీవుడు వానరులను తమ చేతిలో చందనం చెట్లను, పర్వత శిఖరాలను తీసుకొని యుద్ధానికి సిద్ధంగా ఉండమని అన్నాడు. విభీషణుడు ఈ సన్నివేశాన్ని చూచాడు. శ్రీరాముని విషయంలో వీరు కలిగి ఉండే భక్తిని చూసి ఆశ్చర్యపడ్డాడు. ఇంత ప్రేమతో శ్రీరాముని రక్షించే వీరిని పురస్కరించుకొని శ్రీరాముని ఆశ్రయించడమే తగినది అని నిశ్చయించుకొని, ఆ విధంగానే వానరవీరులను ముందుంచుకుని క్రమం తప్పకుండా శ్రీరాముని ఆశ్రయిస్తున్నాడు.

"రావణో నామ దుర్వృత్తో రావణో రాక్షసేశ్వరః,
తస్యాహమవరో భ్రాతా విభీషణ ఇతి శ్రుతః" (యుద్ధ కాండం –17– 10) (చెడ్డ నడతను, ప్రియమైన చేష్టలను కలవాడై, రాక్షసులకు ప్రభువై, రావణుడు అనే పేరు కలిగినవానికి నేను తోడబుట్టినవాడను. తమ్ముడను. నా పేరు విభీషణుడు అని అంటారు).

భగవానుని శరణు పొందేవాడు తన దోషాలను జంకకుండా పలికి ఆశ్రయించాలి– అనేది క్రమం. దీనికి తగినట్లు ఇక్కడ విభీషణుడు పలుకుతున్నాడు. విభీషణుడు "రావయతీతి రావణః" అనే విధంగా అన్ని లోకాలను ఏడ్చి గగ్గోలు పెట్టేటట్లు చేశాడు కనుక రావణుడు అనే ప్రసిద్ధిని పొందాడు. ఆ విధంగా రాక్షసులకు ప్రభువై, వారు చేసి అన్ని కార్యాలకు కారణమై, వారిని ఆయా కార్యాలలో ప్రేరేపించేవాడు.

"ఇంద శ్లోకత్తిల్ 1) ప్రతికూలశేషత్వత్తాల్ వంద నికర్షముమ్, 2) ప్రతికూలనోడు అవర్జనీయ సంబంధత్తాల్ వంద నికర్షముమ్, 3) స్వరూపేణ వంద నికర్షముమ్ ఉండు, " అనే పెరియ వాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించారు. ఆంటే,

1) భగవానునకు దాసభూతుడు గాను, పరతంత్రుడు గాను ఉండవలసిన నా స్వరూపాన్ని పాడు చేసికొని, ఇన్నాళ్లు క్రూరుడైన ఈ రావణునకు సంబంధించిన వాడనుగా ఉన్నాను– అనేది ఒక దోషం,

2) ఇటువంటివానికి తమ్ముడుగా, అంటే, అతడు ఏ తల్లి గర్భంలో 10 నెలలు ఉండి జన్మించాడో, ఆ గర్భంలో తాను కూడా పది మాసాలు ఉండి జన్మించినవాడు– అనే దోషం,

3) "వివిధం భీషయతీతి విభీషణः" అనే విధంగా అందరినీ అనేక విధాలుగా భయపడేటట్లు చేసేవాడు గనుక విభీషణుడు అనే ప్రసిద్ధి పొందినవాడు– అని అన్నందున తనకు కలిగిన దోషం –అని ఈ విధంగా తనకు ఉండే తక్కువదనాలను మూడు విధాలుగా విభీషణుడు పలికాడు. రావణునకు అతనికి ఉండే దోషాలు మాత్రం ఉన్నాయి, అయితే, నాకు మాత్రం అతని కంటే ఎక్కువ దోషాలు ఉన్నాయి నాకు నా దోషాలు ఉండడంతోపాటు అతని సంబంధాన్ని కలిగినవాడను కనుక అతని దోషాలు కూడా ఉన్నాయి– అనేది విభీషణుని మనస్సు –అని తెలుస్తున్నది.

"దుర్వృత్తः" అనే ప్రయోగం చెడ్డ నడతను సూచిస్తుంది. "తే బుద్ధిः ఆచార వర్జితా" (సుందరకాండం– 21 –9) (నీ బుద్ధి మంచి ఆచారాన్ని లేకుండా ఉన్నది) అని రావణునితో సీతాదేవిని పలికిన మాటను శ్రీ పెరియ వాచ్చాన్ పిళ్ళై ఉదాహరించారు.

"విభీషణస్తు ధర్మాత్మా న తు రాక్షసచేష్టితः" (అరణ్య కాండం– 17– 23) (విభీషణుడు ధర్మానుసారం నడిచేవాడు, రాక్షసుల కార్యాలను చేసేవాడు కాడు) అని శూర్పణఖ చెప్పిన మాట. ఇందువల్ల వల్ల స్వరూపం చేత ఏర్పడిన తక్కువ దనం– "స్వరూపేణ వంద నికర్షమ్" – అని విభీషణుడు తన స్వభావం గురించి చెప్పుకున్నది కేవలం నైచ్యానుసంధానంలోకి చేరుతుంది–అని వ్యాఖ్యానం. పరులను, అంటే, వేదబాహ్యకుదృష్టి మతాలవారిని హింసించేవారు– అని పరాశరులకు, పరాంకుశులకు ఆ నామాలు నిరూపకంగా ఏర్పడిన నామాలవలె, దుర్మార్గులను భయపడేటట్లు చేసేవాడు గనుక విభీషణుడు– అనే నామాన్ని రూపకంగా ఇతనికి గ్రహించాలి– అని మన పూర్వాచార్యులు అంటారు.

"తేన సీతా జనస్థానాత్ హృతా హత్వా జటాయుషమ్,

రుద్ధా చ వివశా దీనా రాక్షసీభిః సురక్షితా" (యుద్ధ కాండం 17 11 ఆ రావణుడు జటాయువును చంపి, జనస్థానంలో ఉండే సీతను అపహరించాడు, ఆమెను చెరలో పెట్టాడు. ఆ సీత ఏమి చేయలేనిదై, మనస్సులో చాలా బాధను పొందినదై, రాక్షస స్త్రీలచేత రక్షింపబడినది) అనే విభీషణుడు పలికిన తరువాత మాట ఈ శ్లోకంలో గడచిన శ్లోకంలో వివరింపబడుతున్నది. అయితే, అయోధ్యలో శ్రీరామునకు ఎన్నో కార్యాలు ఉన్నాయి. రాజ్యపరిపాలనలో దశరథ చక్రవర్తికి సహాయంగా ఉండడంవల్ల అతనికి సీతాదేవితో ఎక్కువ కాలం కలసి ఉండే అవకాశం లేదు. సీతాదేవిది కూడా అంతపురంలో కట్టి పడవేసిన స్థితి. ఇద్దరూ కలసి ఆనందించడానికి ఎక్కువ అవకాశం లేనందువల్ల అయోధ్యలో ఉండే స్థితి వీరికి చెరసాలలో ఉన్నట్లుగా ఉంటుంది. అన్ని సమయాలలో ఈ దివ్యదంపతులకు ఏకాంతంగా ఆనందించడానికి చాలా అనుకూలంగా ఉండే చోటు సహజ సౌందర్యం నిండి ఉండే జనస్థానం. ఈ జనస్థానం నుండి రావణుడు శరీరాన్ని, ప్రాణాలను విడదీసినట్లుగా శ్రీరాముని సీతాదేవిని విడగొట్టాడు.

"అనన్యా రాఘవేణాహమ్" (సుందరకాండం −21 −16) (రఘుకుల నాయకుడైన శ్రీ రామునిశకంటే వేరయినదానను కాదు) అనే స్థితినుండి సీతాదేవిని రావణుడు విడదీశాడు. అంతేకాదు, సీతాదేవి ఎక్కడ వెళ్ళడానికి వీలు లేనట్లు ఆమెను అశోకవనంలో క్రూరరాక్షసస్త్రీల మధ్యలో చెరలో పెట్టి హింసించాడు కూడా. సీతాదేవి విషయంలో చాలా అపరాధాన్ని చేసినా, శ్రీరాముడు అతనిని వధించి సీతాదేవిని చెరనుండి విడిపించి, తీసుకొని రావడానికి తగిన ఉపాయాన్ని అన్వేషించేటట్లు అతనిని ప్రాణాలతో విడిచి పెట్టాడు, రావణుడు. కానీ, శ్రీరామునకు ప్రాణసమానుడైన జటాయువు చంపాడు. దశరథచక్రవర్తికి స్నేహితుడు కనుక "మహారాజు" అని, సీతాదేవికి దూరమైన శ్రీరాముడు ప్రాణాలను ధరించి ఉండేటట్లు అతనికి "ఆయుష్మాన్" అని మంగళాశాసనం చేసినవాడు కనుక, భగవంతునకు అన్ని మంగళాలు కలగాలని కోరే స్వభావమనే గొప్ప సంపదను కలిగినవాడు కనుక, పెరియ వుడైయార్ అని మన సంప్రదాయంలో జటాయువును పిలుస్తారు. జటాయువును వధించినందువల్ల శ్రీరాముడు నిరంతరంగా బాధ పడేటట్లు

రావణుడు చేశాడు. ఈ విధంగా శ్రీరాముడు కూడా పరిహారం వెదకడానికి వీలులేనట్లు జటాయువు విషయంలో భాగవతాపచారం అనే గొప్ప అపచారాన్ని రావణుడు చేశాడు.

ఈ విధంగా సీతాదేవి విషయంలో, జటాయు మహారాజు విషయంలో అంతులేని అపచారాన్ని చేసిన మహాపాతకుడైన రావణుని తమ్ముడు అని తననుగూర్చి విభీషణుడు పలుకుతున్నాడు, రావణుడు ఈ విధంగా సీతారాముల విషయంలో చాలా అపచారం చేసినప్పుడే అతనిని విడిచి వేయకుండా, తోడబుట్టినవాడు అని అతనితో ఇంత కాలం కలసి ఉండడం తన మనస్సులో దోషంగా తోచగా, రావణుని విడువకుండా, అతనితో ఇంతకాలం సంబంధం పెట్టుకున్న దోషాన్ని భావించి, మనసులో బాధ పడి, విభీషణుడు ఈ విధంగా పలుకుతున్నాడు.

"యదహం హేతుభిః వాక్యైః వివిధైశ్చ న్యదర్శయమ్,

సాధు నిర్యాత్యతాం సీతా రామాయేతి పునః పునః" (యుద్ధ కాండం– 17 –12)

(నేను రావణునితో "సీతాదేవిని శ్రీరామునకు తిరిగి అప్పగించు"– అని పలు విధాలైన వచనాలతో, కారణాలతో మాటిమాటికి తెలియజేశాను) అనేది విభీషణుడు పలికిన తరువాతి మాట. శ్రీరామునకే చెందిన సీతాదేవిని అతనికి తిరిగి ఇవ్వమని, ఆ విధంగా ఇవ్వకపోతే నాశమే కలుగుతుందని తాను అనేక విధాలుగా, అనేకసార్లు తెలియజేశానని విభీషణుడు అంటున్నాడు. ఈ సందర్భంలో–

"యావన్న గృహ్ణంతి శిరాంసి బాణా రామేరితా రాక్షసపుంగవానామ్,

వజ్రోపమా వాయుసమానవేగా ప్రదీయతాం దాశరథాయ మైథిలీ" (యుద్ధ కాండం– 14– 4)

(వజ్రాయుధంతో సమానమైనవి, వాయువేగంచేత ప్రేరేపింపబడేవి అయిన శ్రీరాముని బాణాలు రాక్షసుల శిరస్సులను ఖండించడానికి ముందే సీతాదేవిని రామనకు తిరిగి ఇవ్వు) అని,

"ధనాని రత్నాని విభూషణాని వాసాంసి దివ్యాని మణీంశ్చ చిత్రాన్,

సీతాం చ రామాయ నివేశ్య దేవీం వసేమ రాజన్ ఇహ వీతశోకాః" (యుద్ధ కాండం– 15– 14)

(రాజా! సంపదలు, రత్నాలు, ఆభరణాలు, గొప్ప వస్త్రాలు, విచిత్రమైన దివ్య మణులు అనే వీటితో సీతాదేవిని రామునకు సమర్పించి, దుఃఖాన్ని తీరినవారమై, ఇక్కడ సుఖంగా మనం జీవించవచ్చు) అని విభీషణుడు రావణునితో పలికిన మాటలు ఇక్కడ స్మరించాలి.

"స చ న ప్రతిజగ్రాహ రావణః కాలచోదితః,

ఉచ్యమానం హితం వాక్యం విపరీత ఇవౌషధమ్" (యుద్ధ కాండం– 17– 13)

(చావడానికి సిద్ధంగా ఉండేవాడు మందును తీసుకోనట్లు, యమునిచే ప్రేరేపించబడిన ఆ రావణుడు నేను చెప్పిన హితాన్ని అంగీకరించలేదు) అనేది తరువాత విభీషణుడు పల్కిన వాక్యం.

"సోఽహం పరుషిత తేన దాసవచ్చావమానితః,

త్యక్త్వా పుత్రాంశ్చ దారాంశ్చ రాఘవం శరణం గతః" (యుద్ధ కాండం –17– 14)

(రావణుని చేత కఠినంగా పలకబడినవాడను, దాసుని వలె అవమానింపబడినవాడను ఐన నేను పుత్రులను, భార్యను విడిచి పెట్టి, రాముని శరణు పొందాను) అని అన్నాడు, విభీషణుడు. "రాఘవం శరణం గతః" అనేదానికి రాఘవుని అన్ని విధాలైన బంధువుగా ఆశ్రయించాను –అని భావం.

ఇది పెరియ వాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించిన మొదటి వ్యాఖ్యానం. ఈ అర్థనిర్వహణలో "త్యక్త్వా పుత్రాంశ్చ దారాంశ్చ" అనే మాట ముఖ్యమైనది.

"ఇత్తాల్ ప్రపత్తి పణ్ణుమవనుక్కు ప్రాప్యాభాసంగళుమ్, ప్రాపకాభాసంగళుమ్ త్యాజ్యమ్ ఎన్దుమిడమ్ తోట్రుకిఱదు" (దీనివల్ల ప్రపత్తి చేసేవానికి ప్రాప్తం కానివానిని, ప్రాపకం కానివానిని విడిచి పెట్టాలి అని తెలుస్తున్నది) అని పెరియ వాచ్చాన్ పిళ్ళై అన్నారు. భగవానుని శరణు పొందేటప్పుడు,

1) విడువవలసినవానిని అన్నిటినీ విడిచిపెట్టి, భగవంతుని ఆశ్రయించాలి– అని,

2) విడువ వలసినవానిని విడిస్తే చాలదు, విడిచినవి అన్నీ భగవంతుడే అనే భావంతో భగవంతుని ఆశ్రయించాలి –అని తెలుస్తున్నది.

"భ్రాతా భర్తా చ బంధుశ్చ పితా చ మమ రాఘవః" (శ్రీరామాయణం– అయోధ్యకాండం –58– 31) ఎన్గిఱపడియే విట్ట ఉఱవెల్లామ్ తామాక వల్లవరై ప్పట్రినేన్" (సోదరుడు, భర్త, బంధువు, తండ్రి కూడా నాకు శ్రీరాముడే– అనే విధంగా విడిచిపెట్టిన బంధువులందరు నాకు తానే కాగలిగినవానిని ఆశ్రయించాను) అని వ్యాఖ్యానం. భగవద్రామానుజులు కూడా శ్రీరంగనాథుని శరణు పొందేటపుడు

"పితరం మాతరం దారాన్ పుత్రాన్ బంధూన్ సఖీన్ గురూన్,

రత్నాని ధనధాన్యాని క్షేత్రాణి చ గృహాణి చ,

సర్వ ధర్మాంశ్చ సంత్యజ్య సర్వకామాంశ్చ సాక్షరాన్,

లోకవిక్రాంత చరణౌ శరణం తేఽవ్రజం విభో!"

(స్వామీ! తండ్రి, తల్లి, భార్య, సంతానం, బంధువులు, స్నేహితులు, లౌకిక విద్యలను నేర్పించిన గురువులు, రత్నాలు, ధనధాన్యాలు, క్షేత్రాలు, ఇళ్ళు –అనే ఈ లోకంలో ఉండే నీచమైన ప్రాప్యాలను, కర్మయోగం మొదలైన నీచమైన

ప్రాపకాలను సవాసనగా విడిచిపెట్టి, లోకాలను కొలిచిన నీ చరణాలను శరణంగా ఆశ్రయిస్తున్నాను) అనే భవిష్యపురాణం వచనాన్ని తన మాటగా పలికారు అంతేకాక,

"త్వమేవ మాతా చ పితా త్వమేవ త్వమేవ బంధు శ్చ గురుః త్వమేవ,

త్వమేవ విద్యా ద్రవిణం త్వమేవ త్వమేవ సర్వం మమ దేవదేవ!"

(దేవతలకు దేవుడవై వెలిగేవాడా! దాసునకు నీవు ఒక్కడివే తల్లి నువ్వు ఒక్కడివే తండ్రి, నీవే నాకు సకలవిధబంధువు, దాసునకు గురువు నీవే, దాసునకు జ్ఞానం, సంపద నీవే. నీవు ఒక్కడివే నాకు అన్నీ) అని బ్రహ్మ పలికిన వాక్యాన్ని తమ మాటగా శరణాగతి గద్యలో శ్రీరంగనాథుని సమక్షంలో విజ్ఞాపన చేశారు.

ఆళ్వార్లు కూడా భగవంతుని శరణ్యత్వాన్ని నిరూపించే ఆరవ శతకంలో "దేవపిరానైయే తందై తాయ్ ఎన్నడైంద వణ్ కురుకూర్ శడకోపన్" (తిరువాయ్ మొழி –6–5– 11) అని పలికారు. అందుచేత భగవంతుని శరణంగా ఆశ్రయించడానికి అతనిని అన్ని విధాలైన బంధువుగా గ్రహించాలి– అని తెలుస్తున్నది.

విడువడం, ఆశ్రయించడం

ఈ సందర్భంలో "ఇత్తాల్ ప్రపత్తి పణ్ణుమవనుక్కు ప్రాప్యాభాసంగళుమ్, ప్రాపకాభాసంగళుమ్ త్యాజ్యమ్ ఎన్నుమిడమ్ తోట్రుకిఱదు" (దీనివల్ల ప్రపత్తి చేసేవానికి ప్రాప్తం కానివానిని, ప్రాపకం కానివానిని విడిచి పెట్టాలి అని తెలుస్తున్నది) అని శ్రీపెరియ వాచ్చాన్ పిళ్ళై పలికిన సూక్తిని గురించి ఒక విచారణ ప్రస్తుతమైనది. విభీషణునివలె, నమ్మాళ్వారులవలె, భగవద్రామానుజులవలె బంధువులను, సంబంధాలను అన్నిటిని విడచి, ఈ విధంగా విడిచిపెట్టిన బంధువులు, సంబంధాలు అన్ని అందరూ భగవానుడే అనిపిస్తుంద అని భావించి ఆశ్రయించాలి– అని అంటే, అది సామాన్యులమైన మనకు సాధ్యమేనా? సంసార సాగరంలో పడి తడబడే మనకు ఏ విధంగా పత్నీ

పుత్రులను విడిచిపెట్టడం వీలవుతుంది? విడచిన తరువాతనే ఆశ్రయించాలి– అని శ్రీ పెరియ వాచ్చాన్ పిళ్ళై స్పష్టంగా పలికారు కదా. శ్రీ విభీషణునివలె, నమ్మాళ్వారులవలె, భగవద్రామానుజులవలె లోకంలో ఎంత మందిని విడచి, భగవంతుని ఆశ్రయించడం సాధ్యం? శరణాగతి అనేది అందరికీకోసం ఉన్నది కదా! అందరికి విడువవలసినవానిని అన్నిటినీ విడిచిపెట్టడం సాధ్యం కాదు కదా! సంసారులమైన మనకు ఏ సమయంలోనూ సంసార బంధాలను విడిచి పెట్టడం వీలు కాదు కదా!విడిచిన తరువాతనే ఆశ్రయించాలి అని నియమం ఉన్నది –అని అంటే, లోకంలో ప్రపత్తిమార్గంలో ప్రవేశించడానికి అధికారులే లేకుండా పోతారు కదా!, తరువాత భగవంతుడు శరణ్యుడైనా ప్రయోజనం అనేది లేకుండా పోతుంది. శరణాగతి అనేది పరమధర్మమై, సర్వాధికారమై, సుకరమై ఉండడానికి ప్రసక్తి ఉండదు కదా. భక్తియోగం వలె ప్రపత్తి యోగానికి కూడా దుష్కరత్వం మొదలైన దోషాలు సంక్రమిస్తాయి కదా. ఈ దోషాలు తీరడానికి ఏమి దారి? అనే ప్రశ్న ఇక్కడ వస్తుంది. దీనికి సమాధానం ఏమంటే–

భార్యపుత్రాదులను విడువడం అనేది 1) పూర్తిగా విడువడం –అని, 2) భావనతో విడువడం– అని రెండు విధాలు. పూర్తిగా విడువడం అనేది విభీషణుడు, నమ్మాళ్వారులు, భగవద్రామానుజులవంటి విశేష జ్ఞానాన్ని కలిగినవారికే సాధ్యం. ఇది ఉన్నతమైన అధికారం కలిగినవారికి ఉండే ఒక వైలక్షణ్యం.

వీలయినంత వరకు విడువవలసిన విషయాలను విడిచి పెట్టడం అనేది సామాన్యులమైన మనవంటి వారికి ఏర్పడిన దారి. పూర్తిగా అన్నిటినీ విడచి ఆశ్రయించాలి– అనేది సామాన్యులమైన మనకు కొన్ని చిక్కులను, విపరీత ఫలితాలను, ప్రశ్నలను కలిగిస్తుంది. లోకసంగ్రహంకోసం సామాన్య ధర్మాలను ఆచరించాలి– అనే స్థితికి భంగం కలుగుతుంది. విడువడం అనేదానిని మనవంటివారి విషయంలో ఒక భావవిశేషంగా గ్రహించినపుడు, విడువడం అనేది ఒక వివేకమైన కార్యం అవుతుంది. ఈ విధంగా విడువలసినవానిని పూర్తిగా విడిచిపెట్టడం సాధ్యం కాకపోయినా, వారి విషయంలో ఉండే

సంబంధాన్ని విడిచిపెట్టి, ఏదో ఇక్కడ ఉన్నంత కాలంవరకు భగవద్గుణానుభవ కైంకర్యాలకు వారిని సహాయంగా, అనుకూలురుగా గ్రహించడం మంచిది.

ఇంకా విడువవలసివానిని పూర్తిగా విడిచిన శ్రీరామానుజులు మొదలైనవారిని ఆశ్రయించాలి. వారితో మనకు ఉండే సంబంధాన్ని ఇంకా ఇంకా అభివృద్ధి చేసుకోవాలి. విడువవలసినవానిని పూర్తిగా విడిచి పెట్టడానికి మనకు సాధ్యం కాకపోయినా, మనం వీరితో మనకు ఉండే సంబంధాన్ని పెంచుకుంటే, మనంగా విడువలసినవానిని విడిచిపెట్టడానికి ఆవశ్యకత ఉండదు. విడవవలసినవి అవే స్వయంగా ఒకదాని తరువాత ఒకటి మనలను విడచి పెట్టి పోతాయి. ఈ విధంగా జరగకపోయినా, వీరి సంబంధాన్ని పురస్కరించుకొని విడిచినవారినిగానే మనలను భగవంతుడు గ్రహిస్తాడు. ఇది సర్వలోకశరణ్యుడైన భగవంతుని కారుణికత్వానికి ఉండే ఒక విశేషం.

ఈ విధంగా, విలక్షణ అధికారులు– అని, సామాన్య అధికారులు–అని రెండు విధాలుగా ఉండే అధికారులు ఉన్నారు. విడిచిన తరువాతనే ఆశ్రయించాలి– అనేది సామాన్యుల విషయంలో ఒక విధంగా విశేష అధికారుల విషయంలో ఇంకొక విధంగా అన్వయిస్తుంది. సామాన్యులు విశేష అధికారుల వలె కావడం సాధ్యం కాదు. విభీషణుడు, నమ్మాళ్వారులు, శ్రీరామానుజుల వంటి ఉత్తమ అధికారులు విశేషజ్ఞులు. సామాన్యులమైన మనకు వారివలె కావడం వీలు కాదు. మనం వారివలె కావాలి అని ప్రయత్నించడం విపరీత ఫలితానికి దారి తీస్తుంది. మనకు ఏ సమయంలోనూ వారివలె కావడం సాధ్యం కాదు. వారితో సాధ్యమైనంతవరకు సంబంధాన్ని పెట్టుకోవడమే వివేకం అవుతుంది. వారితో మనకు ఉండే సంబంధం అనేది భగవంతుని వశీకరిస్తుంది. ఈ విధంగా వశీకరింపబడిన భగవానుడు తన మనసులో మనలను వారివల గ్రహిస్తాడు. ఇదే అతనికి కల గొప్పతనం. వీరిని ఆశ్రయించిన మనకుకూడా ఉజ్జీవనాన్ని అనుగ్రహిస్తాడు.

ఈ విధంగా పత్నీపుత్రాదుల విషయంలో సంబంధాన్ని పూర్తిగా విడువకుండా, వారి విషయంలో ఉండే సంగాన్ని విడువడం– అని, ఇక్కడ ఉండే

కాలంవరకు లౌకిక సంబంధాలను విడచిపెట్టి ఆశ్రయించినవారి సంబంధాన్ని ఇంకా ఇంకా అభివృద్ధి చేసుకోవడం –అని ఈ విధంగా ఉండే విధానాన్ని ఎక్కువగా మన పూర్వాచార్యులు, పెద్దలు అనుసరించారు. ఈ విధంగా మనం సామాన్యులం అనే భావం మనకు ఉండాలి. అదే సమయంలో విశేష జ్ఞానాన్ని కలిగిన వారి సంబంధం మనం తరించడానికి హేతువు –అనే గట్టి నమ్మకం మనకు ఉండాలి. ఈ సందర్భంలో మనం తెలియవలసిన ధర్మసూక్ష్మం ఇదే. ఇక, తరువాత విషయాలను విజ్ఞాపన చేస్తాను.

"రాఘవం శరణం గతః" (శ్రీరాముని శరణంగా ఆశ్రయించాను) అనేదానికి. "ఆశ్రితరుడైయ సర్వాపేక్షతంగళైయుమ్ కొడుక్కుమ్ కుడిపిఱప్పై ఉడైయవనై ప్పట్రినేన్ –ఎన్దుమామ్" (ఆశ్రయించినవారి అన్ని కోరికలను ఇవ్వగలిగేవారి వంశంలో పుట్టినవానిని ఆశ్రయించాను– అని కూడా అర్థం) అని ఇంకొక వ్యాఖ్యానాన్ని వ్యాఖ్యాత అనుగ్రహించారు. ఈ అర్థ నిర్వహణలో "రాఘవ" శబ్దం చాలా ముఖ్యమైనది.

"నివేదయత మాం క్షిప్రం విభీషణ ముపస్థితమ్,

సర్వలోక శరణ్యాయ రాఘవాయ మహాత్మనే" (యుద్ధ కాండం –17–15)

(లోకంలోని అందరిచే శరణు పొందదగినవాడు, గొప్ప గుణాన్ని కలవాడైన శ్రీరామునితో, ఆయనను ఆశ్రయించడం కోసం వచ్చిన, విభీషణుడు అనే పేరు గలిగిన నన్నుగూర్చి తెలియజేయాలి).

"వానరులారా! భగవంతుడు ఎవనినిని రక్షించాలని భావిస్తాడో, అతడే పుణ్యాత్ముడు. భగవంతుడు విభీషణుడనైన నన్ను రక్షించాలని భావిస్తే నాకు మంచి జరుగుతుంది. ఆర్తితో శ్రీరాముని శరణం పొందడం కోసం వచ్చిన నాకు మంచి కలిగేటట్లు మీరు నన్ను గూర్చి శ్రీ రాముని దగ్గర తెలియజేయాలి".

"కాణవారాయ్ ఎన్దు కణ్ణుమ్ వాయుమ్ తువర్ న్దు" (తిరువాయ్ మొழி– 8–5–2) అనే విధంగా శరణాగతునకు ఉండవలసిన స్వభావ విశేషాలలో ఆర్తి అనేది మిక్కిలి ముఖ్యమైనది. దానిని ఈ శ్లోకంలో "నివేదయత మాం క్షిప్రమ్" (శ్రీరాముని దగ్గర నేను శరణాగతుడనై రావడాన్ని బగూర్చి తొందరగా తెలియజేయండి) అనే భాగంలో విభీషణుడు వ్యక్తం చేశాడు –అని మనం తెలియవచ్చు.

మీరు నా రాకను గురించి తెలియజేసేటప్పుడు, "శ్రీరామునకు కైంకర్యం చేయాలి" అనే ఆశతో కూడిన నా ఈ రుచి మారడానికి ముందే తొందరగా తెలియజేస్తే, అది ప్రయోజనం కలిగినది అవుతుంది. నన్ను శ్రీరాముడు మనస్సులో ఆనందించి అంగీకరించి, నన్ను తన సేవలో వినియోగించుకునేటట్లు చేయడం అతని భక్తులైన మీకు తగినది. నన్ను స్వీకరించి సేవలో వినియోగించుకుని ఆనందించడం శ్రీరామునకు తగినది.

మీరు, నన్ను పరమ పురుషుడైన శ్రీ రాముడు ఆనందించి స్వీకరించేటట్లు చేయవలసి ఉన్నందున, ఈ విధంగా చేయకపోతే మీ స్థితి, మీ యోగ్యత మిమ్ములను విడిచి పోతుంది కదా. ఇందువల్ల మీకే నష్టం, స్వరూపనాశం కలుగుతుంది కదా.

మీరు నా రాకనుగూర్చి తెలియజేసినప్పటికీ శ్రీరాముడు నన్ను సంతోషించి స్వీకరించి దాసునిగా స్వీకరించకపోతే, అది ఆ స్వామి యొక్క స్థితికి లోటుకదా, శ్రీ రాముని విషయంలో గొప్ప ప్రేమను కలిగిన మిమ్ములను, శ్రీరాముని కైంకర్యం చేసి ఆనందింప చేయడం నాకు కర్తవ్యం కదా. ఆ విధంగా నేను ఆనందింప చేయకుండా ఉంటే అది నా స్థితికి నాశం కలిగిస్తుంది కదా. మిమ్ములను, శ్రీరాముని ఆనందింప చేయకుండా ఉండడం నాశనం కలిగిస్తుంది అంటే, మిమ్ములను, శ్రీరాముని (మీకు, శ్రీరామునకు తగిన ఆ యా దశలనుండి భ్రంశం చెండేటట్లు చేయడం ద్వారా) పాడు చేస్తే, నా గతి ఏమవుతుంది?

అందుచేత మీరు నా రాకను తొందరగా తెలియజేస్తే మీకు మంచి జరుగుతుంది. శ్రీరాముడు నన్ను స్వీకరించి సేవకునిగా గ్రహించి ఆనందస్తే, దానివల్ల అతనికి కూడా మంచి కలగుతుంది. మీ గోష్ఠిలో ఒకడుగా కలసి ఉండి,

మీవలె శ్రీరామునకు కైంకర్యం చేస్తే నాకు మంచి కలుగుతుంది. ఈ విధంగానే అందరూ మంచిని పొందేటట్లు మీరు నా రాకనుగూర్చి శ్రీరామునకు తెలియజేస్తే అప్పుడు మంచి జరుగుతుంది.

శ్రీరాముడు అన్ని లోకాలను రక్షించి పరమాత్మ కదా. నేనుకూడా ఈ లోకంలోని జనులలో ఒకడను కదా. శ్రీరాముని సౌలభ్య గుణానికి లక్ష్యం కానివారు ఉన్నారా? "నీవు రావణుని తమ్ముడవు, ఆ కారణం చేత మాకు శత్రువువు. నీవు" అని చెప్పకండి (ఈ లోకంలో ఉండే అందరూ ఒకటిగా చేరి ఎదిరించినా, చాలా గొప్పవాడైన ఆ పరమాత్మకు హాని కొంచెం కూడా ఏర్పడే అవకాశం ఉన్నదా?) శ్రీరాముడు శరణు పొందినవారిని రక్షించే వంశంలో జన్మించిన మహాత్ముడు కదా. అతని వల్ల అందరికీ హితం కలిగేటట్లు నా రాకను గురించి తెలియజేయండి –అని అన్నాడు విభీషణుడు.

శ్రీ రామాయణంలో ఈ ఒక్క శ్లోకానికి కల గొప్పతనం ఇక ఏ శ్లోకానికి లేదు. మనకు ఈ శ్లోకం అయినా అర్థంతో మనసులో విడిస్తే చాలు, అది రామాయణమే మొత్తం మన మనసులో నిలిచినట్లు అవుతుంది. శరణాగతి శాస్త్రమైనా శ్రీరామాయణానికి సంగ్రహంగా ఈ శ్లోకం వెలుగుతున్నది– అని అంటే అది అతిశయోక్తి కాదు. శ్రీ విభీషణుని ఈ మాటను విని శ్రీరాముని విషయంలో పొందే ప్రేమ సుగ్రీవుడు వేగంగా శ్రీరాముని దగ్గరకు వెళ్లి ఒక మాటను చెప్పాడు.

"వధ్యతామేష తీవ్రేణ దండేన సచివైస్సహ,

రావణస్య నృశంసస్య భ్రాతా హ్యేష విభీషణః"

యుద్ధకాండలో 17వ సర్గ లో ఉండే 27 వ శ్లోకం ఇది. "ఇతనిని బంధించి దెబ్బలు కొట్టడం గానీ, లేక, మారీచుని వలె వచ్చే కాలంలో బాధ కలిగించడం గాని చేయకుండా వెంటనే వధిద్దాం. ఆ విధంగా వధించేచేటప్పుడు నిన్ను బాధించడం కోసం కలసి వచ్చిన ఈ నలుగురిని తలను ఖండించి, అతని చేతిలో పెట్టి, తరువాత ఇతని శిరస్సును ఖండించాలి. ఇతడు రావణునకు తమ్ముడు

కదా. అందరికీ నిరుపాధిక తల్లి, తండ్రి అయిన శ్రీరాముడు, సీతాదేవి కలసి ఉండడం చూడలేనివాడుకదా రావణుడు. శరీరం, ప్రాణం అనే రెండిటిని విడదీసినట్లు, ఏనాడూ విడిచి ఉండని సీతాదేవిని, భగవంతుడవైన నిన్ను, ఒకవైపు సముద్రం, ఒకవైపు పర్వతం అనేటట్లుగా విడదీసిన దుష్టుడైన రావణునకు ఈతడు ఒక అవయవం అనేట్లుగా చాలా సన్నిహితుడై ఉన్నవాడు కదా ఈ విభీషణుడు" అని సుగ్రీవుడు పలుకుతున్నాడు. ఈ మాటలను విన్న శ్రీరాముడు వానరులను చూసి "మీ అభిప్రాయం ఏమి?" అని ప్రశ్నించాడు. ఈ ప్రశ్నను విన్న వానరులు అందరూ "ఈ విభీషణుని అంగీకరించడం సరైనది అంటే, దానివల్ల సుగ్రీవునకు కోపం కలుగుతుంది. ఇతనిని అంగీకరించడం సరి కాదు– అని అంటే అది శ్రీరాముని మనసుకు అనుకూలం కాదు. ఈ ఇద్దరికీ పరతంత్రులం అయిన మనం ఏమీ సమాధానం పలుకడం తగినది కాదు –అని భావించి, మౌనంగా ఉండిపోయారు. అప్పుడు శ్రీరాముడు వారిని చూచి

"సుహృదా హ్యర్థకృచ్ఛ్రేషు యుక్తం బుద్ధిమతా సదా,

సమర్థేనాపి సందేశం శాశ్వతీం భూతిమిచ్ఛతా" (యుద్ధ కాండం– 17–31) అని అన్నాడు. వానరులారా! నన్ను శరణంగా ఆశ్రయించి ఉండే తనను నేను అంగీకరించకపోతే, అతనికి జీవనం లేదు. శరణు పొందినవానిని అంగీకరించడం చాలా గొప్ప ధర్మం. శరణు పొందినవానికి అంగీకరించకపోతే రఘు కులంలో పుట్టిన రాముడు శరణు పొందినవారిని విడిచి పెట్టాడు– అనే అపకీర్తి నాకు స్థిరంగా కలుగుతుంది. విభీషణుని మాటను అంగీకరిస్తే, అతనిని అంగీకరించకూడదు– అని పలికే సుగ్రీవునకు అంగీకారం కాదు. నా విషయంలో పొందే ప్రేమను కల సుగ్రీవుని మాట ప్రకారం వర్తించడం మంచిది. ఈ విధంగా రెండిటిని చేయవలసి ఉన్నా, ఈ రెండు ఒకదానికి ఇంకొకటి విరుద్ధంగా ఉన్నవి. ఈ రెండింటిలో దేనిని చేయడం? దీనిని విడిచిపెట్టడం? అనే కర్తవ్యం సంకటంలో నేను ఉన్నాను. ఈ స్థితిలో ఉండే నాకు "ఇది చేయదగినది, ఇది చేయరానిది" అనే వివేకం కలిగినవారు, తలచినది చేయగలిగిన శక్తిని కలవారు నశించే విషయంలో దృష్టి పెట్టకుండా శాశ్వతమైన సంపద కోరేవారు, బాధపడే వారిని

చూస్తే అయ్యో! అని జాలి పడేవారు, ఉత్తమ స్నేహితులు అయిన మీరు ఒక మాట చెప్పడం మీకు తగినది కదా. చెప్పండి" అని అన్నాడు శ్రీరాముడు.

ఈ శ్లోకంలో ఉండే "శాశ్వతీం భూతిమిచ్ఛతా" అనే భాగం ముఖ్యం ఈ భాగంలో ప్రకాశించే శ్రీరాముని అభిప్రాయం మనం నిశితంగా గమనించదగినది సుగ్రీవమహారాజు నా శరీరానికి రావణుని తమ్ముడైన విభీషణుడు నీ వల్ల ఏమీ హాని కలుగుతుందో! అని భయపడుతున్నాడు. ఈ శరీరం ఏనాటికి నశించకుండా ఉండే సంపద కాదు శరణు పొందినవాడు ఎటువంటివాడైనా అతనిని విడవకుండా రక్షించినందుకు వల్ల కలిగే కీర్తి శరీరం ఏనాడు నశించనిది కదా. మీ అభిప్రాయంవల్ల నాకు ఏనాడు స్థిరంగా నిలిచి ఉండే కీర్తి శరీరం నాకు కలిగేటట్లు ఉండాలి" అనేది శ్రీరాముని అభిప్రాయమని తెలుస్తున్నది.

దీనిని చూస్తే సిద్ధ (ఎల్లప్పుడూ ఉండే భగవంతుడు అనే) ధర్మానికి కూడా ఒక విధంగా చలనం కలిగే అవకాశం ఉన్నది– అని తెలుస్తున్నది. శ్రీరాముని విషయంలో ఉండే పొంగే ప్రేమతో మనసులో కలతను పొందిన సుగ్రీవుడు చెప్పే మాట ధర్మమైన శ్రీరామునకే, అంటే, శరణు పొందినవారికి మంచిని కలిగించేవాడైన శ్రీరామునకే, ఒకవిధంగా, చలనం కలిగించేవిగా ఉన్నవి కదా. ఇక్కడ శ్రీరాముడు తాను అనే ధర్మం క్షణం పొందడానికి అవకాశం ఇవ్వకుండా ఉండే ప్రకారం ఏది? అంటే, భగవంతుని ఆశ్రయించినవారు ఏనాడూ అతని మనసును అనుసరించకుండా ఉండరు. ఒకవేళ ఆ విధంగా అనుసరించకుండా ఉండేవాడు అయితే, అతని మనఃక్లేశాన్ని మిగిలినవారితో పోగొట్టి, అతనిని తన వశం చేసికొని, తనను తన స్థితినుండి చలనం పొందకుండా ఉంచుకోవడమే అతడు తనను సుస్థాపించుకునే ప్రకారం. ఇదే భగవంతుడు అవతరించి చేసే ముఖ్యమైన ధర్మసంస్థాపనం. "సుహృదా హి" (స్నేహితులచే) అని శ్రీరాముడు పలకడం కూడా గమనించదగినది. శ్రీరాముడు వానరులను చూసి చాలా మృదువుగా అడిగాడు. తనకు స్నేహితులు అనే స్థితిలో ఉండి మంచిని చెప్పాలి– అని దీని భావం. ఏ స్థితిలో అయినా మంచిని కోరేవారు కదా స్నేహితులు.

వానరులు అందరూ తమ తమ అభిప్రాయాన్ని తెలియజేయడం సాధ్యం కాదు కనుక, అంగదుడు, శరభుడు, జాంబవంతుడు, మైందుడు, హనుమంతుడు– అనే ఐదుగురు శ్రీ రాముని సన్నిధిలో ఒకటిగా చేరి తమతమ అభిప్రాయాలను వేరు వేరుగా విజ్ఞాపన చేశారు. దానికి ముందు మిగిలిన వానరులూ శ్రీరాముని దగ్గర అతని శరణ్యత్వాన్ని స్థాపించే కొన్ని గుణ విశేషాలను విన్నవించారు.

"అజ్ఞానం నాస్తి తే కించిత్ త్రిషు లోకేషు రాఘవ!,

ఆత్మజ్ఞానం పూజయన్ రామ! పృచ్చస్యస్మాన్ సుహృత్తయా" (యుద్ధకాండం –17– 33)

(శ్రీరామా! ముల్లోకాలలోనూ నీకు తెలియనిది ఏమీ లేదు. నీ భక్తులు చెబితే తప్ప ఏదీ చేయని నీ గొప్పతనం ప్రకాశించేటట్లు స్నేహంతో మా అభిప్రాయాన్ని అడుగుతున్నావు)

"త్వం హి సత్యవ్రతో శూరో ధార్మికో దృఢవిక్రమః,

పరీక్ష్యకారీ స్మృతిమాన్ నిసృష్టాత్మా సుహృత్సు చ" (యుద్ధ కాండం– 17– 34) (నీవు చెప్పిన మాటను దాటనివాడవు. వ్యర్థం కాని సంకల్పాన్ని కలవాడవు. పరాక్రమానికి కలవాడవు. ధార్మికుడవు. అంటే, ధర్మాన్ని విడువనివాడవు. స్థిరమైన కార్యాన్ని చేసేవాడవు. దేనిని అయినా ఆలోచించి ఆలోచించి చేసేవాడవు. చక్కని జ్ఞానాన్ని కలవాడవు. స్నేహితులకు కట్టుబడి ఉండేవాడవు) అనేది వానరుల విన్నపం. ఇక, అంగదుడు మొదలైనవారు పలికిన మాటలను చూద్దాం.

" అర్థానర్థౌ వినిశ్చిత్య వ్యవసాయం భజేత హి,

గుణతః సంగ్రహం కుర్యాత్ దోషతస్తు విసర్జయేత్ " (యుద్ధ కాండం– 17–35) అనేది అంగదుని మాట.

శ్రీరాముడు తనను శరణు పొందినవారిని అంగీకరించడంలో స్థిరమైన అభిప్రాయం కలవాడు. సుగ్రీవుడు విభీషణుని వధించాలి– అని ఉన్నాడు. ఈ విధంగా ఒకదానికి ఇంకొకటి విరుద్ధంగా ఉండే రెండు అభిప్రాయాలలో, ఒకదానిని విడిచి ఇంకొక అభిప్రాయాన్ని అంగీకరించవలసి ఉన్నందున, దీనికి తగినట్లే, విభీషణుని స్థితిని చక్కగా ఆలోచించి చూచి, అతనిలో దోషం ఉంటే అంగీకరించదగనివాడుగా, లేకపోతే గుణం ఉంటే అంగీకరించదగినవాడు గాను నిర్ణయించాలి–అని అంగదుని అభిప్రాయం.

"శరభ స్త్వథ నిశ్చిత్య సాధ్యం వచన మబ్రవీత్,

క్షిప్ర మస్మిన్ నరవ్యాఘ్ర! చారః ప్రతివిధీయతామ్,

ప్రణిధాయ హి చారేణ యథావత్ సూక్ష్మబుద్ధినా,

పరీక్ష్య చ తతః కార్యో యథాన్యాయం పరిగ్రహః" (యుద్ధ కాండం –17–41, 42) (సూక్ష్మమైన జ్ఞానాన్ని కల ఒక చారుని ఇతని విషయంలో నియోగించి, అతని ద్వారా ఇతనిని పరీక్షించి చూచి, ఆ తరువాత ఇతనిని అంగీకరించే విషయంలో నిర్ణయం తీసుకోవాలి) అనేది శరభుని నిర్ణయం. తరువాత నీతిశాస్త్రాన్ని చక్కగా తెలిసినవాడైన జాంబవంతుడు తన అభిప్రాయాన్ని తెలుపుతున్నాడు.

"బద్ధవైరాచ్చ పాపాచ్చ రాక్షసేంద్రాత్ విభీషణః,

ఆదేశకాలే సంప్రాప్తః సర్వథా శంక్యతామియమ్" (యుద్ధ కాండం– 17–44) (ఈ విభీషణుడు విరోధాన్ని పెంచుకున్నవాడు, వంచకబుద్ధిని కలవాడు అయిన రావణుని దగ్గర నుండి వచ్చినవాడు కనుక, రాకూడని కాలంలో, రాకూడని దేశంలో వచ్చినవాడు కనుక, అన్ని విధాలుగా సందేహపడ

తగినవాడు) అనేది జాంబవంతుని అభిప్రాయం. ఆ తరువాత మైందుడు అనే వానరుడు తన అభిప్రాయాన్ని ఈ విధంగా వ్యక్తం చేశాడు.

"భావ మస్య తు విజ్ఞాయ తతః త్వం చ కరిష్యసి" (యుద్ధ కాండం– 17– 47) (ఇతనిని మనతో చేర్చుకొని, ఇతని మంచి చెడ్డలను బాగా విచారించి, దానికి తగినట్లు నడుచుకోవడం మంచిది) అని అతడు అన్నాడు.

దీనికి తరువాత హనుమంతుడు ఈ నలుగురి మాటలను ఖండిస్తూ, శ్రీరాముని ముందు సుగ్రీవమహారాజును చూచి, తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు.

"న వాదా న్నాపి సంకర్షాత్ నాధిక్యా న్న చ కామతః,

వక్ష్యామి వచనం రాజన్! యథార్థం రామగౌరవాత్" (యుద్ధ కాండం– 17– 50)

మహారాజా! వాదంలో ఒకనిని గెలవాలి– అని కాని, లేక, ఒకరి విషయంలో అసూయ కలిగి కాని, నేను గొప్పవాడననే అభిప్రాయంతో కాని, ఒక ప్రయోజనాన్ని ఆశించి కాని, లేక పక్షపాతంతో కాని నా అభిప్రాయాన్ని చెప్పడం లేదు శ్రీరాముని గుణాలు చూచి వాస్తవాన్ని చెబుతున్నాను– అని అన్నాడు, హనుమంతుడు ఈ శ్లోకానికి చాలా విస్తృతమైన వ్యాఖ్యానాన్ని పెరియ వాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించారు.

"ఈ విభీషణుని దగ్గర గుణాలను చూచి స్వీకరించడం, లేకపోతే, దోషాలను చూచి విడిచి వేయడం గొప్ప విషయం కాదు. ఎందుకంటే, ఇతనిని మనం ఏదైనా ఒక కార్యంలో ప్రయోగిస్తే తప్ప ఇతని స్వభావం తెలియడం వీలు కాదు. ఇతని స్వభావాన్ని తెలియకుండా ఇతనిని మనం ఏ కార్యంలోను ఉపయోగించడం సాధ్యం కాదు. అందువల్ల ఇతనిని పరిశీలించి స్వీకరించడం అనేది వీలైన విషయం కాదు"– అని మొదట అంగదుని వాదాన్ని

హనుమంతుడు ఖండించాడు. తరువాత, "ఈ విభీషణుడు మనకు ఎదురుగా ఉన్నందున, ఒకరిని నియోగించి, ఇతని మంచి చెడ్డలను గ్రహించి తెలిసికొని, దానికి తగినట్లు నడుచుకోవచ్చు– అనే విషయం కూడా సాధ్యం కాదు" అని శరభుని అభిప్రాయాన్ని హనుమంతుడు ఖండించాడు.

ఈ విభీషణుడు శ్రీరాముని దగ్గరకు రాకూడని ప్రదేశంలో, రాకూడని కాలంలో వచ్చాడు–అనేది కూడా సరి కాదు. ఎందుకంటే, రావణుడు చాలా తమోగుణాన్ని కలవాడు. ఇతరులను బాధించే స్వభావం కలవాడు. అందుచేత, విడువదగినవాడు. విభీషణుడు అతనిని విడవకుండా ఉంటే, అతని పాపకార్యాలవల్ల అతనివలె అతని తోడబుట్టినవాడైన ఇతడు కూడా నశించి పోతాడు. శ్రీరాముడు రజస్సు, తమస్సు అనే గుణాలు కొంచెం కూడా లేకుండా పూర్తి సత్వగుణం కలవాడు. ఇతరుల దుఃఖాలను తీర్చి, వారికి ఆనందాన్ని కలుగజేసేవాడు. ఈ కారణంచేత అందరికి ఆశ్రయించదగినవాడు. ఇతనిని ఆశ్రయిస్తే ఇతని చరణాలను చేరి, కైంకర్యం చేసి, తరించవచ్చు. ఈ విధంగా శ్రీరామునకు ఉన్న గొప్పతనాన్ని, రావణునకు ఉన్న దోషాలను గమనించినవాడు, విభీషణుడు ఇతడు మనః పవిత్రతతో శ్రీరాముని చరణాలను ఆశ్రయించాలని వచ్చాడు. పరమ పురుషుడైన శ్రీరాముని శరణంగా ఆశ్రయించడానికి ఇతనికి ఈ కాలం, ఈ దేశం తగినవి, ఇవి తగనివి అనే సంగతి లేదు" అని జాంబవంతుని మాటలు స్వీకరించ దగినవి కాదు అని హనుమంతుడు ఖండించాడు.

భగవంతుడు ఆనందించేటట్లు ఒకడు తనకు తగిన ధర్మాలను శాస్త్రరీతిలో అనుసరించి ఆచరించడం కర్మయోగం అనబడుతుంది. ఒకడు ఇటువంటి కర్మయోగాన్ని చేస్తాడు. కర్మయోగం అనే ధర్మం పరిశుద్ధమైన చోట, పరిశుద్ధమైన కాలంలో చేయబడినది అయితే దానికి మంచి కలుగుతుంది. ఆ విధంగా చేయకపోతే ధర్మానికి మంచి ఫలం కలుగదు. అయితే, ఈ ధర్మంవలె కాలాన్ని, దేశాన్ని సిద్ధధర్మం అయిన పరమ పురుషునకు విధించడానికి శాస్త్రం అవకాశం ఇవ్వలేదు. తగిన చోట, కాలం అనే వీటితోషభగవంతుడనే ధర్మానికి హితం, ప్రయోజనం కలుగుతుంది–అని చెప్పే అవకాశం లేదు.

శ్రీరాముడు అనే సిద్ధధర్మాన్ని శరణంగా ఆశ్రయించే విభీషణనకు ఆ విధంగా ఆశ్రయించడానికి ఏదైనా ఒక దేశ, కాలం తగినది అవుతాయి కనుక, అవే చాలా మంచివి అనేటప్పుడు, ఆ విధంగా ఆశ్రయించడానికి "ఇది కాలంగా, ఇది దేశంగా కావాలి" అనే నియమం లేదు కదా. ఈ వాస్తవాన్ని వాల్మీకి మహర్షి హనుమంతుని మూలంగా వ్యక్తం చేశాడు.

"ఈ విభీషణుని ఒక కార్యంలో వినియోగించి, ఆ కార్యాన్ని అతనిచేత చేయించి, దానివల్ల ఇతని అభిప్రాయాన్నితెలియవచ్చు– అనేది సంభవం కాదు. ఎందుకంటే, పరాయివాడు తన కార్యంలో సమర్థుడుగా ఉంటే, తన అభిప్రాయాన్ని వ్యక్తం చేయకుండా ఉండేటట్లు నడచుకోగలడు. అందుచేత వేగంగా అతని స్థితిని మనం తెలియడం వీలు కాదు. " అని హనుమంతుడు మైందుని అభిప్రాయం కూడా అంగీకరించదగినది కాదు– అని అన్నాడు. ఈ విధంగా అంగదుడు మొదలైనవారు తెలియజేసిన అభిప్రాయాలలో ఉండే దోషాలను ప్రస్తావించిన తరువాత హనుమంతుడు తన అభిప్రాయాన్ని తెలియజేశాడం.

ఈ విధంగా విభీషణుని దగ్గర దోషాలను గుర్తించే కార్యం ఏది కనబడలేదు. ఇతని ముఖం చల్లగా గోచరిస్తున్నది. ఇతడు చెడ్డవాడై ఉండే పక్షంలో ఇతనికి విరోధంగా ప్రవర్తించాలని ప్రయత్నించిన వానరసమూహానికి ఇష్టమైనవాడై మాటలు పలుకడానికి అవకాశం ఉన్నదా? భయం కొంచెం కూడా లేకుండా ఉండడానికి అవకాశం ఉన్నదా. ఒకనికి మనస్సులో చెడ్డ అభిప్రాయం ఉంటే, దానిని అతడు మూసి పెట్టుకోవాలని ఎంతగా ప్రయత్నించినా, అతని ముఖం అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తుంది కదా. ఈ విభీషణుడు పవిత్రమైన మనస్సును గలవాడై ఉన్నందున ఇతని మనసు చల్లగా భయం అనేది ఏమి లేకుండా వానరుల విషయంలో స్నేహభావం కలిగి ప్రకాశిస్తున్నది. ఇతరులకు చేయడానికి అరుదైన శ్రీ రాముని ప్రయత్నాన్ని, అంటే, ఖరుడు, దూషణుడు మొదలైన14 వేల మంది రాక్షసులను అందరిని మూడున్నర ముహూర్తకాలంలో తానొక్కడే వధించిన పరాక్రమాన్ని విన్నాడు. రావణుని

చరిత్ర నీచమైనది అనే విషయాన్ని కూడాతెలిసి కొన్నాడు. చెడ్డవాడు, రావణుని కంటే ఎన్నో రెట్లు బలం కలవాడైన వాలిని రాముడు ఒకే బాణంతో వధించి, రాజ్యంలో ఏ మాత్రం ఆశ పొందకుండా, దానిని సుగ్రీవునకు వశం చేసి ఇవ్వడం కూడా విన్నాడు. శ్రీరాముడు రావణుని వధించి లంకారాజ్యాన్ని తనకు ఇస్తాడు అని కూడా బలంగా మనసులో తలచినవాడై ఇక్కడకు వచ్చాడు– అని నేను భావిస్తున్నాను– అని హనుమంతుడు అన్నాడు.

"రాజ్యం ప్రార్థయమానస్తు బుద్ధిపూర్వమిహాగతః" (యుద్ధకాండం– 17–65) (రాజ్యాన్ని కోరేవాడుగానే మనఃపూర్వకంగా, అంటే, వంచించాలి అనే అభిప్రాయం లేకుండా విభీషణుడు ఇక్కడకు వచ్చాడు.) అని పలికిన హనుమంతుని వార్త మనం గమనించదగినది. దీనిని గూర్చి తరువాత విచారింప బడుతుంది.

"అథ రామః ప్రసన్నాత్మా శ్రుత్వా వాయుసుతస్య హ,

ప్రత్యభాషత దుర్ధర్షః శ్రుతవానాత్మని స్థితమ్" (యుద్ధకాండం –18 –1)

(ఈ విధంగా హనుమంతుడు విన్నవించిన మాటలను విన్న వెంటనే (సుగ్రీవ మహారాజు మొదలైనవారు, శరణు పొందిన విభీషణుని అంగీకరించకూడదు అని పలికేటప్పుడు ఒక విధంగా నిరుత్సాహపడిన, తన సత్తను కోల్పోయిన రాముడు వెంటనే ఉత్సాహాన్ని పొందాడు. అతని మనస్సు చాలా సంతోషంతో చల్లబడింది. ఆతడు తన మనసులోని అభిప్రాయాన్ని తెలియజేయడం ఆరంభించాడు. "అథ రామః ప్రసన్నాత్మా " అనే ప్రయోగానికి పెరియ వాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించిన వ్యాఖ్యానం మనం అనుభవించదగినది.

"అథ రామః–అనంతరమ్ పెరుమాళ్ ఉళరానార్. అదాకిఅదు–రక్షకత్వమే స్వానురూపమాకైయాలే శరణమెన్రపోదే రక్షిక్కప్పెఱాద స్వరూపహాని పోకై. సంసారిచేతననుక్కు భగవద్ జ్ఞాన అజ్ఞానంగళాలే సద్భావ–అసద్భావంగళ్ పోలేయిఱే, రక్షకనుక్కు రక్షకత్వసిద్ధియాలే సద్భావముమ్, తదభావత్తాలే అసద్భావముమ్" (అథ రామః–ఆ తరువాత రాముడు ప్రాణం కలిగినవాడు

అయ్యాడు. అంటే, రక్షకత్వమే స్వరూపం కనుక, శరణం అని అనగానే రక్షించలేనప్పుడు కలిగిన స్వరూపహాని పోయింది. సంసారి జీవునకు భగవంతునకు సంబంధించిన జ్ఞాన, అజ్ఞానాల వల్ల సత్త కలగడం, అది లేకుండా పోవడంవలె, రక్షకుడైన భగవంతునకు రక్షకత్వ సిద్ధివల్ల సత్త, అది లేకపోతే దాని అభావం ఏర్పడుతుంది.) అని పెరియ వాచ్చాన్ పిళ్ళై పలికారు. రక్షకత్వం అనేది భగవంతునకు స్వరూపం. స్వరూపం అంటే– అసాధారణం. ఆ ధర్మం అతని స్వరూపాన్ని, అంటే, అతడు ఎటువంటివాడు అనే విషయాన్ని, నిరూపించే ధర్మం. దీనికి భంగం కలిగితే అతనికి స్థితి అనేది లేదు. తన స్వరూపాన్ని పోగొట్టుకున్న అతడు లేనివాడే అవుతాడు. దీనికి వ్యాఖ్యాత ఒక దృష్టాంతాన్ని తెలియజేస్తున్నారు. జీవాత్మకు సద్భావం అనేది బ్రహ్మ జ్ఞానం వల్ల కలుగుతుంది. పరబ్రహ్మకు సంబంధించిన జ్ఞానం కలవాడే నిజానికి సత్తను కలవాడు అవుతున్నాడు. పరమాత్మను గూర్చిన జ్ఞానం ఎవనికి లేదో అతడు ఉన్నా, లేనివాడే అవుతున్నాడు.

"అసన్నేవ స భవతి అసత్ బ్రహ్మేతి వేద చేత్, అస్తి బ్రహ్మేతి చేద్వేద సంతమేనం తతో విదురితి" అని వేదాంతం ఘోషిస్తున్నది. ఈ విధంగానే భగవంతుడు తనకు అసాధారణమైన ధర్మ మైన శరణ్యత్వం, అంటే, రక్షకత్వం సిద్ధించే కాలంలోనే సద్భావాన్ని, అంటే, సత్తను కలిగినవాడు అవుతున్నాడు. సుగ్రీవుడు, వానర వీరులు అయిన అంగదుడు, శరభుడు, జాంబవంతుడు, మైందుడు అనే నలుగురు విభీషణుని అంగీకారాన్ని ఒప్పుకోకుండా తెలిపిన అభిప్రాయాలవల్ల తనను ఆశ్రయించిన విభీషణుని రక్షించే అవకాశం, సమయం పొందలేని శ్రీ రాముడు ఆ కారణంచేత తన సత్తను కోల్పోయాడు. శరణ్యత్వం అనేది భగవంతునకు స్వరూప నిరూపక ధర్మం మాత్రమే కాదు. అది భగవంతుని సిద్ధ ధర్మంగా స్థాపించే ధర్మం. శరణ్యత్వం ప్రకాశించనపుడు సిద్ధ ధర్మం అయిన అతని స్థితికి లోపం కలుగుతుంది. అంతేకాక, శ్రీ పెరియ వాచ్చాన్ పిళ్ళై ఇంకా ఒక కారణాన్ని ఈ విధంగా తెలియజేశారు.

"సర్వాశ్రయణత్తుక్కు ఏకాంతమాక చ్చక్రవర్తిత్తిరుమకనాయ్ వందు అవతరిత్త తామ్ ఆశ్రయణోన్ముఖనాయ్ వందవనై విషయీకరిక్కామైయాలే ఓలరాయ్, తిరువడి వార్తైయాలే ఉళరానార్ ఎన్దుమామ్" (అందరూ

ఆశ్రయించడానికి వీలుగా దశరథపుత్రుడుగా అవతరించిన తాను ఆశ్రయించాలని వచ్చిన విభీషణుని అనుగ్రహించలేనందున శ్రీ రాముడు సత్తను కోల్పోయినవాడై, హనుమంతుని మాట వల్ల తిరిగి సత్తను పొందాడు.)

భగవంతుడు శరణ్యత్వాన్ని, (రక్షకత్వాన్ని) తనకు నిరూపకంగా కలిగినవాడు మాత్రమే కాదు, అతడు సిద్ధధర్మం మాత్రమే కాదు, అన్నిటికీ మించి అతడు శరణు పొందిన వారికి ఆశ్రయం ఇవ్వడం, రక్షించడం విశేషధర్మంగా కలిగిన రఘు కులంలో పుట్టినవాడు. రఘు కులానికి ఉండే ఆ గొప్పతనాన్ని పలు విధాలుగా వృద్ధి చేయడం కోసమే భగవంతుడు శ్రీ రాముడై ఈ కులంలో అవతరించాడు. శరణాగత రక్షణకు పట్టాభిషేకం చేసి కొన్న వంశంలో పుట్టిన జన్మ– అని దేశికులు శ్రీరామావతారానికి లక్షణాన్ని అనుగ్రహిస్తారు. అతనికి రాఘవుడు అని పేరు. ఈ పేరుకు ఏమి అర్థం. ॰రాఘవः॰ అనేదానికి రఘు కులంలో పుట్టినవాడు అనేది సాధారణంగా తోచే అర్థం. అయితే, శ్రీరాముని విషయంలో ఈ అర్థాన్ని ఇంత మాత్రమే మనం గ్రహించకూడదు. శ్రీరాముని విషయంలో ఇంత మాత్రమే అర్థాన్ని గ్రహిస్తే అది శ్రీరాముని గొప్పతనాన్ని పూర్ణంగా తెలియజేసేది కాదు.

"రాఘవः" అనే పదానికి "రఘువంశవర్ధనः" (అయోధ్య కాండం– 95 –19) అనే అర్థాన్ని వాల్మీకి మహాముని అనుగ్రహిస్తారు. శరణ్యత్వాన్ని ;కులధర్మంగా కలిగి ఉండే రఘువంశంలోని గొప్పదనాన్ని పలు విధాలుగా వృద్ధి చేసేవాడు– అని దీని అర్థం. ఇదే శ్రీ రామచంద్రునకు నిరూపక పదం. అతని యథార్థస్థితిని పూర్తిగా తెలియజేయగలదు. శ్రీ రాముడు విభీషణుని అంగీకరించకపోతే అతని అవతారప్రయోజనం సిద్ధించకుండా పోతుంది. "రఘుకులంలో పుట్టినవాడు ఒకడు శరణాగతుని రక్షించలేదు, కులధర్మంనుండి తప్పిపోయాడు" అని తాను పుట్టి కులానికి అపకీర్తి వస్తుంది కదా. రఘు వంశ వర్ధన్అనే అతని నిజమైన స్థితికిభంగం కలుగుతుంది కదా. ఈ కారణం చత మనసులో చాలా కలత పొందాడు, శ్రీ రాముడు.

"ప్రసన్నాత్మా–ప్రసన్నమనాः. ధర్మి ఉండానవాఱే ధర్మమ్ ఉండాయిట్రు. అదావదు మహారాజర్ వార్తైయాలే కలంగిన తిరువుళ్ళమ్ ప్రసన్నమాయ్, "నిలై

ప్పెట్ర ఎన్నెంజుమ్ పెట్రదు నీడుయిర్" – (తిరువాయ్ మొழி–3–2–10) ఎన్గిఱపడియే స్వలాభత్తిల్ ఆశ్రితరైప్పోలే ఆనార్ ఎన్గై.

(ప్రసన్నాత్మా–ప్రసన్నమైన మనస్సు కలవాడు అయ్యాడు. ధర్మి నిలువగానే ధర్మం కూడా నిలచింది. అంటే, సుగ్రీవుని మాట వల్ల కలత పొందిన మనసు తేట పడి, "నా మనసు నిలిచింది, తిరిగి దీర్ఘమైన ఆయుష్షును పొందింది–అనే విధంగా స్వలాభంలో ఆశ్రితులవలె అయ్యారు)

తరువాత శ్రీరాముని విషయంలో చాలా ప్రేమను కలిగిన హనుమంతుడు విభీషణుని అంగీకారాన్ని చాలా వేగంగా ఆదరిస్తూ మాట పలుకగా, శ్రీరాముడు, పోయిన ప్రాణం తిరిగి వచ్చింది– అనే విధంగా ఊరటను పొందాడు, ధైర్యాన్ని పొందాడు, విభీషణుని అంగీకరించవచ్చు– అని పలికిన హనుమంతుని మాటతో శరణాగత రక్షణమనే స్వరూపం ప్రకాశాన్ని పొందే సమయం వచ్చింది కదా, శరణాగతుడు అయిన విభీషణుని రక్షించడానికి తగిన సమయం వచ్చింది– అని సంతోషంతో తన మనసులో శ్రీరాముడు ఉబ్బి తబ్బిబ్బైయ్యాడు. పూర్వం కలత పొందిన అతని మనస్సు ఇప్పుడు తేటపొందినది అనే అర్థాన్ని " ప్రసన్నాత్మా" అని అంటూ వాల్మీకి వర్ణిస్తున్నాడు.

"పవనసుతనాలే లబ్ధసత్తాకనాన పెరుమాళ్" (హనుమంతునిచే సత్తను పొందిన శ్రీరాముడు) అని తర్వాత వ్యాఖ్యానం చేయబడింది. ఇక్కడ శ్లోకంలో "హ "అనే శబ్దం వాల్మీకి భగవానుడు హనుమంతుని పొగడడం తెలుపుతున్నది. హనుమంతుని “అద్వితీయుడు–సాటి లేనివాడు” అని వాల్మీకి భగవానుడు కీర్తిస్తున్నాడు. సర్వరక్షకుడైన, సర్వలోకశరణ్యుడైన అయిన భగవంతుడు కూడా తన సత్తను కోల్పోగా, అతనిని, అతని విషయంలో తమకు ఉండే అతిమాత్రమైన ప్రేమ ప్రేరేపించగా తన మాటలతో రక్షించినవాడు కదా హనుమంతుడు– అని భావం. శ్రీరాముడు సత్తను పొందిన తరువాత ధర్మం వ్యక్తమైంది. ధర్మం అనేది ధర్మిని ఆశ్రయించి సత్తను పొందుతుంది. ధర్మి లేకపోతే ధర్మం నిలువదు. హనుమంతుని మాటచేత సత్తను పొందిన శ్రీరామునకు ప్రసన్నత కలిగింది. "రామః ప్రసన్నాత్మా"– రాముడు అయినందున భగవంతుడు ప్రసన్నాత్మ అయ్యాడు.

"హ" ఒరువన్ సర్వరక్షకనుక్కు త్తన వార్తైయాలే రక్షకనాక ఆవదే! ఎన్దు ఋషి కొండాడుకిఱార్. " ("హ" ఒకడు తన మాటతో సర్వ రక్షకుడైన భగవంతునకుహ రక్షకుడు కావడమా! అని వాల్మీకి మహర్షి కీర్తిస్తున్నాడు) అని శ్రీవాల్మీకి భగవానుని మనసులో కదిలే భావాన్ని వ్యాఖ్యాత వ్యక్తం చేశారు. ఈ విధంగా హనుమంతుని మాట చత తన స్వరూపప్రకాశాన్ని పొందినవాడై, అందుచేత మనసులో చల్లబడినవాడై, శ్రీరాముడు వానరవీరులను చూచి, "నేను మీ మాటలను విన్నట్లే మీరు కూడా నా మాటలను వినాలి"అని పలికి,

"మిత్రభావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన,

దోషో యద్యపి తస్య స్యాత్ సతా మేతదగర్హితమ్" (శ్రీ రామాయణం– యుద్ధ కాండం– 18 –3) (మిత్రుని భావంతో వచ్చిన ఇతనిని ఏ విధంగానూ-వదిలిపెట్టే అవకాశం లేదు. వదిలిపెట్టను. ఇతనిలో దోషం ఉంటే ఉండనీ. ఇతనిని అంగీకరించడం సత్పురుషులకు గర్హించదగినది కాదు) అని అన్నాడు, శ్రీరాముడు. ఈ శ్లోకవ్యాఖ్యానంలో మనం తప్పక తెలుసుకోవలసిన ముఖ్యమైన విషయాలను వ్యాఖ్యాత శ్రీ పెరియ వాచ్చాన్ పిళ్లై వ్యక్తం చేశారు.

విభీషణశరణాగతిలో శరణాగతికి ఉండే లక్షణాలు పుష్కలంగా ఉన్నాయి.

"అనుకూల్యస్య సంకల్పః ప్రాతికూల్యస్య వర్జనమ్,

రక్షిష్యతీతి విశ్వాసః గోప్తృత్వవరణం తథా,

ఆత్మ నిక్షేపకార్పణ్యే షడ్విధా శరణాగతిః" (అహిర్బుధ్న్యసంహిత– 37 –27)

(భగవంతుడు చేసే రక్షణప్రయత్నాలకు అనుకూలమై ఉండడం, ఆ ప్రయత్నాలకు ప్రతికూలంగా ఉండకపోవడం, భగవంతుడు మనలను రక్షిస్తాడు– అనే నమ్మకం, నన్ను రక్షించాలి అని భగవంతుని దగ్గర ప్రార్థించడం, ఆత్మను భగవంతుని సన్నిధిలో సమర్పించడం, తనను రక్షించే ఉపాయం ఏది తన దగ్గర లేకపోవడం –అనే ఆరు విధాలైన స్వభావాలు కలిగినది, శరణాగతి) అని శాస్త్రవచనం. ఈ విధంగానే, శరణాగతికి ఏడు విధాలైన ప్రకారాలు, అంటే,

అంగాలు ఉన్నాయని పెద్దలు అంటారు. శ్రీవిభీషణుని వైభవాన్ని తెలిసికొనే ఈ సమయంలో విభీషణశరణాగతిలో ఉండే అన్ని విశేషాలను, స్వభావాలను తనలో కలిగినవాడుగా ప్రకాశించాడు–అని మన పూర్వాచార్యులు వ్యాఖ్యానించారు.

ఆనుకూల్యస్య సంకల్పం అనేది మంచి మనసును కలవాడై ఉండడాన్ని తెలుపుతుంది. అంటే, భగవంతునకు శరీరమై ఉండే ఈ లోకంలోని అందరి విషయంలోనూ అనుకూలంగా ఉండాలి– అనే నిష్ఠను సూచిస్తుంది. ప్రతి ఒక్కరూ ప్రతిదినం ఆ నాటికి ఉండే నిత్యకర్మానుష్ఠానం ముగిసిన తరువాత, "ఈనాడు లోకానికి నేను ఏమి మంచి చేశాను?" అని మనసులో పోఆలోచించుకోవాలి– అని శాస్త్రం తెలుపుతున్నది. ఇతరులకు సహాయం చేయగలిగిన శక్తి లేనివాడు కూడా ఇతరులకు సహాయ పడాలి–అనే భావం అయినా కలిగి ఉండడం ఆవశ్యకం.

రావణుడు మరణించగా, అతని చివరి సంస్కారాన్ని చేయాలని భావించని విభీషణుడు "ఇతడు ధర్మమార్గాన్ని అతిక్రమించినవాడు, చాలా దుష్టస్వభావాన్ని కలవాడు, కొంచెం కూడా దయ అనేది లేకుండా ఉన్నవాడు, సత్యం తప్పినవాడు, దేవ అసుర మనుష్యస్త్రీలను అపహరించాడు. అందరికీ చెడ్డ కలిగించడంలోనే ఆసక్తి కలవాడు, అన్ని లోకాలను ఏడిపించాడు– అని రావణుడు ఎంత దుర్మార్గుడై ఉన్నాడో, ఆ విషయాన్ని వివరించాడు, విభీషణుడు. ఇటువంటి దురాచారాన్ని కలవాడైన రావణునకు కూడా అతని హితాన్ని మనసులో పెట్టుకొని, మంచి మాటలను విభీషణుడు చెప్పాడు.

"సునివిష్టం హితం వాక్య ముక్తవంతం విభీషణమ్,

అబ్రవీత్ పరుషం వాక్యం రావణః కాలచోదితః" (యుద్ధ కాండం– 16 –1)

అని విభీషణుడు రావణునకు చెప్పిన మంచి మాటలను పొగడుతూ, యమునిచే ప్రేరేపించబడినవాడై, ఆ మాటను వినని రావణుని నిందిస్తూ వాల్మీకి భగవానుడు పలుకుతున్నాడు. వినడానికి చాలా మధురమైనది, అదే సమయంలో హితాన్ని కలిగించేదైన మాటను విభీషణుడు పలికాడు. అయితే, రావణుడు ఒక చెడ్డ

ప్రవృత్తిని, స్వభావాన్ని కలవాడు. శ్రీరాముని, సీతను విడదీసిన మహాపాపి. ధర్మాత్ముడైన విభీషణుడు చేసిన ఉపదేశం అతని స్వభావానికి తగినది కానందున దానిని అతడు మనసులో గ్రహించలేదు. "నేను మంచిని పొందడం కోసం ఇతడు మంచి మాటలను చెప్పాడు" అని విభీషణుని పొగడవలసి ఉండగా, దానికి మారుగా " త్వాం తు ధిక్! కులపాంసనమ్" (6 15 16 17 కులాన్ని పాడు చేయడానికి వచ్చిన నిన్ను తరిమికొట్టాలి) అని గర్హిస్తూ పలికాడు. రాజ్యం నుండి గెంటి వేశాడు. దీనివల్ల దుష్టులకు మనం చేసే ఉపదేశం ఫలించదు– అని తెలుస్తున్నది. అయినా, వారికికూడా మంచిని మనం సాధ్యమైనంతవరకు చేయాలి– అని తెలుస్తున్నది. సీతాదేవి రావణునకు ఉపదేశం చేసింది. శ్రీరాముడు రావణునకు హితం కలగాలని ఆశించాడు. "యది వా రావణః స్వయమ్" (యుద్ధకాండం–18–34) అనే శ్రీరాముని వచనాన్ని మనం చూడవచ్చు. "లోకంలో చేరినవాడుకదా రావణుడు" (లోకత్తుక్కుళ్ళే అంతర్భూతనిఱే రావణనుమ్) (నాచ్చియార్ తిరుమొళి వ్యాఖ్యానం –9–3) అని అంటారు ఇక్కడ పెరియ వాచ్చాన్ పిళ్ళై. రావణుని వధ జరిగిన తరువాత కూడా అతని చివరి సంస్కారాన్ని చేయడానికి విభీషణుడు అంగీకరించనప్పుడు శ్రీరాముడు ఈ విధంగా అన్నాడు–

"మరణాంతాని వైరాణి నిర్వృత్తం నః ప్రయోజనమ్,

క్రియతా మేష సంస్కారో మమా ప్యేష యథా తవ" (పగ మరణంతో ముగిసిపోతుంది. మన ప్రయోజనం సిద్ధించింది. ఇతనికి చరమసంస్కారాలను నిర్వర్తించు. ఇతడు నీకు ఏ విధంగా కావలసినవాడో, నాకు కూడా ఆ విధంగానే కావలసినవాడు).

"త్వత్సకాశాత్ దశగ్రీవసంస్కారం విధిపూర్వకమ్,

ప్రాప్తుమర్హసి ధర్మజ్ఞ! త్వం యశోభాక్ భవిష్యసి"

(నీవు ధర్మ మార్గాన్నిచక్కగా తెలిసినవాడవు. రావణునకు చరమసంస్కారాలను శాస్త్రప్రకారం చేసి, మహా పాపి అయిన తన శత్రువుకుకూడా సంస్కారం చేశాడు అనే గొప్ప కీర్తిని నీవు పొందగలవు) అని

రాముడు నియమించగా, విభీషణుడు కూడా ఆ విధంగానే చేశాడు. ప్రహ్లాదుడుకూడా హిరణ్యకశిపునకు మంచి మాటలను పలికాడు.

లంకను విడిచిపెట్టి బయలుదేరిన విభీషణుడు ఆ సమయంలో కూడా "దుర్బుద్ధి అయిన రావణుడు నశించిపోతున్నాడే! అయ్యో" అనే ఉద్దేశ్యంతో మళ్లీ అతనికి మంచిని ఉపదేశించాడు. అంతేకాక,

"ఆత్మానం సర్వదా రక్ష పురీం చేమాం సరాక్షసామ్,

స్వస్తి తేఽస్తు గమిష్యామి సుఖీభవ మాయా వినా" (యుద్ధ కాండం –16 –26) (నిన్ను చక్కగా రక్షించుకో. రాక్షసులతో కూడి ఉండే ఈ లంకను రక్షించుకో. నీకు మంచి కలగాలి. నేను వెళ్లి వస్తాను. నన్ను విడిచి పెట్టినా, నీవు ఏ కొరత లేనివాడివై వర్ధిల్లాలి) అని ఆ దశలో కూడా రావణునకు మంచిని ఆశించి పలికాడు, శ్రీవిభీషణుడు. లోకంలో అందరూ బాగుపడాలి– అనే భావాన్ని కలవాడు కదా విభీషణుడు. రావణుడు సీతాదేవిని అపహరించిన వెంటనే ఎందుకు విభీషణుడు అతనిని విడిచి పెట్టి బయటకు రాలేదు? అని మనకు సందేహం కలగవచ్చు. దుష్టునకు బుద్ధి చెబితే, వెంటనే అతడు వినడు. అతడే ఒక సమయంలోతన చెడ్డ నడకను, దానివల్ల జరుగబోయే అనర్థాన్ని తెలిసికొని, ఆలోచన చేస్తాడు. ఆ సమయంలో అతనికి హితాన్ని పలికి, అతనికి రాబోయే ఆపద నుండి అతనిని రక్షించవచ్చు– అని తగిన సమయంకోసం విభీషణుడు ఎదురు చూచాడు. ఇంతేకాక, దూతగా వచ్చిన హనుమంతుని రావణుడు బాధించాలి– అని ప్రయత్నించగా, అది తగని కార్యం– అని రావణునకు తెలియజేసి, హనుమంతుని రక్షించాడు. అంతేకాక, తన కుమార్తె అయిన అనలను సీతాదేవిని ఊరడించడం కోసం పంపించాడు. అందుచేత సాధువుల గోష్ఠిలో చేరినవాడు విభీషణుడు– అనే విషయం స్పష్టం.

"**ప్రాతికూల్యవర్జనమ్**" అనే శబ్దం చెడ్డను, ప్రతికూలంగా ఉండే విషయాలను వెంటనే విడువడం తెలుపుతుంది. సంసారాన్ని అభివృద్ధి చేసే భార్యాపుత్రులను పూర్తిగా నేరుగా విడువలేకపోయినా, వారి విషయంలో ఉండే అభిమానాన్ని అయినా కొంత విడిచిపెట్టాలి. ప్రయోజనాంతరప్రవృత్తి, అంటే, భగవద్భక్తిని, భగవంతుని కైంకర్యాన్ని మాత్రమేపరమ ప్రయోజనంగా

భావించకుండా, మిగిలిన వాటిని, అంటే, లోకంలో ఉండే సుఖభోగాలను ప్రయోజనాలుగా భావించి, వాటి కోసం ప్రయత్నించడం అనేది ప్రాతికూల్యవర్జనానికి విరోధి అవుతుంది. ఈ విధంగానే సాధనాంతరప్రవృత్తి, అంటే, భగవంతుని సిద్ధోపాయంగా ఆశ్రయించకుండా, ప్రయోజనం సిద్ధించడానికి అతని కంటే ఇంకొక విషయాన్ని, ఉపాయాన్ని, సాధనంగా ఆచరించడం ప్రాతికూల్యవర్జనానికి విరోధి అవుతుంది. "త్యక్త్వా పుత్రాంశ్చ దారాంశ్చ రాఘవం శరణం గతః" ((యుద్ధ కాండం– 17– 14) (పుత్రులను భార్యను శ్వదలిపెట్టి శ్రీరాముని శరణు పొందాడు) అని, "పరిత్యక్తా మయా లంకా మిత్రాణి చ ధనాని చ, భవద్గతం మే రాజ్యం చ జీవితం చ సుఖాని చ" (యుద్ధ కాండం–19 –5) (నేను లంకా రాజ్యాన్ని, మిత్రులను, సంపదను విడిచి పెట్టాను. నా ప్రాణం, సుఖాలు నీ అధీనంలో ఉన్నాయి) అని విడువవలసిన సంసారాన్ని వెంటనే విడిచి పెట్టి, భగవంతుని శరణు పొందినందున విభీషణుని దగ్గర ప్రాతికూల్యవర్జనం అనేదిపూర్ణంగా ఉన్నది– అని మనం తెలియవచ్చు.

రక్షిష్యతీతి విశ్వాసః

భగవంతుడు మనలను రక్షించకుండా విడిచిపెట్టడు– అనే గట్టి నమ్మకం మహావిశ్వాసం అనబడుతుంది. ఇది భగవానుని శరణు పొందేవానికి తప్పక ఉండాలి. రావణుని భవనం నుండి వచ్చినందున, అతని తమ్ముడు అయినందున శ్రీరాముడు ఉండే చోటుకు వస్తే వానరవీరులుచేత తన ప్రాణానికి ఆపద కలుగవచ్చు– అని భయపడడానికి అవకాశం ఉన్నది. అయినా, విభీషణుడు శ్రీరాముడు ఉండే చోటు తనకు ఉద్దేశ్యం అని నమ్మివచ్చినందున "రక్షిష్యతీతి విశ్వాసః" అనే స్వభావం ఇతనిలో ఉన్నది– అని మనం తెలియవచ్చు.

"గోప్తృత్వవరణమ్" అనేది భగవంతుని శరణంగా ఆశ్రయించడాన్ని తెలుపుతుంది. భగవంతుడు ఒక్కడే రక్షకుడు, మిగిలినవారు కారు –అనే భావంతో భగవంతుని ఆశ్రయించాలి. ఈ విధంగానే ఇక్కడ విభీషణుడు శ్రీరాముని శరణు పొందినందున ఇతనిలో "గోప్తృత్వవరణమ్" అనే విషయాన్ని మనం గమనించవచ్చు.

"ఆత్మనిక్షేపమ్" అనేది ఆత్మసమర్పణాన్ని సూచిస్తుంది. సంసారిజీవుడు అనాది కాలంగా నాది అని భ్రమించి అభిమానించే ఈ ఆత్మ అనేది భగవంతునికే చెందినది, ఇంకొకరికి చెందదు– అని తెలిసి కొని, ఈ భావంతో తన సొత్తును, అంటే, తన ఆత్మను, ఆత్మకు చెందిన అన్నిటినీ, వాటి వల్ల కలిగే ప్రయోజనాలను అన్నిటినీ ఆ స్వామికే సమర్పించాలి. ఆత్మస్వరూపం ప్రకాశించేటట్లు తన మూడు కరణాలతో, అంటే, మనసు, వాక్కు, శరీరం– అనే వీటితో ఎల్లప్పుడు భగవంతుని మాత్రమే ఆశ్రయించడం ఆత్మసమర్పణః అవుతుంది. ఇదే పంచకాల పరాయణుల ప్రకారం. మన కాలం, ద్రవ్యం, శక్తి– అనే వీటిని భగవంతునకు అర్పణ చేయాలి. మన పెద్దలు పంచ కాలపరాయణులుగానే ప్రకాశించారు.

భగవంతుని సన్నిధిలో ఆత్మను సమర్పించడం– అనేది చాలా ముఖ్యం. హిరణ్యకశిపుడు ప్రహ్లాదుని చూచి, "నీవు నీ ఆచార్యుని దగ్గర చాలా విషయాలను నేర్చుకుని ఉంటావు. వాటిలో నీ మనసుకు చాలా గొప్పది అని తోచినదానిని ఇప్పుడు నాకు చెప్పు" అని అన్నాడు. హిరణ్యకశిపునిచే ఆ విధంగా నియమింపబడిన ప్రహ్లాదుడు ఆచార్యులు తనకు చెప్పిన విషయాలలో దేనిని చెప్పకుండా, తల్లి గర్భంలో ఉండగా శ్రీనారద భగవానుడు తనకు తెలియజెప్పిన, ఉన్నతమైన ఒక విషయాన్ని హిరణ్యకశిపునకు తెలియజేశాడు.

"తన్మన్యే అధీతముత్తమమ్" (శ్రీ భాగవతం– 75 –24) (నేను నేర్చిన విషయాలలో చాలా గొప్పది– అని భావించే విషయం ఏమంటే, శ్రీ విష్ణువు విషయంలో తొమ్మిది విధాలైన భక్తిని కలిగి ఉండడమే) అని అన్నాడు.

"శ్రవణం కీర్తనం విష్ణోః స్మరణం పాద సేవనమ్,

అర్చనం వందనం దాస్యం సఖ్య మాత్మనివేదనమ్,

ఇతి పుంసార్పితా విష్ణౌ భక్తి శ్చేన్నవలక్షణా,

క్రియతే భగవత్యర్థా తన్మన్యేధీత ముత్తమమ్" (శ్రీ భాగవతం–7–5– 23, 24)

(భగవానుడైన విష్ణువుయొక్క స్వరూపం, రూపం, కళ్యాణ గుణాలు, విభూతులు, ఐశ్వర్యం, దివ్య లీలలు– అనే వీటికి వాచకాలైన నామాలను 1) వినడం, 2) వీటిని కీర్తించడం, 3) వీటిని ధ్యానానికి విషయంగా చేసికోవడం, 4) పాదాలను సేవించడం, 5) ఆరాధన సమర్పించడం, 6) నమస్కరించడం, 7) దాస్యకృత్యాలను చేయడం, 8) స్నేహం కలిగి ఉండడం, 9) ఆత్మను సమర్పించడం అని భక్తి తొమ్మిది విధాలు అయినది. భగవంతుడైన విష్ణువు విషయంలో ఇటువంటి భక్తిని కలిగి ఉండాలి) అని ప్రహ్లాదుడు అన్నాడు. ప్రహ్లాదుడు భక్తియోగనిష్ఠుడు. భక్తియోగనిష్ఠునకు మాత్రమే భగవద్భక్తి కావాలి అని మాత్రం కాదు, ప్రపత్తి యోగనిష్ఠునకు కూడా భక్తి ఆవశ్యకం. భగవద్భక్తియొక్క ముఖ్యమైన అంశం ఆత్మసమర్పణం. దీనిని ఋగ్వేద ఖిలం అయిన జితంతే స్తోత్రం

"ఇత్యేవమనయా స్తుత్యా స్తుత్వా దేవం దినే దినే,

కింకరోస్మీ ఽ తి చాత్మానం దేవాయైవం నివేదయేత్"

(ఈ విధంగా ఈ స్తోత్రంతో భగవంతుని స్తుతించి, " నేను నీకు దాసుడను"అని భగవంతుని వద్ద సమర్పణం చేయాలి అని) కైంకర్యప్రార్థనాపూర్వకంగా భగవంతుని సన్నిధిలో ఆత్మసమర్పణ చేయాలి అని చెప్పబడింది.

ఈ రెండు శ్లోకాలను వేదాంత దేశికులు ఉదాహరించి, శ్రీవిభీషణునకు ఆత్మసమర్పణ అనే సంస్కారం (నిష్ఠ) ఉన్నది, "రాఘవం శరణం గతః" (యుద్ధ కాండం ––17 14) అనే వాక్యంలో ఉండే శరణ శబ్దం విభీషణుడు తనను రక్షించే

బాధ్యతను శ్రీరాముని దగ్గర సమర్పించడం అనే ఆత్మ సమర్పణాన్ని సూచిస్తున్నది– అనే విషయాన్ని తెలియజేశారు.

"కార్పణ్యమ్" –నేను, నాది"అనే అహంకార, మమకారాలు తొలగిన చైతన్య స్థితి కార్పణ్యం అనబడుతుంది. తనని తాను రక్షించుకోవడానికి తన దగ్గర ఏమి లేని స్థితిలో గర్వం అంతా తొలగి ఉండే స్థితి కార్పణ్యం అనబడుతుంది. ఆకించన్యం, అనన్యగతిత్వం– అనే రెండు భగవంతుని ఉద్దేశించి మనకు సహజంగానే ఉన్నాయి. ఈ రెండిటిని మనం అనుసంధించుకోవాలి. భగవంతుని దగ్గర విన్నపించాలి కూడా. రావణునివల్ల పరాభవాన్ని పొంది వచ్చినందున అహంకారం లేకపోవడం, భార్యాపుత్రులను వదిలిపెట్టి వచ్చినందున మమకారం లేకపోవడం విభీషణునిలో మనం గమనించవచ్చు.

శ్రీరామాయణంలో "మిత్రభావేన సంప్రాప్తం "అనే ఈ శ్లోకం ఒక చరమశ్లోకం. భారతంలోకృష్ణ చరమ శ్లోకంవలె శ్రీరామాయణానికి కూడా ఇది ఒక చరమ శ్లోకమై, చివర ఉన్నందున చరమం అవుతున్నది.

ఈ శ్లోకానికి, శ్రీకృష్ణ చరమ శ్లోకానికి మధ్య ఉండే పోలిక

"అంగు కర్మాద్యుపాయంగళై పరక్క మున్నే విధిత్తు, పిన్బం చరమోపాయమాయ్, ప్రపత్తియై విధిక్కియాలే చరమమాక ఇరుందదు. ఇంగుమ్ అంగద శరభప్రభృతికళ్ విభీషణాస్వీకారత్తై త్తనిత్తనియే శొల్ల, అవట్రై పూర్వపక్షీకరిత్తు, చ్చరమమాక సిద్ధాంతిత్త శ్లోకమాకైయాలే చరమమాకిఱదు" (అక్కడ కర్మయోగం మొదలైన ఉపాయాలను వివరంగా విధించిన తరువాత చరణమోపాయంగా ప్రపత్తిని విధించినందున చరమ శ్లోకం అయినవిఇక్కడ కూడా అంగదుడు, శరభుడు మొదలైనవారు విభీషణుని అంగీకరించకూడదు– అని ఒక్కొక్కరు చెప్పగా, వారి మాటలను పూర్వపక్షం చేసి, చివరిగా సిద్ధాంతం చేసిన శ్లోకం అయినందున చరమ శ్లోకం అయినది) అని వ్యాఖ్యానం. ఈ శ్లోకం శ్రీకృష్ణుడు గీతలో చివరిగా పలికిన

“సర్వధర్మాన్ పరిత్యజ్య మామేకం శరణం వ్రజ,

అహం త్వా సర్వ పాపేభ్యో మోక్షయిష్యామి మా శుచః" (భగవద్గీత– 18–66) (అన్ని సాధనాలను పూర్తిగా విడిచిపెట్టి, నన్ను ఒక్కని మాత్రమే ఉపాయంగా ఆశ్రయించు. నేను నిన్ను అన్ని పాపాలనుండి వినిపిస్తాను) అనే సూక్తివలె ఉన్నది. ఏ విధంగా? అంటే, భగవానుడైన శ్రీకృష్ణుడు గీతలో కర్మయోగం (భగవంతుని ఆనందం కోసం జీవాత్మ చేసే స్వధర్మానుష్ఠానం), జ్ఞానయోగం (మనస్సులో పరిశుద్ధతను పొందినవాడు చింతించే జీవాత్మను గూర్చిన చింతన), భక్తియోగం (పరమాత్మను గూర్చి ప్రీతితో చేసే చింతనం) అనే ఉపాయాలను విశదంగా పలికి, చివరిలో వీటిని విడచిపెట్టి, పరమాత్మ అయిన తననే శరణంగా ఆశ్రయించమని ఆజ్ఞాపించాడు.

శ్రీరాముడు కూడా అంగదుడు మొదలైనవారు పలికిన మాటలను ఖండించి, తనకే తగిన, గొప్పదైన అభిప్రాయాన్ని సిద్ధాంతంగా ఈశ్లోకంరూపంలో చెప్పాడు. శ్రీకృష్ణుడు సంపదను కోల్పోయిన అర్జునుని సంపదను కలవాడుగా చేయడంకోసం చెప్పిన చరమ శ్లోకంవలే, శ్రీరాముడు కూడా సంపదను పోగొట్టుకున్న విభీషణుడు లంకా రాజ్యసంపదను పొందినవానినిగా చేయడంకోసం ఈ సూక్తిని పలికాడు. అక్కడ శ్రీకృష్ణుడు సేనమధ్యలో అర్జునుని శోకం తీరడంకోసం పలికిన సూక్తివలె, ఇక్కడ కూడా శ్రీరాముడు సేన మధ్యలో విభీషణుని శోకం తీరడంకోసం ఈ సూక్తిని పలికాడు.

మన పూర్వాచార్యులు "తిరుత్తేర్ త్తట్టిల్ వార్తై" అని, "కడఱ్కైవార్తై" అని ఈ రెండు సూక్తులను తాము ఆదరించి, తమ శిష్యులకు కూడా ఉపదేశిస్తూ వచ్చారు. ఈ రెండు సూక్తులు అందరికీ క్షేమాన్ని కలిగించే గొప్పతనాన్ని కలిగినవై ఉన్నాయి. ఈ రెండు సూక్తులతో సంబంధం కలవాడే శ్రీ వైష్ణవుడు– అని చెప్పబడుతున్నాడు.

శ్రీకృష్ణ చరమశ్లోకానికి కంటే ఈ శ్లోకానికి ఉండే వైలక్షణ్యం

ఇక పెరియ వాచ్చాన్ పిళ్ళైఈ రెండు సూక్తులలో, శ్రీరాముని సూక్తికే చాలా గొప్పదనం ఉన్నదని అభిప్రాయపడ్డారు–అనే విషయాన్ని మనం గమనిద్దాం.

"అంగు శరణాగత అధ్యవసాయమ్ శొల్లిట్రు. ఇంగు శరణ్య అధ్యవసాయమ్ శొల్లుకిఱదు. అంగు "శరణాగతనై పాపంగళిరుందుమ్. విడువిప్పేన్"ఎన్గిఱదు,

ఇంగు "నాన్ విడేన్" ఎన్గిఱదు (అక్కడ శరణాగతి చేసినవాని అధ్యవసాయం చెప్పబడింది. ఇక్కడ శరణ్యుడైన భగవంతుని అధ్యవసాయం చెప్పబడింది. అక్కడ, "పాపాల నుండి నిన్ను విడిపిస్తాను" అని చెప్పబడింది. ఇక్కడ, "నేను నిన్ను విడువను"అని చెప్పబడింది). అనే వారి సూక్తులు తప్పక అనుభవించ దగినవి. భగవంతుని పొందడం కోసం భగవానుని ఎవడు శరణంగా ఆశ్రయిస్తాడో అతడు శరణాగతుడు అనబడతాడు. భగవంతుడుతనను ఏనాడు రక్షించక విడిచిపెట్టడు, తప్పక రక్షిస్తాడు– అనే గట్టి అభిప్రాయాన్ని శరణాగతాధ్యవసాసాయం అని అంటారు. భగవంతుని చరణాలను శరణంగా ఆశ్రయించినవారికి ఈ విధమైన గట్టి నమ్మకం తప్పకుండా ఉండాలి– అనే విషయాన్ని శ్రీకృష్ణచరమ శ్లోకంలో మనం గమనించవచ్చు. ఈ విధమైన గట్టి అభిప్రాయాన్ని కలిగి ఉండే జీవుని తనను పొందనీయకుండా అడ్డుపడే పాపాలనుండి విడిపిస్తాను– అని శ్రీకృష్ణభగవానుడు తెలియజేశాడు.

"నన్ను శరణంగా ఆశ్రయించిన సంసారి జీవాత్మను విడిచిపెట్టను, అతనిని కాపాడి తీరుతాను" అనే భగవంతుని దగ్గర ఉండే దృఢమైన భావాన్ని శరణ్యాధ్యవసాయం అంటారు. దానిని పైన ప్రస్తావించిన శ్రీరాముని సూక్తిలో మనం గమనించవచ్చు. ఒక సంసారి జీవాత్మ భగవంతుని పొందడం– అనే ప్రాప్యాన్ని పొందే కాలంలో ఇతనికి ఉండే శరణాగతావ్యవసాయం, భగవంతునకు ఉండే శరణ్యాధ్యవసాయం తప్పక ఉండాలి– అని అన్నా, ఈ రెండిటిలో, శరణ్యునకు ఉండే అధ్యవసాయమే చాలా ముఖ్యమైనది కనుక, శరణ్యుడు అయిన భగవంతుని వల్లనే శరణాగతునకు హితం కలుగుతుంది– అనే విషయాన్ని మనం తెలియవచ్చు. ఇక, ఈ శ్లోకంలోని అర్థవిశేషాలను క్రమంగా వివరిస్తాను.

"మిత్ర భావేన సంప్రాప్తం న త్యజేయం కథంచన,

దోషో యద్యపి తస్య స్యాత్ సతామేతదగర్హితమ్"

(మిత్రుని భావంతో వచ్చి ఆశ్రయించిన ఇతనిని ఏ విధంగానూ నేను విడచి పెట్టే అవకాశం లేదు. ఇతనిలో దోషం ఉండనీ, ఇతనిని రక్షించడం అనేది మంచివారికి

గర్హించదగినది కాదు) అని శ్రీరాముడు తన మనసులో ఉండే అభిప్రాయాన్ని తెలియజేశాడు.

(మిత్రభావేన సంప్రాప్తమ్) ఒకడు మిత్రుని వేషంతో వంచకబుద్ధితో శరణాగతి అని పలికి వచ్చినా, నా ప్రాణానికి అతనివలన ఆపద కలిగినా, విడచిపెట్టను. అతని దోషమే ఆలంబనంగా చేసికొని, అతనిని రక్షిస్తాను –అని భగవంతుడు అన్నాడు. శరణ్యుడైన భగవంతునకు శరణాగతుని రక్షించే తీరాలి– అనే నిర్బంధం ఉన్నది– అనే విషయం దీనివల్ల తెలుస్తున్నది. తనకు చేసిన ఉపకారానికి ప్రత్యుపకారం చేసేవాడు మిత్రుడు అని లోకక్రమం. అయితే భగవంతుడు ఇక్కడ ఆ అర్థంలో మిత్రశబ్ద ప్రయోగాన్ని చేయలేదు. ఈ మిత్రశబ్దం విశ్వసనీయుడు– నమ్మదగినవాడు–అనే అర్థాన్ని తెలుపుతుంది. నమ్మదగినవాని మాటలతో, పనులతో నన్ను ఆశ్రయించినవారిని నేను విడువను– అని భగవంతుడు అంటున్నాడు. నిజానికి నమ్మదగినవాడుగా ఉండాలి అనేది కూడా ఆవశ్యకం కాదు. మాటలతో, పనులతో నమ్మదగినవానివలె ఉండేవానినే ఇక్కడ మిత్ర శబ్దం తెలుపుతున్నది.

(న త్యజేయం కథంచన) ఆశ్రయించడమా? మానడమా? అనే విచారణలో అవకాశం లేదు. శరణాగతులను విడిచిపెట్టడంలో నాకు శక్తి లేదు. అతని వల్ల నాకు ఆపద రావచ్చు –అని అంటే, నా ప్రాణానికి ఆపద వచ్చేటట్టుగా ఉన్నప్పటికీ మిత్రభావంతో వచ్చినవానిని విడిచిపెట్టను–అని భగవంతుడు అంటున్నాడు.

(దోషో యద్యపి) "శ్రేయసి స్థితైః భవద్భిః" (యుద్ధకాండం –18– 2) అని శ్రీరాముడు పలికినట్లుగా శ్రీరామునకు ఏది మంచిని కలిగిస్తుందో అందులో స్థిరంగా నిలిచి ఉండి, తన సత్తా కలిగినవారై ఉండేవారు వానరవీరులు శ్రీరాముని విషయంలో తమకు కల ప్రేమకారణంగా అస్థానే భయశంకను కలవారై, పరమధార్మికుడు, శరణాగతి నిష్ఠను కలవాడైన విభీషణుని –

1) ఇతడు రాక్షసుడు, (హీనమైన చరిత్రను కలవాడు) అని,

2) రావణుని తమ్ముడు (దివ్యదంపతుల విషయంలో చాలా గొప్ప అపచారం చేసిన రావణుని తమ్ముడు) అని,

3) విభీషణుడు (లోకంలోనివారికి భయాన్ని కలిగించేవాడు) అనే నిరూపక నామాన్ని కలిగినవాడు–

అనే మూడు దోషాలను వానరవీరులు చూపుతున్నారు. ఇతడు మన నమ్మకానికి తగినవాడు కాడు, ఇతడు మనలను మోసగిస్తాడు. ఇతడు మనకు భేదాభిప్రాయాలను, కలతలను కలిగిస్తాడు. ఇతడు మనకు బాధను కలిగిస్తాడు, చంపను కూడా చంపుతాడు–అనేది హనుమంతునకు తప్ప మిగిలిన వానరవీరుల ఆక్షేపం. దోషాలను కలిగినవాడు గనుక, ఇతనిని శ్రీరాములు అంగీకరించకూడదు– అని అంటున్నారు, వానర వీరులు. వీరు పలికే మాటలు శ్రీరామునకు సహించరానివిగా తోచగా, వెంటనే, "దోషో యద్యపి తస్య స్యాత్" అని అంటూ విభీషణుడు దోషాన్ని కలిగినవాడే! అని అంటే, ఆ దోషమే కారణంగా అతనిని నేను విడువను అని– శ్రీరాముడు, అంటున్నాడు. ఒకడు ధర్మాత్ముడు అంటే, అతని ధర్మాన్ని చూచి అంగీకరించాడు– అని అంటారు. అతడు పుణ్యాత్ముడు అనే దానిని పురస్కరించుకొని, అతనిని అంగీకరిస్తే, దానివల్ల నాకు ఏమి గొప్పతనం వస్తుంది? అతడు శరణాగతి చేశాడు అనే విషయాన్ని ఆధారంగా చేసికొని, అతనిని అంగీకరిస్తే కదా నాకు గొప్పతనం–అని శ్రీరాముడు అంటున్నాడు. ఏది మంచి? ఏది చెడు? అనే విషయాన్ని పరిశీలించి చూడాలి. విభీషణుడు ధర్మాత్ముడైనా, అతని ధార్మికత్వం భగవంతుని కటాక్షంలో కార్యకరం అవుతుంది– అని చెప్పడానికి లేదు. భరతుని చరిత్రను ఇంతకు ముందే చూచాము. అతని కంటే గొప్ప అధికారి ఇంకొకడు లేడు కదా. అతడు భగవంతుని దగ్గర క్రమానుసారంగా శరణాగతి చేసినా, అతడు కోరిన ఫలం లభించలేదు. "భరతనుక్కు నన్మైతానే తీమైయాయిట్రు" (భరతునకు మంచి చెడు అయింది) అనేది శ్రీపిళ్ళైలోకాచార్యులవారు పలికిన సూక్తి. తరువాత రాముడే తనకు భరతుని ప్రార్థనకు తాను అంగీకరించ లేదు అని తన మనస్సులో చాలా నొచ్చుకున్నాడు.

పాపం కలవానికి మంచి కలుగదు. పుణ్యం కలవానికి మంచి కలుగుతుంది. భగవంతుని మనసులో అభిమానం కలిగితేనే ఒకడు పుణ్యం కలిగినవాడు కాగలడు. "యత్ త్వత్ప్రియం తదిహ పుణ్య మపుణ్యమన్యత్" (భగవన్! నీకు ఏది ఇష్టమో, అది పుణ్యం, ఏది నీకు ఇష్టం కాదో, అది పుణ్యం కాదు) –అని పుణ్యపాపాలకు లక్షణం చెప్పబడింది. అంటే, మనం చేసే ఏ పని అయినా, భగవంతునకు ఆనందం కలిగిస్తే అదే పుణ్యం అవుతుంది. మిగిలినది అంతా పాపమే. వేదం మొదలయిన శాస్త్రాలలో చెప్పబడిన ధర్మాలను భగవంతుని ప్రీతికోసం చేయడమే పుణ్యం –అని అనడం ఒక పక్షం. దీనికంటే ముఖ్యమైన పక్షం ఒకటి ఉన్నది.

"ప్రజాపతిం త్వం వేద, ప్రజాపతిः త్వా వేద, యం ప్రజాపతిర్వేద స పుణ్యో భవతి" (యజుర్–కాండం–1, ప్రశ్న 6–42)) (పరమ పురుషుడు ఒకనిని వరిస్తున్నాడు, పరమ పురుషుని ఇంకొకడు వరిస్తున్నాడు. ఎవరిని

పరమ పురుషుడు వరిస్తాడో, అతడే ఆ పరమ పురుషుని పొందుతాడు) అని శాస్త్రంలో చెప్పిన విధంగా ఏ జీవాత్మను భగవంతుడు వరిస్తాడో అతడు పుణ్యశాలి అవుతాడు. "అవన్ తిరువుళ్ళత్తిలే పట్టపోదాయిట్రు ఇత్తలైక్కు స్వరూపమ్ జీవిప్పదు " (భగవంతుని మనసులో పడినప్పుడే జీవుని స్వరూపం జీవిస్తుంది) అని పెరియ వాచ్చాన్ పిళ్ళై (తనిశ్లోకవ్యాఖ్యానం–2 –67) పలికారు.

ఒకడు మంచిని చేస్తున్నాడు, కాని, అది భగవంతుని మనసులో పడలేదు అంటే, అతడు పుణ్యశాలి కాడు. ఒకడు పాపిగా ఉన్నాడు, అయోనా, అతనికి మంచి చేయాలి, అతనిని రక్షించాలి– అని భగవంతుని మనసులో అభిప్రాయం కలిగితే, ఆ విధంగా కరుణాకటాక్షానికి లక్ష్యం అయినవాడే పుణ్యశాలి అవుతాడు–అని ఈ వేదవాక్యం తెలుపుతున్నది. దీనిని భగవంతుని స్వాతంత్ర్యప్రయుక్తమైన కృప– అని సంప్రదాయంలో వ్యవహరిస్తారు.

(సతా మేతదగర్హితమ్) నన్ను మీరు నిందించినా పరవాలేదు. ధర్మసూక్ష్మం తెలిసినవారు నిందించరు– అని అంటున్నాడు, భగవంతుడు. దీనికి తరువాత, సుగ్రీవ మహారాజు రాముని విషయంలో తనకు కల గొప్ప ప్రీతితో వివేకం

లేనివాడై ఉన్నాడు "ఈ విభీషణుడు. అంగీకరించదగినవాడు కాడు– అనే విషయాన్ని కొన్ని రీతులను అనుసరించి శ్రీరాముని దగ్గర పలికాడు. దీనికి సమాధానం చెప్పే శ్రీరాముడు కూడా పలు సూక్తులను పలికాడు. వాటిలో కొన్నిటిని చూద్దాం.

పిశాచాన్ దానవాన్ పృథివ్యాం చైవ రాక్షసాన్,

అంగుళ్యగ్రేణ తాన్ హన్యామిచ్ఛన్ హరిగణేశ్వర!" (యుద్ధ కాండం– 18 –32) (సుగ్రీవ మహారాజా! పిశాచాలను, అసురులను, ఈ భూమిలో ఉండే రాక్షసులను అందరినీ నేను, కావాలని అనుకుంటే, నా గోటి చివరతో వధించగలను) అని అన్నాడు శ్రీరాముడు.

ఆ విధంగా అయితే ఇంతవరకు శత్రువులు ఎందువల్ల నశించలేదు? విరోధులు ఇంతవరకు నశించకుండా ఉండడం వారిని వధించడం అనేది చాలా కష్టమైన పని అనే కారణంవల్ల కాదు. ఇంతవరకు శత్రువులు ఇంతవరకు నశించకుండా ఉండడం వారిని వధించాలి అని ఇంత వరకు భగవంతుని సంకల్పం కలగకపోవడమే కారణం. ఈ విభీషణునివలె నమస్కరిస్తే, రావణుడు, అతనికి చెందినవారు, తరించి ఉండి ఉండవచ్చు కదా. ఈ మంచి అభిప్రాయంతోనే భగవంతుడు వారిని కూడా విడిచిపెట్టాడు. ఎవడు తన కరుణతో ఈ ప్రపంచాన్ని సృష్టించి, రక్షించి, లయం చేస్తున్నాడో అతడే గొప్ప దైవం– అనేది వేదాంత సిద్ధాంతతత్వం. ఇటువంటి ఉన్నతదైవమే శ్రీరాముడు– అనేది కూడా స్పష్టం. సర్వశక్తుడైన భగవంతుడు లంకలోని రావణుని, అతనికి చెందినవారితో పాటుగా నశింపజేయడం పెద్ద విషయమా? తాను అనే ధర్మాన్ని స్థాపించే ఈ ప్రకరణంలో భగవంతుడు "మిత్రభావేన" అనే శ్లోకంలో తన స్వభావాన్ని స్పష్టం చేశాడు. ఈ శ్లోకంలో తన దైవత్వాన్ని ప్రదర్శించాడు.

"సకృదేవ ప్రసన్నాయ యవాస్మీతి చ యాచతే,

అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ" (యుద్ధ కాండం –18– 33) (ఒకసారి శరణు పొందిన విషయంలోను, నేను నీకు చెందినవాడను– అని యాచించినవాని విషయంలోను అన్ని ప్రాణులనుండి అభయాన్ని అనుగ్రహిస్తున్నాను. ఇది నా వ్రతం) అనేది చాలా ముఖ్యమైన

శ్లోకం. శ్రీసుగ్రీవ మహారాజు శ్రీరాముని చూచి, "శ్రీరామా! పురుషోత్తముడవైన నిన్ను ఉపాయంగా ఆశ్రయించినవారిని విడువకుండా రక్షించడం నీకు తగిన ధర్మం. శాస్త్రం శరణాగతిని ఒక్కసారి చేస్తే చాలు, పలుమార్లు చేయనక్కరలేదు– అని పలికింది. కానీ ఈ విభీషణుడు శాస్త్రక్రమాన్ని తప్పి,

"రాఘవం శరణం గతః" (యుద్ధ కాండం–17 –14) "భవంతం శరణం గతః" (యుద్ధ కాండం –19 –4), "పాదయోః శరణాన్వేషీ నిపపాత" (యుద్ధ కాండం –19– 2) అని ఈ విధంగా మూడుసార్లు నిన్ను శరణు పొందాడు కదా. అందుచేత ఇతడు అంగీకరించదగినవాడు కాడు– అని ఆక్షేపించారు. దీనికి రాముడు పలికిన సమాధానం ఏమంటే,

(సకృదేవ) విభీషణుడు క్రమం తప్పకుండా నన్ను శరణు పొందినవాడు. రావణునిచే చాలా అవమానింపబడిన విభీషణుడు నలుగురు రాక్షసులతో కలసి నా దగ్గరకు వచ్చి ఆకాశంలో నిలిచినప్పుడు మీరు అతనిని శత్రువుగా భావించి, మనసులో కలతను పొందారు. మీ మనస్సులోని సందేహాన్ని తీర్చాలని తలచి, "నన్ను శత్రువుగా భావించరాదు, నేను శ్రీరాముని శరణు పొందడంకోసం వచ్చాను" అనే సత్యాన్ని మీకు విభీషణుడు తెలిపిన మాట "రాఘవం శరణం గతః " అనేది. మీ మాట వల్లనే నేను కూడా సందేహాన్ని పొందానేమో! అనే సందేహాన్ని పొంది, నా సందేహాన్ని తీర్చడం కోసం విభీషణుడు పలికిన మాట "భవంతం శరణం గతః" అనేది. వాస్తవానికి క్రమం తప్పకుండా నన్ను అతడు శరణు పొందినప్పుడు చెప్పిన మాట "పాదయోః శరణాన్వేషీ నిపపాత" అనేది. అందుచేత విభీషణుడు అంగీకరించదగినవాడు –అని అన్నాడు. శ్రీరాముడు.

ఈ మాటలను విన్న సుగ్రీవుడు "విభీషణుడు నిన్ను శరణు పొందినవాడు కాడు, ఎందుకంటే, అతనిని వధించాలి– అనే మా మాటను విని, భయపడివెళ్లిపోవడం కోసం సిద్ధమై ఉన్నాడు కదా. అందువల్ల ఇతడు స్వీకరించ దగినవాడు కాదు" అని అన్నాడు.

(ప్రపన్నాయ) "నేను ఇతనిని స్వీకరించవచ్చా? స్వీరించకూడదా? అని సందేహపడనవసరం లేకుండా ఉండేటట్టు ఇతడు నన్ను నమ్మకంతో ఆశ్రయించినవాడు" అని అన్నాడు, శ్రీరాముడు.

అపుడు సుగ్రీవుడు మళ్ళీ, "నిన్నే పరమ హితంగా భావించకుండా, రాజ్యాన్నికోరి వచ్చాడు కదా ఈ విభీషణుడు. నీకు అంతరంగ సేవకుడైన హనుమంతుడుకూడా "రాజ్యఞ ప్రార్థయమానస్తు బుద్ధిపూర్వమిహాగతః" (యుద్ధ కాండం– 17 –65) (ఈ విభీషణుడు బుద్ధిపూర్వకంగా రాజ్యాన్ని కోరి ఇక్కడకు వచ్చాడు.) అని అన్నాడు కదా! అందుచేత, ఇతడు స్వీకరించదగినవాడు కాదు" అని అన్నాడు.

"న వయం తత్కులీనాశ్చ రాజ్యకాంక్షీ చ రాక్షసః" యుద్ధ కాండం –18– 13) (నేను రావణునకు దాయాది కాను. విభీషణుడు రావణునకు దాయాది అయినందున రాజ్యాన్ని కోరి వచ్చాడు. రాక్షసులలో కూడా తెలివైనవారు ఉంటారు) అని,

"అహం హత్వా దశగ్రీవం సప్రహస్తం సబాంధవమ్,

రాజానం త్వాం కరిష్యామి సత్యమేతత్ బ్రవీమి తే" (యుద్ధ కాండం –19 –19) (రావణుని ప్రహస్తునితో పాటు, మిగిలిన బంధువులతో పాటు సంహరించి నిన్ను లంకకు అధిపతిగా చేస్తాను– అని నేను సత్యంగా పలుకుతున్నాను.) అని శ్రీరాముడు స్వయంగా పలికాడు. అందుచేత శ్రీవిభీషణుని ప్రయోజనాంతరపరునిగా, అంటే, లంకా రాజ్యాన్ని ఆశపడే విభీషణుడు శ్రీరాముని దగ్గరకు వచ్చి శరణాగతి చేశాడు– అని సందేహించే అవకాశం ఉన్నది. ఇది నిజం అయితే, విభీషణునకు శ్రీవైష్ణవత్వమే సిద్ధించదు. ఈ స్థితిలో ఇతనిని విభీషణాళ్వాన్ అని, విభీషణ పెరుమాళ్ అని గొప్పగా చెప్పడానికిఎలా వీలవుతుంది? అనే సందేహం కలుగుతుంది. దీనికి తగిన సమాధానాన్ని మనం తప్పక తెలుసుకోవాలి.

(తవాస్మీతి చ యాచతే) హనుమంతుడు రావణుని ముందు నా గొప్పతనాన్ని చెప్పేటప్పుడు దానిని సహించలేని రావణుడు ఆ హనుమంతుని వధించమని ఆజ్ఞాపించాడు. అప్పుడు అక్కడ ఉన్న విభీషణుడు "దూతను చంపడం తగదు" అని ఆ ప్రయత్నాన్ని అడ్డుకున్నాడు. ఈ విధంగా విభీషణుడు తనకు చేసిన మంచిని మనసులో పెట్టుకుని, లంకా రాజ్యాధిపత్యాన్ని అతనికి

ఇవ్వాలి– అని భావించి, "రాజ్యం ప్రార్థయమానస్తు బుద్ధిపూర్వమిహాగతః" అని హనుమంతుడు చెప్పాడు తప్ప, విభీషణుడు రాజ్యాన్నిప్రార్థించాడా? లేదు కదా!

"న వయం తత్కులీనాశ్చ రాజ్యకాంక్షీ చ రాక్షసః" (యుద్ధ కాండం –18–13) (నేను రావణునకు దాయాది కాను. విభీషణుడు రావణునకు దాయాది అయినందున రాజ్యాన్ని కోరి వచ్చాడు. రాక్షసులలో కూడా తెలివైనవారు ఉంటారు) అని శ్రీ రాముడు పలికిన మాటను శ్రీరామభక్తి వల్ల శంకను పొందిన సుగ్రీవుని ఆవేశాన్ని తగ్గించడానికి తగినట్లు శాస్త్రాలలో పలికే ప్రక్రియలో రాజవృత్తాంత ప్రక్రియలో తెలియజేయబడింది) అని వేదాంత దేశికులు అన్నారు. అంటే, శ్రీరాముడు విభీషణుని సుగ్రీవమహారాజు స్థితిలో భావించి పలికాడు. విభీషణుడు కూడా నీవలెనే రాజ్యాన్ని ఆశపడి నా దగ్గరకు వచ్చాడు. రావణుడు మరణించి లంకారాజ్యం లభించే వరకు అయినా నాకు అనుకూలంగా ఉంటాడు –అని భావం. ఈ విధంగా రాచమర్యాదలో మాటను పలికితే అది వానర ప్రభువు అయిన సుగ్రీవునకు సులభంగా తెలివిని కలిగిస్తుంది అని అతని ఉద్దేశం.

విభీషణుని వాస్తవమైన స్థితిని తెలిసుకోవడం కోసం హనుమంతుని మాట కాని, లేక, శ్రీ రాముని మాట కాని ఉపయోగపడవు. వీరి మాటలను దారిలో పోయేవారి మాటలు– అని అంటూ పెరియ వాచ్చాన్ పిళ్ళై పక్కకు పెట్టారు. వేదాంత దేశికులు కూడా ఈ మాటలను పురస్కరించుకొని విభీషణుని ప్రయోజనాంతరపరుడని అనడం ఆపాతరసికులైనవారి, అంటే, పైపైన గమనించి అర్థాలను గ్రహించి, అందులోనే ఆసక్తిని కలిగినవారి, మాట –అని అన్నారు. విభీషణుని స్థితిని అతని మాటలనుబట్టే నిశ్చయించుకోవడం సరి అయినది. ఒకరి స్థితిని నిశ్చయించుకోవడంలో అతని మాటలను సాక్షిగా గ్రహించడం అనేది చక్కని క్రమం. ఇది అంతరంగ న్యాయం– అని పెద్దలు అంటారు. ఈ న్యాయం చాలా ముఖ్యమని మనం గ్రహించాలి– అనే విషయాన్ని కొంచెం వివరిస్తాను. సంప్రదాయంలో ఈ న్యాయం వచ్చే సందర్భాలు అనేకం ఉన్నాయి. వాటిలో రెండిటిని చూద్దాం.

ఆళ్వారులు నిత్యసూరుల అవతారాలుగానే పురాణాలు, ఆ పురాణాలను అనుసరించి పలికిన దివ్యసూరిచరితం, గురు పరం పరా ప్రభావం మొదలైన

గ్రంథాలు తెలుపుతున్నవి. అయితే, నంబిళ్ళై ఈడువ్యాఖ్య, ఆచార్య హృదయం అనే గ్రంథం ఆళ్వారులలో ముఖ్యులైన నమ్మాళ్వారులను మనవంటి ఒక సంసారి చేతనులుగా (పుణ్యపాప రూపకర్మల వల్ల కలిగిన ఆయా శరీరాలతో పుట్టి, అంతు లేని సుఖదుఃఖాలను అనుభవించే జీవాత్మలలో ఒకరుగా) పలికారు. నమ్మాళ్వారులు తమ తిరువాయ్ మొళి ప్రబంధంలో తమను ఉద్దేశించి పలికేటప్పుడు "మాఱి మాఱి పల పిఱప్పుమ్ పిఱందు అడియై అడైందుఉళ్ళమ్ తేఱిఈఱిలిన్ఱ త్తిరువెళ్ళమ్ యాన్ మూళ్ కినన్" (మాటిమాటికి అనేక జన్మలను ఎత్తి, పరమాత్మ పాదాలను ఆశ్రయించి, మనసులో వివేకాన్ని పొంది, సాటి లేని ఆనంద ప్రవాహంలో మునిగాను) అని అన్నారు.

(మహా సముద్రంలో పడి కొట్టుకుపోయే ఒక గడ్డిపరక సముద్రంలోని కెరటం తరవాత ఒక కెరటం గెంటగా అది సముద్ర తీరానికి చేరేటట్లు, ఒకసారి ఒక జన్మలో పుట్టి, అందులోనే తిరిగి తిరిగి జన్మించి, ఈ విధంగా పలు జన్మలలో పుట్టి, సుఖదుఃఖాలను అనుభవిస్తూ కాలం గడిపే సమయంలో భగవంతుని శ్రీచరణాలను చేరి, మనస్సు తేట పడి, అంతు లేని ఆనందం అనే గొప్ప ప్రవాహంలో మునిగాను) అనేది దీని తాత్పర్యం. దీనిని గమనిస్తే, ఇంతకు ముందు ప్రస్తావించిన ఆళ్వారుల సూక్తియే ఈడు సూక్తి, ఆచార్య హృదయగ్రంథసూక్తి అనే ఇవి నమ్మాళ్వారులు సంసారి జీవులలో ఒకరే అని అనడానికి ఆధారమైనది అని తెలుస్తుంది. పురాణాలలో చెప్పినట్లు నమ్మాళ్వారులను విష్వక్సేనుల అంశగాను, మిగిలిన ఆళ్వారులను శంఖం చక్రం మొదలైన అందరూ నిత్యసూరుల అంశగాను గ్రహిస్తే, పైన చెప్పిన నమ్మాళ్వారుల "మాఱి మాఱి ప్పలపిఱప్పుమ్ పిఱందు" అనే మాటను, శ్రీరాముడు పరమాత్మ అయిన నారాయణుడై ఉన్నప్పటికీ, తనను "ఆత్మానం మానుషం మన్యే" అని మానవమాత్రునిగా చెప్పుకున్నట్లు, ఆళ్వారులు కూడా తాము విష్వక్సేనుల అంశ అయినా, తమను తక్కువగా పలుకుతూ, ఈ విధంగా అన్నారు అనే భావాన్ని నిర్వహించి, అభినయపరంగా అర్థం నిర్వహించ వలసి వస్తుంది. వారి వారి యథార్థస్థితిని నిశ్చయించడానికి వారు వారు పలికిన మాటలనే ప్రమాణంగా గ్రహించడం యుక్తం. "పొయ్యిల్ పాడల్" (అసత్యం లేని

పాశురాలు) అని కీర్తింపబడే తిరువాయ్ మొழிలోని "మాఱి మాఱి పల పిఱప్పుమ్ పిఱందు అడియై అడైందు ఉళ్ళమ్ తేఱి" అనే వాక్యాన్ని, ఆ విధంగానే, మిగిలిన వాక్యాలను పూర్వం తెలిపినట్లుగా, అభినయపరంగా చెప్పకుండా, ఉన్నదానిని ఉన్నట్లే తెలిపే వాక్యాలుగా గ్రహించడమే న్యాయం అవుతుంది. ఆళ్వారులను నిత్యసూరుల అవతారాలు అని పలికే పురాణవచనాలను వారి వైభవాలను వర్ణించే సూక్తులుగా చెప్పవచ్చు. నిత్యసూరుల అవతార విశేషం కలిగినవారు ఆళ్వారులు అని కూడా చెప్పవచ్చు. పురాణాలకు, నంబిళ్ళై ఈడు, ఆచార్య హృదయం –అనే గ్రంథాలకు మధ్య విరోధం ఏమి కొంచెం కూడా లేకుండా అర్థం చెప్పుకునే క్రమం ఇదే.

2) ఈ విధంగానే, భగవంతుడు ఎందుకు గీతాశాస్త్రాన్ని లోకానికి ఉపదేశించాడు? అనే ప్రశ్నకు అంతరంగన్యాయాన్ని గ్రహించే పెద్దలు సమాధానాన్ని తెలియజేస్తారు. అర్జునుడు తనకు ఆత్మహితం కలిగించేది ఏదో, దానిని ఉపదేశించమని భగవంతుడైన పార్థసారధిని ప్రార్థించగా, అతనిని వ్యాజంగా పెట్టుకొని పలికిన శాస్త్రం శ్రీభగవద్గీత అనే విషయం మనకు తెలుసు. ఈ గీతాశాస్త్రం వేదాంతానికి వ్యాఖ్యానమై ఉన్నది. అంటే, పరమవేదాంత సారభూతమైన అర్థవిశేషాలను, గ్రహించి అవతరించిన దివ్య గ్రంథం.

అయితే, భగవద్గీతను వేదాంతానికి వ్యాఖ్యగా అవతరించిన ప్రబంధంగా గ్రహించేటప్పుడు ఒక ఆక్షేపం వస్తుంది. అది ఏమంటే, ఇంతకు ముందే వేదాంతానికి వ్యాఖ్యానంగా మహర్షులు అనుగ్రహించిన ఎన్నో గ్రంథాలు ఉన్నాయి కదా. ఇంకా చెప్పాలంటే, వేదవ్యాసభగవానుడు అనుగ్రహించిన శారీరక మీమాంసాశాస్త్రం వేదాంతానికి వ్యాఖ్యానంగా అవతరించిన ప్రబంధమే కదా. గీతలో భగవంతుడు తాను వేదవేద్యుడు అనే విషయాన్ని తెలియజేశాడు. వేదపురుషుడు, వైదికులు అయిన మహర్షులు, ఇంతకుముందే భగవంతుని గూర్చి తెలియజేయగా, వాటిద్వారా మనం కూడా భగవంతునకు చెందిన జ్ఞానాన్ని పొంది ఉజ్జీవించవచ్చు. కాని, గీతాశాస్త్రం అని ఈ విధంగా ఎందుకు ఒక

గొప్ప శాస్త్రం అవతరించాలి? ఈ గ్రంథానికి అవసరమే లేదే? ఈ గ్రంథాన్ని మనం ఎందుకు ఆదరించాలి? అనేది ప్రశ్న.

ఇది ఒక పెద్ద ఆక్షేపం. దీనికి సమాధానాలు అనేకం ఉన్నాయి. వాటిలో ముఖ్యమైనది అంతరంగన్యాయం. భగవంతునిగూర్చి పలు శాస్త్ర గ్రంథాలు మనకు తెలుపుతూ ఉన్నప్పటికీ, తత్వనిష్కర్షం అనే విషయం ప్రస్తావనకు వచ్చినప్పుడు, అంటే, భగవంతుని యథార్థమైన స్థితిని నిశ్చయించేటపుడుఆ స్వామి పలికిన వచనాలనే ముఖ్యమైన ప్రమాణంగా గ్రహించాలి కనుక, శాస్త్ర గ్రంథాలలో గీతకు పరమ ప్రామాణ్యం, ప్రథమ స్థానం సిద్ధిస్తుంది. గీత భగవంతుని సూక్తి కనుక, దీనితో మనకు సంబంధం తప్పక ఉండాలి. మిగిలిన శాస్త్రాలు భక్తిని మోక్షోపాయంగా విధిస్తున్నాయి, గీతా శాస్త్రం అయితే, భక్తివర్ధకశాస్త్రం. అందుచేత అంతరంగ న్యాయాన్ని గ్రహించి, గీతాశాస్త్రాభ్యాసాన్ని తప్పక చేయాలి– అని మనం గ్రహించాలి. ఈ విధంగానే, విభీషణుని యథార్థమైన స్థితిని కూడా మనం అంతరంగ న్యాయంతో, అంటే, అతని మాటలను ఆధారంగా చేసికొని నిశ్చయించాలి.

"పరిత్యక్తా మయా లంకా మిత్రాణి చ ధనాని చ,

భవద్గతం మే రాజ్యం చ జీవితం చ ప్రయోజనమ్ " (యుద్ధ కాండం– 19– 5) (నేను లంకారాజ్యాన్ని, స్నేహితులను, సంపదను విడిచి పెట్టాను. నాకు రాజ్యం, ప్రాణాలు, సుఖాలు అన్ని మీ వల్లనే) అని అన్నాడు కదా. నా తమ్ముడు లక్ష్మణుడు ఏ విధంగా నన్నే గొప్ప ప్రాప్యంగా కోరి, నన్ను విడువకుండా వెంటనే ఉండి, నాకు సంతోషాన్ని కలిగిస్తున్నాడో, ఆ విధంగానే, ఈ విభీషణుడు కూడా నాకు సేవ చేయాలని వచ్చాడు– అని శ్రీరాముడు అన్నాడు. "తవ చాస్మీతి యాచతే" అని పదాలను కలిపి, "చ" అనే పదం ఏవకారార్థంలో గ్రహించి చూస్తే, "శ్రీరాముడవైన నీకే నేను దాసుడను అయి ఉన్నాను") అని యాచించేవానికి" అనే అర్థం ఇక్కడ లభిస్తుంది.

"రాక్షసానాం వధే సాహ్యం లంకాయాశ్చ ప్రధర్షణే,

కరిష్యామి చ యథా ప్రాణం ప్రవేక్ష్యామి చ వాహినీమ్" (యుద్ధ కాండం) (నేను నీ సేనలో ప్రవేశించి, ప్రాణం ఉన్నంత వరకు లంకను భయపెట్టడంలో, రాక్షసులను వధించడంలో నీకు సహాయం చేస్తాను) అని శ్రీరామప్రాప్తితో పాటు, ఢ శ్రీరామ కైంకర్యంలో కూడా స్థిరమైన మనసును కలవాడై విభీషణుడు వెలిగాడు.

విభీషణుడు ఐశ్వర్యాన్ని కోరినవాడు, లంకా రాజ్యాన్ని ఆశ పడినవాడు. కాకపోతే, శ్రీరాముడు అతనికి ఆ విధంగా ఎందుకు దానిని ఇచ్చాడు? విభీషణుడు కూడా ఎందుకు దానిని స్వీకరించాడు? అనే ప్రశ్నలు వస్తాయి. దీనికి చాలా విశదంగా సమాధానాన్ని మన పూర్వాచార్యులు అనుగ్రహించారు దీన్ని తెలిసికొనే సమయంలో మనకు విభీషణుని వైభవం చక్కగా మనసులో పడుతుంది.

విభీషణుని యథార్థమైన స్థితి ఏది? హనుమంతునివలె విభీషణుడు కూడా చిరంజీవి. హనుమంతునివలె విభీషణుడు కూడా అనన్య ప్రయోజనుడు. హనుమంతుని వలె విభీషణుడు కూడా శ్రీమంతుడు– అని అంటారు, మన పూర్వాచార్యులు. విభీషణుడు ధార్మికత్వాన్ని బ్రహ్మ దగ్గర ప్రార్థించి పొందేటప్పుడు, అధర్మాన్ని స్వభావంగా కల రాక్షసజాతిలో పుట్టిన వ్యక్తి తనకు ధార్మికత్వాన్ని వరంగా అడుగుతున్నాడే! అని ఆశ్చర్యపడి, "నాయనా! నీవు కోరే ధార్మికత్వాన్ని నీకు ఇస్తాను. దానికి మించి చక్కగా నీవు చిరకాలం జీవించు, అమరత్వాన్ని నీకు ఇస్తున్నాను "అని బ్రహ్మ అనుగ్రహించాడు. ఇతడే ఈ విధంగా విభీషణునకు అనుగ్రహించాడు అంటే, ఇతని కంటే చాలా గొప్పవాడైన భగవంతుడు కేవలం లంకారాజ్యాన్ని విభీషణునకు ఇచ్చాడు– అని అనడం సక్రమమేనా? నిజానికి భగవంతుడు విభీషణునకు చేసిన అనుగ్రహం అనేది ఏది? అనేదానిని మనం బాగా విచారించి గమనించాలి. "విభీషణాళ్వానుక్కు ఫలమ్ రామప్రాప్తి" (విభీషణుడు తాను శ్రీ రాముని దగ్గర శరణాగతి చేసి, దానికి ప్రతిఫలంగా పొందినది శ్రీరాముని ప్రాప్తి– అని తెలుపుతున్నది, శ్రీవచన భూషణమనే మహాగ్రంథం.

శ్రీరాముడు విభీషణుడునకు అతడు చేసిన శరణాగతికి ఫలంగా తననే అనుగ్రహించాడు, అంటే, అతనిని తన అంతరంగునిగా గ్రహించి వర్తించాడు. అతనికి తన విషయంలోని అనుభవాన్ని అనుగ్రహించాడు. అతడు చెప్పినట్లు చేశాడు. శ్రీరంగవిమానాన్ని ఇచ్చి "ఇలంగైయర్ కోన్ వళిపాడు కోయిల్" అని ఎల్లప్పుడు ఆరాధన చేసేటట్లు అనుగ్రహించాడు.

విభీషణుడు ప్రార్థించిన విధంగానే అతనికి తన విషయంలో కైంకర్యాన్ని అనుగ్రహించాడు. ఈ సందర్భంలో విభీషణుడునకు లభించిన శ్రీరామకైంకర్యంలోని గొప్పతనాన్ని మనం తెలిసి కోవాలి. హనుమంతుని వలే ఆయా సమయాలకు తగినట్లు, శ్రీరాముని విషయంలో లభించిన కైంకర్యాలను శ్రీరాముడు మనస్సుఆనందించేటట్లు చేశాడు. తన దగ్గర శరణు పొందిన విభీషణుని అంగీకరించి స్వీకరించిన, శ్రీరాముడు అతని దగ్గరనుండి రావణునకు సంబంధించిన రాక్షసుల బలాబలాలను తెలిసికోవాలని అనుకున్నాడు. విషయాలను చాలా విశదంగా రాముని దగ్గర విభీషణుడు తెలియజేశాడు. రాక్షసులతో యుద్ధం చేయడం, రాక్షసులు ఉండే చోట్లను మాయాజాలాలను, యుద్ధప్రకారాలను, వారిని వధించడానికి అనుసరించవలసిన దారులను, ఆయా సమయాలలో తెలియజేసి, రావణునితో యుద్ధం చేయాలనే శక్తి కలిగిన పలువురు రాక్షసులు వధలో పాలు పంచుకొన్నాడు, విభీషణుడు.

ఇంద్రజిత్తు మాయాసీతను హనుమంతుని ముందు వధించగా, ఆ హనుమంతునిద్వారా ఈ విషయాన్ని తెలిసికొన్న శ్రీరాముడు సీతను ఇంద్రజిత్తు వధించాడు– అని భావించి, దుఃఖసాగరంలో మునిగి పోయాడు. విభీషణుడు అపుడు వెంటనే రాముని దగ్గరకు వెళ్లి, ఇంద్రజిత్తు ఏ విధంగానూ సీతను వధించే అవకాశం లేదు– అని, నిజానికి జరిగినది రాముని నిశ్చేష్టునిగా చేయడంకోసమే ఇంద్రజిత్తు ఈవిధంగా మాయాజాలం చేశాడని తెలియజేసి, శ్రీరాముడుతన ప్రాణాలను ధరించగలిగేటట్లు చేశాడు. ఇంద్రజిత్తు చేసిన నికుంభిలా యాగం ముగిసిన తరువాత, అతనితో తానే స్వయంగా యుద్ధం చేసి, తరువాత లక్ష్మణునకు ఇంద్రజిత్తు వధించడానికి తగిలిన ఉపాయాలను తెలిపి, ఇంద్రజిత్తు వధలో ముఖ్య భాగాన్ని పంచుకున్నాడు. తగిన సమయంలో అతని సహాయం వానరులకు లభించి ఉండకపోతే విపరీతంగా ఉండి ఉండేది. రాక్షసులు యుద్ధ

క్రమాన్ని భంగం చేయడంలో గొప్ప సహాయాన్ని చేసిన విభీషణుని ప్రభావాన్ని తరువాత శ్రీరాముడుతూ పలికిన మాటలు గమనించదగినవి.

"త్వత్ప్రభావాచ్చ మే జితమ్" (యుద్ధ కాండం– 114– 109) (నీ ప్రభావం వల్లనే నాకు జయం లభించింది) అని, తరువాత అతనికి పట్టాభిషేకాన్ని జరిపించేటట్లు లక్ష్మణుని అజ్ఞాపించే సమయంలో,

"విభీషణ మిమం సౌమ్య!లంకాయా మభిషేచయ,

మమ రక్తం చ భక్తం చ మమ చైవోపకారిణమ్" (యుద్ధ కాండం– 112 –9, 10) (నా విషయంలో అంతు లేని ప్రేమ కలవాడు, నా విషయంలో చలించని భక్తిని కలవాడు, నాకు విశేషంగా ఉపకారం చేసినవాడు అయిన ఈ విభీషణునకు లంకారాజ్యపట్టాభిషేకాన్ని నీవు చేయాలి) అని అని శ్రీరాముడు పలికిన మాట మనం గమనించదగినది.

ఇంతకుమించి, అతడు ప్రార్థించకుండానే, నారాయణుడు– అని, జగన్నాథుడు –అని పేరు పడిన వాడు (ఇతడే శ్రీరంగనాథుడు) ఇక్ష్వాకు కులధనం అని, ఇక్ష్వాకుకులదైవం అనే గొప్పతనాన్ని పొందినవాడు, తనకంటే గొప్పవాడైన ఆరాధనామూర్తిని అతనికి ఇచ్చాడు. " ఇవన్ అనన్యప్రయోజననాన పడియాలే ఇవనుక్కు తమ్మిలుమ్ శిరియ కోయిలాళ్వారై ఎళుందరుళవిత్తుక్కొడుత్తదు" (విభీషణుడు అనన్య ప్రయోజనుడు కనుక ఇతనికి తన కంటే గొప్పది అయిన శ్రీరంగనాథుని అర్చామూర్తిని శ్రీరాముడు అతనికి ఇచ్చాడు) అని దేశికులు పలకడం ఇక్కడ జ్ఞాపకం పెట్టుకోవాలి.

ఇంతేకాక, విభీషణుడు ప్రార్థించకుండానే అతనికి లంకారాజ్యాన్ని ఇచ్చాడు. ఇతడు అనన్యప్రయోజనుడు అయినప్పుడు శ్రీరాముడు ఇతనికి లంకారాజ్యం

అనే ఐశ్వర్యాన్ని ఎందుకు ఇచ్చాడు? అనే ప్రశ్న వస్తుంది. దీనికి రెండు విధాలుగా సమాధానాన్ని వేదాంతదేశికులు తెలియజేశారు.

1) తనను ధ్యానవిషయంగా కలిగిన భక్తులకు భగవంతుడు తగిన కాలంలో మోక్షాన్ని అనుగ్రహిస్తాడు. దానికి ముందుగా మోక్షప్రదానం చేసే కాలం వచ్చేవరకు వారికి ఆరోగ్యం, ఐశ్వర్యం మొదలైన భోగాలను అన్నిటినీ ఇస్తాడు. ఈ వాస్తవం–

"శరీరారోగ్య మర్థం చ భోగాం శ్చానుషంగికాన్,

దదాతి ధ్యాయినాం నిత్య మపవర్గప్రదో హరిః" అని విష్ణు ధర్మంలో (74–48) అని చెప్పబడింది. ఈ విధంగా చిరంజీవి అయిన అతని ఆయుస్సు చివరి వరకు ఈ సంపదను అంతటిని భగవంతుడు అనుగ్రహించాడు. ఇది విభీషణునకు శ్రీరాముడు తానుగానే ఈ సంపదను అనుగ్రహించాడు– అనేది ఒక సమాధానం.

2) ఈ సంపద కూడా శ్రీరామకైంకర్యం కోసమే– అనే విషయాన్ని వాల్మీకి భగవానుడు స్పష్టం చేశాడు. ఉత్తరరామాయణంలో ఒక చోట చివర చాలా ఆశ్చర్యకరమైన చరిత్రను మహర్షి వర్ణించారు. శ్రీరాముడు తన అవతారాన్ని చాలించి, స్వస్థానానికి వేంచేసే సమయం అది. బ్రహ్మ చేసిన నియమనం ప్రకారం కాలరుద్రమూర్తి ఋషివేషాన్ని ధరించి, శ్రీరాముని దగ్గరకు వచ్చాడు. తాను ఒంటరిగా కొన్ని విషయాలను సంభాషించాలి అని, ఆ సమయంలో ఎవరూ లోపలకు రాకూడదు–అని, ఎవరైనా వస్తే, వచ్చినవారికి మరణ దండన విధించాలని శ్రీరామునితో అతడు చెప్పాడు. శ్రీరాముడు కూడా సరే అని అన్నాడు. తన ద్వారపాలకులను బయటకు పంపించి వేసి, లక్ష్మణుని ద్వారం దగ్గర కాపలాగా పెట్టి, "ఎవరూ లోపలకు రాకూడదు, ఎవరైనా లోపలకు వస్తే, వారికి మరణ దండన విధించడం జరుగుతుంది" అని ఆజ్ఞ ఇచ్చాడు. ఋషిరూపంలోని కాల రుద్రమూర్తి శ్రీరామునితో అతని అవతార రహస్యాన్ని విజ్ఞాపన చేసి, అవతార ప్రయోజనం పూర్తి అయే సమయం అయినందున, బ్రహ్మ మొదలైన దేవతలు అందరూ శ్రీరాముడు తన స్థానానికి వేంచేయడం చూసి ఆనందించాలని ఆశతో ఎదురు చూస్తున్నారు– అని తెలియజేశాడు.

శ్రీరాముడు కూడా, తనకు అదే అభిప్రాయం– అనే విషయాన్ని తెలియజేసి, అతనితో ఇంకా కొన్ని విషయాలను మాట్లాడుతూ ఉన్నాడు.

ఆ సమయంలో దూర్వాసమహర్షి అక్కడికి వచ్చి, లక్ష్మణుని చూచి, తాను లోపలికి వెళ్లి, శ్రీరాముని చూడాలి– అని అన్నాడు. అతనితో లక్ష్మణుడు లోపల శ్రీరాముడు ఒక ఋషితో ఒక ముఖ్యవిషయాన్ని మాట్లాడుతున్నాడు– అని, కొంచెం సేపు వేచి ఉండమని ప్రార్థించాడు. దుర్వాసమహర్షి సహజంగా కోపాన్ని కలవాడు. అతడు వేయి సంవత్సరాల కాలం తపస్సు చేసి, చాలా ఆకలితో ఉన్నాడు. శ్రీరాముడు తన చేతితో ఆహారాన్ని ఇవ్వగా, దానిని భుజించాలి– అని వచ్చినందున, చాలా కోపంతో తనను వెంటనే లోపలకు పంపించాలని, లేకపోతే శపిస్తానని, ఆ శాపంవల్ల ఇక్ష్వాకులం అంతా నశించిపోతుందని భయపెట్టాడు. అప్పుడు లక్ష్మణుడు ఒక క్షణకాలం ఆలోచించి, శ్రీరాముడు అవతరించిన ఉన్నతమైన ఇక్ష్వాకువంశం నశించడం కంటే, తాను ఒక్కడే మరణదండనను పొందడం తగినది– అని నిర్ణయించుకుని, లోపలకు వెళ్లి, రామునితో మాట్లాడడానికి దుర్వాసుని అనుమతించాడు. దుర్వాసుడు లోపలకు వెళ్లాడు. వెంటనే రాముడు కాలరుద్రునికి పంపించి వేసి, దుర్వాసుని ఆహ్వానించి, అతనికి అతడు కోరిన ఆహారాన్ని ఇచ్చి తగిన ఉపచారాలను చేశాడు. తరువాత దుర్వాస మహర్షి శ్రీరామునకు మంగళాశాసనం చేసి, అక్కడనుండి వెళ్ళిపోయాడు.

దుర్వాసమహర్షి వెళ్ళిపోయిన తరువాత శ్రీరామునకు తన ప్రతిజ్ఞ గుర్తుకు వచ్చింది. దాని ప్రకారం తాను లక్ష్మణునకు తాను మరణదండన విధించ వలసి వస్తుందే! అని అతడు మనసులో చాలా బాధపడ్డాడు. అపుడు లక్ష్మణుడు రాముని చూచి, "నీవు సత్య సంకల్పుడవుకదా. నీవు పలికిన మాటలను నీవు దాటకూడదు. మాట మీరితే ధర్మమార్గం నుండి తప్పినవాడవు అవుతావు. నాకు మరణశిక్ష విధిస్తే ఏమయింది? నీవు నీ ప్రతిజ్ఞ నెరవేర్చుకో" అని విన్నపించాడు.

మనస్సులో చాలా కలత చెందినవాడై, ఏమి చేయాలో తెలియకుండా ఉండే ధర్మసంకటం స్థితిలో శ్రీరాముడు రాజసభను ఏర్పాటు చేసి, వశిష్ఠుడు మొదలైన అందరికీ జరిగిన వృత్తాంతాన్ని తెలియజేశాడు. "శ్రీరాముడు

లక్ష్మణునకు దేశబహిష్కరణ శిక్ష విధిస్తే, అది మరణదండనకు సమానం అవుతుంది, అదే ధర్మ మార్గం తప్పక ఉండే దారి" అని వశిష్ఠుడు చెప్పగా, శ్రీ రాముడు మనసులో దుఃఖం నిండగా చాలా బాధతో ఏదో ఒక విధంగా ధైర్యం తెచ్చుకుని, లక్ష్మణునకు దేశబహిష్కరణ శిక్షను విధించాడు. లక్ష్మణుడు కూడా తన కన్నులలో నీరు ప్రవహించగా, శ్రీరామునకు నమస్కరించి, తన భవనానికి కూడా వెళ్లకుండా, నేరుగా సరయూ నదితీరానికి వెళ్లి, ఆ నదిలో మునిగి, యోగమార్గం ద్వారా ప్రాణత్యాగం చేశాడు. ఆ సమయంలో ఇంద్రుడు అక్కడకు వచ్చి, లక్ష్మణునకు నమస్కరించి, అతనిని, అతని చరమదేహంతో పాటు దేవలోకానికి తీసుకొని పోయాడు. దేవలోకంలో దేవతలు అందరూ నమస్కరించి, పూజించగా, అక్కడ నుండి లక్ష్మణుడు పరమపదానికి చేరుకున్నాడు.

లక్ష్మణుని విడచి పెట్టినందున కలిగిన దుఃఖాన్ని భరించలేక శ్రీరాముడు లక్ష్మణుడు వెళ్ళిన దారిలోనే తాను కూడా వెళ్లాలని నిశ్చయించుకున్నాడు. అతని ఆజ్ఞప్రకారం శ్రీవిభీషణుని నాయకత్వంలో రాక్షసులు అందరూ, సుగ్రీవ మహారాజు ఆధిపత్యంలో వానరులు అందరూ అక్కడకు వచ్చి చేరుకున్నారు. అందరూ శ్రీరాముని పాదాలలో వాలి, తమను అందరిని అతనితోపాటు తీసికొని పొమ్మని ప్రార్థించారు. అయోధ్యా నగరంలోని ప్రజలుకూడా శ్రీరాముని ఆ విధంగానే వేడుకున్నారు. అతని పాదాలపై పడి నమస్కరించారు. వారి అందరి స్థితిని గమనించిన వశిష్ఠుడు శ్రీరామునితో వారిని అందరిని అతని వెంట తీసుకొనిపొమ్మని అన్నాడు. శ్రీరాముడు కూడా దానికి అంగీకరించాడు. అయితే అంగదునకు సహాయంగా. జాంబవంతుడు, మైందుడు, ద్వివిదుడు, – అనే ముగ్గురిని నిలచి ఉండేటట్లునియమించాడు. శ్రీ హనుమంతుడు ఇంతకు ముందే శ్రీరామునితో తాను విజ్ఞాపన చేసిన రీతిలో ఈ భూలోకంలోనే నిలచిపోయాడు. తన ఆజ్ఞప్రకారం లంకకు వెళ్లి, రాజ్య పరిపాలన చేయమని విభీషణుని శ్రీరాముడుడు నియమించాడు. శ్రీరాముని ఆజ్ఞానుసారం ఈ ఐదుగురు కలియుగం ఆరంభం వరకు ఈ భూలోకంలోనే ఉంటారు. శ్రీరాముడు తన తమ్ములతోపాటు, సుగ్రీవుడు మొదలైన వానరులతో పాటు, తనతో పాటు వచ్చిన రాక్షసులతో పాటు, అయోధ్యా నగర ప్రజలు మొదలైన

జీవరాసులతోపాటు సరయూ నదిలో ప్రవేశించాడు. వానరులు, రాక్షసులుఅ, యోధ్యా నగరంలోని జీవరాసులు అనే వీరు అందరూ ఒకరితో ఒకరు కలసి సరయూ నదిలో మునిగి పైలోకాన్ని చేరిన రేవు "గోప్రతారమ్" అని చెప్పబడుతున్నది.

రాక్షసులు, వానరులు దేవ శరీరాన్ని పొంది, దేవలోకానికి చేరారు. బ్రహ్మచే నిర్మింపబడిన సాంతానికం అనే లోకాన్ని అయోధ్యా నగరంలోని ప్రజలు చేరారు. ఈ లోకంలో బ్రహ్మ యొక్క ఆధిపత్యం ప్రవర్తించదు కనుక, సత్యలోకం కంటే ఉన్నతమైనది. వీరికి కర్మపారతంత్ర్యం లేకుండా పోయినందున, అతిశయితమైన భగవదనుభవం లభించినందున, ఇంచుమించుగా పరమపదంతో సమానంగా వెలిగే వైభవాన్ని కలిగినది.

ఈ విధంగా శ్రీ రాముడు తన స్థానానికి వేంచేసే కాలంలో విభీషణునకు చేసిన నియమనం ఏది? అనే విషయాన్ని వాల్మీకి భగవానుడు–

"రాక్షసేంద్ర! మహావీర్య! లంకాస్థః త్వం ధరిష్యసి,

యావత్ ప్రజా ధరిష్యంతి తావత్త్వం వై విభీషణ!,

యావచ్చంద్రశ్చ సూర్యశ్చ యావత్ తిష్ఠతి మేదినీ,

యావచ్చ మద్గతా లోకే తావత్ రాజ్యం తవాస్త్విహ,

శాసిత స్త్వం సఖిత్వేన కార్యం తే మమ శాసనమ్,

ప్రజా సంరక్ష ధర్మేణ నోత్తరం వక్తుమర్హసి,

కించాన్యత్ వక్తుమిచ్ఛామి రాక్షసేంద్ర! మహామతే!,

ఆరాధయ జగన్నాథ మిక్ష్వాకుకులదైవతమ్,

ఆరాధనీయ మనిశం సర్వైర్దేవైః సవాసవైః" (ఉత్తరకాండం –108 –27, 28, 29, 30)

(గొప్ప వీర్యాన్ని కలవాడవు, రాక్షసులకు అందరికీ ప్రభువువు అయిన విభీషణా! ఈ భూమిలో ప్రజలు జీవించేవరకు, నీవు లంకలో ఉన్నతమైన జీవనాన్ని పొంది, ప్రకాశిస్తావు. ఈ భూమి నిలిచి ఉన్నంతవరకు, ఈ భూమిలో చంద్రుడు, సూర్యుడు ప్రకాశిస్తూ ఉన్నంతవరకు, ఈ భూమిలో నా చరిత్ర గొప్పతనంతో ప్రకాశించే వరకు ప్రజలను ధర్మమార్గంలో తప్పకుండా పాలిస్తూ ఉండు. నీవు నాకు స్నేహితుడవు కనుక, నా ఈ కోరిక ప్రకారం నీవు నడుచుకోవాలి– అని నియమిస్తున్నాను. నా మాటకు బదులు చెప్పకుండా, ధర్మమార్గాన్ని తప్పకుండా ప్రజలను కాపాడు. ఇంద్రుడు మొదలైన సకల దేవతలచేత ఆరాధింపబడే ఇక్ష్వాకుకులదైవం అయిన జగన్నాథుని ఆరాధించు) అని వాల్మీకిమహర్షి వర్ణించారు. ఇందువల్ల విభీషణుడు లంకారాజ్యాధిపత్యాన్ని పొందడంకూడా శ్రీరాముని దివ్యమైన ఆజ్ఞను పరిపాలించడం కోసమే– అని తెలుస్తున్నది. రఘువంశ మహాకావ్యంలో మహాకవి కాళిదాసు పదిహేనవ సర్గ చివరలో–

"నిర్ర్తయ్యైవం దశముఖ శిరశ్ఛేదకార్యం సురాణాం

విష్వక్సేనః స్వతనుమవిశత్ సర్వలోకప్రతిష్ఠామ్,

లంకానాథం పవనతనయం చోభయం స్థాపయిత్వా

కీర్తిస్తంభద్వయమివ గిరౌ దక్షిణే చోత్తరే చ"

(మహావిష్ణువు ఈ విధంగా రావణుని శిరస్సులను ఖండించడం– అనే దేవతల కార్యాన్ని పూర్తి చేసి, శ్రీవిభీషణుని, హనుమంతుని తన కీర్తిని తెలియజేసే, రెండు స్తంభాలుగా దక్షిణ దిక్కులోఉండే సువేల పర్వతంపైన, ఉత్తర దిక్కులో ఉండే హిమాచల పర్వతంలోను స్థాపించి, అన్ని లోకాలకు ఆధారమైన తన దివ్యదేశాన్ని చేరాడు.) అని వర్ణించడం కూడా మనం గమనించవచ్చు.

తరువాత, సుగ్రీవుడు శ్రీరాముని చూచి, "శ్రీ రామా! విభీషణ శరణాగతి క్రమం తప్పింది అనే నా మాటకు బదులు తగినట్లు నీచే చెప్పబడింది. సరే. కాని, నీవు విభీషణుని అనుగ్రహించినందున ఏమి ఫలం? అని అడిగాడు. శ్రీరాముడు ఈ విధంగా పలుకుతున్నాడు.

(అభయం సర్వభూతేభ్యో దదామ్యేతద్వ్రతం మమ) దేవతలు, మానవులు మొదలైన సకలప్రాణులకు భయాన్ని పోగొట్టి, వారికి మంచిని కలుగ చేస్తాను" అని, "ఈ లోకంలో ఉండే అందరికీ దుఃఖాన్ని తీర్చి, ఆనందాన్ని కలిగించడం అనేది నాకే ఉండే ధర్మం కదా! సుగ్రీవా! దీనిని నీవు గ్రహించడం మంచిది" అని అన్నాడు, శ్రీరాముడు.

ఈ విధంగా శరణాగతుని రక్షించే తన దృఢమైన సంకల్పాన్ని వ్యక్తం చేయడం మాత్రమే కాకుండా, తనను ఆశ్రయించి ఉండే సుగ్రీవమహారాజుకు పరతంత్రుడై ఉండడం అనే తనకే తగిన గొప్పతనాన్ని కూడా ప్రకాశింపజేసి, తనకు కల ధర్మస్వభావాన్ని స్థాపించి, శ్రీరాముడు విభీషణుని రక్షించాడు.

"ఆనయైనం హరిశ్రేష్ఠ! దత్తమస్యాభయం మయా,

విభీషణో వా సుగ్రీవ! యది వా రావణః స్వయమ్" (యుద్ధ కాండం– 18– 34 34)

వానరులలో గొప్పవాడవయిన సుగ్రీవ మహారాజా! తన రాకను నా వద్ద తెలియజేసే విధంగా విభీషణుడు ప్రార్థించాడు. కదా. ఇతడు నా దగ్గరకు వచ్చి, తన మనసులోని ఆర్తి తీరడం, నేను అతనిని అంగీకరించడం అనే ఇవి నీవు అతనిని పిలుచుకొని వచ్చినప్పుడే కదా సంభవిస్తాయి. అందుచేత, నీవు వెళ్లి విభీషణుని తీసికొని రా. విడువవలసినవానిని అన్నిటినీ విడచిపెట్టి, నా దగ్గర శరణు పొందిన అతనికి నావల్ల ఆభయం అనేది ఇవ్వబడింది. విభీషణుని మాత్రమే నేను తీసికొని రమ్మన్నాను– అని నీవు భావించవద్దు. ఇక్కడకు వచ్చినవాడు రావణుడైనా సరే, అతనిని నేను అంగీకరిస్తాను. నేను విభీషణుని మాత్రమే అంగీకరిస్తే, తన పట్ల పుణ్యం కలిగినవానిని మాత్రమే నేను అంగీకరిస్తాను– అని అందరూ భావించే అవకాశం ఉన్నది. అంతేకాక, నేను విభీషణుని అంగీకరిస్తే, అతనితో పాటు వచ్చిన నలుగురు మాత్రం ఉజ్జీవించవచ్చు. ఇక్కడకు వచ్చినవాడు రావణుడై ఉన్నా, అతని నేను అంగీకరించడమే నాకు గొప్పతనం కలిగిస్తుంది. అప్పుడే నా సర్వలోకశరణ్యత్వం అనే నా స్వరూపం ప్రకాశిస్తుంది. అంతేకాక, అతనితోపాటు లంకలో ఉండే

రాక్షసులు అందరూ రక్షింపబడతారు. నాకు వచ్చే గొప్పతనం అంతా నాకు ప్రాణస్నేహితుడవు అయిన నీకు కూడా వస్తుంది కదా –అనేది ఈ శ్లోకం ద్వారా తేలిన తాత్పర్యం.

ఈ సందర్భంలో శ్రీరాముడు తానే స్వయంగా వెళ్ళి విభీషణుని పిలిచి, స్వీకరించడం కాకుండా, సుగ్రీవుని పిలచి విభీషణుని తీసుకొని రమ్మని అనడంలో ఏమి తాత్పర్యం?అనే ప్రశ్న కలుగుతుంది. శ్రీరామునకు ఆశ్రితపారతంత్ర్యం, అంటే, తనను ఆశ్రయించినవారికి తాను వశుడై ఉండడం, అనే సంపద ఉన్నది. శ్రీరామునకు కల ఈ కళ్యాణగుణం సహజసిద్ధమైనది కనుక, ఈ విధంగా చేశాడు– అని ఒక కారణం ఇక్కడ చెప్పబడుతున్నది. శ్రీరాముని విషయంలో అంతు లేని ప్రేమను కల విభీషణుని వధించాలి అని పలికి, అతని విషయంలో చాలా అపచారం పడినవాడు, సుగ్రీవుడు. తన భక్తుల విషయంలో ఒకడు ప్రీతిని చూపిస్తే, అది భగవంతుని మనస్సుకు చాలా ఆనందాన్ని కలిగిస్తుంది. అయితే, భగవంతుని విషయంలో ప్రీతిని చూపించినప్పటికి, అతని భక్తుల విషయంలో ఒకడు ప్రీతిని చూపకుండా ఉన్నట్లయితే, అది భగవంతుని మనసులో చాలా పాపంగా తోస్తుంది. ఇటువంటివానితో సంబంధం కలిగిన ప్రపంచమే నశిస్తుంది– అనే ఈ విషయాన్ని భగవంతుడే సాక్షాత్తూ తెలియజేశాడు అనే విషయాన్ని ఇంతకు ముందే నేను విన్నపించాను. శ్రీరాముడు తన భక్తుల విషయంలో చాలా ప్రేమను కలవాడు కనుక, తన భక్తుల ఒకడైన సుగ్రీవుడు విభీషణుని విషయంలో చేసిన అపచారం తీరి, హితాన్ని పొందేటట్లు అతని ద్వారానే విభీషణుని అంగీకరించాడు– అని మనం తెలియాలి.

సర్వలోకశరణ్యుడయిన మాధవుని వైభవాలను, స్వభావ విశేషాలను అనేకమార్లు మనం అనుభవిస్తూ వస్తున్నాము. ప్రసంగ వశం చేత ఈ సందర్భంలో మనం తెలుసుకోవలసిన తత్వం ఇంకా ఒకటి ఉన్నది. భగవంతుని ఒక జీవుడు ఆశ్రయించే ఆశ్రయణం స్వగతస్వీకారం అనబడుతుంది. భగవంతుడే ఒక జీవుని రక్షించదగినవానినిగా భావించి, అతనిని అభిమానించి స్వీకరించడం పరగతస్వీకారం అవుతుంది.

"ముముక్షుర్వై శరణమహం ప్రపద్యే" (శ్వేతాశ్వతరోపనిషత్–6–18) (మోక్షాన్ని పొందగోరేవాడనై భగవంతుని నేను శరణం పొందుతున్నాను) అనే వేదవాక్యం స్వగత స్వీకారానికి ప్రమాణం.

"నాయ మాత్మా ప్రవచనేన లభ్యో న మేధయా న బహునా శ్రుతేన,

యమేవైష వృణుతే తేన లభ్యః తస్యైష ఆత్మా వివృణుతే తనూమ్ స్వామ్" (కఠోపనిషత్–1 –2 –23)

(ఈ పరమాత్మ శ్రవణ, మనన, ధ్యానాలతో మాత్రమే పొందదగినవాడు కాడు. ఎవనిని పరమాత్మ వరిస్తున్నాడో, అతనిచేతనే పరమాత్మ పొందదగినవాడు. అతనికి ఈ పరమాత్మ తన స్వరూప జ్ఞానాన్ని అనుగ్రహిస్తాడు) అనే వేదవాక్యం పరగత స్వీకారానికి ప్రమాణం.

ఈ సంసారి జీవాత్మ పరమాత్మను ఆశ్రయించేటప్పుడు ఏ విధంగా లక్ష్మీదేవిని పురస్కరించుకొని ఆశ్రయిస్తున్నాడో, ఆ విధంగానే, భగవంతుడు కూడా ఒక జీవాత్మను అభిమానించి, అనుగ్రహించేటపుడు లక్ష్మీదేవిని కానీ, లేక, ఆ లక్ష్మీదేవి స్థానంలో ఉండే ఒక భాగవతోత్తముని కానీ ముందుంచుకుని అనుగ్రహిస్తాడు– అనేది పరమాత్మకు సంబంధించిన, మనం తెలియవలసిన తత్వం. గుహుని విషయంలో శ్రీరామునకు అనుగ్రహం కలిగిన రీతిబట్టి ఈ తత్వాన్ని మనం గమనించవచ్చు.

"గుహేన సహితో రామః" అనే రామాయణ వాక్యాన్ని మనం గ్రహిద్దాం. గుహుడు శ్రీరామునితో చేరాడు– అని ఈ వాక్యంలో చెప్పబడలేదు. శ్రీరాముడు గుహుడు ఉండే చోటుకు పోయి, అతనితో చేరాడు– అని ఇక్కడ చెప్పబడుతున్నది. దీనివల్ల భగవంతుడు జీవుడు ఉండే చోటుకు పోయి, అతనిని అభిమానించి, అనుగ్రహిస్తున్నాడు– అని స్పష్టం అవుతున్నది. ఈ విధంగా అనుగ్రహించేటప్పుడు శ్రీరాముడు సీతాదేవిపురుష కారంతోనే అనుగ్రహించాడు– అనే విశేషాన్ని తిరుమంగై ఆళ్వార్ "మాళైమాన్ మడనోక్కి" అనే సూక్తి ద్వారా సూచించారు.

విభీషణుడు స్వగత స్వీకారనిష్ఠుడు. అతడు భగవంతుని దగ్గరకు శరణాగతుడై వచ్చినవాడు. గుహుడు అయితే, పరగత స్వీకారానికి విషయంగా ఉండే గొప్పతనాన్ని కలిగినవాడు. ఈ విధంగా ఈ ఇద్దరి మధ్య తేడా ఉన్నప్పటికీ, వాల్మీకి భగవానుడు శ్రీవిభీషణుని శ్రీరాముడు అంగీకరించిన చరిత్రను వర్ణించేటప్పుడు గుహుని చరిత్ర వలెనే వర్ణించాడు. సీతాదేవిస్థానంలో ఉండే సుగ్రీవమహారాజును పురస్కరించుకొని విభీషణుని స్వీకరించిన ఈ తత్వం "ఆనయైనం హరిశ్రేష్ఠ" ద్వారా అనే సూక్తి ద్వారా స్పష్టమవుతున్నది. " విభీషణేనాశు జగామ సంగతిమ్" (యుద్ధ కాండం –18 –45) (విభీషణునితో ఆ క్షణమే సంబంధాన్ని పొందాడు) అని ఇక్కడ ఒక వాక్యం ఉన్నది. విభీషణుడు పరగత స్వీకారానికి విషయమైనాడు– అనేది స్పష్ట పడేటట్లు వాల్మీకి భగవానుడు వర్ణించడంలో ఏమి అభిప్రాయం? విభీషణుని అంగీకారంలో శ్రీరామునకు కల ఉద్దేశ్యం, అతనిని అంగీకరించిన విధానం అనే వీటిని దృష్టిలో పెట్టుకొని వాల్మీకిమహర్షి విభీషణునకు శ్రీరాముడు చేసిన అనుగ్రహాన్ని పరగత స్వీకారంగానే, లేక, దానితో సమానంగానే వర్ణించాడు అని మనం భావించాలి. ఒక సంసారిజీవాత్మ భగవంతుని ఆశ్రయించేటప్పుడు తాను దోషాలనుగుణకలిగినవాడుగా, గుణహీనిని కలిగి ఉన్నందున, తన ఈ స్థితిని భగవంతుడు క్షమించేటట్లు చేయడంకోసం అతనికి లక్ష్మీదేవి పురుషకారం చాలా ఆవశ్యకం అవుతున్నది. ఆమె పురస్కారంతో భగవంతుని జీవుడుఆశ్రయిస్తున్నాడు. అయితే, భగవంతుడు కల్యాణ గుణ సాగరుడు. అతని దగ్గర దోషం అనేది లేదు. అతడు ఒక జీవుని తనచే రక్షింపబడదగినవానినిగా భావించి, అతనిని అభిమానించి, అంగీకరించేటప్పుడు, లక్ష్మీదేవిని కానీ, ఆమె స్థానంలో ఉండే ఒక భాగవతోత్తముని కానీ ముందుంచుకోవడం ఎందుకు? అనే ప్రశ్న ఏర్పడుతుంది.

మన పూర్వాచార్యులు దీనికి చెప్పే సమాధానం ఏమి? అంటే, భగవంతునకు కూడా ఒక దోషం ఉన్నది. పరమాత్మకు, జీవాత్మకు మధ్య ఉండే సంబంధం ఏనాడూ ఉంటుంది. దానిని ఏ సమయంలోనూ ఎవ్వరు లేకుండా చేయలేరు. ఇటువంటి నిత్యసంబంధాన్ని తన సౌలభ్య గుణాలను, అతడు

ఇంతవరకూ చూడకుండా, భగవంతుడు, తన దగ్గరకు వచ్చిన జీవునిలో ఉండే దోషాలను గమనించి, ఇతనిని పక్కకు గెంటి, సంసారంలో ఇంత కాలంగా పెట్టాడు. ఇప్పుడు తాను అతనిని అభిమానించి, అంగీకరించాలని ఉన్నప్పటికీ, ఈ భగవంతుని ఈ జీవాత్మ కాదని పక్కకు పోవచ్చు కదా. ఈ విధంగా ఈ జీవాత్మ తనను కాదని పక్కకు వెళ్ళిపోకుండా ఉండడం కోసం, అతడు తన వశంలో రావడం కోసం భగవంతునకు లక్ష్మీదేవి కానీ, ఆమెతో సమానమైన స్వభావం కలిగిన పరమ భాగవతోత్తముడు కాని అక్కర అవుతుంది. ఇక్కడ—.

"ఇవన్ మున్నిడువర్ కళై అవన్ మున్నిడు మెన్నుమిడమ్ అభయప్రదానత్తిలుమ్ కాణలామ్"

"ఇరువర్ మున్నిడుకిఱదుమ్ తన్దామ్ కుట్రంగళై శమిప్పిక్కైక్కాక" (శ్రీవన భూషణం—152, 153)

(జీవుడు పురస్కరించుకునేవారిని భగవంతుడు కూడా పురస్కరించుకుంటాడు— అనే విషయాన్ని అభయ ప్రధానంలో చూడవచ్చు) (ఈ విధంగా జీవుడు భగవంతుడు పురస్కరించుకోవడం కూడా తమ తమ దోషాలను లేకుండా చేసికోవడం కోసం) అని శ్రీ పిళ్ళై లోకాచార్యులవారి సూక్తులు స్మరించ దగినవి. ఈ విధంగా శ్రీరాముడు విభీషణుని నేరుగా స్వీకరించకుండా, సుగ్రీవుని ముందుంచుకుని స్వీకరించడంలో ఉండే కారణాలను చూచాము. ఈ సందర్భంలో

1) భగవంతుడు శరణాగతులను రక్షించే కాలంలో ఆశ్రిత పరాధీనుడై ఉంటాడు, అంటే, తనను భక్తులకు వశం చేసికొంటాడు— అని,

2) భగవంతుడు శరణ్యుడైన తన విషయంలో, తనను ఆశ్రయించిన శరణాగతుని విషయంలో తన భక్తులు చూపించే ప్రేమను ఎదురు చూస్తాడు— అని ఇవి

విభీషణుని శరణాగతి ప్రకరణంలో మనం గమనించవలసిన అర్థాలు అని శ్రీ పెరియవాచ్చాన్ పిళ్ళై అనుగ్రహించడం స్మరించాలి. ఈ ప్రకరణంలో

భగవంతుడనే ధర్మం చక్కగా సుస్థాపింపబడిన విషయం గమనించాము. తరువాత, సుగ్రీవునడుకూడా శ్రీరాముని ఆజ్ఞ ప్రకారం విభీషణుని తీసికొని రాగా, విభీషణుడుకూడా శ్రీరాముని దగ్గరకు వెళ్లి, నమస్కరించి తరించాడు అని చరిత్ర.

ఇంతవరకు శరణాగతి ధర్మానికి సంబంధించిన పలు తత్వాలను, సంగ్రహంగా, సర్వలోకశరణ్యుడైన శ్రీరాముని గూర్చిన పలు తత్వాలను, అతనికి కల వైభవాలను వాల్మీకి మహర్షి రామాయణంలో ఆయా సందర్భాలలో విస్తృతంగా, అందంగా, స్పష్టంగా తెలియజేశాడు– అని,

3) శ్రీరాముని మనస్సును, అతడు చూపిన మార్గాలను అనుసరించి మన పూర్వాచార్యులు ఇంకా చాలా విశేషాలను విస్తృతంగా, స్పష్టంగా, చాలా అందంగా తెలియజేశారు– అని ఏదో ఒక విధంగా కొన్ని విషయాలను మాత్రం గ్రహించి విన్నవించాను.

నేను విజ్ఞాపన చేసిన విషయాల కంటే విన్నపించకుండా విడిచిపెట్టిన విషయాలు ఇంకా చాలా ఉన్నాయి. లక్ష్మణశరణాగతి, అళ్వారుల శరణాగతి, భగవద్రామానుజుల శరణాగతి అనే విషయాలను గూర్చి నేను ఏమీ విన్నపించలేదు. భరతుని శరణాగతి, విభీషణుని శరణాగతి– అనే వీటిలోని విషయాలను తెలియడానికి ముందు ఉన్నతా ధికారులైన వీరి వైభవాలను మనం విస్తృతంగా తెలియాలి. వీరి వైభవాలను గురించి విశదంగా నేను విన్నపించి ఉండాలి. అయితే నాకు ఆ వీలు కలుగలేదు. విభీషణుని శరణాగతి ప్రకరణంలో కూడా మన పూర్వాచార్యులు చూపిన ఎన్నో అర్థ విశేషాలను తెలుపడం నాకు వీలు కాలేదు. మిత్రులు క్షమిస్తారని భావిస్తాను.

శరణాగతికి ఫలం కైంకర్యం అనే విషయం

ఈ తత్వాన్ని వాల్మీకి భగవానుడు లక్ష్మణ శరణాగతి, దండకారణ్య మునులు చేసిన శరణాగతి, విభీషణ శరణాగతి– అనే వీటిని వివరించే ప్రకరణంలో స్పష్టంగా తెలియజేశారు. ఇంతటితో మాధవుని శరణ్యత్వానుభవం పూర్తి అయినది. ఇక,

"సర్వేషా మేవ లోకానాం పితా మాతా చ మాధవః,

గచ్ఛధ్వమేనం శరణం శరణ్యం పురుషర్షభాః"

(అన్ని లోకాలకు తండ్రి, తల్లి మాధవుడు. శరణ్యుడైన ఇతనిని పురుషులలో గొప్పవారైన మీరు శరణు పొందండి) అనే శ్లోకంలోని స్వాపదేశతాత్పర్యార్థాన్ని గమనించాలి. మాధవుని శరణ్యత్వాన్ని గురించి తెలియజేయడం ఈ శ్లోకానికి ముఖ్య విషయం. భగవంతుని శరణ్యునిగా ఆశ్రయించే సమయంలో, అతనిని అన్నివిధాలైన బంధువుగా భావించి ఆశ్రయించాలి– అనే గొప్ప శాస్త్రార్థాన్ని వ్యక్తం చేయడం ద్వారా అతడే సర్వలోకప్రాణులకు తల్లిగా, తండ్రిగా ఉన్నాడు– అని ముందుగామార్కండేయ మహర్షి తెలియజేశారు.

తరువాత, శరణ్యుడు ఎవరు? ఎవరి విషయంలో శరణాగతి చేయాలి? అంటే, అతడు బ్రహ్మచారి నారాయణుడు కాడు, అతడు మాధవుడు– అని తెలిపారు మహర్షి. అన్ని లోకాలలోని జీవరాసులకు అన్ని విధాలైన బంధువు అయిన మాధవుడే శరణ్యుడు– అని భావం. ఇది అన్ని శాస్త్రాలలోని తాత్పర్యార్థసారంగా మహర్షులు, ఆళ్వారులు, మన పూర్వాచార్యులు ఏకకంఠంగా నిర్ణయించి పల్కిన అర్థం.

మాధవుని భక్తుల గొప్పతనం –ఆతివాహిక సత్కారం

మాధవుడైన అర్చావతార మూర్తిని ఆశ్రయించి, అతని చరణాలలో ఉజ్జీవనాన్ని పొందే అతని భక్తులకు అతని వైభవాలు చక్కగా మనసులో ఊరడంకోసం కొంచెం విశదంగానే ఆ స్వామిని గూర్చిన ఎన్నో విషయాలను గమనించాము. ఇక, చివరిగా ఒక విషయాన్ని విజ్ఞాపన చేస్తాను.

తిరువాయ్ మొழி ప్రబంధంలో పదవ శతకంలో తొమ్మిదవ దశకం "శూళ్ విశుంబు" అనే దశకం. ఈ దశకంలో మాధవుని భక్తులకు కల గొప్ప తనాన్ని నమ్మాళ్వారులు చాలా అందంగా తెలియజేశారు. ఆళ్వారులు అనుగ్రహించిన దివ్యప్రబంధాలలో, తిరువిరుత్తం అనే ప్రబంధంనుండి ఆరంభించి, చివరి ప్రబంధమైన తిరువాయ్ మొழిలోని పదవ శతకం ఎనిమిదవ దశకం

(తిరుమాలిరుమ్ శోలై దశకం) వరకు వారికి కల పరభక్తి దశ. దీనిని భగవద్విషయజ్ఞానానుభవ ప్రావణ్య రూపమైన దశ– అని అంటారు. అంటే, భగవంతుని సహజమైన కృపవల్ల ఆ స్వామినిగూర్చిన జ్ఞానాన్ని, అతని స్వరూప స్వరూపగుణ విభవైశ్వర్యాదుల (ఇక్కడ ఆది శబ్దంచేత దివ్య చేష్టితాలు, వీటికి అన్నిటినీ తెలియజెప్పే తిరునామాలు చెప్పబడతాయి) అనుభవాన్ని, అతని విషయంలో అతిశయించిన ప్రావణ్యాన్ని కలిగి ఉండే దశ.

"శూళ్ విశుంబు" దశకంలో ఈ స్థితిని దాటి, పరజ్ఞాన దశను ఆళ్వారులు పొందారు. ఈ లోకంలో తాము ఉండే స్థితిలో వారికి అనుభవించడానికి ఇంకా ఏమి మిగలనందున, భగవంతుడు వారికి పరమ భక్తిలో ఏర్పడే పరిపూర్ణమైన బ్రహ్మానుభవకైంకర్యాలలో అతిశయించిన ప్రావణ్యం కలగాలి– అని ఈ పరజ్ఞానదశను కలిగించాడు. ఈ దశలో ఆళ్వార్లు అనుగ్రహించిన దశకమే "శూళ్ విశుంబు" దశకం. ఆళ్వారులు పరమపదానికి వేంచేసి ప్రకారం, అర్చిరాది మార్గంలో వారు వెళ్లేటప్పుడు దారిలో అన్ని లోకాలు వారిని కీర్తించి, సత్కరించి, కృతార్థులు కావడం, పరమపదంలో తిరుమామణి మండపంలో నిత్యముక్తులు సేవించగా, లక్ష్మీదేవితో తాను వేంచేసి ఉండే సన్నివేశాన్ని భగవంతుడు ఆళ్వార్లకు దర్శింప చేయడం– అనే వీనిని ఈ దశకంలో మనం గమనించవచ్చు. ఈ దశకంలో ఆళ్వారులకు కలిగిన అనుభవాలను పెరియ వాచ్చాన్ పిళ్ళై ఆశ్చర్యకరంగా వర్ణిస్తున్నారు.

"అంగుత్తై అనుభవత్తుక్కీడాంబడి మికవుమ్ విడాయ్ పిఱక్కైక్కాక త్తన్నుడైయ స్వరూప రూప విభూతికళై కణ్ణాలే కండాప్పోలే విశదమాఱప్రకాశిక్కుమ్బడి పణ్ణి అరుళినాన్. అదాకిఱదు–

1) వేదాంతంగళిలే ప్రసిద్ధ మాన అర్చిరాదిమార్గత్తైయుమ్,

2) శరీరవిశ్లేష సమయత్తిల్ వరుమ్ క్లేశ మెల్లామ్ ఆఱుంబడి తాన్ వందు ముకమ్ కాట్టుమ్బడియుమ్,

3) మార్గస్థరాన పురుషర్ కళుడైయ సత్కారంగళైయుమ్,

4) అమ్మార్గత్తాలే పోయ్ ప్పుక్క క్కడవ పరమపదత్తైయుమ్,

5) నిత్య సూరికళ్ వందు ఆదరిక్కుంబడియుమ్,

6) పిరాట్టిమారుమ్, శ్రీవైకుంఠనాథనుమ్ ఎదిరే వందు ఆదరిక్కుమ్బడియుమ్,

7) నిత్యసూరికళ్ సేవిక్క పిరాట్టిమార్ కళోడే వీట్రిరుందరుళుకిఱ పడియుమ్,

8) పరమ ప్రాప్తరాననిత్యసూరికళ్ నడువే తామ్ ఆనందనిర్భరరాయ్ ఇరుక్కుంబడియుమ్ కాట్టియరుళ క్కండు, ప్రీతరాయ్, అత్తై అన్యాపదేశత్తాలే పేశి అనుభవిక్కిఱార్, తమక్కు అవన్ పణ్ణిక్కొడుత్త పేట్రై వైష్ణవర్కళ్ ఎల్లారుమ్ పెట్రార్ కళాక ప్పేశుకిఱ ఇదు అన్యాపదేశ మావదు. ఇదు తనక్కు ప్రయోజనమ్ ఇంగుళ్ళార్ "తమక్కు ఆళ్వార్ పేఱు తప్పాదు "ఎన్ఱిరుక్కైక్కాక"

.

(1)వేదాంతాలలో ప్రసిద్ధమైన అర్చిరాది మార్గాన్ని,

1) శరీరం తొలగే సమయంలో కలిగే క్లేశం అంతా తీరేట్లు భగవంతుడు వేంచేసి దర్శనం ఇచ్చిన ప్రకారాన్ని,

2) మార్గంలో ఉండే ఆతివాహికపురుషులు చేసే సత్కారాన్ని,

3) ఆ మార్గం ద్వారా ప్రయాణం చేసి, చేరదగిన పరమ పదాన్ని,

4) నిత్యసూరులు వచ్చి ఆదరించే రీతిని,

5) దివ్య దేవేరులు, శ్రీ వైకుంఠనాథుడు ఎదురుగా వచ్చి ఆదరించిన రీతిని,

6) నిత్య సూరులు సేవించగా దివ్య దేవేరులతో కలసి తాను వేంచేసి ఉండే స్థితిని పరమపద నాథుడు అనుగ్రహించిన ప్రకారాన్ని,

7) పరమ ప్రాప్యులైన నిత్యసూరుల మధ్య ఆనందంతో నిండినవారై ఉండే రీతిని దర్శింపజేయగా దర్శించి,

ఆనందించినవారై, దానిని అన్యాపదేశ ప్రక్రియలో పలుకుతూ ఆనందిస్తున్నారు. తమకు భగవంతుడు అనుగ్రహించిన ఫలాన్ని వైష్ణవులు అందరూ పొందినట్లుగా పలికే ఈ దశకం అన్యాపదేశ దశకం. దీనికి ప్రయోజనం ఏమంటే—ఇక్కడ ఉండేవారు తమకు కూడా ఆళ్వారులు పొందిన ఫలం తప్పకుండా లభిస్తుంది అని నమ్మి ఉండడం కోసమే) అనే పెరియవాచ్చాన్ పిళ్లై శ్రీ సూక్తి ఇక్కడ అనుసంధేయం.

"మాధవన్ తమరెన్ఱు వాశలిల్ వానవర్

పొదుమెన ఎమదిడమ్ పుకుదుక ఎన్ఱలుమ్

కీదంగళ్ పాడినర్ కిన్నరర్ కరుడర్ కళ్

వేదనల్ వాయవర్ వేళ్వియుళ్ మడుత్తే"

అనేది ఈ తిరువాయ్ మొళిలో ఐదవ పాశురం. మాధవుని భక్తులైన వైష్ణవులు సంసార దశను దాటి, అర్చరాది మార్గంలోని అనేక లోకాలను అతిక్రమించి, విరజా నదీ తీరాన్ని చేరి, ఆ నదిలో స్నానం చేసి, సూక్ష్మ శరీరాన్ని విడచి, ఆ నదీతీరంలో ఉండే పరమపదాన్ని చేరుతారు. ఈ విధంగా వారు అనేక లోకాలను. దాటి వెళ్లేటప్పుడు ఆయా లోకాలలో వీరిని వెంట నడిపించే ఆతివాహికులైన వరుణుడు, ఇంద్రుడు, ప్రజాపతి వంటి దేవతలు "మేము ఉండే చోటుకు మీరు వేంచేయాలి" అని ప్రార్థించి, తమ తమ స్థానాలకు తీసికొని వెడతారు. అక్కడ ఉండే వేద విద్వాంసులు, మునులు మాధవుని భక్తులైన వీరి విషయంలో ప్రీతిని కలవారై, తమ ప్రీతిని ఆవిష్కరిస్తూ, వీరిని సత్కరించి, ఆనందించాలి— అని భావించి, తాము చేసే యాగం మొదలైన వైదిక కర్మల ఫలాన్ని ప్రేమతో వీరి పాదాలలో సమర్పించి గౌరవిస్తారు. ఇంతటితో

"సర్వేషామేవ లోకానాం పితా మా తా చ మాధవః,

గచ్ఛధ్వమేనం శరణం శరణ్యం పురుషర్షభాః"

(అన్ని లోకాలకు తండ్రి, తల్లి మాధవుడు. శరణ్యుడైన ఇతనిని పురుషులలో గొప్పవారైన మీరు శరణు పొందండి) కాని ఈ శ్లోకానికి కల వివరణం పూర్తి అయ్యింది.

సుఖప్రాప్తికి దారి ఏది? అనేది ధర్మరాజు ప్రశ్న. మాధవుని శరణు పొందడమే సుఖప్రాప్తికి దారి– అనేది మార్కండేయమహర్షి సారంగా తెలియజెప్పిన అర్థం. ఈ అర్థమే సకలశాస్త్రాల సారం. మన పూర్వాచార్యులు చక్కగా అనుభవించిన ఈ అర్థాన్ని మనం ఏదో ఒక విధంగా కొంత తెలియగలిగే భాగ్యం పొందినవారం అయ్యాము. ఈ వివరణలోని దోషాలను విడిచిపెట్టి, గుణాలను గ్రహించమని మిత్రులను ప్రార్థిస్తున్నాను.

మాధవుని గొప్పతనం అనే గ్రంథం పూర్తి అయినది.